# ఆలోచించండి

**డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి**

**CTMS వారి దశమ ప్రచురణ**

**జూన్, 2007**

ఆలోచించండి

## ఆలోచించండి

డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి

మొదటి ముద్రణ: జూన్ 2007

సర్వ హక్కులు రచయితవి

వెల : రూ.60/-
$: 5/-

ప్రచురణ కర్త : డా. టి హెచ్ చౌదరి
సెంటర్ ఫర్ టెలికాం మెనేజ్‌మెంట్ & స్టడీస్
పి & టి కాలనీ, కార్ఖానా (సికింద్రాబాద్) హైదరాబాద్
ఫోన్ నెం: + 91 (40) 6667 1191
ఫాక్స్: + 91 (40) 6667 1111
ముద్రణ: బాబు ప్రింటర్స్, హైదరాబాద్,
ఫోన్ నెం : + 90(40)6677 4499

# విషయసూచిక

1. పేదరికం, ప్రగతి; రాజకీయాలు 1
2. ఉపాధి హామీ పథకం ఉపయోగమేనా? 12
3. వెనుకటి గుణమేల మానురా! 17
4. కులాలు-సాధికారత 18
5. ప్రజాస్వామ్య భారతంలో హేయతమ దినం 24
6. భారత కమ్యూనిస్టుల వింత ధోరణులు 30
7. పేదరికం 35
8. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక-దేశాన్నీ, ఆర్థిక వ్యవస్థనూ విధ్వంసం చేసే అంశాలు 39
9. ముస్లింలు బ్రతకడం రాజకీయమయిందా? 47
10. మైనారిటీ వృత్తి కళాశాలలు-ఘోరాలు, నేరాలూ 54
11. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ప్రమాణాలు చాలని ఉద్యోగావకాశాలు, అంతులేని వాగ్దానాలు 59
12. నిర్బంధ విద్య 62
13. కులనిర్మూలన ఏ మేఱకు, ఎలా సాధ్యం 64
14. విమర్శనే! 69
15. భారతీయ సంస్కృతి శాశ్వత సజీవత్వం-మహాభారతం 72
16. ఎన్నికలా?హింసా? 84
17. కచ-దేవయాని-శుక్ర గాధను గురించి దురవగాహన 85
18. కచదేవయాని కథ 88
19. క్రైస్తవుల జనాభా ఎంత? 89



20. గ్రామాభ్యుదయం ప్రణాళికలు-ప్రజల బాధ్యతలు 90
21. తుది నిర్ణయం సోనియాదే...! 94
22. మానవతావాదమా? మూఢవాదమా? 95
23. పిట్రోడా, రాహుల్, కాంగ్రెస్ 99
24. చైనాలో ఆర్థికప్రగతి, పెరుగుతున్న అసమానతల సహఅస్తిత్వం 108
25. మైనారిటీ స్కూళ్ళల్లో అవినీతి, అక్రమాలు 116
26. దళిత క్రైస్తవులు ! 117
27. సంస్కరణలు అభివృద్ధికోసమా? 118
28. ఉమ్మడి పౌరచట్టం అవసరమే కాని.... 122
29. ఉమ్మడి పౌరసత్వ సంహిత 123
30. సిగ్గుచేటు 124
31. బుష్‌కు స్వాగతం 125
32. మైనారిటీల వెనుకబాటుతనం 127
33. మహామనీషి డా॥ భీమ్‌రావ్ అంబేద్కర్ 128
34. పోలవరం ప్రాజెక్టుపేరు 134
35. మనపట్టణాల, మన వ్యక్తుల పేర్లు 135
36. విస్తృత రిజర్వేషన్లు - కొన్ని పర్యవసానాలు 136
37. గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ దాడులు 143
38. సి.పి.ఐ. అరబ్ ముస్లింల ఏజెన్సీయా? 145
39. మరింత సేవ 146
40. ఇరాన్ అణ్వస్త్రాలు - భారతదేశానికి ముప్పు 148
41. మైనారిటీల పేర మహామోసం 152

| | | |
|---|---|---|
| 42. | జనాభా నియంత్రణ అవసరమా? | 156 |
| 43. | మత మార్పిడి వ్యాపారం | 161 |
| 44. | గ్రామాలు ఎలా బాగుపడతాయి? | 169 |
| 45. | గ్రామాభ్యుదయం ఎలా జరుగుతుంది? | 175 |
| 46. | ఎందుకీ దుష్ట సంప్రదాయం? | 179 |
| 47. | విద్యలేని బ్రతుకు మిథ్య | 180 |
| 48. | తెలంగాణా వెనుకబాటుతనం పోయేదెలా? | 183 |
| 49. | ఏకపక్ష దౌర్జన్యం కాదు | 187 |
| 50. | ఆంధ్రప్రదేశ్‌కు కొత్తరాజధాని నగరం | 189 |
| 51. | ఐ.ఎ.ఇ.ఎ. ఇరాన్ | 191 |
| 52. | మార్కిస్ట్ మదర్సా శిక్షణలో కమ్యూనిస్టు ఫత్వాలు | 193 |
| 53. | ఓపికకూ ఓ హద్దుంటుంది. | 197 |
| 54. | ప్రజల దిగుబడి | 201 |
| 55. | నాయుడిగారి సెక్యులరిజం | 203 |






# 1. పేదరికం: ప్రగతి: రాజకీయాలు

**భా**రత దేశాభివృద్ధి లక్ష్యంగా, 1951 సంవత్సరం నుండి దేశంలో రూపొందింపబడి, అమలు పరచబడుతున్న పంచవర్ష ప్రణాళికలు ప్రతిదీ కూడా, దేశం నుండి పేదరికాన్ని నిర్మూలించడమే ధ్యేయంగా ఉంచుకొన్నట్లు – నాటి నుండి నేటి వరకు ఉన్న ప్రధానమంత్రులు, ప్రభుత్వాలు నిర్వహించిన రాజకీయ పార్టీలు, ప్రత్యేకించి కాంగ్రెసు, ప్రకటిస్తూనే ఉన్నాయి. ప్రతి ప్రణాళికలోను ఉపాధి ఉద్యోగాల కల్పనకు – ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆయా పథకాల నిర్వహణకు ఇబ్బడిముబ్బడిగా నిధులు పేదరిక నిర్మూలనకుద్దేశించి కేటాయింప బడుతున్నాయి. ఆశించిన మేరకు ఉద్యోగాల కల్పన జరగని సందర్భాలలో, ప్రభుత్వాలు పేదలను ఆదుకొనాలని తిండిగింజలు, కిరోసిన్, చక్కెర, వస్త్రాలు, గృహ నిర్మాణం, రవాణా, వృద్ధాప్యపింఛనుల సదుపాయాలు సరఫరా గ్రామీణ పేదల కందించేందుకు ఆర్థికంగా మడుపుకని హెచ్చు మొత్తాలలో నిధులను కేటాయించడం జరుగుతోంది. లక్షలాది పేదలలో యువకులు, విద్యాధికులు, నిరుద్యోగులుగా ఉండటం వల్ల ఈ ప్రక్రియ మరీ అవసరం అయ్యింది. పేదలలో అతి పేదల ఉన్నతికి అంత్యోదయ, ఆదిగా గల మంచి కార్యక్రమాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. దేశం నుండి పేదరిక నిర్మూలనకు – తమ పార్టీయే ఇతర పార్టీలకన్నా గొప్ప గొప్పపథకాలను తీసుకువచ్చి పటిష్టవంతంగా చిత్తశుద్ధితో అమలుపరుస్తామంటూ – వివిధ రాజకీయ పార్టీలూ, నేతలూ వాగ్దానాలు చేయడం జరిగింది. ఇంకా ఇప్పుడు చేస్తున్నారు కూడా. ఈ ప్రయోగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరితో ఇంకొకరు పోటీపడుతున్నట్లు – ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన, ఇందిరా ఆవాస్ యోజన, వాల్మీకి ఆవాస్ యోజన, ఉపాధి హామీ పథకం, ముఖ్యమంత్రి యువజన ఉపాధికల్పనా కార్యక్రమం, ఇత్యాది ఎన్నో పథకాలు వందలు, వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రారంభించి, అమలు పరుస్తున్నారు. వీటికి తోడు గ్రామీణాభివృద్ధి పథకాలు, సమీకృత గ్రామీణాభివృద్ధి

కార్యక్రమాలు, పేదరిక నిర్మూలన, దీనజనోద్ధరణ, సమగ్ర పేదరిక నిర్మూలన పథకాలు నడుపుతున్నారు. వాటికి హెచ్చుగా నిధులు కేటాయించారు. వీటి నిర్వహణకై ఎందరో ఐ.ఎ.ఎస్. అధికారులను నియమించారు. దారిద్ర్యం అనే ఈ దయ్యం భారతీయులను పట్టి పల్లార్చుతున్నదని, ఏలాగైనా దీన్ని మట్టుబెట్టాలని ఆనాడు శ్రీమతి ఇందిరాగాంధి, కాంగ్రెస్‌పార్టీని రెండు ముక్కలుగా చీల్చాక "గరీబీ హఠావో" అనే స్ఫూర్తిదాయకమైన నినాదం విసిరారు. ఈ పిలుపు ఒక విధంగా చెప్పాలంటే 1942లో మహాత్మాగాంధి బ్రిటిష్‌వారికి యిచ్చిన "భారతదేశం నుండి వైదొలగండి" అనే కేకకు ప్రతిధ్వనిగా ఉండిందని చెప్పవచ్చు. ఐతే ఈ 'భారతదేశం నుండి వైదొలగండి" అనే నినాదమే మనకు స్వాతంత్ర్యం తెచ్చింది అనలేము – బ్రిటీష్ వాళ్ల శక్తి సన్నగిల్లడం, ద్వితీయ ప్రపంచ సంగ్రామం తర్వాత బ్రిటీష్ వారి ఆర్థిక స్తోమత పడిపోవడం – వీటికి తోడు సైనిక దళాలు నీరసించి పోవడం (జపాను వాళ్లకు లొంగిపోయిన మన భారతీయ సైనికులు బ్రిటీష్ వాళ్లని వదలి సుభాష్‌బోస్‌గారు స్థాపించిన భారతజాతీయ సైన్యంలో చేరిపోయారు. ముంబాయిలో భారత నావికాదళం తిరుగుబాటు చేసింది) ఫలితంగా మనకు స్వాతంత్రం ప్రాప్తించింది."పేదరికాన్ని పారద్రోలు" అనే నినాదం – ఒక పొలికేకగానే ఉండిపోయింది. రాజకీయ పార్టీలు ఒకదానితో మరొకటి పోటీపడి "పేదరిక నిర్మూలనా" కార్యక్రమాలను చేపట్టేందుకిది దోహదపడింది. ఫలితంగా ప్రతి క్రియాశీలక రాజకీయ నాయకుడు "తన పేదరికాన్ని" నిర్మూలించుకొని అభ్యుదయం పొందగలిగాడు. తనతోబాటు తన నాలుగైదు తరాల సంతతికి సరిపడేంత సంపదను ఆర్జించుకొన్నాడు.

ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తాము ఎంపికచేసుకొన్న నియోజక వర్గాలలో పదుల సంఖ్యలో ప్రతి ఒక్క అధికారి – ఏదో ఒక పేదరిక నిర్మూలన పథక నిర్వహణాధికారిగా ఉండేందుకు ప్రభుత్వాధికారులను నియమించుకొన్నారు. ఐతే దురదృష్టకరం ఏమిటంటే దారిద్ర్యం అనే ఈ 'దయ్యం' పోలేదు. కాగా ఎవరికైతే వాస్తవంగా లబ్ధిచెందాలో వారికది చేరలేదు. అధికారం కోసం ప్రాకులాడే







రాజకీయుల జేబులలోకే అదంతా పోయింది. ఏతావాతా చెప్పవచ్చేదేమంటే రాజకీయనాయకులకు ఈ పేదరికం 'ముద్దుబిడ్డగా' తయారైంది.

ప్రజలు అత్యధికంగా ఆదరిస్తున్న, ప్రజలను ఇతోధికంగా సేవిస్తున్న దాదాపు అన్ని రాజకీయపార్టీల నాయకుల తీరుతెన్నులను ఒకింత విశ్లేషణ చేస్తే – పేదరికనిర్మూలన, ఆర్థికాభివృద్ధుల పేరుతో దేన్ని స్థిరీకరించడం జరుగుతోందో తేటపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కోటికిమించి తెల్లరేషన్ కార్డులున్నాయి. వీటినన్నింటినీ దారిద్ర్య రేఖకు దిగువన నివసించే ప్రజల కుటుంబాలకు పంచారు. సగటున ఒక కుటుంబంలో ఐదుగురు సభ్యుల వంతున లెక్కవేసినా, ఆంధ్రప్రదేశ్ మొత్తంలో దారిద్ర్యరేఖకు దిగువ ఉండే ప్రజలు ఐదుకోట్లుంటారు. 67శాతం జనాభా దారిద్ర్యరేఖకు గతకొన్నేళ్ళలో గణనీయంగా ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన జరిగినట్టేనా? ఇవిగాక 2003 నవంబరులో మరొక 25 లక్షల తెల్లరేషన్ కార్డులు పంచారు. వీటితో చేరి, దారిద్ర్యరేఖకు దిగువ ఉండే వారి శాతం 83కి పెరుగుతుంది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా హెచ్చు పరిమాణంలో సొమ్ము వ్యయం కావడం, ఆర్థికాభివృద్ధి ఎంతగానో జరిగినట్టు ప్రకటించుకోవడం ఒక వంక – మరొక వంక దారిద్ర్య రేఖకు దిగువ నున్న వారి సంఖ్య 67 శాతం నుండి 83 శాతానికి పెరిగిపోతుండటం ఆశ్చర్యం పుట్టించకమానదు! పేదరిక నిర్మూలనకు భారతదేశంలో సామాజిక ప్రణాళికలు మొదలైన 1951లో దారిద్ర్య రేఖకు దిగువనున్నవారు 70 శాతం కాగా నేడు వారు 26 శాతమే అని గొప్పగా చెప్పుకునే ప్రభుత్వ గణాంక వివరాలు – 26 శాతమా? 67 శాతమా? లేక 83 శాతమా – వీటిలో ఏది సత్యం? ఒకింత స్థూల పరిశీలన చేస్తే ఈ రాజకీయ పార్టీల పోటీలకు పేదరికం దాని ఎదుగుదల లేకుంటే మనుగడ లేదనిపిస్తుంది. ఏలనంటే ప్రతి రాజకీయ పార్టీ ఎప్పటికప్పుడు పేదరిక నిర్మూలనే తమ ధ్యేయంగా ప్రకటించుకుంటుంటాయి. ప్రజల సంక్షేమానికిదే తారకమంత్రంగా జపిస్తుంటాయి. రాయితీలపై ఆహారధాన్యాలు, కిరోసిన్, చక్కెరల పంపిణీ, గ్యాస్ కనెక్షన్లు, స్టౌల (పొయ్యిలు) సరఫరా, సైకిళ్ళు,

ప్రభుత్వ పోరంబోకు భూములనూ ఆలయాల భూములనూ బీదల ఇండ్లకై పంచడం, వృద్ధులకు పింఛనులు, రాయితీలపై ఇళ్ళు కట్టివ్వడం – ఇవన్నీ కూడా సంక్షేమ పథకాల క్రిందకే వస్తాయి. ఒకవ్యక్తి జీవించి ఉండడం కంటె మరణించడం ద్వారానే తన కుటుంబానికి ఎంతగానో ఆర్థికంగా మేలు చేకూరుస్తున్నాడనేటంతగా – పేదలంటేనూ, దురదృష్ట వంతులంటేనూ ఎంతటి ప్రేమ, ఆప్యాయతలున్నాయో ఇది స్పష్టం చేస్తుంది. ఉదాహరణకు కొన్ని పదుల సంఖ్యలో మనుషుల్ని (అక్రమమార్గాన) ట్రాక్టరు తొట్టెలో తరలిస్తుంటారు. ప్రమాదవశాత్తు ఆ ట్రాక్టరు తలక్రిందులై కొందరు మరణిస్తారు. మృతుల కుటుంబాలకు తల ఒక్కింటికి రూ. 50,000/–ల నుండి రూ. 2 లక్షల వరకు పరిహారంగా బీదలంటే అపారమైన ప్రేమగల ముఖ్యమంత్రి తక్షణమే ప్రకటిస్తాడు. అలాగే కొందరు పేదవాళ్ళు కల్తీ సారా తాగి మరణిస్తుంటారు. మరణించిన ప్రతి ఒక్క కుటుంబం వారికి లక్ష రూపాయల చొప్పున పేదలనాదుకొనే ప్రభుత్వం చెల్లిస్తుంటుంది. ప్రతిపక్ష పార్టీలు ప్రత్యేకించి బీదవాళ్ళ కోసమే తాము శ్రమిస్తున్నట్లు ప్రకటించుకొనే కమ్యూనిస్టు పార్టీలు ఇంకో అడుగు ముందుకుపోయి పరిహారంగా చెల్లించే మొత్తం చాల తక్కువైంది, ఆ కుటుంబీకులకు మరింత హెచ్చు మొత్తం ఇవ్వాలనీ – కల్తీసారా త్రాగి చనిపోయిన వారి పట్లా, అక్రమంగా అతి హెచ్చు సంఖ్యలో ట్రాక్టర్లలో ప్రయాణించి ప్రమాదానికి గురియై మరణించి వారిపట్లా తమకే ఎక్కువగా ప్రేమ ఉన్నట్లు చాటుతుంటారు.

దారిద్ర్యం, పేదవాళ్ళూ లేని సమాజం చరిత్రలో ఏనాడూ ఉన్నట్టు దాఖలాల్లేవు. అలాగే ఈ పేదరికం అనేది అందరికి ఒకేలాగున ఉన్నట్టూ చరిత్రలో లేదు. పూర్వకాలంలో రాజులు, ధనికులు పేదలకు భక్తి కలిగించినట్టు దరిద్రులకు, నిర్భాగ్యులకు ఇళ్ళు కట్టించినట్టు – అలాగే ఉన్నవారిలో మంచి వాళ్ళు తాము ఆర్జించిన దానిలో కొంత భాగాన్ని దానధర్మాలకు వెచ్చించినట్టు – మనమంతా ప్రాథమిక పాఠశాలల పాఠ్య పుస్తకాల్లో చదివే ఉంటాం. ఈ దానధర్మాలనేవి ధనవంతులకక్కరలేదు. పేదలకే అవసరం. ఈ రోజున







ప్రపంచమంతటిలోను అత్యధిక ధనిక దేశంగా చెలామణి అవుతున్న అమెరికాలో 12 నుండి 14 శాతం మేరకు బీదవాళ్లే. దారిద్ర్య రేఖకు దిగువ నివసించేవాళ్లే. అక్కడకూడా కొన్ని ప్రాంతాలల్లో వీరిశాతం 22 వరకు వుంది. సర్వే సర్వత్రా విద్య వ్యాపించి ఉన్నా, నిరుద్యోగం తక్కువగానే ఉన్నా ఏ దేశంలోనూ 10 శాతంకు తక్కువ సంఖ్యలో పేదవాళ్ళు లేరు. దీనికి కారణం ఏమిటి?

ముగ్గురు లేదా నలుగురు పిల్లలున్న కుటుంబాన్ని చూడండి. తల్లిదండ్రులు ఈ పిల్లలపై ఒకేమాదిరి శ్రద్ధచూపుతూ ఒకలాగే ఆహారం ఇస్తూ విద్యాబుద్ధులు కూడా ఒకేలాగున చెప్పిస్తారు. వాళ్లందరినీ ఒకే బడికి పంపుతారు. ఐతే ఫలితాలు వాళ్ళలో వేరుగా ఉంటుంటాయి. ఒకడు ఏ ఇంజనీరో – కాదంటే సుసంపన్నుడైన వ్యాపారో అవుతాడు. ఇంకొకడు నిరుద్యోగిగా, ఏ పనీలేక తిరుగుతుంటాడు. దీనికి కారణం? వీళ్ళపట్ల తల్లిదండ్రులు కనపర్చిన ఆదరణ, శ్రద్ధా వీరికిచ్చిన అవకాశాలూ ఒక్కటే అయినా ఫలితాలు భిన్నంగా ఎందుకుంటున్నట్టు? ఉపాధ్యాయుడు తరగతిలో చదువుకునే పిల్లలందరికీ ఒకే విధంగా బోధన చేస్తుంటాడు. వాళ్ళు చదివే పాఠ్యపుస్తకాలూ ఒక్కటే, కొందరికి ఆ పుస్తకాలూ, వసతులు ఉచితంగానే కల్పిస్తుంటారు. ఐతే కొందరు పిల్లలు మధ్యలో చదువుమానేస్తుండడం, కొందరు పరీక్షలు తప్పిపోతూండటం జరుగుతోంది. వేరు వేరు కుటుంబాల నుండి వివిధ రకాల ఆదాయాలు వచ్చే వారి నుండి విభిన్న సంస్కృతులకు చెందినవారి నుండి విద్యార్థులను ఒకే వసతిగృహంలో వుంచి – వాళ్ళందరికీ ఒకేవిధమైన భద్రత, సదుపాయాలు కల్పించి చదువు చెప్పిస్తున్నా – తుదకు కొందరు పరీక్షలు తప్పడం, కొందరు మధ్యలో మానేయ్యడం – ఆఖరికి ఏ కొందరో ఉత్తీర్ణులు కావడం, ఇతరులను మించి వృద్ధిలోకి రావడం మనం చూస్తున్నాం. కొందరు పరీక్షలు తప్పి రాష్ట్ర సంక్షేమశాఖపై ఆధారపడే స్థితి దాపురిస్తోంది. దీనికంతకీ కారణం? మనదేశంలో తెలిమిడిని బట్టి, అవగాహనను బట్టే తేలేది ఏమిటంటే – ప్రజలంతా ఒకే పెట్టుబడితో జీవన వ్యాపారం ప్రారంభించినా, ఐతే ఒకరు తమ పెట్టుబడిని లాభసాటిగా ఉపయోగిస్తారు.

మరొకరు దాన్ని వృధాగా ఖర్చు చేసేస్తుంటారు. అలా చేసేందుకు వాళ్లకు స్వేచ్ఛ ఉంది. తమ ఇష్టానుసారం వాళ్ళు పోతూవుంటారు. 'ఆ స్వేచ్ఛను కొందరు సద్వినియోగపర్చుకుంటారు. ఇంకొందరు దుర్వినియోగం చేసుకుంటారు,

ప్రజలకు గృహవసతి, ఆహారం అందించడం ద్వారా వాళ్ళు బ్రతికేట్టు (వాళ్లు ఓటర్లుగా ఉంటారు గనుక) చేయవచ్చు. ఇదే సంక్షేమము, సంక్షేమానికని ప్రభుత్వం ఇబ్బడిగా ముబ్బడిగా నిధులు ఖర్చు చేస్తున్నది. సంక్షేమ పథకాల నిర్వహణ, దానిమీదనే బ్రతుకుతుండడం పరిపాటియై పోయింది. తద్వారా సంక్షేమం నిత్యకృత్యమై పోయింది. సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందేవాళ్ళు కూడా అది ఒకవ్యసనంగా మారినందువల్ల – దానికి అలవాటుపడి పొయ్యారు. ఈ సంక్షేమ పథకాల లబ్ధిదార్లు తమకు వాగ్దానం చేసేవాళ్లకు తమ వోట్లివ్వడం వినా సమాజానికిచ్చేదేమి? సంక్షేమ పథకాల ఫలితాలను ఊరికే అనుభవిస్తూ, సమాజానికే విధంగానూ సేవ చెయ్యకుండా – పదేపదే “మీ సంక్షేమమే మా లక్ష్యం” అంటూ ఒకరితో ఇంకొకరు పోటపడి, లబ్ధిదార్లు ఇచ్చే వోట్లకోసమని ఎగబడే వ్యవస్థలు, పార్టీలు ఉంటున్న కారణంగా ప్రజలకు సంక్షేమం అనేది ఒక హక్కుగా మారింది. ఈ తరహా సంక్షేమం జాతి లేదా ఒక వ్యక్తి అభ్యుదయానికి దోహదకారికాగలదా? ప్రజలు నిత్యము బీదరికంలోనూ, దారిద్ర్యంలోనూ ఉండేందుకు వారికి సాయపడడం అనుచితం. ఎవరైతే మనం వారికి అందించే సహాయం వల్ల తమను తాము ఉద్ధరించుకొనేందుకు ప్రయత్నించరో వారికి సాయం చేయడం కేవలం అపాత్రదానమే అవుతుంది. దారిద్ర్యంలో బాధపడేవాడు తనకు తానే పైకి తెచ్చుకునేవాడై ఉండాలి అన్నది మనం విజ్ఞతతో యోచించాల్సిన విషయం. ఎవరూ గూడా తనను తానే దిగజార్చుకోగూడదు. తనను తానే నాశనం చేసుకోరాదు. ప్రయత్నం, శ్రద్ధ, పట్టుదల, ఆకాంక్షలు ఒకరిని పైకి తీసుకు వచ్చేందుకు దోహదపడతాయి.అకర్మణ్యత, ఉన్నతికి చేరుకోవాలన్న కాంక్ష లేకపోవడం, ఏ ప్రయత్నం లేకుండానే ఆదాయం వచ్చిపడాలి, దేనికీ యోగ్యత లేకున్నా ఏదో మనకు రావాలి అనుకోవడం పేరాశ దేనికీ శ్రమించకపోవడం,







పేదరికాన్ని స్థిరీకరించడమే కాగలదు. సమాజం లేదా ప్రభుత్వం నిరంతరం అలాంటి బ్రాగురాయుణుల్ని కూర్చోబెట్టి పోషించడం ఎందుకూ? అలాంటి వాళ్లకి ఇళ్ళిచ్చి, మేతబెట్టి ఉచితంగా బట్టలు పెట్టి, ఏ ఖర్చు లేకుండా వారి రోగాలకు చికిత్సలు చేయించడం వల్ల సమాజానికి ఒరిగేదేమిటి? మన సంక్షేమ పథకాల లబ్ధిదార్లు – మనవల్ల పొందే సహాయానికి ప్రతిఫలంగా – సమాజానికి వారు ఏ ప్రయోజనాన్నయినా చేసేటట్టు చూడాలి. ఉదాహరణకు మనం ఇళ్లు, ఆహారం, రవాణా సదుపాయాలు, బట్టలు ఉచితంగా ఏ పేదవాళ్ళకైతే ఇస్తున్నామో, ఆ బడుగువర్గాల ప్రజలు – కనీసం మొక్కలను పెంచడం, విరామ సమయాల్లో విహార స్థలాలను మెరుగు పర్చడం వంటి పనులను చేసేటట్లు చూడాలి.

అక్షరాస్యత, విద్య అనేవి అతిగొప్ప సామర్థ్య నిర్మాణ కారకాలు. ఎస్.ఎస్.సి, స్థాయి వరకు పాఠశాలల్లో విద్య ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం బాధ్యతగా స్వీకరించాలి. ప్రతి విద్యార్థి తరగతులకు విధిగా హాజరయ్యేట్టు చూడాలి. ప్రతి విద్యావంతుడికి, ప్రతి అక్షరాస్యుడికి ఉద్యోగం వచ్చి తీరుతుందని ఎక్కడా రాసిపెట్టిలేదు. కాని ఏ విద్య లేనివాడికీ, ఏ నిరక్షరాస్యుడికీ, మంచి ఉద్యోగం అనేది మాత్రం ఎప్పుడూ, ఎక్కడా రాదు. విద్యాధికులక్కూడా – తమ ఉద్యోగాలను పదిలంగా ఉంచుకోవడానికీ , ఒకవేళ ఆ ఉద్యోగాలు ఊడిపోతే తిరిగి శిక్షణ పొందేందుకూ నిరంతరం అధ్యయనం అవసరం.

పౌరులందరికి పనిచేసే అవసరంగాని, పనిచెప్పే సామర్థ్యం గాని లేని దేశం కాదు మనది. అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా రాష్ట్ర, దేశ రహదారుల నిర్మాణం, వివిధ నదుల అనుసంధానం, నీటిపారుదల సౌకర్యం కల్పించడం, ఎడారి భూములను ఫలవంతం చెయడం, వంటి ప్రాజెక్టులకు లక్షలాది శ్రామికులు అవసరం. వీళ్లందరు విధిగా పట్టభద్రులయి ఉండనక్కరలేదు. నేడు సంక్షేమం పేరిట లక్షలాది ప్రజలు బ్రతికేందుకు ఎన్నో సహాయాలందిస్తున్నాం. దీనికారణంగా ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ సంక్షేమ పథకాలు నిర్వహించే పాలనాధికారులు సమర్థవంతంగా వీటిని అమలుపరుస్తున్నా, వారిపరంగా హెచ్చు

పరిమాణంలో నిధుల దుర్వినియోగం జరుగుతున్నది. సమాజ శ్రేయస్సుకు వాళ్ళనుంచి ఏమంచీ జరగకుండా, అదేపనిగా, పేదవారనే సాకుతో – ఏ పనీ చెయ్యకుండా ఉండే బ్రాగురాయణుల్ని కూచోబెట్టి మేపడం నీతిబాహ్యం కూడా. ఎవడైతే కష్టించి పనిచెయ్యడో వాణ్ణి పోషించకూడదంటే అదేమీ చెడు సూత్రం కాదు. రష్యా, చైనాలు – ఆధునికీకరణ, శక్తి, అభ్యుదయం సాధించాయంటే, అది కేవలం ప్రభుత్వోద్యోగుల, ప్రభుత్వ చోదిత ప్రాజెక్టుల వల్ల మాత్రమే జరగలేదు. జాతీయ రహదారుల నిర్మాణం, బంజరు భూములను సాగు భూములుగా మార్చడం, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం, అడవుల పెంపకం, గృహాల నిర్మాణం, ఎడారులను పచ్చని ప్రాంతాలుగా తీర్చిదిద్దడం, నదుల అనుసంధానం, జల రవాణా సౌకర్యం కల్పించడం, నదుల పారిశుధ్య కార్యక్రమం, ఆనకట్టలు కట్టడం, గ్రామాల, నగరాల పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ – ఆదిగా గల గొప్పపనులలో ఆ దేశాల ప్రజలను భాగస్వాములను చేసి విజయాలు సాధించారు. ఈ కారణం వల్లనే ఆ దేశాలలో నిరుద్యోగం లేదు. పనిలేని లక్షలాది పౌరులను కూచోబెట్టి మేపుతూ విపరీతంగా నిధుల దుర్వినియోగం మనకు కనబడదు. దేశంలో లక్షల సంఖ్యలో విద్యాధికులైన నిరుద్యోగులుండగా, ప్రభుత్వం వయోవృద్ధులకు పింఛను లివ్వడం ఏతర్కంతో చూసినా ఎంతమాత్రం సరిగాదు. ఇదంతా వాళ్ళవోట్లు కొనుక్కోవడానికే గాని, ఏదో సమాజానికి వాళ్లు ప్రతిగా ఏదో ఒరగబెడతారనీకాదు. సంక్షేమ ప్రతిఫలంగా వేతనాలు చెల్లించే దేశాల ప్రభుత్వాల్లో ప్రతిపౌరుడు, అతడు లేదా ఆమె దినసరి వేతం కానీండి – హెచ్చు మొత్తంలో జీతం పుచ్చుకొనే నిర్వహణాధికారి కోసం భవిష్యనిధికి లేదా నిరుద్యోగభృతిలాభంగా చెల్లించే నిధికి – తనవంతు ధనం అందించే వాడై ఉంటాడు. నిరుద్యోగ భృతి చెల్లింపు కూడా కొంతకాలానికే పరిమితమై ఉంటుంది. ఆ కాలంలో ఆ నిరుద్యోగి ఏదో పనిని వెతుక్కోవాలి. అతడు ఉద్యోగం సంపాదించు కునేందుకు కావలసిన నూతన యుక్తి ప్రయుక్తులను సమకూర్చుకోవడానికి అతనికి చేసిన ఆర్థిక సాయం దోహదపడుతుంది. ఉదాహరణకు కంప్యూటర్లు అందుబాటు లోకి వచ్చిన రోజులల్లో, కేవలం టైపింగు వచ్చిన వాళ్ళకు మాత్రమే ఉద్యోగాలు







రాలేదు. పదాలకూర్పు తదితర కంప్యూటర్ మెళకువలు నేర్చినవాళ్లకే పనులు దొరికేవి. తమ, తమ శ్రమ వినియోగం స్థానే మర మనుషుల ప్రయోగం ఇత్యాదుల వల్ల పనులగొల్పోయి అదనపు సిబ్బందిగా మిగిలిపోయిన వాళ్ళు ఇంకో పనిలో నైపుణ్యం పొందేందుకు తిరిగి వారికి శిక్షణ ఇచ్చేవారు, ఆ పునశ్శిక్షణ వ్యయాన్ని ప్రభుత్వం భరించేది. సంక్షేమ ప్రతిఫలం చెల్లింపు అనేది కేవలం నియమిత కాలానికే చెల్లింపబడేది. అంతేగాని శాశ్వతంగా కాదు.

నేడు భారతదేశంలో జరుగుతున్నదేమిటి? విద్యాధికులు, ఉద్యోగులు, సంపన్నులయిన వాళ్ళ కుటుంబాల్లో ఒక్కరో ఇద్దరో బిడ్డలు మాత్రమే ఉంటారు గనుక ఉత్తమమైన ఉన్నత స్థాయి చదువు చెప్పిస్తున్నారు. కనుకనే వాళ్ళ పిల్లలు తల్లిదండ్రులకన్నా మెరుగ్గా ఉంటున్నారు. వాళ్ళు ఆర్థికాభ్యుదయంలో త్వరగా ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నారు. ఎటొచ్చీ నిరక్షరాస్యులే తమ కుటుంబాలను మెరుగుపర్చుకునే యోగ్యత, తెలివి లేని కారణంగా ఎందరో పిల్లలతో సతమతమౌతున్నారు. కొన్ని ప్రత్యేక వర్గాలవారు డజనుల కొద్దీ పిల్లలను కంటూ దేశ స్వరూపాన్నే మార్చేస్తున్నారు. ఈ సమస్యను మనం కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా పరిష్కరించాలి. దేశంలో తెలివితేటలు కలిగిన, తమ సంపద పెంచుకొంటున్న ఏ కొద్దిమందో ఉంటే ఇబ్బందిలేదు. ఐతే నానాటికి ఉద్యోగాలకు నోచుకోని వాళ్ల జనాభా పెరిగిపోతుంది. ఇది ఇలాగే కొనసాగితే దేశం ఎప్పటికీ శక్తివంతం కాలేదు. సమాజం ఆరోగ్యకరంగా ఉండదు. పేదరిక నిర్మూలన అనేదీ జరుగదు. కనుక కుటుంబ సంఖ్యను నియంత్రించుకోవడం అవసరం. దీనిని నిర్భయంగా నిర్బంధంగా అమలుపర్చాలి. ఓట్ల పుణ్యమా అని ఏ పన్నులూ చెల్లించని పేదవాళ్లు దేశంలో సంపదను కూర్చిపెట్టే అల్పసంఖ్యాకులపై అధికారం చెలాయిస్తున్నారు. పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకుండా పన్ను విధింపుకూడదు అనే నినాదం చేపట్టి బ్రిటిష్ చక్రవర్తి మూడవ జార్జికి వ్యతిరేకంగా అమెరికా పౌరులు ఏనాడో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. మరి మనం భారతదేశంలో "పన్ను చెల్లింప నక్కరలేకుండానే ప్రాతినిధ్యం" అనే వ్యవస్థలో అఘోరిస్తున్నాం. ఓటు హక్కు విద్యకు, పన్నుల చెల్లింపునకు లంకె ఉండాలి. అలాకాని నాడు

అయోగ్యులు, బాధ్యతా రహితులు దేశాన్ని పాలిస్తూ వినాశానికి దారితీస్తారు.

మనదేశంలో రాజకీయ నాయకులే ఒకరితో ఇంకొకరు పోటీపడి – సంక్షేమ పథకాలంటూ తమ లబ్ధికై ఎగబడుతున్నారు. ఒకపార్టీ పేదలకు ఉచిత విద్యుత్తు ఇస్తానంటుంది. ఇంకొక పార్టీ ఉచితంగా ఇళ్లు కట్టిస్తానంటుంది, మరొకపార్టీ మీరు తీసుకొన్న ఋణాల బకాయిలన్నీ మాఫీ చేయించేస్తానని హామీ ఇస్తుంది. ఇలా సంపదను సృష్టించే విధానం కన్నా, ఆ సంపదను పంచిపెట్టే పద్ధతి వేగం పుంజుకుంటూ ముందుకు పోతుంటే మనదేశంలో శక్తి ఉండదు, అభ్యుదయమూ ఉండదు. ఏ పార్టీయైతే ప్రజలకు వాగ్దానాలు ఇచ్చుకుంటూ పోతూ, వాటిని అమలు చెయ్యదో ఆపార్టీ ఎన్నికలలో పాల్గొనే హక్కును కోల్పోతుందనే ఆంక్షలను విధించాలి. ఆపార్టీ అధికారులను మోసగాళ్ళుగా (420లు)గా ప్రకటించి వాళ్లను అరెస్టు చెయ్యాలి, బ్యాంకులను స్థాపించి, ధరావతులను సేకరించి తరచు బోర్డులు త్రిప్పేసేవాళ్ళకి ఇలాగా ఎన్నికల ముందు ఓటరులకు అపరిమితంగా వాగ్దానాలు గుప్పుతూ ఆనక గద్దెనెక్కిన తర్వాత ఆ హామీలకు ఎగనామం పెట్టే వాళ్లకి తేడా ఏమి? భారతీయ జ్ఞానము, ప్రజ్ఞ– "శ్రేయ – ప్రేయ"' అనే వాటి మధ్య స్పష్టంగా వ్యత్యాసం ప్రకటించింది, ప్రతి వ్యక్తిని ఉన్నతికి తీసుకు వెళ్లేది, నిరంతరమైనది – 'శ్రేయ'. కాగా ఒక వ్యక్తిని తాత్కాలికంగా తృప్తిపరచి, తన వైయ్యక్తిక సామర్థ్యం, ప్రయత్నాల ద్వారా తనదంటూ ఒక జీవన వ్యాపారాన్ని చేపట్టకుండా ఉంచేది 'ప్రేయ'. రాజకీయాలు ప్రేయాన్నేగాని, శ్రేయాన్ని ప్రబోధించడంలేదు. ఇది మన పాలకుల గుణాత్మక దివాలా కోరుతనానికి నిదర్శనం. పూర్వకాలంలో యువరాజులకు – అంటే ముందు ముందు రాజులు కాబోయే వారికి – చట్టం, దర్మం, పరిపాలన, నైతికత, (ఇవిగాక వారి శారీరక ధారుధ్యం) వంటి అతి ఉపయుక్త, శ్రేయోదాయక అంశాలపై సుదీర్ఘ శిక్షణ గరపడం జరుగుతుండేది. నేడు శుష్కవాగ్దానాలు చేస్తున్నవారు ఎవరైనా సరే ఎన్నుకోబడుతున్నారు. గత 56 ఏళ్లుగా ఈ దిగజారుడు తనం భారతదేశం పేదరికంలో కూరుకుపోయే స్థితిని దాపురింపజేసింది. పది పంచవర్ష ప్రణాళికలు అమలు జరిపినా ఈ దైన్యం మారలేదు. కొంతమంది మండల, జిల్లా పరిషత్తుల







పాలనా నిర్వాహకుల, శాసన నిర్మాతల, ప్రభుత్వాధినేతల తీరుతెన్నులు చూస్తుంటే సుమతీ శతకంలో ఓ పద్యం గుర్తుకు వస్తుంది.

కనకపు సింహాసనమున  
శునకముఁగూర్చుండబెట్టి శుభలగ్నమునం  
దొనరుగ బట్టము గట్టిన(డెమా క్రసీ అగునుగాక)  
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ!

1930 దశకంలో నిడుబ్రోలులో రాజకీయులకు ఒక పాఠశాల స్థాపించారు ఆచార్య ఎన్.జి. రంగాగారు – సామాజికశాస్త్రం, రాజకీయాలు, ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంస్థా నిర్వహణ, నైతిక సూత్రావళి, పాలనా నిర్వహణలను నాయకుల తయారీకి అక్కడ భోధించారు. నేడు అటువంటి భోధనాశాలలు చాలా అవసరం. పార్లమెంటు, శాసనసభలలో సభ్యులు, రాజకీయ నాయకులుగా ఎదిగేందుకు ఈ పాఠశాలలుండేవి. నేతృత్వం, సచ్ఛీలత ఆదిగాగల ప్రముఖ అంశాలలో మౌలిక సూత్రాలలో శిక్షణ గరపడం అవసరం. ఒకరు లేదా ఇద్దరికి మించి పిల్లలు లేకుండేలాగున కుటుంబ నియంత్రణ, జనాభా అదుపు విధిగా ఉండాలి. సమాజ శ్రేయస్సుకై ఎంతో కొంత శ్రమించనివారికి ఆర్థిక సహాయం, వితరణ అసలేకూడదు. ఏ కుటుంబానికి గాని అయిదేళ్లకు మించి సంక్షేమానికని ఆర్థిక సహాయం ఇవ్వగూడదు. పనిలేకుండా పడిఉండేవాళ్లకి విద్య నేర్పించాలి. ఎక్కువ సంతానం కలిగి ఉండటాన్ని నిరోధించాలి. ఇట్లాంటి కొన్ని చర్యలు పేదరిక నిర్మూలనకు దోహదపడుతాయి. బీదలను (దరిద్ర నారాయణులని) కీర్తించడం, పేదవాళని డిగ్రీ దానంతల పెట్టడం ద్వారా దేశం నుండి పేదరికాన్ని నిర్మూలిస్తామని ప్రగల్భాలు పలకడం జాతిని దివాళా తీయిస్తాయి. కాని పేదరికాన్ని నిర్మూలించడానికి విద్యపరిమితసంతానాలే సరియైన సాధనాలు

# 2. ఉపాధి హామీ పథకం ఉపయోగమేనా?

31-10-2005

ప్రపంచంలో విశేషించి అభివృద్ధి చెందని దేశాల్లో ఎక్కడా లేనివిధంగా ప్రస్తుతం కేంద్రంలో కాంగ్రెస్ హయాంలో రాజ్యం చేస్తున్న వివిధ పక్షాల కూటమి, జాతీయ గ్రామీణ ఉపాధి కల్పన హామీ పథకానికి ఒక చట్టం చేసింది. దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర ఇటీవలే లభించింది. ఇది ప్రజల యొక్క వాస్తవమైన దీర్ఘకాలిక సంక్షేమం కోసమా, లేక ఎన్నికలలో ఓట్లు దండుకోవడానికి ఉపయోగపడే తాత్కాలిక ప్రయోజనం కోసమే ఉద్దేశింపబడిన మంత్రమా? గ్రామీణ ప్రాంతాల్లో 70శాతం జనాభా నివసిస్తున్నారు. వీరియొక్క తలసరి వార్షిక ఆదాయం రూ. 8000/-, పట్టణవాసుల యొక్క తలసరి ఆదాయం రూ. 56,000/-, ఈ వ్యత్యాసానికి కారణం గ్రామీణులు 70శాతం పైగా వ్యవసాయానికి సంబంధించిన పనుల్లో ఉండటం. రానురాను వ్యవసాయంలో మనుషుల పని తగ్గుతూ యంత్రాల వాడకం పెరుగుతోంది ఎద్దులు, ఎద్దులబండ్ల బదులు ట్రాక్టర్లు, ట్రెయిలర్స్, డెలివరీ వాహనాలు ఎక్కువౌతున్నాయి. వరికోతకు, నూర్పుడికి కూడా యంత్రాలు ఉపయోగంలోకి వస్తున్నాయి. నూతుల్లోంచి ఆకుమడులకు, ఇతర సశ్యాలకు నీరు, నూతులు, బావుల్లోంచి మనుషులు, ఎద్దులు కాక ఎలక్ట్రిక్ మోటారుల ద్వారా తీయబడుతోంది. ఇటువంటి తదితర కారణాలవల్ల వ్యవసాయ కూలీల అవసరం తగ్గిపోతుంది. రానురాను ఇలా తగ్గిపోవడం తీవ్రతరమౌతోంది. మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్లలోపే అందరికి ప్రాథమికోన్నత విద్య సమకూర్చాలనే ధ్యేయం 55 సంవత్సరాల తర్వాత కూడా సాధించలేదు. విద్యతో పాటు ఇతర వృత్తులకు కావలసిన నైపుణ్యం నేర్పలేదు. ఇందువల్ల గ్రామాల్లో పెరుగుతున్న జనాభా, ఉపాధి అవకాశాలు తగ్గిపోతూ, ఆదాయ సముపార్జన అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 20 శాతం జనాభా అతి పేదరికంలో కొట్టుమిట్టాడుతోంది. ఇతరులను అటువుంచి, ఈ అతిబీద ప్రజానీకానికి సంవత్సరానికి 100 రోజులు పని కల్పిస్తూ రోజుకు రూ. 80 కూలీ







ఇస్తూ పని కల్పించే హామీ క్రిందెంత ఖర్చు అవుతుందో చూద్దాం.

భారతదేశంలో గ్రామీణ జనాభా 70 కోట్లు. కుటుంబాల సంఖ్య 14 కోట్లు. ఇందులో అతిబీద కుటుంబాల సంఖ్య 20 శాతం ప్రకారం రెండు కోట్ల ఎనభై లక్షలు. దాదాపు వీరంతా చదువులేమివల్ల కూలి చేసుకుని బ్రతకవలసిందే. ఐదుగురు ఉన్న కుటుంబంలో ముగ్గురికి పని కల్పించాలంటే, ఎనిమిది కోట్ల నలభై లక్షలమందికి పని కల్పించాలి. రోజుకి రూ. 80 చొప్పున హామీ ఇచ్చిన 100 రోజుల పనికి, సంవత్సరానికి రూ. 50,400 కోట్లు ఖర్చుపెట్టాలి. వాస్తవానికి అతిబీద వారి సంఖ్య ఎక్కువ కాబట్టీ, ఈ ఖర్చు సంవత్సరానికి ఎనభైవేల కోట్లపైనే ఉంటుంది. దేశవ్యాప్తంగా, సంవత్సరానికి ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి రూ. 6,000 లభ్యమైతే? తలసరి రూ. 1200 ఒక దినానికి? రూ. 4 కన్నా తక్కువే. అతిబీదవారంటే రోజుకు రూ. 40కూడా ఆదాయం లేనివారని అర్థం. అంటే ఈ నిర్వచనం ప్రకారం మనదేశంలో అతిబీదవారి యొక్క దారిద్ర్యం, హామీ ఇవ్వబడిన ఉపాధి పథకం క్రింద పరిష్కృతం అవదని తెలియడంలా?

ఒక గ్రామంలోని లక్ష్యింపబడిన అతి పేదవారిందరికీ 100 రోజులు ఏం పనిని కల్పించగలం? భారతదేశంలో 6లక్షల పైచిలుకు గ్రామాలున్నాయి. అంటే సరాసరి గ్రామ జనాభా 1800;360 కుటుంబాలు, ఇందులో 20 శాతం అంటే 72 కుటుంబాలు అతి పేదవారు. కుటుంబానికి ముగ్గురు చొప్పున 216 మంది పని చేయగలిగినవారుంటారు. వ్యక్తికి సంవత్సరానికి రూ. 6,000లు చొప్పున ఈ గ్రామంలో సంవత్సరానికి13 లక్షల రూపాయల పని చేయబడాలి. ఇంతపని గ్రామాభ్యుదయం కోసం ప్రతి సంవత్సరం ఉండడానికి వీలుందా? 80 శాతం మంది పని చేయడానికి ఇంకా ఉన్నారు. ఆలోచించండి. ఇలా ఈ పథకం క్రింద వెచ్చించబడే ధనంలో సింహభాగం బిచ్చమిచ్చినట్లే.

1985 సంవత్సరంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ, "ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఖర్చుపెట్టే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే

లక్షితులకి చేరుతోంది, మిగిలింది ప్రభుత్వోద్యోగులు, కంట్రాక్టర్లు దళారీల జేబుల్లో చేరుతోంది అని బల్లగుద్ది బాహాటంగా చెప్పారు. ఈ రెండు దశాబ్దాల్లో అది 15 నుంచి పది పైసలకు దిగజారిపోయి వుండవచ్చు. ఊరికనే వచ్చిందే కదా అని ఎంతో కొంత మన చేతుల్లోకి పడిందని లక్షిత బీద ప్రజలు సంతృప్తి చెందుతున్నారే కాని మొత్తం ఏమయింది అని ప్రశ్నించి పూర్తి లబ్ధిని పొందే సంఘటిత శక్తి, స్థైర్యం వారిలోలేదు. కనుక ఎన్నో రకాలైన పన్నులను వేసి ప్రభుత్వం దండుకుంటున్న ప్రజల సొమ్మును పరాన్నభుక్కులపాలు చేస్తున్నాం. వీరిలో అధికులు గ్రామాల్లో వ్యవహరిస్తున్న పార్టీ వ్యక్తులు, ప్రభుత్వోద్యోగులు.

ఇంత ఖర్చుతో శాశ్వత ప్రయోజనాన్నిచ్చే ప్రత్యామ్నాయాలేమైనా ఉన్నాయా అని మనం ఆలోచించాలి. ఈ ఉపాధి హామీ పథకం క్రింద ఖర్చుపెట్టబడే మొత్తం ప్రస్తుతం విద్యకోసం ఖర్చుపెట్టే దానికన్నా కూడాఎక్కువ. అందరికీ విద్య, విశేషించి గ్రామాల్లో ఉన్న అతిబీద వారికి విద్యతోపాటే వేర్వేరు వృత్తులకు కావలసిన నేర్పరితనాన్ని బోధించినట్లయితే వారికి స్వయం నిర్భరత అవకాశాలు హెచ్చువుతాయి. ఉపాధి లభించడానికి కావలసిన అర్హతలు పొందగలుగుతారు. విద్య మూలాన కుటుంబ నియంత్రణను పాటించి సంపన్నులు, విద్యాధికులు, ఉద్యోగస్తులవలె వారు కూడా ఒకరిద్దరు బిడ్డలతో సరిపెట్టుకొని, వారికి మంచి విద్య, పౌష్టికాహారం, ఆరోగ్యం ఇవ్వగలుగుతారు. ఉపాధి కోసం తగినంత పనిలేని గ్రామాల్లోనే ఉండకుండా, ఎక్కడ ఉద్యోగ ఉపాధి అవకాశాలున్నాయో అక్కడకు వెళతారు. హామీ ఇచ్చాం, ఎలాగోలా అమలుచేస్తాం అంటే లక్షితులకు కల్పించబడే పనిద్వారా దేశానికి ప్రయోజనం కూడా ఉండాలి. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పథకాలు అంతులేకుండా బహుకాలం వరకూ ఉండలేవు. కాబట్టి ఈ పథకం క్రింద లబ్ధిపొందే వారు ప్రభుత్వం ఎక్కడ పని చూపితే అక్కడికి వెళ్ళవలసినట్టుగా నియమం ఉండాలి. వేలాది కిలోమీటర్ల జాతీయ రహదారుల పని చేబడుతున్నాం. పట్టణాల్లో అధికాధిక సంఖ్యలో గృహాల, ఇతర భవనాల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్రాల్లో ఎన్నో నీటిపారుదల పథకాలు







ప్రారంభించబడుతున్నాయి. ఎన్నో జలాశయాల నిర్మాణం జరగాలి. వేలాది కిలోమీటర్ల కాలువలు తవ్వాలి. వాటితో పాటు నదుల అనుసంధానం, అడవుల పెంపుదల, వృథాగా వున్న భూమిని సేద్యంలోకి తీసుకువచ్చే పనులు చేపట్టడం, మొదలగు పథకాల్లో వీరిని పురమాయించాలి. పని దగ్గర వీరికి తాత్కాలిక ఆవాసం కల్పించాలి. రాత్రిబడుల్లో చదువు చెప్పించాలి. ప్రాజెక్టు క్షేత్రాల్లో తాత్కాలిక బాలవాటిక ఏర్పరచి వారి యొక్క పిల్లల బాగోగులు చూడాలి. దీనికోసం ఒక సమీకరణ, ఒక ఉద్యమం ఉండాలి. ఇది కేవలం ప్రభుత్వోద్యోగుల ద్వారా అయ్యేపనికాదు. నిజంగా ప్రజాసంక్షేమాన్ని కోరే పార్టీలు ఇటువంటి కార్యాచరణకై పోటీపడి పనిచేస్తే కాని ఈ పథకం సత్ఫలితం ఇస్తుంది. ఇది అసంభవం కాదు. కమ్యూనిస్టుల ఏకపక్ష పాలనలో ఉన్న రష్యా, చైనా దేశాల్లో అందరిచేతా ఈ విధంగా పని చేయబడింది. అందరికి ఉపాధి కల్పించబడి దారిద్ర్యరేఖకు పైకి దాదాపు అందరూ రాగలిగారు. ఈ విధంగా పనిచేయించక పోయినట్లయితే గ్రామీణ ఉపాధి పథకం ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తుంది. దళారీలు, కొంత మంది ప్రభుత్వోద్యోగులు, ఈ ధనాన్ని కబళించేస్తారు. బీదప్రజల కోసం అని గ్రామాల అభివృద్ధి అని, సబ్సిడీల క్రింద గ్రామాల్లో సామాజిక ప్రయోజనాల ప్రణాళికలపైన ప్రభుత్వాలు సంవత్సరానికి యాభై వేల కోట్ల రూపాయలపైనే ఖర్చుపెడుతూ వస్తున్నాయి. ఈ మొత్తాలు ఏమి సాధించాయి? బీద ఓటర్ల జనాభా ఎక్కువవడానికి తోడ్పడ్డాయా లేక ఆ బీద ప్రజలు తమ దారిద్ర్యం నుండి బయటపడటానికి కావలసిన సమర్థతను గడించడానికి ఉపయోగపడ్డాయా? పార్టీలు పోటీపడి దరిద్రులను, 'దరిద్ర నారాయణులు'గా వర్ణించి, వారి భజన చేస్తూ వారికి ఇతర ముడుపుల వాగ్దానం ఇస్తూ వారి ఓట్లకు గాలం వేస్తున్నాయి. అంతేకాని వారి వ్యక్తి వికాసానికి శాశ్వత ప్రయోజనానికి తోడ్పడటం లేదు. ఈ ఆత్మవంచనను, ప్రజా సమ్మోహనా పథకాలను ఎంత తొందరగా విసర్జించితే దేశానికి అంత మేలు జరుగుతుంది. ఈ చట్టం తీసుకురావడానికి మేము పట్టుబట్టాం. దీని ద్వారా బీద ప్రజలంటే మాకు ఎంత శ్రద్ధ ఉందో తెలుసుకోండి అని వామపక్షీయులు చెప్తున్నారు. మరి

ఆ వామపక్షీయులు 27 ఏళ్ళుగా పాలిస్తున్న పశ్చిమ బెంగాల్‌లో, అప్పుడప్పుడు 20 ఏళ్లు పాలించిన కేరళలో ఎంతమంది యొక్క బీదతనాన్ని వీళ్లు తీర్చారు? విశేషించి, పశ్చిమ బెంగాల్‌లో ఎంత సంఖ్యలో వారు ఉపాధిని కల్పించగలిగారు. కేవలం పేదరికాన్ని అందరికి పంచి ఆదాయపు అసమానతను మాత్రం తగ్గించారు. వీరి ఒత్తిడితో ప్రభుత్వాధిపత్యం కోసం కాంగ్రెస్ వారు మరిన్ని ప్రజాసమ్మోహక పథకాలను ప్రవేశపెట్టి దేశానికి ఇతోధికమైన హానిచేస్తారా?

**పసరంబు బందైనఁపసులకాపరితప్పు**
**ప్రజలు దుర్జనులైన ప్రభునితప్పు**
**భార్య గయ్యాళైనఁ - ప్రాణనాథుని తప్పు**
**తనయుఁడు దుష్టైనఁ - తండ్రితప్పు**
**సైన్యంబు చెదరిన - సైన్యానాథుని తప్పు**
**కూతురు చెడుగైన - మాతతప్పు**
**అశ్వంబు చెడుగైన - నారోహకుని తప్పు**
**ఇభమది చెడ మావ - టీని తప్పు**
**ఇట్టి తప్పు లెరుంగక యిచ్చవచ్చి**
**నటుల మెలగుదు రిప్పుడీ, యవని జనులు**
**భూషణవికాస! శ్రీధర్మపుర నివాస!**
**దుష్టసంహార! నరసింహ! దురితదూర!**

భా॥ పశువు పరుల పొలాల్లో మేసి బందెరదొడ్లో పడ్తే గొడ్లకాపరి తప్పు. ప్రజలు దుర్జనులైతే పరిపాలకుల తప్పు. భార్యగయ్యాళైతే భర్త తప్పు. తనయుడప్రయోజకుడైతే తండ్రితప్పు. సరియైన శిక్షణ సైన్యానికి లేకుంటే సైన్యాధక్షుడితప్పు. కూతురు చెడు ప్రవర్తనకలిగివుంటే తల్లి తప్పు. గుఱ్ఱం ఏనుగు సరిగా లేకుంటే అశ్వారూఢుని, మావటి వాడిదీ దోషం. ఇలాంటి తప్పుల నెరుగక భూమ్మీది జనులు తిరుగుతారు ఓ నరసింహా!







# 3. వెనుకటి గుణమేల మానురా!

అత్యధిక ప్రేక్షకులు చూసే ఒక తెలుగు టీ.వి. చానల్‌లో ఒక చర్చలో పాల్గొంటూ, జమాత్-ఏ-ఇస్లామియా-ఏ-హింద్ కార్యవాహకుడు, భారతదేశంలో గతంలో జరిగిన యుద్ధాలూ, జిహాదీ ఉగ్రవాదులు చేసిన ఊచకోతలూ, పాకిస్తానీ ఐయస్ఐ కార్యకలాపాలు మరచి, పాకిస్తాన్ అధ్యక్షుడు శాంతికోసం చేస్తున్న ప్రయత్నాలను హర్షించాలనీ, బస్సు యాత్రలూ, క్రికెట్ పోటీలు ముమ్మరం చేయాలనీ చెప్పారు. "నేను భారత్‌కు క్రికెట్ క్రీడ చూడటానికి రావడం లేదు. కాశ్మీర్ సమస్య చర్చించడమే నా ప్రధాన లక్ష్యం"అని ముషారఫ్ మరోసారి స్పష్టం చేశారు. మార్క్సిస్ట్, ఇస్లామీ, లౌకికవాద, ఓట్ల యాచకులకు పాకిస్తాన్ యొక్క నైజబుద్ధి తెలియకకాదు; హిందూ వ్యతిరేకత, పెరిగిపోతున్న ముస్లిం ఓట్ల కొరకు కక్కుర్తి, అధికార దాహం వల్ల ఈ వర్గాలు పదేపదే పాకిస్తాన్‌తో సంబంధాలు పెంచుకోవాలని హితబోధ చేస్తుంటారు. కాని హిందూ ద్వేషంతో, దేశాన్ని విభజించి, పాకిస్తాన్‌ను సృష్టించిన ఇస్లామీ శక్తులు భారతదేశంలో చిత్తశుద్ధితో శాంతిని కాంక్షించడంలేదు. ఏం ఆడినా, ఏ యాత్ర జరిపినా, ఏ చర్చ నిర్వహించినా వెనుకటి గుణాన్ని మరువక, కాశ్మీర్ పాట పాడుతూనే ఉంటున్నారు. ఈ జబ్బుకు మందు ఒకటే. చర్చలు సాగించండి, కాని విశ్వాసఘాతుక పాకిస్తాన్‌ను నమ్మవద్దు, మన సైన్యాన్ని ఆధునికీకరణం చేసి, అజేయంగా చేయాలి. మరోసారి పాకిస్తాన్ యుద్ధం ప్రారంభిస్తే, దాన్ని ముక్కలుగా చేసి, వాటిని నిర్వీర్యం చేసి, యావత్ భరత వర్షంలో ధర్మం యొక్క సార్వభౌమత్వాన్ని నెలకొల్పాలి.

# 4. కులాలు - సాధికారత

**16-03-2004**

డా॥ కృష్ణారావు గారు తమ "కులాల పునాదులపైనే అధికారం" అనే వ్యాసంలో (ఆంధ్రభూమి 05.04.04)అత్యాసక్తికరమైన విషయాలను వ్రాశారు. ప్రజాస్వామ్య పాలనలో ప్రజలందరికీ భాగస్వామ్యం కావాలి; రాను రానూ అన్ని రాజకీయ పార్టీలు ప్రతి నియోజక వర్గంలోనూ, జనాధిక్యత ఉన్న కులంవారినే అభ్యర్థులుగా నిలబెట్టడం మూలాన, చాలా కులాలకు ప్రాతినిధ్యం, పాలకుల్లో భాగస్వామ్యం చేకూరడంలేదు. మరో వ్యాసంలో "బిసిల్లో చైతన్యమే భారత్‌కు బాసట" (ఆంధ్రభూమి 10.03.04), మరో రచయిత శ్రీ బి.యన్. రాములుగారు దీనికి పరిష్కార మార్గం ప్రతిరాష్ట్రంలోనూ, శాసనసభ, శాసనమండలితో పాటు, అలాగే కేంద్రంలో లోకసభ, రాజ్యసభలతో పాటు, మూడవసభను ఏర్పాటు చేయాలనీ, ఆ మూడో సభలో అన్ని కులాలకూ ప్రాతినిధ్యం ఇవ్వాలని సూచించారు. మరోవైపున కులనిర్మూలన సంఘాలు, కులాలను అంతమొందించనిదే ప్రజాస్వామ్యమూ, సమసమాజమూ కలగానే ఉంటాయి అంటున్నారు. ఇవన్నీ సత్యాలే, కానీ పాక్షిక సత్యాలు.

ప్రపంచంలో వర్గాలుగా విభాజితంగాని ప్రజ ఏ దేశంలోనూ ఏ చారిత్రక కాలములోనూ లేరు. చివరకు వర్గరహిత సమాజాన్ని సృష్టిస్తామన్న కమ్యూనిస్ట్ పాలితదేశాల్లోనూ పాతవర్గాలు పోయి కొత్త వర్గాలు సృష్టింపబడినవి. యుగోస్లోవియా కమ్యూనిస్ట్ మేధావి మిలోవన్ జిలాస్ సోదాహరణంగా ఒక పుస్తకంలోఈ మార్పును ఎప్పుడో నిరూపించాడు. కాకపోతే ఈ వర్గాలు ఇతర సమాజాల్లో, దేశాల్లో వంశపారంపర్యం, జన్మతః గాక; వృత్తిపరంగా, విద్య – అవిద్యల మూలానో, ఆదాయాల ఆధారంగానో ఏర్పడుతూ వచ్చాయి, కాబట్టి ఒక వర్గంలోనుండి మరో వర్గంలోనికి వెళ్ళడానికి స్వేచ్ఛయుంది. ఒక్క అమెరికాలో మాత్రం శ్వేత జాతులచే పాలింపబడుతున్న, ఒకప్పుడు వారికి బానిసలుగాయున్న ఆఫ్రో అమెరికన్లు (ఒకప్పుడు వీరిని నీగ్రోలని పేర్కొనేవారు) ఇప్పుడు కూడా







వివక్షతకూ, న్యూనతకూ గురవుతునేవున్నారు; ఇది జన్మను బట్టి సంక్రమించిన దురవస్థ.

నిరక్షరాస్యతను విద్యతో నిర్మూలించగలం; పనిచేయడానికి అవకాశాన్నిచ్చి, పురోగతికి చేయూతనిచ్చి పేదరికాన్ని పోగొట్టగలం. మతం జన్మతో వస్తుంది, కాని మనం మార్చుకోవచ్చు. మరి కులం జన్మతో రావడం మూలాన ఎలా నిర్మూలించగలం? ఎలా మార్చగలం? తల్లితండ్రులను మార్చుకోలేముకదా? అంటరానితనాన్ని చట్టం ద్వారా సామాజిక స్పృహద్వారా తగ్గించుకుంటూ వస్తున్నాం. అయినా, ఇంకా అక్కడక్కడ ఉంటూనే యుంది.

మనకు ఇన్ని కులాలెలా వచ్చాయి? భగవద్గీతలో శ్రీకృష్ణుడు "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః"అనీ; "బ్రాహ్మణ, క్షత్రియ, విశామ్, శూద్రాణాంచపరంతప ప్రవిభక్తానికర్మాణి స్వభావ ప్రభవైర్గుణైః" అని చెప్పాడు. చేసే పనులను బట్టి, స్వభావంచేత (ఇష్టంచేత) చేస్తున్న పనులను బట్టి నాలుగు రకాలుగా ప్రజలు వర్గీకృతులయ్యారు అన్నారు. జన్మతః తరతరాలుగా ఒకే వర్గంలో ఉండాలని బోధింపబడలేదు; ఆదేశింపబడలేదు. భగవద్గీతలో ఈ నాలుగు వర్ణాలవారు తమ స్వభావాలననుసరించి ఏ ఏ పనులు చేస్తారు అనేది వివరించబడింది. శమ, దమ, తప, శౌచం, క్షాంతి, ఆర్జవం, జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యముతో చేయబడు కర్మలు బ్రహ్మకర్మలనీ; తేజం, శౌర్యం, ధృతి, దాక్ష్యం, యుద్ధంలో పారిపోకుండా ఉండటం, దానం, ఈశ్వర (ఆధిపత్య) భావ ఆధారితకర్మలు క్షాత్రకర్మలనీ; కృషి, వాణిజ్యం, గోపాలనలు వైశ్యకర్మలని, మిగతావన్నీ సేవాభావాలను కలిగిన శూద్రకర్మలనీ,నాలుగు రకాలుగా వృత్తులు విభజింపబడ్డాయి. తమ తమ పనులను సక్రమంగా ఆసక్తితో చేసే వారందరూ (ఒక్క బ్రాహ్మణులేకాదు) సంసిద్ధిని పొందుతారని శ్రీకృష్ణుడు బోధించాడు. దీన్నిబట్టి ఏ రకం పనిచేసే వాళ్లూ, ఇతరులకు తీసిపోరనీ, సమగౌరవాన్ని, సమసిద్ధిని పొందగలరని విదితమవుతోంది. కాలక్రమేణ ప్రతివర్గంలోనూ, కర్మవిశేషతను బట్టి, అనేక అనువర్గాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు కాలువల్లో చేపలు బట్టేవారు, నదుల్లో చేపలు బట్టేవారు, సముద్రంలో చేపలు బట్టేవారు, చేపలు అమ్మేవారు

ఇలా పలువర్గాలుగా, చతురత, విశేషజ్ఞతను బట్టి విభాజితులయ్యారు. తండ్రి, తాతల నుండి బాల్యం నుండి, పిల్లలు అనువంశిక వృత్తియందు నిపుణులవడం సులువు. ఈ విషయాన్ని మనం అందరం అనుదినం చూస్తున్నాం. ఉదాహరణకు రాజకీయనాయకుడి పుత్రులూ, చివరకు పత్నులూ కూడా రాజకీయమే వృత్తిగా ఎంచుకోవడం చూస్తున్నాం. అంతేకాదు, జన్మతః వారు ఏ పత్రాలూ నింపకుండా, ఏ విన్నపమూ చేయకుండా తల్లిదండ్రుల పార్టీ సభ్యులే అని ధంకా పథంగా వినిపిస్తున్నారు. వేలాది సంవత్సరాలనాడు నాలుగు వర్ణాలు మాత్రంతో సరిపెట్టుకుంటే, కాలాంతరాన వృత్తియందు విశేషతను పెంచి, అదే మరొక్క వృత్తిగా ఆవృత్తిలోని వారు మరో వర్గం / వర్ణం / కులంగా పరిణామం చెందారు. ఆ నాలుగు కులాలు నేడు 6,000లకు పైగా పెరిగాయి. కాకా కాలేల్కర్‌గారు హిందూ సమాజంలో 3,500 కులాలను పేర్కొంటే, మండల్‌గారు 4,500 పైగా నమోదు చేశారు. ఇప్పుడవి 6,000కు పైగా ఉన్నాయని తెలుస్తోంది. ఏసుక్రీస్తు వెంటనే ఒకే తెగ అయిన క్రైస్తవుల్లో 80కిపైగా తెగలొచ్చాయి ప్రస్తుతం. మహమ్మదు ప్రవక్త కాలంలో ఒక్క మహమ్మదీయ తెగ ఉంటే, ఇప్పుడు డజను పైగా ఉన్నాయి.

అలాగే ఒక కమ్యూనిస్ట్ పార్టీ నుండి మన దేశంలోనే దాదాపు డజను కమ్యూనిస్ట్ పార్టీలు, ముఠాలు ఉన్నాయ్. అమెరికాలో ప్రతి పది సంవత్సరాలకూ జనగణనతో పాటు వృత్తుల్ని కూడా లెక్కిస్తూ ఉంటారు. ప్రతి దశాకానంతరం, వందలాది పాతవృత్తులు మాయమైపోతుండటం; మరికొన్ని వందల కొత్త వృత్తులు పరిగణనలోనికి రావడం జరుగుతోంది. మనదేశంలో కూడా అంతే. పల్లకీ మోసే బోయవృత్తి ఉందా? అనువంశిక వేశ్యలున్నారా? (అన్నికులాల లోంచి, సెక్స్ వర్కర్స్ అనే క్రొత్త వృత్తి వారుద్భవిస్తున్నారు) పగటివేషగాళ్లు పోయి ఎపిసోడ్ వేషగాళ్ళు బుల్లితెర కోసం వస్తున్నారుగదా?

అయితే మనదేశంలో కులం జన్మతః వస్తోంది, కాని ఇతర దేశాల్లో వృత్తి ఐచ్ఛికంగా వస్తోంది. ఈ వ్యత్యాసానికి బృహత్కారణం అందరికీ చదువూ, శాస్త్రసాంకేతిక విద్య, జన బాహుళ్యంలోకి చొచ్చుకుపోవడం. మనదేశంలో కూడా ఈ మార్పును చూస్తున్నాం. మా తాతముత్తాతలు వందల ఏళ్ళుగా







వ్యవసాయదారులు. మా నలుగురు అన్నదమ్ముల్లో ముగ్గురు బాగా చదువుకున్నారు; వ్యవసాయాన్ని వదిలివేశారు. ఒకరు పారిశ్రామికవేత్త; ఒకరు ఉపాధ్యాయుడు; నేను ప్రభుత్వ ఉద్యోగం చేశాను. బాగా చదువుకోని తమ్ముడు వ్యవసాయంలో, తండ్రిగారి వృత్తిలో మిగిలిపోయాడు. మా ఒక అబ్బాయి మత్స్యపరిశ్రమలో, మరో అబ్బాయి వైద్యవృత్తిలో ఉన్నారు. వారి పిల్లలు ఏ వృత్తిలో ఉంటారో చెప్పలేం. విద్య, అందులో సాంకేతిక శాస్త్రీయ విద్య పరిమితం అయినప్పుడు, సమాజంలో, దేశంలో ఆర్థిక, వాణిజ్య ప్రగతి చాలా తక్కువగా ఉన్నప్పుడు, తండ్రి వృత్తే, సంతతి యొక్క కులం వృతి, సంస్కారాలు. ఇప్పుడు చదువుల ననుసరించి వృత్తి; ఏదేశంలో, ఏ ప్రాంతంలో, జీవనం, వృత్తి ఉందో ఆ సంస్కారాలు; ఆ సంస్కృతి అలవడుతుంది. గ్రామాల్లో మార్పులు నెమ్మదిగా, తక్కువ ప్రమాణంలో వస్తాయి; పట్నాల్లో, విదేశీ జీవనంలో త్వరగా, విపరీత ప్రమాణంలో వస్తాయి. ఉదాహరణకు ఎన్నో కులాలకు, ప్రాంతాలకూ, భాషలకూ చెందిన భారతీయులు గయానా, సురీనాం, ఫీజీ, దక్షిణాఫ్రికా, మారిషస్, వెస్ట్ ఇండీస్‌లకు కూలీలుగా వెళ్ళారు. నూట డెబ్బయ్ సంవత్సరాలలో కులాలు పోయాయి; అందరిదీ ఒకే భాష; కొంతమంది సేద్యం, కొందరు వ్యాపారం; కొంతమంది ఉపాధ్యాయులు ఇలా విద్యకుశలత, ఇష్టం కొద్దీ కొత్త వర్గాలుగా తయారవుతున్నారు.

మనదేశంలో విదేశీయుల దండయాత్ర, దమన నీతి, ఎనిమిది వందల సంవత్సరాలకు పైగా సాగాయి. వాటి ప్రతిఘటనలో దమనానికి గురియైన మనజాతి విద్య, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో వెనుకబడ్డాం. వృత్తులు మారలేదు, కులాలు మారలేదు, ఉండే ప్రదేశం మారలేదు. ఇవన్నీ మారాలంటే అభివృద్ధి చెందిన దేశాల్లో లాగా అందరికీ విద్య, పరిమిత సంతానం, గ్రామాలను వదిలి పట్నాల్లో నివాసం, కొత్త వృత్తులూ, కొత్త జీవన సరళులూ అలవరచుకోవాలి. ఈ మార్పు మనం చూస్తున్నాం. ఒక ఐ.టీ. కంపెనీలో, ఒక బ్యాంక్‌లో, ప్రక్కప్రక్కన కూర్చొని, ఒకేపనిచేస్తున్న, ఒకే విద్యా ప్రమాణాలూ, అభిరుచులు వున్న వేర్వేరు కులాల్లో పుట్టినప్పటికీ, సంస్కృతీ సారూప్యం మూలాన, కులం వారిని విభజించడం తగ్గిపోతోంది. అన్యోన్యత ఉన్నవారు కులానికి సంబంధం లేకుండా వివాహం

చేసుకోవడానికి సంకోచించరు. అమెరికాలో ఉన్న భారతీయుల్లో సంస్కృతీ సారూప్యం, కులం కన్నా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటోంది. భారతదేశంలో సంస్కృతీ సారూప్యత ఇంతవరకు కులం ద్వారా సంక్రమిస్తోంది. ముమ్ముందు చదువు ద్వారా, వృత్తి ద్వారా, నివాస ప్రాంతం ద్వారా సంస్కృతీ సారూప్యత, తద్వారా వివాహ సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి. కులం యొక్క వాడి, విభేదం, ప్రత్యేకత తగ్గుతాయి. ఈ పరిణామాన్ని త్వరితం చేయాలంటే విద్య, ఆధునికత, పారిశ్రామికీకరణ, పట్టణ నివాసం – వీటిని మనం కాంక్షించాలి, ప్రోత్సహించాలి. పథకం ప్రకారం సాధించాలి.

దురదృష్టవశాత్తూ మన రాజకీయాలు తప్పుదారిన పట్టాయి. మన పార్టీలకూ, నాయకులకూ రాజకీయం ఒక వృత్తిగా, ఒక ఆజీవికగా తోస్తోంది.

రాజకీయానికి లక్ష్యం ప్రభుత్వం నడపడం, ఎమ్మెల్యేలుగా, యం.పీలుగా ఎన్నిక అవ్వడం, అందుకు ఓట్లు కావాలి. విద్య, ఆర్థిక వికాసం, ఆజీవిక లేని, బీదవారి, నిరుద్యోగుల, సదసద్వివేక చతురత లేని జనాల ఓట్లు దండుకోవాలంటే వారికి సులువైన మార్గం, బంధుత్వం, కులం. అందుకనే కులాల వారీగా ప్రజాసమీకరణ, సింహనాదం, శంఖారావం, గర్జన, తర్జనలూ, కులవర్గ రహిత సమసమాజం అనే పాట పాడే కమ్యూనిస్ట్ సోదరులు కూడా చివరకు కులం యొక్క శరణాన్నే ఆశ్రయిస్తున్నారు. వీరు ప్రజాహితం కోసం నిర్మాణ, సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు (1943–52) ఎంతో ప్రజాదరణను పొందారు. అధికారమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న తర్వాత ఇతర పార్టీలకూ, అధినేతలకు పల్లకీ మోసేవారుగా 'పరిణతి' చెంది, ప్రతిదినం ప్రకటనలు చేసే 'స్టేట్‌మెంట్ పార్టీ ఆఫ్ ఇండియా"గా కుదించుకుపోయారు. ఇది అందరూ విచారించవలసిన పరిణామం.

శ్రీ బి.యస్. రాములు గారు కమ్యూనిటీ (కాస్ట్‌కు మారుపేరు) సభలను శాసనసభలకు విస్తృతాంగాలుగా ఏర్పరచాలని వ్రాశారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 170/200 కులాలు ఉన్నాయి. అందరికీ ప్రాతినిధ్యం కావాలంటే అటువంటి సభకు వెయ్యి మందికి పైగా సభ్యులుండాలి, జనాభా దామాషాననుసరించి, అంత పెద్దసభలో ఏ విషయాన్ని కూలంకషంగా చర్చించగలం? భారతదేశంలో







6000పైగా కులాలున్నాయంటున్నారు. ఢిల్లీలో అటువంటి సభకు ఏ పదివేలమందో సభ్యులుండవలసి వస్తుంది. అవును, కమ్యూనిస్ట్ రష్యాలో, చైనాలో అంతమంది సభ్యులుండే శాసనసభలుండేవి / ఉన్నయ్. గంటల తరబడి అధినాయకుని ప్రసంగం విని, కరతాళ ధ్వనులు ఆపమని ఆజ్ఞ వేసే వరకు చేయడం, వారు పాలించమన్న శాసనాలకు "అవును" అని చెప్పడం కన్నా వారికి వేరే బాధ్యతలు గాని, హక్కులుగాని లేవు. కమ్యూనిటీ సభలను పూర్తిగా కాదనలేకపోయినా, ఇవి తాత్కాలికోపశమన ప్రయోగాలు, పరికరాలు అని మనం విస్మరించకూడదు.

ఉపసంహారం: కులాలు శాసనాల వల్ల పోవు; తీర్మానాల వల్ల ఉద్యమాల వల్ల అసలే పోవు; అందరికీ విద్య, శాస్త్రీయ, సాంకేతిక విద్య, పారిశ్రామికీకరణ, పట్టణ నివాసం, ఆధునికీకరణ, సంస్కృతీకరణ, ప్రభుత్వం స్వధర్మాన్ననుసరించి ప్రజలూ, వారి సంస్థలూ చేయలేని పనికి మాత్రం (దేశ రక్షణ, న్యాయం, న్యాయపాలన, రోడ్లు, రవాణా, రహదార్లూ, సేద్యం, విద్య, ఆరోగ్యం, జాతీయ స్థాయిలో విద్యుదుత్పత్తి, వితరణ; నదుల అనుసంధానం) పరిమితమయినప్పుడు (కనీసం క్రమేణ), రాజకీయానికి ప్రాధాన్యత తగ్గిపోతుంది. ఓట్ల కోసం నానా పాట్లూ పడవలసిన అవసరం తగ్గుతుంది. సమాన సంస్కృతులున్న వారు దంపతులవుతారు. జన్మతో సంక్రమించిన కులవర్గాలు గాక, మేధస్సుతో, సాధనతో, సంపత్తితో ఏర్పరచుకున్న సారూప్యత గల వర్గాలు ఏర్పడుతాయి; తమ కృషిని బట్టి వర్గాంతరం జరుగుతుంది. భగవంతుని ప్రసాదంగా కాక, ఆర్థిక స్థోమతను బట్టి సంతానాన్ని పరిమితం చేసి వారికి ఉత్తమ విద్యనూ, ఉత్కృష్ట విలువలనూ పోషకాహారాన్ని ఇవ్వగలగటమూ కులవైషమ్యాన్ని రెచ్చగొట్టకుండా కులంలో విద్యాధికులైన వారూ, సంపన్నులైనవారూ సర్వతోముఖాభ్యుదయం కోసం ఉద్యమించడం; అవసరం. సాక్షరతా, సంస్కృతితో సాధికారిత సిద్ధిస్తుంది.

# 5. ప్రజాస్వామ్య భారతంలో హేయతమ దినం

**20.06.2005**

**ము**ప్పై సంవత్సరాలనాడు, అనగా ఇరవై ఐదు జూన్ 1975 ఉదయాన వార్తా పత్రికలలో పతాక శీర్షికలు, రేడియో ప్రసారాల్లో ఉద్వేగభరితమైన ఘోషణలు 'ఇందిరాగాంధీ ప్రధానమంత్రి భారత రాజ్యాంగపు 352(1)వ అధికరణని అనుసరించి భారతదేశంలో అత్యవసర పరిస్థితి విధించింది. 1942లో మహాత్మాగాంధీ ఆదేశానికి భారత జాతీయ కాంగ్రెస్ "క్విట్ ఇండియా", "భారతదేశాన్ని వదలిపో" అనే ఆజ్ఞను బ్రిటీష్ వాళ్ళకు ఇచ్చే తీర్మానాన్ని ఆమోదించింది. మరుసటి దినాన సూర్యోదయం కాకముందే గాంధీ గారితో సహా వందలాది జాతీయ నాయకులను నోరుమూయించడానికి, నిశ్చేష్టులను చేయడానికి కారాగారాల్లో నిర్బందించింది బ్రిటీష్ ప్రభుత్వం. సరిగ్గా అదే ఉద్దేశ్యంతో స్వతంత్ర భారతంలో ప్రజాస్వామిక ప్రధానమంత్రిగా వున్న ఇందిరమ్మ బ్రిటీష్ పాలకుల పద్ధతిలో స్వాతంత్ర్య యోధులను, పరిపాలనాదక్షులను ప్రజాస్వామ్య పరిరక్షకులను విపక్షంలో వున్న జయప్రకాశ్ నారాయణ్, మురార్జీదేశాయ్ వంటి పేరొందిన నాయకులను, వందలుకాదు, వేల సంఖ్యలో జైళ్ళలో పెట్టించింది. ఈ దుశ్చర్యకు ఆశ్చర్యపడిన జయప్రకాశ్‌నారాయణ్‌గారు, ఈ అత్యవసర పరిస్థితిని "వినాశకాలే విపరీత బుద్ధి"గా అభివర్ణించారు. పత్రికల మీద సెన్సార్‌ను విధించారు. ప్రజల సమావేశాల మీద ఆంక్షలు విధించారు. రేడియో తదితర ప్రసార మాధ్యమాల మీద నిఘా విధించి, ఇందిరకు గాని, అత్యవసర పరిస్థితికిగాని వ్యతిరేకంగా స్పందించడానికి వీలు లేదన్నారు. తమకు వ్యతిరేకులనుకున్న ప్రభుత్వ అధికారులను పనికిమాలిన పదవులకు స్థానాంతరం చేసారు. 'ప్రతిపక్షాలు, వాటి నాయకులు దేశంలో కల్లోలాన్ని సృష్టిస్తున్నారు, అరాజకతను రెచ్చగొడుతున్నారు. అందుకే దేశసమగ్రతను, శాంతిని కాపాడటం కోసం, ఆర్థికస్థితిని, ప్రజాసంక్షేమాన్ని, సాంఘిక న్యాయాన్ని ఏ అడ్డంకులూ లేకుండా సాధించడం కోసం, బాధ్యతారహితంగా కేవలం ఇందిరాగాంధీని గద్దెదించడం







కోసమే ప్రతిపక్షాలు ప్రయత్నించడం మూలాన "బీదలపాలిటి పెన్నిధి" అయిన ఇందిరమ్మ ఈ "అత్యవసర పరిస్థితి"ని విధించవలసి వచ్చిందని ప్రచారం చేసారు.

ఇంతకూ సన్నిహితమైన కారణం ఏమంటే తన ఎన్నిక కోసమై చట్టవిరుద్ధమైన అవినీతి పద్ధతులను అవలంభించి ఇందిరాగాంధీగారు ఎన్నికను గెలిచారు కనుక అది చెల్లదని అలహాబాదు హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పును మన్నించినట్లయితే ఇందిరగారు పార్లమెంటు సభ్యులుగా గాని, ప్రధానమంత్రిగా గాని ఉండలేరు. పదవిలోనించి తప్పుకున్నట్లయితే తనకు ఏ కీడు వాటిల్లుతుందో అని, న్యాయాలయం యొక్క తీర్పును వమ్ముచేయటం కోసం అత్యవసర పరిస్థితిని ప్రవేశపెట్టింది. 1969లో తనకు ఇష్టంలేని వ్యక్తి సంజీవరెడ్డిగారు రాష్ట్రపతి అయినచో తనకు ముప్పు కలుగుతుందనే భయంతో, తన ఆధిక్యతను నిలుపుకోవడం కోసం పార్టీని చీల్చి కమ్యూనిస్టుల సహాయంతో తన విధేయుడు భక్తుడు అయిన వి.వి.గిరిని రాష్ట్రపతిగా ఎన్నిక చేయించుకోగలిగింది ఇందిరమ్మ. అత్యవసర పరిస్థితిని విధించడం కేవలం అలహాబాదు హైకోర్టు తన ఎన్నికకు సంబంధించి ఇచ్చిన తీర్పు మాత్రమే అని అనటానికి నిదర్శనం ఒకటి వుంది. కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగా పార్లమెంటు సభ్యుడిగా ఎన్నిక అయిన నవీన్ చావ్లా యొక్క ఎన్నిక అవినీతి పద్ధతులను అవలంబించి గెల్చాడని, అభియోగంపై ఒక హైకోర్టు రద్దు చేసింది. అప్పుడు ఈ ఉదంతంలో ఇందిరాగాంధీగారు మిన్నకున్నారు. కాని తన పదవికే ముప్పు తెచ్చేటటువంటి తీర్పు వమ్ముచేయడానికి ఒకే మార్గం, అది అత్యవసర పరిస్థితి విధించడం. తన ద్వితీయ పుత్రుడైన సంజయ్‌గాంధీ తల్లి యొక్క పదవిని ఆసరాగా చేసుకుని మారుతీ కంపెనీ పెట్టడంతో సహా ఎన్నో స్వంత లాభాల కోసం పాలన యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని ప్రభుత్వ వ్యవస్థ అస్తవ్యస్తమైపోతోందని, ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోతుందని ప్రతిపక్షాలు ఆందోళనకు ఉద్యమించాయి. దేశమంతటా ఇందిరకు వ్యతిరేకత ఎక్కువైపోతోంది. ఈ సంక్షోభం నుంచి రక్షించుకోవాలంటే ప్రజాస్వామ్యాన్ని హరించి నియంతృత్వాన్ని స్థాపించడమే శరణ్యమవుతుంది. ఇందిరాగాంధీ గారికి మద్దతుగా భారతీయ

కమ్యూనిస్టు పార్టీ నిలిచింది. అంతకు ముందు ఆ పార్టీ నిర్ణయం మేరకు పార్టీని వదిలి కాంగ్రెస్‌లో ప్రవేశించిన మోహన్ కుమార్ మంగళం వంటి నేతలు ఇందిరకు సలహాదారులై, రష్యాలో ఏ విధంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని బలగాలను ఉపయోగించి విపక్షాలను, వ్యతిరేకులను నిర్మూలించారో ఆ పద్ధతులను ఇందిరాగాంధీ గారి చేత అవలంభింపచేశారు. భారత ఉచ్ఛ న్యాయాలయాన్ని ప్రక్కకు పెట్టి, తనకు ఎదురుకాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో, వరిష్ట న్యాయమూర్తులను ప్రక్కకు పెట్టి, తన భావసారూప్యం వున్న అపరనాయ్యమూర్తిని సుప్రీంకోర్టు యొక్క ముఖ్య న్యాయమూర్తిగా నియమించింది. ఆయన ఎటువంటి విధేయుడంటే, అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించే ఒక కేసులో ' ఈ పరిస్థితి వున్నంత కాలం ఏ వ్యక్తికి, ఏ హక్కూ వుండదు, అంతేకాదు, ఏ వ్యక్తికీ ప్రాణ హక్కు కూడా లేదు, ప్రభుత్వం ప్రాణ హక్కును హరించడం కూడా చట్ట సమ్మతమే" అని తీర్పునిచ్చారు.

ఇక ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ స్వంతంగా చేసుకోవటం కోసం అధికారులను భయపెట్టి చేయరాని పనులన్నీ చేయించారు. తమను సమర్థించని ప్రభుత్వోద్యోగులను, 'అవినీతిపరులని, అసమర్థులని' ఆరోపించి తొలగించారు.

రాజ్యసంపద మదంబున ఎన్నో దుష్కృత్యాలు చేస్తున్న వ్యక్తికి దేవుడున్నాడు కాబట్టి వేరొక బుద్ధిని కలిగింది. ఇక నన్ను ఎదిరించి గద్దె దించే శక్తి మరొకటిలేదని ధీమాను కలిగి పద్దెనిమిది నెలల తర్వాత మార్చి 27, 1977నాడు అత్యవసర పరిస్థితిని తొలగించి, విపక్షనేతలను, వారి కార్యకర్తలను అందరినీ విడుదల చేసి ఎన్నికలను ప్రకటించింది ఇందిరాగాంధీ. అత్యవసర పరిస్థితిలో తన మద్దతుదారులను మెప్పించడం కోసం తన పదవిని కాపాడటం కోసం రాజ్యాంగ చట్టాన్ని విపక్షం లేని పార్లమెంటు చేత సవరణ చేయించింది. ప్రధానమంత్రితో పాటు రాష్ట్రపతి భూమికను ప్రశ్నించే హక్కును తొలగించడం, మార్గదర్శక సూత్రాల్లో "సోషలిజం", "సెక్యూలరిజం" అనే 'అ'నిర్వచనీయమైన పదాలను ప్రవేశపెట్టడం వామ పక్షీయులకు, మైనారిటీలకు సంతుష్టినిచ్చే ప్రక్రియలను చేసింది. జన







సంతుష్టీకరణ కోసం "పేదరిక నిర్మూలన" పేరుతో ఇరవై సూత్రాల, ఐదు సూత్రాల పథకాలను ప్రచారం చేయించారు. కాని ఆ దారిద్ర్యం, ఆ నిరుద్యోగ పరిస్థితులు నేటికీ తాండవిస్తూనే వున్నాయి.

ఎవరినైతే దేవుడు నాశనం చేయదలచారో వారికి పదవీ మద మాత్సర్యాలను కలుగచేస్తాడట. అదే జరిగిందేమో! ఇందిరమ్మగారు ఎన్నికలు ప్రకటించగానే విభజితులమైతే వినాశం పొందుతామనే భావనతో ప్రతిపక్షాలన్నీ ఏకమై ఎన్నికల రంగంలో దిగాయి. అత్యవసర పరిస్థితుల్లో చేసిన దుశ్చర్యలకు కాంగ్రెస్ ఓడింపబడుతుందనే భయంతో జగ్జీవన్‌రామ్, బహుగుణలు మరికొందరు, కాంగ్రెస్‌ను వదిలి ప్రతిపక్షాల కూటమితో భాగస్వాములయ్యారు. భారత ప్రజలు అధికశాతం నిరక్షరాస్యులైనా, పట్టభద్రులు కాకపోయినా ఏది ధర్మమో, ఏది న్యాయమో ఏది ఉచితమో నిర్ణయించుకునే వివేకాన్ని కోల్పోయిన వారు కాదు. అందుచే 1977లో సార్వత్రిక ఎన్నికల్లో "దుర్గ"కు ప్రతిరూపమనుకుని ఒకప్పుడు ఆరాధించిన ఇందిరాగాంధీని, ఆవిడ పుత్రుడిని, ఆవిడ పార్టీని ధర్మగ్లాని చేయించిందనే ఆక్రోషంతో మట్టి కరిపించారు. ఈ నిర్ణయం భారతీయుల విచక్షణా శక్తికి ఒక మహా నిదర్శనం. వారి వివేకం, విచక్షణ తాత్కాలికంగా మరుగుపడచ్చుగాని, అనతికాలంలోనే అవి తిరిగి ప్రభవిస్తాయి. అందుకనే ప్రజలను ఎల్లకాలం మభ్యపెట్టి అనుచిత నిర్ణయాలకు పథకాలకు అలవాటు చేయలేము.

విచిత్రమేమిటో ప్రస్తుతం అత్యవసర పరిస్థితి విధింపబడనప్పటికీ, సోనియా నాయకత్వానికి కట్టుబడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందిరాగాంధీకి అత్యవసర పరిస్థితిలో సహాయం చేసిన కమ్యూనిస్టులు కుటిలనీతిపరులై 1975–77లో చేసిన దుశ్చర్యలను తిరిగి చేయటం ప్రారంభించారు. తమ భక్తులను విధేయులను గవర్నర్‌లుగా నియమించటం, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే పరిస్థితి వుంటే అటువంటి శాసనసభలను రద్దుచేయటం, తమకు అవిధేయులను, తమ ప్రయోజనాలకు, దుశ్చర్యలకు సహకరించని వారిని ఏరివేయటం, తమపైవున్న

అవినీతి కేసులను మరుగుపరచటం, లేక కొట్టి వేయించడం; మైనారిటీలు, కమ్యూనిస్టులు చెప్పినవన్ని తమ అధికారం నిలబెట్టుకోవడం కోసం చేయటం మొదలైన పనులు చేస్తున్నారు. అంతకంటే ఘోరం ఏమిటంటే భారతదేశం యొక్క భద్రతను అఖండతను విచ్ఛిన్నం చేయతలపెట్టిన అంతర్జాతీయ మతోన్మాదశక్తులు విశృంఖలంగా పనిచేస్తున్నాయి. భారతీయుల పరంపరాగత ప్రత్యేకతను, ధార్మికదృష్టిని కించపరుస్తూ ఇతర మతాల్లోకి మార్చే శక్తులు ఎంతో ప్రోత్సాహాన్ని, సహాయాన్ని పొందుతున్నాయి. ఢిల్లీలో అనువంశిక పరిపాలన కోసం ఎటువంటి వ్యూహాలు, కార్యక్రమాలు జరుగుతాయో, అదేవిధంగా రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ అధినేతలకు శిరోధార్యం వహించే రాష్ట్రనాయకులు తమ మతం, తమ కులం, తమ బంధువులను వారసులుగా తయారు చేస్తున్నారు. ప్రభుత్వ నియమాలతో నిమిత్తం లేకుండా ఇష్టం వచ్చిన వారికి లాభసాటి శక్తిశాలి పదవులను ఇవ్వటం జరుగుతోంది. ఇందిరగారు అత్యవసర పరిస్థితిలో తమ కుటుంబం యొక్క ప్రయోజనాలను మాత్రమే రక్షించుకోవటానికి ప్రయత్నించింది. దేశభద్రతకు ముప్పువచ్చే పనులేవీ చేయలేదు. కాని ప్రస్తుత అప్రకటిత "అత్యవసర" పరిపాలనలో తమ వంశోన్నతియే కాక దేశ విచ్ఛిత్తికి, బలహీనతకు దోహదం చేసే ప్రతి శక్తికి నిరవరోధ అవకాశం ఇవ్వబడుతోంది.

భారతదేశం యొక్క సుదీర్ఘ ఇతిహాసంలో యు.పి.ఏ ప్రభుత్వం వంటి ఫాసిస్టు, హిందూ వ్యతిరేక పాలకులు అప్పుడప్పుడు విజృంభించిన వారున్నారు. కాని ఆత్మస్థైర్యం, నిజాయితీ వున్న భారతీయులు అకుంఠిత దీక్షతో పోరాడి దుష్టపాలనను దుష్టపాలకులను తుడిచిపెట్టారు. మేధావులు, నిజాయితీ గలిగిన వ్యక్తులు, ప్రలోభాలకు లొంగక, "మార్క్సు వాదులను, మత మార్పిడీ వ్యాపారస్తులయిన మిషనరీలను, ఇస్లామిస్టులను, మెకాలేయులను" దుష్ట చతుష్టయాలను , వారి అక్రమ చర్యలను వారి దేశ విచ్ఛిన్నకర కార్యకలాపాలను నిర్భీతిగా తూర్పారబట్టాలి. ఏ విధంగా ఐతే మహాత్మగాంధీ నాయకత్వంలో నిర్భయంగా ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి దుష్టపాలకులను ఎదిరించారో, ఆ విధంగా







ఈ అప్రజాస్వామిక పాలనను, అంతర్జాతీయ కుట్రదారులను మనం ఎదుర్కోవాలి. విశేషించి మెజారిటీ హిందువులకు జరుగుతున్న అన్యాయాలను మనం ఎదుర్కోవాలి. చర్చి, మసీదు వ్యవహారాల్లో, వారి సంపదల్లో జోక్యం చేసుకోలేని ప్రభుత్వానికి హిందూ దేవాలయ సంపత్తిని తన ఇష్టమొచ్చినట్లు ఖర్చుచేసే అధికారం కూడా లేకుండా చేయాలి.

మైనారిటీలను తుష్టిపరచడం కోసం రాజ్యాంగ చట్టాన్ని సవరించి మరొక అత్యవసర పరిస్థితి ఘోషణకు యు.పి.ఎ. ప్రభుత్వం సంకల్పిస్తోంది. కుట్ర ద్వారా మతకలహాలను ప్రారంభించి, ఆ రాష్ట్రాన్ని 'కమ్యూనల్ ఎమర్జన్సీ' క్రిందకు తీసుకురావటమే ఈ సవరణ వుద్దేశ్యం. అటువంటి పరిస్థితుల్లో ఆ రాష్ట్ర విపక్ష ప్రభుత్వాలను రద్దు చేయటం ఈ 'దుష్ట చతుష్టయం' యొక్క వుద్దేశ్యం. ఈ సవరణను సాగనీయరాదు.

భా॥ ఏ సమయాన ఏది అవసరమో తెలుసుకొని అప్పటికా మాటలు చెప్పి, ఇతరుల మనస్సు నొప్పింపక, తాను బాధపడక తప్పించుకొని తిరిగేవాడే బుద్ధిమంతుడు.

# 6. భారత కమ్యూనిస్టుల వింత ధోరణులు

**"పిట్టకొంచెం, కూత ఘనమన్నట్టుగా"** దేశం మొత్తంలో 5 శాతానికి తక్కువగా మాత్రమే ఓట్లు పొందుచున్నప్పటికీ, రెండు రాష్ట్రాల్లో మాత్రమే ప్రభావమున్నప్పటికీ, కమ్యూనిస్టుల అభిప్రాయాలూ, వ్రాతలూ, ప్రకటనలూ, ప్రదర్శనలూ, గోడలమీద వ్రాతలూ, దేశ ప్రజలంతా వారివైపే ఉన్నట్లు సూచిస్తాయి. దీనికి ముఖ్యకారణం, వార్తాపత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో, కొన్ని విశ్వవిద్యాలయాల్లో వారి చొరబాటే.భారత కమ్యూనిస్టుల వింత ధోరణులు

మనదేశంలో అమలు జేయతలచుకున్న ప్రతి సరళీకృత విధానాన్ని, ప్రతి ఆర్థిక సంస్కరణనూ వ్యతిరేకించడం వారికి అలవాటైపోయింది. కమ్యూనిస్ట్ చైనా ఏమి చేసినా శ్లాఘించడం, అదేపని భారతదేశం చేస్తే తెగడటం వారికి అలవాటైపోయింది. చైనా అణ్వస్త్రాలనూ, అణు విస్ఫోటనలూ చేస్తే అవి శాంతి పరిరక్షణకని చెబుతారు. అదే భారతదేశం చేసినప్పుడు, "మనదేశం బీద దేశం, ఇంత ఖర్చు భరించలేం. ఆ ధనాన్ని పేదల కోసం వెచ్చిస్తే మంచిది" అంటారు. చైనా వ్యోమసీమలోకి రాకెట్ ద్వారా మనిషిని పంపితే హర్షిస్తారు. చైనా చంద్రుడిపైకి మనిషిని పంపే పథకాన్ని చేపట్టిందంటే, అది సోషలిజం యొక్క ఘన విజయమంటారు. భారత వ్యోమ పరిశోధన సంస్థ, చంద్రునిపైకి మనిషిని పంపే పథకం చేపట్టిందంటే, బీద భారతదేశం అటువంటి నిరర్ధకమైన, డాంబిక చర్యలు చేయకూడదంటారు. ఆకలితో ప్రజలు చస్తున్నా, కమ్యూనిస్ట్, పాలిత ఉత్తరకొరియా ఆటంబాంబులను, క్షిపణులను తయారుచేయడం, అమెరికాకు బుద్ధి చెప్పే ప్రయత్నమంటారు. చైనా, సింకియాంగ్ రాష్ట్రంలో వేర్పేటు వాదులైన ముస్లింలను అణచివేస్తుంటే కిమ్మనని వారు, అదే పని "పోటా" చట్టం క్రింద భారతదేశం చేస్తూంటే దాన్ని వ్యతిరేకిస్తారు. టిబెట్ స్వయంప్రతిపత్తిని కోరితే, చైనా నిరాకరించడం సబబేనంటారు. కాని ముస్లిం ఆధిక్యత కారణంగా కాశ్మీరుకు భారతదేశం అధికాధిక స్వయం ప్రతిపత్తిని కల్పించాలంటారు. చైనా ప్రభుత్వరంగ







సంస్థలను ప్రైవేటైజ్ చేస్తోంది. అన్ని రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. ఈ చర్యలనే భారతదేశం చేస్తుంటే, వాటిని వ్యతిరేకించడమే కాదు, అలా చేయడం ప్రపంచ బ్యాంక్‌కూ, అమెరికాకు మనం అమ్ముడుపోవడమే, అంటున్నాయి కమ్యూనిస్ట్ పార్టీలు. చైనాలో ఒకే ఒక్క కమ్యూనిస్ట్ పార్టీ వుంటే మనదేశంలో కనీసం తొమ్మిది కమ్యూనిస్ట్ పార్టీలున్నాయి. ఆ దేశంలో సమ్మె చేయనీయరు. ఇక్కడ పదేపదే సమ్మెలు చేయిస్తారు కమ్యూనిస్ట్‌లు. అక్కడ వాక్ స్వాతంత్ర్యం కోసం, మానవ హక్కుల కోసం మాట్లాడితే, ప్రదర్శన చేస్తే కాల్చేస్తారు. 1988లో జూన్ 4వ తేదీనాడు టియూనన్‌మెన్ స్క్వేర్, బీజింగ్‌లో విద్యార్థులు శాంతియుతంగా వాక్ స్వాతంత్ర్యం కోసం ప్రదర్శన చేస్తుండగా, చైనా యొక్క ప్రజాసైన్యం, ట్యాంకులనుపయోగించి మూడు వేలకు పైగా విద్యార్థులను కాల్చి చంపివేసింది. మన కమ్యూనిస్టులు మిన్నకున్నారు. ఇజ్రాయిల్‌లో, పాలస్తీనీయులు ఆత్మాహుతి ప్రక్రియ ద్వారా చిన్నారులను సహితం హతమారుస్తుంటే, వారి చర్యలకు వ్యతిరేకంగా, వాటిని అదుపులోనికి తీసుకురావడానికి, ఇజ్రాయిల్ సైనికచర్యలు తీసుకుంటే వాటిని ఖండించడం, సమావేశాలు ప్రదర్శనలు జరపడం కమ్యూనిస్ట్‌ల ఆనవాయితీ.

ఒక ముఖ్య విషయంలో చైనా ఏంచేస్తోంది, దాన్నే మనం చేయబూనితే మన కమ్యూనిస్ట్‌లు ఏమంటున్నారో చూద్దాం. చిల్లర వ్యాపారం (రిటైల్ బిజినెస్) లో విదేశీ పెట్టుబడిని చైనా 1994లో ఆహ్వానించింది. ప్రపంచలోనే అతిపెద్దదయిన అమెరికా దేశపు సూపర్‌మార్కెట్ చైన్ కంపెనీ వాల్‌మార్ట్, 1995లో మొదటి సూపర్ మార్కెట్‌ను ప్రారంభించింది. తరువాత ఫ్రాన్స్ దేశానికి చెందిన సూపర్ మార్కెట్ సంస్థ కారెఫూర్ చైనాలో ప్రవేశించింది. దాని వెంటే ఇంగ్లండ్ యొక్క టెస్కో సూపర్ మార్కెట్ కంపెనీ చైనా రంగప్రవేశం చేసింది. ఈ విధంగా ప్రపంచంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో వున్న రిటైల్ వ్యాపార సంస్థలు చైనాలో ప్రవేశించి, దేశీయ సంస్థలతోపాటు, తమలో తాము పోటీ పడుతున్నయ్. కాని మన కమ్యూనిస్ట్‌లు (స్వదేశీ జాగరణ మంచ్ వారు కూడా) విదేశీ

పెట్టుబడులు, కంపెనీలు మన రిటైల్ ట్రేడ్ రంగంలోకి రాకూడదని ఘోషపెడుతున్నారు. "పరదేశీయులు కేవలం లాభాల కోసమే మనదేశంలో పెట్టుబడులు పెడుతున్నారు. లాభాల ద్వారా మన దేశాన్ని దోచుకుంటారు"అని వీరి వాదన. చైనా అనుభవం చూడండి. 2004వ సంవత్సరంలో అమెరికన్ దేశపు వాల్‌మార్ట్, చైనా నుండి 91.6 కోట్ల డాలర్ల (4,500 కోట్ల రూపాయలు) లాభాలను అమెరికాకు తీసుకువెళ్లింది. అదే సంవత్సరంలో 1800 కోట్ల డాలర్ల (81,000 కోట్ల రూపాయలు) చైనా వస్తువులను కొని, ఆదేశపు యొక్క అంతర్జాతీయ వ్యాపారాన్ని పెంపొందించిది. వాల్‌మార్ట్ అమ్మే ప్రతివస్తువు, ఇతర కంపెనీల ధరల కన్నా కనీసం 15శాతం తక్కువగా వుంటాయి. ఈ తక్కువ ధర చైనా ప్రజలకు మేలా? హానా? వాల్‌మార్ట్ చైనా నుంచి కొని ఎగుమతి చేసి చైనాకు సమర్పించిన విదేశీముద్ర, భారతదేశం యొక్క ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఎగుమతుల కన్నా ఎక్కువ!

మన వ్యాపారస్తులు తుడిచిపెట్టుకుపోతారనే భయాన్ని మన కమ్యూనిస్టులు (స్వదేశీ జాగరణ వారూ) వ్యక్తం చేస్తున్నారు. మన పెట్టుబడిదారులంటే వారికున్న ప్రేమను మనం గౌరవించాల్సిందే కాని, వారి అధిక లాభార్జన మన ప్రజలకు మేలా? ప్రతి వస్తువూ, వాల్ మార్ట్ వంటి రిటైల్ కంపెనీల ద్వారా కనీసం 15 శాతం తక్కువ ధరకు మనం కొనడం మనకు మంచిది కాదా? అధిక ధరల ద్వారా, అధిక లాభాలను పొందడం మూలాన, కొనుగోళ్లు పరిమితం అవుతాయి. అలాకాక, తక్కువ మార్జిన్‌తో, ఎక్కువ అమ్మితే, కొనుగోళ్లు పెరుగుతాయి. గ్రాహక సంతృప్తి పెరుగుతుంది. ఇదెందుకు ఆమోదయోగ్యం కాదు?

విదేశీయులు పోటీవల్ల స్వదేశీ కంపెనీలు మూతబడతాయనే భయం నిజమే. కాని మనం పోటీ చేయలేని బడుద్దాయిలము కామే? సోషలిజమనే పేరుతో నలబై ఏళ్ళకు పైగా "పర్మిట్, లైసెన్స్ , కోటా" పద్ధతిని ఏలిన వారు అనుసరించడం మూలాన, భారత వ్యాపారులు, వాణిజ్య సంస్థలూ నిర్వీర్యమయ్యాయి. బూటకపు సోషలిజం పోయిన తర్వాత 1990–2000 వ్యవధిలో ఉద్భవించిన మన ఐ.టీ.







బీ.టీ కంపెనీలు, ప్రపంచ వ్యాప్తంగా పోటీబడుతూ ముందుకు సాగుతున్నాయి. ఆదిలో కష్టాలు పడ్డా మన పాత కంపెనీలు కూడా పోటీతత్వానికి కావలసిన ఆత్మవిశ్వాసాన్ని, సాహసాన్ని, అభ్యాసాన్ని, అనుసంధానాన్ని సమకూర్చుకొని రాణించడం మొదలు పెట్టాయి. ఉదాహరణకు టాటా కంపెనీలు కార్లను, ఉక్కునూ యూరప్‌కూ, అమెరికాకు ఎగుమతి చేయగలుగుతున్నాయ్, ఆటోమొబైల్ రంగంలో విడి భాగాలకు, ఫోర్జింగ్స్‌కూ భారతదేశపు కంపెనీలు అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదిస్తున్నాయ్. అలాగే రిటైల్ రంగంలో కూడా భారతీయులు అంచెలంచెలుగా అమెరికన్, ఫ్రెంచ్, ఇంగ్లీషు కంపెనీలతో పోటీబడే స్థోమతను సంపాదించుకోగలుగుతారు. ఆత్మ న్యూనతా భావాన్ని వీడాలి.

వ్యాపారం అనేది అందరికీ లాభదాయకంగా పరిణమించగలదు. కొన్ని వస్తువుల ఉత్పత్తిలో, కొన్ని సేవల సమకూర్పులో మనకు గణనీయమైన విశిష్టత ఉంటుంది. మరికొన్నిటిలో ఉండదు. ఉన్న విశిష్టతతో, లేమిని అధిగమించాలి. కమ్యూనిస్టులకు పేదరికమంటే చాలా గౌరవం. పేదవారు లేకపోతే ఎవరికి వాగ్దానవరాలనివ్వగలరు? ఎవరిని సమీకరించి ప్రదర్శనలు నిర్వహించి, సమ్మెలు చేయించి, అస్తిత్వాన్ని నిలుపుకోగలరు. చైనా చేస్తే మంచి, ఉత్తరకొరియా చేస్తే మెప్పు. ఆపనినే, ఆ ప్రక్రియనే భారతదేశం చేస్తే తప్పు. ఇదేం ధోరణి కమ్యూనిస్టులది? "చైనా అధినేత మా అధినేత" అనే మనస్తత్వం ఉన్నవారికి విదేశస్తులు దేశానికి అధినేతగా ఉండటం, ఆమోదయోగ్యమే కదా. దేశం యొక్క నాయకత్వంలోనే 'విదేశీపెట్టుబడిని' ఒప్పుకున్న వారు, రిటైల్ వ్యాపారంలో విదేశీపెట్టుబడిని వ్యతిరేకించడం సహేతుకంగా లేదు.

(1991–96) పి.వి. నరసింహారావు గారు ప్రధానిగా ఉన్నప్పుడు, నేటి ప్రధాని సర్దార్ మన్‌మోహన్‌సింగ్, నాటి ఆర్థికమంత్రి. ఉదార ఆర్థికనీతిని దుయ్యబడుతున్న కమ్యూనిస్టులకు ఆగస్టు 4, 1992లో లోకసభలో ఈ కథ చెప్పారు. "ఒక విదేశపు కమ్యూనిస్ట్ పార్టీకి విరాళం తెమ్మని విద్యార్థులకు, ఒక టీచరు ఆదేశం ఇచ్చారు. మిషా అనే విద్యార్థి తన తండ్రిని విరాళం కోసం

అడుగగా, ఆ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ లేదు. కాబట్టి నేనివ్వను అన్నాడు. మరునాడు ఈ విషయం విన్న టీచరుగారు, అయితే, ఆ దేశంలో ఉన్న ట్రేడ్ యూనియన్‌కు విరాళం ఇవ్వమని తండ్రిని అడుగమన్నాడు. మిషా యొక్క తండ్రి, ఆ దేశంలో ట్రేడ్ యూనియన్ కూడా లేదు. కాబట్టి నేను విరాళం ఇవ్వను అన్నాడు. అంతట టీచరుగారు, ఆ దేశంలోని బీదప్రజల కోసం విరాళమడుగమన్నాడు. మిషా తండ్రి తిరిగి విరాళం తిరస్కరించాడు, ఎందుకంటే ఏ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీలేదో, కనీసం ట్రేడ్ యూనియన్ లేదో, ఆ దేశంలో పేద ప్రజలు లేనట్లే".

ఈ కథ సారాంశము పేదరికాన్ని పోషించడంలోనే కమ్యూనిస్ట్‌ల అస్తిత్వం ఉంటుంది!

**కనకపు సింహాసనమున**
**శునకము కూర్చుండ పెట్టి శుభలగ్నమునం**
**దొనరగ బట్టముగట్టిన**
**వెనుకటిగుణమేల మాను వినరా సుమతీ!**

భా॥ కుక్కను తీసుకొచ్చి కుందనపు (బంగారు) గద్దెమీద కూర్చుండబెట్టే దానికి కట్టిన కుచ్చులన్నీ తెగి పోయేట్టు కొరుకుతుంది. కుక్క పుట్టుకతో వచ్చిన గుణాన్ని ఎలా మానదో, అల్పుడైన వానికి ఎంత గౌరవమర్యాదలు చేసినా తన నీచత్వాన్ని విడువలేడు.







# 7. పేదరికం

కొద్ది దినాల క్రితం ఉత్తరాంధ్ర నుండి ఒక సోదరి తన కుటుంబం అనుభవిస్తున్న పేదరికాన్ని, ఆదాయ వ్యయాలను హృదయ విదారకంగా వర్ణిస్తూ సహాయం కోరుతూ ఒక లేఖ వ్రాసింది. తన సంతానం నలుగురని, అత్తమామలను కలుపుకొని, ఎనిమిది మంది, నెలకు 1700 రూపాయల ఆదాయంతో ఎలా బ్రతకగలమని ప్రశ్నించింది.

ఈనాడు భారతదేశంలో బాగా చదువుకున్న వారు, ఉద్యోగం చేస్తున్నవారు, సంపద ఉన్నవారు, ఒకరిద్దరికన్నా పిల్లల్ని కనడం లేదు. వారికి మంచి చదువులు చెప్పించి, ఉద్యోగార్హతలను పెంచి పేదరికం నుండి బయటపడి, సంపన్నులుగా తయారుచేస్తున్నారు. అటువంటివారు, అమెరికా, యూరప్ దేశాలకు ఉద్యోగ వ్యాపారాల కోసం వెళ్లి ప్రఖ్యాతి పొందుతున్నారు. కాని మన నిరక్షరాస్యులూ, బీదవారూ, ఒక మతానికి చెందినవారూ, అంతులేని సంతానాన్ని కంటున్నారు. నిరక్షరాస్యత, అధిక సంతానం, పేదరికం అనే పరస్పర ప్రవర్థిత వలయంలో చిక్కుకుంటున్నారు. వీరందరికీ ఓట్లు ఉండటం మూలాన, రాజకీయ పక్షాలూ, నాయకులూ, వారి ఓట్ల కోసమై వారిని మెప్పించే వాగ్దానాలు చేయడం, పేదవారిని నారాయణునితో పోల్చి (దరిద్ర నారాయణ) వారిని స్తుతించడం, వారి హక్కుల (తిండి, గుడ్డ, ఇల్లు, భూమి, పని, వివాహం, విహారం...) ను ఏకరువు పెట్టడం చేస్తున్నారు. భారతదేశం సంవత్సరానికి రూ. 28వేల కోట్ల సబ్సిడీతో "పేద"వారికి ఆహార ధాన్యాలనూ, పంచదార, కిరోసిన్‌లను అందిస్తోంది. ఈ సబ్సిడీని కాల, సంతాన సంఖ్యతో సంబంధం లేకుండా ఇస్తున్నాం. అందరికి విద్య, పరిమిత సంతానం, చూపించిన పనిచేసిన వారికే సబ్సిడీలు, ఇవి కూడా ఐదు సంవత్సరాలకు మాత్రమే అని చెప్పే నాయకులు, పార్టీలు మనకు లేవు. 'ఇష్టమొచ్చిన మేరకు సంతానోత్పత్తి మా హక్కు; అందరికీ ఆజీవిక, ఆహారం, ఆవాసం కల్పించడం మీ (ప్రభుత్వం) విధి" అనే అభిప్రాయాన్ని, ఆకాంక్షనూ, బాధ్యతా రహితంగా రాజకీయ

పక్షాలూ, నాయకులూ, ప్రజలలో, బీదవారిలో, వారి ఓట్ల కోసం ప్రచారం చేస్తున్నయ్. అందుకే, నిర్భయంగా, బాహాటంగా, విశృంఖలంగా తమ బీదరికాన్ని, పరిమిత విద్యను, ఉద్యోగం గాని, పనికిగాని లేని అర్హతతో సంబంధం లేకుండా, "మా బోటి పేదలను ఆదుకోవలసిన బాధ్యత ఏలినవారిదని" పేదలు డిమాండ్ చేయగలుగుతున్నారు.

కమ్యూనిస్ట్ పాలిత చైనాలో డాక్టర్ సర్టిఫికెట్, యాజమాన్యం యొక్క "నో అబ్జెక్షన్ సర్టిఫికెట్" లేకుండా, పెండ్లి చేసుకోనీయరు. పెండ్లయిన వారికి, ఒక్కొరికన్నా ఎక్కువ సంతానం ఉండటానికి వీల్లేదు. ఈ విధంగా, జనాభాను నియంత్రించడం మూలాన, అందరిని నిర్భందంగా చదివించడం మూలాన నిరుద్యోగ సమస్య లేకుండా పోయింది. పనిలేని, పనిచేయని 'పేద'లకు సబ్సిడీ భారం ప్రభుత్వం మీద లేదు. అందుకని 1976 వరకూ మనకన్నా వెనుకబడిన, తక్కువ తలసరి ఆదాయం ఉన్న చైనా, సంపన్న శక్తివంతమైన పథంలో త్వరగా పురోగమిస్తోంది. మనదేశంలో సంవత్సరానికి జనాభా పెరుగుదల రెండు కోట్లు. గడచిన 57 ఏళ్ళల్లో, ఏ సంవత్సరంలోనూ కోటిని మించి ఉపాధి కలిగింది లేదు. అంటే నిరుద్యోగుల, పాక్షిక ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది కాని, తగ్గడం లేదు. జనాభా పెరుగుదల, దేశం యొక్క స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాభివృద్ధులు ఏ విధంగా లంకెపడియున్నాయో ఈ పట్టిక తెల్పుతుంది.

**Table # 1**

| GDP Growth | Poulation Growth | Time to double per capita income |
|---|---|---|
| 3.5% | 2.0% | 50 years |
| 6.5% | 1.8% | 15 years |
| 10.0% | 1.0% | 7 years |







**Table # 2 Time Taken to double the per capita income**

| Country | UK | USA | Japan | Indonesia | S.Korea | China |
|---|---|---|---|---|---|---|
| Years | 58 | 47 | 33 | 17 | 13 | 10 |
| Since the year | 1780 | 1840 | 1880 | 1965 | 1970 | 1978 |

**Table# 3 Poverty came down**

| Country | Indonesia | Malaysia | Thailand | Singapore | India |
|---|---|---|---|---|---|
| From | 58% (1972) | 37% (1973) | 49% (1962) | 24% (1972) | 75% (1951) |
| To | 17% (1982) | 14% (1987) | 26% (1986) | 10% (1982) | 30% (2002) |

అందరినీ విద్యావంతులను చేసి, కుటుంబ నియంత్రణను జాతీయ నీతిగా పాటించిన దేశాలు ఏవిధంగా తలసరి ఆదాయాన్ని రెండింతలుగా ఎంతకాలంలో చేయగలిగాయో, ఎంత త్వరగా దారిద్ర్యమును తగ్గించగలిగాయో పట్టికలు 2,3లలో చూడవచ్చును.

మన దేశంలో పేదరికాన్ని శాశ్వతం చేయడానికి అన్ని రాజకీయ పక్షాల మధ్య మౌనాంగీకారమున్నట్లుంది. పేదరికం, పేదవాళ్లు లేకపోతే, నిరక్షరాస్యులు లేకపోతే, శుష్క వాగ్దానాలు చేసి, ఓట్లు దండుకునే అవకాశం లేదు. వామపక్షాలు నిరంతరం ఉద్యమాలు, ప్రకటనలు, ప్రదర్శనలు జరపడానికి, వారి ఉనికికి ఆస్కారం ఉండదు. ఈ విషయాన్ని గురించి ప్రస్తుత భారత ప్రధాని మన్మోహన్ సింగ్ గారు 4.8.1992న లోక్‌సభలో, విత్తమంత్రిగా ఈ కథ చెప్పారు.

"మాస్కోలోని ఒక స్కూల్లో ఒక ఉపాధ్యాయుడు మిషా అనే విద్యార్థి తన తండ్రిని విరాళం కోసం అడుగగా, ఆ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ లేదు. కాబట్టి నేనివ్వను అన్నాడు. మరునాడు ఈ విషయం విన్న టీచరుగారు, అయితే దేశంలో ఉన్న ట్రేడ్ యూనియన్‌కు విరాళం ఇవ్వమని తండ్రిని అడుగమన్నాడు. మిషా యొక్క తండ్రి, ఆ దేశంలో ట్రేడ్ యూనియన్ కూడా లేదు. కాబట్టి నేను విరాళం ఇవ్వను అన్నాడు. అంతట టీచరుగారు, ఆ దేశంలోని బీదప్రజల కోసం విరాళమడుగమన్నాడు. మిషా తండ్రి తిరిగి విరాళం తిరస్కరించాడు, ఎందుకంటే

ఏ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీలేదో, కనీసం ట్రేడ్ యూనియన్ లేదో , ఆ దేశంలో పేదలు ఉండే అవకాశమే లేదు కాబట్టి" – కమ్యూనిస్ట్ పార్టీల తీరుపై లోకసభలో మన్మోహన్ సంధించిన వ్యంగ్యాస్త్రం.

ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం ఎలా పెరిగిపోతోందో తెల్లరేషన్ కార్డుల కథ విశదీకరిస్తోంది. దారిద్ర్యరేఖకు క్రింద ఉన్నవారికి మనరాష్ట్రంలో తెల్లరేషన్ కార్డులు ఇస్తారు. డిశంబర్ 2003 నాటికి దాదాపు కోటి పదిలక్షల కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులుండేవి. అంటే కనీసం 4 కోట్ల 95 లక్షల మంది, 62% శాతం జనాభా దారిద్ర్యరేఖ క్రింద ఉన్నారట. ఇక ఎన్నికలు వస్తున్నయ్ గదా అని మరో 30 లక్షల తెల్లకార్డులు పంచారు బీదల మీద దయతో. దీంతో దారిద్ర్యరేఖ క్రింద ఉన్న జనాభా 6 కోట్ల 30 లక్షలు, లేక 80% అయింది. ఆహా! ఎంత చక్కటి అభివృద్ధి! ఈ అంకెల వల్ల, రాజకీయ పక్షాల దరిద్ర నారాయణుల పట్ల భక్తి, శ్రద్ధ, ఆసక్తుల వల్ల మనం నేర్చుకోవలసిందేమంటే అందరికీ మాధ్యమిక విద్య గరపడం ప్రభుత్వం యొక్క బాధ్యత విధి.

చదువు యొక్క లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగం పొందడం కాదు. తమ ప్రజ్ఞను, ప్రతిభను కార్యపటిమను, దక్షతను పెంపొందించుకొని ఉద్యోగార్హత, పారిశ్రామిక, వ్యాపార ఔత్సాహికతను సాధించడం.

మన జీవన స్థాయి బాగా పెరిగే వరకూ, అల్ప వయసులో పెండ్లి చేసుకోకుండా ఉండటం, పోషించలేని స్థితిలో ఒకరికన్నా ఎక్కువ మంది పిల్లల్ని కనకుండా ఉండటం, అలా కన్న తల్లిదండ్రులకు ఓటు హక్కు తీసివేయడం, సంక్షేమ పథకాలకు అనర్హులుగా చేయడం, ప్రభుత్వోద్యోగంలో నుండి తొలగించడం మొదలైన కఠిన చర్యలను తీసుకోవాలి.

కుల, జాతి, మత, లింగ, వివక్ష చూపకుండా, జాతీయ విద్య, సంతాన పరిమితిని అమలు చేయాలి. లేనిచో దరిద్ర దేవత మనలో చాలామంది నెత్తిన కూర్చుని జాతిని, దేశాన్ని నిర్వీర్యం చేస్తుంది.







# 8. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక - దేశాన్నీ ఆర్థిక వ్యవస్థనూ విధ్వంసం చేసే అంశాలు

06.0.2004

1. ఇది ఎన్నికల సమయం. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ప్రణాళికా పత్రాన్ని అట్టహాసంగా ప్రకటిస్తోంది. హామీల, వరాల వర్షం కురిపిస్తున్నాయి. వరలక్ష్మీ వ్రతం చేయకుండానే గృహస్థులలయిన వారికి, గుణవత్తలేని డిగ్రీలు పొందిన నిరుద్యోగులకూ, వయసు మళ్ళిన వారికి, రోగులకు, కోకొల్లలుగా పిల్లల్ని కని ఓటు సంపత్తిని పెంచుకుంటున్న ఒక మత సముదాయానికి, ప్రభుత్వోద్యోగులకు, వెనుకబడిన వారనీ, ప్రక్కకు నెట్టబడ్డవారని, అట్టడుగువారని, నోరులేని వారిని, స్త్రీలని, యువకులని, తాడితులు, పీడితులు, ఉపేక్షితులని వర్గీకరించబడినవారికి ఎం.ఎల్.ఏ, ఎం.పీ టిక్కెట్ దొరకని వారికి, అందరికీ వరాలూ, హామీలు. ఇందిర, రాజీవ్, సోనియా, తన్నియమిత అధ్యక్షుని బొమ్మలతో నింపిన కవర్ పేజి క్రింద 30పుటల ఎన్నికల ప్రణాళికను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ (ఐ) ప్రచురించింది. 150 వరకూ హామీలు, వాగ్దానాలు ఉన్నయ్. చెల్లని చెక్కులనిచ్చే వారు నేరస్థులనీ, వారికి శిక్ష విధించే చట్టం ఉంది. అలాగే, నెరవేర్చని హామీలు, వాగ్దానాలూ చేసే పార్టీ అధినేతను చెఱసాలకు పంపించే చట్టం ఉంటే పార్టీల్లో, నాయకుల్లో బాధ్యత, నిబద్ధత, నిజాయితీలు పెరుగుతాయి. ఇటువంటి చట్టాన్ని తెస్తామని ఏ పార్టీ కూడా హామీ ఇవ్వడంలేదు. ఇలా హామీ ఇచ్చినట్లయితే కాంగ్రెస్ తన నిజాయితీని నిరూపించుకొనేది. ఈ హామీ ఇవ్వనందున గడచిన 13 ఎన్నికల్లో, బీదరికాన్ని నిర్మూలిస్తామని వచించి వంచించినట్లుగానే, ఈ 150 హామీలూ నీటిమూట అని, శుష్క ప్రియాలూ శూన్య హస్తాలు (!) అని మరోసారి అభియోగింపబడుతుంది.

2. వ్యవసాయం, నీటిపారుదల అనే శీర్షికల క్రింద 34 హామీలు, గ్రామీణాభివృద్ధి క్రింద 10 హామీలు ఇచ్చింది. ఈ 44 హామీలు తమ 42 ఏళ్ల పాలనలో పూర్తిగా గాని, ఆంశికంగా గాని అమలు చేసినవి కావు. చేస్తే శ్లాఘించవలసిందే. కొన్ని నమ్మశక్యంగాని హామీలు చూడండి. గ్రామాల్లో ప్రతి గొఱ్ఱెకాపరికీ 10 ఎకరాలు ఇస్తారట. అంత మిగులు భూములు ఉన్నాయా మన రాష్ట్రంలో? ఎన్ని వందల కోట్లు, ఎక్కడనుండి తెచ్చి, ఎవరి మీద ఏ పన్ను వడ్డించి ఈ హామీని నెరవేరుస్తారు?

3. అట్టడుగున ఉన్న బీద కుటుంబాలకు గ్యాస్ సిలండర్‌కు100 రూపాయల రాయితీ ఇచ్చి సరఫరా చేస్తారట. మనరాష్ట్రంలో ఒకకోటి 25 లక్షల పైగా తెల్లరేషన్ కార్డులు ఉన్నయ్. సంవత్సరానికి కనీసం ఆరు సిలిండర్లు వేసికుంటే, ప్రతి ఏటా రూ. 750 కోట్లు అవుతుంది. ఈ భారం ఎవరి మీదవేస్తారు?

4. పట్టభద్రుడైన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ. 2500/- ఉచిత వేతనం ఇస్తారట. కేవలం బి.ఎడ్ గ్రాడ్యుయేట్ నిరుద్యోగులే 80,000 దాకా ఉన్నారు. మన రాష్ట్రంలో ప్రతి ఏటా మూడు లక్షలకు పైగా గ్రాడ్యుయేట్లు అవుతున్నారు. సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు కూడా ఉండటం లేదు. అంటే సగటున 9 లక్షల పట్టభద్రులకు, సంవత్సరానికి ఒకరికి రూ. 30వేల చొప్పున, రూ. 2700 కోట్లు రూపాయలు ఉచిత వేతనం క్రింద ఇస్తారట! బి.ఇ, యం.బి.ఎ. పాసయి ఉద్యోగం పొందినవారికి, నెల రూ. 2,500/3,000 రూపాయలు ఇస్తున్నారు. పని చేయకుండానే ప్రభుత్వం నెలకు 2500 రూపాయిలిస్తే, ఇంకా ఉద్యోగాలెందుకు? ఈ హామీ నెరవేరిస్తే ప్రభుత్వం దివాలా ఎత్తడమేకాక , ప్రజల్లో పనిచేసి బ్రతుకుదామనే భావన క్షీణిస్తుంది.

5. ఎన్నో ప్రభుత్వరంగ పరిశ్రమలు పోటీకి తట్టుకోలేక, అవసరానికి మించిన సిబ్బంది ఖర్చులతో, అమ్మకాలు లేక మూతబడుతుంటే వాటిని







పునరుద్ధరించడానికి, పారిశ్రామిక పునరావాస మండలిని ఏర్పరుస్తారట. అంటే చచ్చే పరిశ్రమలకు సబ్సిడీల మందులూ వైటమిన్లూ ఇచ్చి, ఉత్పత్తి లేకుండా ఉద్యోగాలను నిలపడమే. విదేశ్ సంచార్ నిగమ్ ప్రభుత్వరంగ సంస్థలో మూడు వేలమంది ఉద్యోగులుండేవారు. పోటీ లేనప్పుడు వందల కోట్ల లాభాలుండేవి. అమెరికాకు మాట్లాడాలంటే నిమిషానికి రూ. 72 చార్జీ ఉండేది. పోటీ పెట్టిన తర్వాత 60% మార్కెట్ వాటాను కోల్పోయింది. నిమిషానికి ధర ఇప్పుడు రూ. 7/- పడిపోయింది. ఇంకా తగ్గుతుంది. 60% మార్కెట్ వాటాను కొట్టేసిన పోటీ ప్రైవేట్ కంపెనీల్లో కేవలం 600 మంది ఉద్యోగులున్నారు. 40శాతం వాటా ఉన్న కంపెనీ 3000 మంది ఉద్యోగుల్ని భరించి, పోషించగలదా? 2400 మంది ఉద్యోగాలు కాపాడటానికి, ఏడు కోట్ల టెలిఫోన్ వాడకందార్లు, నిమిషానికి 7 రూపాయల బదులు, 72 రూపాయలు చెల్లించాలి? ఏది సామాజిక న్యాయం? బ్రతకలేని కంపెనీలను కృత్రిమంగా బ్రతికించడం కాదు కావాల్సింది, అదనపు ఉద్యోగులకు వేరే విద్యా చతురతలు నేర్పించే సంస్థ, ఇతర ఉద్యోగార్హతలను సంపాదించుకోమని ప్రోత్సహించి, సహాయం చేయడం.

6. ప్రైవేట్ కంపెనీ రంగంలో అనుసూచిత కులాలకు, తెగలకూ రిజర్వేషన్లు కల్పిస్తామంటోంది కాంగ్రెస్. ఈ విధానం భారతీయ కంపెనీలకేనా లేక ఈ దేశంలో వ్యవహారం జరుపుతున్న విదేశీ కంపెనీలకు కూడా వర్తిస్తుందో చెప్పలా. దేశీ కంపెనీలకు మాత్రమే అయితే ఈ వివక్షతవల్ల, దేశీ కంపెనీలు పోటీకి పనికి రాకుండా పోతాయి. విదేశీ కంపెనీలలో కూడా రిజర్వేషన్‌లు పెడితే ఆ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడి పెట్టవు. అదీకాక ఏ పారిశ్రామికవేత్త అయినా తన డబ్బుతో పెట్టే కంపెనీలో తక్కువ అర్హతలున్నవారిని తీసుకుని తన కంటిని తన వేలుతో పొడుచుకుంటానికి సద్రుశమైనట్లు, తన కంపెనీ పోటీలున్న విఫణిలో నిలుచోగలడా? ప్రభుత్వంలో అర్హత తక్కువ ఉన్నా, అధికార బలంతో

సాగవచ్చు. ప్రైవేట్ రంగంలో ఇది సాధ్యం కాదు. దీనివల్ల మన వాణిజ్య రంగానికి, ఉపాధి కల్పనావకాశాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. సవ్యమైన ప్రత్యామ్నాయం, వెనుకబడిన వారికి విద్యార్థి దశలో, ఉత్కృష్టస్థాయి విద్యాభ్యాసాన్ని చేకూర్చడం.

7. ప్రభుత్వంలో దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయ్. వాటిని వెంటనే నింపుతామంటున్నారు. ఈ ఖాళీలు విద్య, వైద్య వంటి శాఖల్లో నిమ్నతర పదవుల్లో ఉన్నయ్. కాని గిర్గలానీ కమిటీ తేల్చినట్లుగా ఎన్నో శాఖల్లో మొత్తం మూడు లక్షల మంది పనిలేని ఉద్యోగులున్నారు. వీరందరికీ తరగతులు పెట్టి, ఖాళీలున్న పదవులకు కావలసిన విద్యనూ, నేర్పరితనాన్నీ ఇచ్చి, ఖాళీగా ఉన్న పదవులకు తరలించవచ్చు. అలా చేస్తే ఎన్నికల ప్రణాళికలోని హామీని అమలు చేయడానికి ఖర్చయ్యే రూ. 2400 కోట్లను ఆదా చేయవచ్చు. ఆ డబ్బును అందరికి విద్య, వైద్యం వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఉపయోగించవచ్చు.

8. ఇక మైనారిటీల (ఇది మనదేశంలో ముస్లింలకు మారుపేరు)కు ఇచ్చిన హామీలు దేశంలో సెక్యులరిజానికి రాజ్యాంగానికి, సర్వమత సమానత్వానికి, వివిధ మతస్తుల మధ్య సమరసతకూ వ్యతిరేకంగా, విధ్వంసకరంగా వున్నాయ్. రాజ్యాంగానికీ, స్త్రీ పురుష సమానత్వానికి వ్యతిరేకమైన వైయక్తిక న్యాయవ్యవస్థను పరిరక్షిస్తుందట. అంటే ముస్లింలో బహుభార్యాత్వం ఉండవచ్చు. స్త్రీ పురుష సంతానాలకు, వారసత్వంలో అసమానత ఉండవచ్చు! ఈ అన్యాయాన్ని హిందువులకు నిషేధించి, ముస్లింలకు ఎందుకు శాశ్వతీకరణం చేయాలి.

9. ముస్లింలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ గృహాలను కేటాయిస్తారట. హిందువులు ఇద్దరు, ముగ్గురు సంతానంతో సరిపెట్టుకొంటుంటే ముస్లిం కుటుంబాల్లో ఐదు నుండి పాతికమంది పిల్లలుండటం మూలాన 1947లో







9-10శాతం ఉన్న ముస్లింలు, 15-20 శాతానికి పెరిగి పోయారని వారే చెబుతున్నారు. ఎక్కువ మంది పిల్లల్ని పుట్టిస్తే ఎక్కువ ఇళ్ళు ఇస్తామనడం, సంతానోత్పత్తిని పెంచుకోమని ఇచ్చే ఆహ్వానమే.

10 సంవత్సరాదాయం రూ. 24,000 కలిగిన ముస్లిం కుటుంబాలను బిసీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ల తాయిలం ఇస్తారట. సంతానము అపరిమితం, అక్షరాస్యతా, విద్యా అల్పం, అటువంటప్పుడు కుటుంబాదాయం ఎలా పెరుగుతుంది? ఇప్పటికీ తెల్లరేషన్ కార్డుల ద్వారా, ఉచిత కరెంటు, తదితర సంక్షేమ పథకాల క్రింద, అతి వేగంగా పెరుగుతున్న జనాభా వల్ల సంక్షేమ పథక ద్రవ్యంలో అధిక భక్షకులుగా ముస్లింలు ఉన్నారు. సంతాన నిరోధానికి దూరంగా ఉండి, విద్యయందభిరుచి లేకుండా స్వయంకృత స్వయంపోషిత దైన్యానికి సమాజం పారితోషకాన్నివ్వాలా? ఎంత ఘోరం?

11. మత కలహాల బాధితుల కుటుంబాలకు తగిన పరిహారం చెల్లిస్తారట. మెజారిటీ కులస్తులు మతకలహాల్లో మరణించడం లేదా? వారి సంపద ధ్వంసమవడం లేదా? హిందూ బాధితుల ఊసు లేదే? అసలు ఈ మత కలహాలు ఏ మతస్తులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొదలవుతున్నాయి? ఏ రోజున ఎక్కువగా ప్రారంభమవుతున్నాయి? విదేశీ విద్రోహులు, టెర్రరిస్టులు ఎక్కడ ఆశ్రయం పొందుతున్నారు? ఏ విషయాలను గురించి మతకలహాలు ప్రారంభమవుతున్నాయి? కలహాలు ప్రారంభించిన వారికి ఏ శిక్షలు వేస్తారు? ఈ అధ్యయనానికి, కలహనివారణ చర్యలను సూచించటానికి ఒక కమిటీని వేస్తామంటే సబబుగా వుంటుందికాని, మెజారిటీ బాధితుల ఊసు లేకుండా మైనారిటీ మతకలహ బాధితులకు పరిహారం ఇస్తామనడం వివక్షతో కూడిన బుజ్జగింపు చర్య కాదా?

12. ప్రతి జిల్లాలో మైనారిటీలకు ఒక్కో ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, రెసిడెన్షియల్

స్కూల్ ఏర్పాటు చేస్తారట. అంటే ఇప్పుడు ముస్లింలకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశం లేదా? తమ ఇష్టమొచ్చినన్ని, ఏ విద్యా సంస్థలనైనా, ఎక్కడైనా స్థాపించుకునే హక్కును, ఈ భూమండలంలో, ఏ దేశంలో లేని హక్కును, మెజారిటీ హిందువులకు కాదన్న హక్కును పొంది, విశృంఖలంగా ఉపయోగించుకొని, ఎన్నోవేల సీట్లను హిందువులకు అమ్ముకుంటున్న, ముస్లింలకై సెక్యులర్ ప్రభుత్వ సొమ్మును వినియోగించి ఇంకా ప్రత్యేక సంస్థలను నెలకొల్పుతామనే హామీ ఏమి న్యాయం? ఏ స్వార్థ దుష్ట ప్రయోజనం కోసం ఇవ్వబడుతుందో ముస్లిమేతరులు, హిందువులు గుర్తించలేరా? ఈ దుశ్చర్యను నిరసించి, బుద్ధి చెప్పలేరా?

13. కాంగ్రెస్ ప్రభుత్వ మైనారిటీ మహిళా సంక్షేమ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేస్తుందట, అయితే హిందూ మహిళల మాటేమిటి? షాదీఖానాలు, మసీదులు, స్మశానశాలల నిర్మాణానికి ప్రభుత్వ ఖజానా నుంచి సహాయం చేస్తుందట. సెక్యులర్ ప్రభుత్వమేమిటి, ముస్లింలకు (క్రిస్టియన్‌లకు), హిందువులకు లేని రీతిలో, ప్రభుత్వసొమ్మెందుకు ప్రత్యేకంగా వినియోగించాలి. హిందువులను మతం మార్చుకోమని సూచించటానికి ఇవన్నీ ప్రోత్సాహక పథకాలు కావా? దీన్ని హిందువులు నిరసించి, కాంగ్రెస్ మైనారిటీలను బుజ్జగించి, హిందువులపై వివక్ష చూపించే పార్టీగా ముద్రవేసి హిందువులను బుజ్జగించే పార్టీలకు ఎందుకు ఓటు వేయకూడదు. కాంగ్రెస్ యొక్క ఈ దుర్నీతి ప్రజల్లో విభాజకతను పోషించదా?

14. జనాభా పెరుగుదలను సాలీనా ఒక శాతాన్ని మించకుండా ఉండటానికి తగు చేష్టలు చేస్తుందట. చాలా హర్షనీయం. కాని జనాభా నియంత్రణ నుంచి మైనారిటీలను మినహాయిస్తుందా అనే సంశయం కలుగకమానదు. ఎందుకంటే ముస్లింలు బహుభార్యాత్వాన్ని శాశ్వతంగా ఉంచుకోవచ్చని హామీ ఇచ్చింది. ఇద్దరికన్నా ఎక్కువ పిల్లల్ని కన్నవారికి కులమత వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను రద్దుచేస్తామని, ఓటు హక్కు తీసివేస్తామనీ,







ప్రభుత్వోద్యోగాలకు అనర్హులుగా చేస్తామని చెబితే బాగుండేది. ఒక్కరికన్నా ఎక్కువ సంతానం ఉండకూడదనే నిర్బంధ చట్టాన్ని అమలుచేసి చైనా జనాభా పెరుగుదలను అదుపులో పెట్టింది. అందువల్లే, అద్భుతమైన అభివృద్ధిని, అందరికీ విద్య, ఉపాధి, వైద్యం ఇవ్వగలిగింది.

15. వ్యవసాయదారులకు, బీదవారికి ఉచితంగా విద్యుత్‌ను ఇస్తామని మరో హామీ. ప్రతి సంవత్సరం విద్యుత్ సబ్సిడీకి గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 2000 కోట్లకు పైగా ఖర్చు పెడుతోంది. దాదాపు 20% ఎనర్జీ దొంగతనంగా ఓట్ల బలం ఉన్నవాళ్లు దండుకుంటున్నారు. ఏదైనా ఎవరికయినా ఎందుకు ఉచితంగా ఇవాలి? ఆ లబ్ధిదారులు సమాజానికి ఏ ప్రతిఫలం ఇస్తున్నారు. ఓట్లున్నాయని ఉచిత విద్యుత్‌ను పొందితే, తెలివుందని, పట్టుబడని విధంగా ఆదాయపు ఇతర పన్నులను ఎందుకు ఎగగొట్ట కూడదనుకోవడం ఆ కోవకు చెందిన దుష్కార్యమే కదా? ఈ హామీ కేవలం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది.

16. మరో విషయం ప్రస్తావించి ముగిస్తాను. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక – 2004 ప్రచురణలో ముఖచిత్రంలో నెహ్రూ, గాంధీ గారి బొమ్మలు లేవు. ఇందిర, రాజీవ్, సోనియాల బొమ్మలూ, వాటిలో పాటు సోనియాచే నియమింపబడ్డ శ్రీనివాస్ గారి బొమ్మ ఉన్నాయ్. దీనివల్ల మనకు ఇప్పటి కాంగ్రెస్, ఇందిరమ్మ కాంగ్రెసే గాని నెహ్రూ, గాంధీ, పటేల్, ఆజాద్‌ల కాంగ్రెస్ కాదని ఖచ్చితంగా తెలుస్తోంది. అలాగే మనరాష్ట్ర కాంగ్రెస్, భాషా ప్రయుక్త రాష్ట్రనిర్మాతలయిన టంగుటూరిప్రకాశం, బూర్గుల రామకృష్ణారావుగార్ల బొమ్మలు లేవు. కాబట్టి ఇప్పటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇందిర వంశపాలితం అని తెలుస్తోంది. ఇంత పారదర్శకత ద్వారా సత్యాన్ని బయల్పరిచినందుకీ కాంగ్రెస్ (ఐ)ను అభినందించాల్సిందే.

17. చివరగా కాంగ్రెస్ ప్రణాళికలో లంచగొండితనాన్ని నిర్మూలిస్తామని ఎక్కడా

ఉల్లేఖించలా. తక్షణమే ప్రత్యేక తెలంగాణా కావాలని ప్రజలు ఉద్యమించినా దాని ఊసుఎత్తకుండా, రద్దు చేయబడ్డ శాసనమండలిని పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అసంతుష్టులకూ, పార్టీ ఫిరాయిస్తామని బెదరించిన వారలకూ, ఎన్నికలకై కోట్లు ఇచ్చిన వారికిది ఉద్దేశించబడిందా లేక నిష్ణాతులూ, మేధావులూ, అనుభవజ్ఞులైన వారి చేత మంచి చట్టాలనూ, పరిపాలననూ అందించడానికా? ఈ విషయం స్పష్టం చేసియుంటే బాగుండేది. ఎన్నికల కోసమై ఇచ్చిన వాగ్దానాలనూ హామీలను నెరవేర్చిన పార్టీలు మన దేశంలో ఇంతవరకు చూడలేదు. మనమంతా దేవుణ్ణి ప్రార్దిద్దాం – "అలా చేసే నిజాయితీ పార్టీలకు కలుగుగాక" అని.

**కమలములు నీట బాసిన**
**గమలాప్తుని రశ్మి సోకి కమలినభంగిన్**
**దమ తమ నెలవులు దప్పిన**
**దమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ!**

భా॥ సూర్యోదయం కాగానే కమలాలు వికసిస్తాయి. నీటినుండి తీసివేసిన కమలానికి సూర్యరశ్మిసోకితే వాడిపోతుంది. మనషులూ అంతే. వారి వారి స్థానాలు తప్పితే మిత్రులనుకున్నవారే శత్రువులౌతారు.







# 9. ముస్లింలు బ్రతకడం రాజకీయమయిందా?

20.03.2004

1. శ్రీ మహబూబ్ భాషా బహదూర్ గారి వ్యాసం (ఆంధ్రజ్యోతి 08.03.04) సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తోంది. దాదాపు 700 సంవత్సరాలు భారతదేశంలోని భాగాలను పాలించి, భారతదేశానికి ఎనలేని సంస్కృతినీ, నాగరికతనూ, విజ్ఞతనూ ఇచ్చామని చెప్పుకున్న ముస్లింలు ఎందుకు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారో, పేదరికంలో మగ్గుతున్నారో, ఆత్మ విమర్శ చేసుకుంటే తెలుస్తుంది. హిందువులు 850 ఏళ్లు ఇతరుల ఆధిపత్యంలో ఉన్నా, పరదేశీయులచేత, వారిమతం పుచ్చుకున్న వారిచేత ఎంతో వివక్షతకు, అణచివేతకు దోపిడికి గురిఅయినా, గత వంద సంవత్సరాల్లో, అన్ని విద్యలనూ అభ్యసిస్తూ, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించుకుంటూ, అభ్యుదయ పథంలో పయనించుచుండటం మనం చూస్తున్నాం. విద్యా, సంస్కృతులను పెంపొందించుకోవడటం మూలాన తమ సమాజంలో ఉన్న దుష్ట సంప్రదాయాలనూ, ఆచరణలనూ గర్హిస్తూ, వాటిని విడనాడటానికి ఉద్యమించి కృతకృత్యులవుతున్నారు. బాల్య వివాహాలు తప్పనీ, వితంతువులు పునర్వివాహం చేసుకోవచ్చనీ, అంటరానితనం అమానుషమనీ, ఆర్థిక, సాంఘిక అసమానతలనూ కులాలనూ సరైన విద్యా సముపార్జన ద్వారా తగ్గించుకోవాలని, ప్రజలకు ప్రబోధిస్తూ, సమాజ సంస్కరణలను చేపట్టారు. చట్టాలను మార్చుకుంటూ, క్రొత్త శాసనాలను చేసుకుంటూ వస్తున్నారు. బాలికలను విద్యావంతులుగా చేస్తున్నారు. విద్యకు ఎనలేని విలువనిస్తున్నారు. కుటుంబ నియంత్రణ ద్వారా, పరిమిత సంతానానికి పౌష్టికాహారం, మంచి విద్యను ఇచ్చి పేదరికంలో నుండి బయట పడటానికి ప్రయత్నిస్తున్నారు. వీటన్నిటినీ తప్పుబట్టే ఛాందసవాదుల నోరుమూయిస్తున్నారు. ఏ పీఠాధిపతీ, మతాధికారీ ఏ మార్పులకు, సంస్కరణలకూ దేవుడి పేరుతో, వ్యతిరేకంగా

ఆదేశాల నివ్వలేకపోతున్నారు. ఇచ్చినా శిరసావహించేవాళ్లు లేరు.

2. మరి ఇటువంటి ఉద్యమాలూ, సంస్కరణలూ, విద్య యందు ప్రేమ, ముస్లిం సమాజంలో జరిగినవా? బ్రిటీష్ పాలకులను ఎదిరించి, వారి ఉదాసీనతను లెక్క చేయకుండా హిందూ సమాజం స్వాతంత్ర్యానికి పూర్వమే ఎన్నో పాఠశాలలనూ, కళాశాలలనూ స్థాపించుకున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో అసంఖ్యాకంగా పాల్గొని, ఆత్మ స్థైర్యాన్ని స్వావలంబననూ, ప్రగతిశీల భావాలనూ, శాస్త్రీయ సాంకేతిక, వాణిజ్య విద్యలనూ పెంపొందించుకున్నారు. అన్ని కులాలూ, అన్ని ప్రాంతాలూ అన్ని వర్గాలూ సమాన స్థాయిలో ఈ ఉద్యమాల, వాటి పర్యవసాన, పరిణామ ఫలాలను చవి చూడలేదు. ఈ ఉద్యమాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

3. మరి ముస్లిం సమాజం? ఔరంగజేబు కాలం నుంచే, సైనిక బలంతో సాధించిన ఆధిపత్యాన్ని కోల్పోతూ వచ్చింది. మరాఠీలు, సిక్కులూ తిరిగి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించసాగారు. బ్రిటీష్‌వారు అందర్నీ ఓడించి తమ ప్రభుత్వాన్ని స్థాపించారు. వారి దగ్గరనుండి స్వాతంత్ర్యం సాధించడానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించబడింది. ఇందులో ముస్లింలు చేరకూడదని సర్ సయ్యద్ మొహమ్మద్ ముస్లింలకు ఉద్బోధించారు. భారతదేశానికి ప్రజాపాలన వ్యవస్థ పనికి రాదన్నాడు, కారణం ఏమంటే "భారతదేశంలో ముస్లింలు అల్ప సంఖ్యాకులు, ప్రజాపాలన వ్యవస్థవల్ల అధిక సంఖ్యాకులైన హిందువులు, ముస్లింలను పాలిస్తారు. ఇది మాకు ఆమోదయోగ్యం కాదు" అన్నారు. 1906లో ముస్లింలకు ప్రత్యేకంగా ముస్లింలీగ్ అనే సంస్థ స్థాపించబడింది. 1909 నుండి ముస్లింలకు ఇతర భారతీయులతో జతపరుపబడకుండా వేరే ఎలెక్టరేట్ ఏర్పరచబడింది. ఈ వేర్పాటు అంచెలంచెలుగా పెరిగి తీవ్రతరమై, చివరకు మేం భారతీయులం కాము; ముస్లిం జాతివేరు; మా మతం, సంస్కృతి, జీవనసరళి వేరు, మేం ప్రపంచ వ్యాప్తమయిన ముస్లిం సముదాయం యొక్క అంతర్భాగం; భారతదేశాన్ని విభజించి, మాకొఱకై పాకిస్తాన్ అనే







ఇస్లామిక్ రాష్ట్రాన్ని / దేశాన్ని ఇచ్చిన తర్వాతే బ్రిటీష్ వారు భారతఖండం నుంచి పోవాలి అనే ముస్లింలీగ్‌ను బలపరుస్తూ వచ్చారు. అనుచరులు లేని, ముస్లింలపై ప్రభావంలేని, హిందువుల యొక్క "చూపుడు బాలుడు" అని పిలువబడ్డ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి నాయకులు కొద్దిమంది తప్ప ముస్లిం ప్రజలు కాంగ్రెస్‌లో చేరలేదు. "క్విట్ ఇండియా" వంటి గాంధీ – కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొనకుండా ఉండటమేగాక జిన్నాగారి నాయకత్వంలో బ్రిటీష్ వారికి మద్దతిచ్చారు. కాంగ్రెస్, గాంధీజీ, బ్రిటన్‌ను "క్విట్ ఇండియా" అంటే ముస్లింలు "డివైడ్ అండ్ క్విట్ " అంటే "విభజించి మరీ పొండి" అన్నారు. 1945–46నాడు సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ (ఢిల్లీ)కి జరిగిన ఎన్నికల్లో 98.3 శాతం ముస్లింలు, గాంధీ–నెహ్రూ–ఆజాద్‌ల కాంగ్రెస్‌ని తిరస్కరించి, పాకిస్తాన్ కావాలంటున్న ముస్లింలీగ్‌కు ఓటు చేశారు. ఓట్ల ద్వారా, తీర్మానాల ద్వారా, విభజన జరగడం లేదు కాబట్టి ప్రత్యక్ష చర్య ద్వారా పాకిస్తాన్‌ను సాధిద్దామని 16 ఆగస్ట్ 1946లో దేశవ్యాప్తంగా హిందూ వ్యతిరేక కోట్లాటలను ప్రారంభించారు. బెంగాల్‌లో సుహ్రావర్దీ నాయకత్వంలో ముస్లింలీగ్ ప్రభుత్వం ఉండేది. పోలీసులకు రెండు రోజులు ప్రకటించాడు. ఆ రెండు దినాల్లో ముస్లిం మూకలు, పదివేల మంది హిందువుల్ని చంపారు. తూర్పు బెంగాల్‌లో నవకాళీ జిల్లాలో హిందువులపై జరిగిన అత్యాచారాలు పాశవికాన్ని కూడా సిగ్గు పరచేవిగా యున్నాయి. ప్రతీకారంగా బీహార్‌లో ముస్లింలపై హిందువులు పాశవికంగా ప్రవర్తించారు. భారతదేశంలో ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రథమ నరమేధం ముస్లింలీగ్ ప్రసాదమే. ముస్లిం లీగ్ ప్రారంభించిన మతస్థ అంతర్యుద్ధం కాంగ్రెస్ నాయకుల్ని భయభ్రాంతుల్ని చేసింది. ఇంతవరకూ భారత్ విభజన, పాకిస్తాన్ ఏర్పాటు, నా శవంమీద జరగాలన్న గాంధీగారు కూడా, కాంగ్రెస్‌తోపాటు ముస్లింలు ఆదేశించినట్లు దేశ విభజనకు, పాకిస్తాన్ స్థాపనకు 15.06.1947 నాడు దాసోహం అన్నారు.

4. పాకిస్తాన్ ఏర్పడిన (14.08.1947) వందరోజులలోపునే అక్కడ ఉన్న 15 శాతం హిందూ, సిఖ్ ప్రజలు దాదాపు సంపూర్ణంగా తరిమి వేయబడ్డారు. తూర్పు పాకిస్తాన్ నుంచి కూడా హిందూ–బౌద్ధులు తరిమి వేయబడ్డారు. 1947లో వారి జనాభా 28% ఉంటే ఇప్పుడు 9 శాతానికి తక్కువగా యుంది. ఏటేటా తగ్గుతోంది. మరి విభజనకు, పాకిస్తాన్‌కు పోరాడిన, కలహించిన భారత భూభాగంలోని ముస్లింలు, తూర్పు పంజాబ్, ఢిల్లీలో కొంతమంది తప్ప, అందరూ ఇక్కడే ఉండిపోయారు. పాకిస్తాన్, బంగ్లాల్లో హిందువులు హరించుకుపోతే, భారతదేశంలో 1948లో 7.5% ఉన్న ముస్లిం జనాభా 15% దాటిపోయింది. 25% అని వారి నాయకులు అంటున్నారు. 700 సంవత్సరాల దండయాత్రల్లో, ముస్లిం ఆధిక్యంలో 30,000 దేవాలయాలను ధ్వంసం చేసి 90% వరకూ ఉన్న హిందూ ప్రజలపై నిరంకుశ పాలను చేసి, అప్పుడప్పుడు హిందువులపై జిజియా పన్నువేసి, దేశాన్ని విభజించి, ముస్లిం పాకిస్తాన్ (బంగ్లాను) సృష్టించి, అక్కడ నుంచి తరిమివేయబడిన హిందూ– సిఖ్ – బౌద్ధులను గురించి తమచే నిర్మించబడ్డ దేశాలను తప్పుపట్టకుండా ఉన్న ముస్లింలను భారతీయులు మనసారా నమ్మగలరా? ప్రేమించగలరా?

5. ఇకవారి పేదరికాన్ని గురించి చూడండి. చదువుకోని వాళ్ళు, నిరర్థక చదువుల్ని మాత్రం నేర్చుకున్నవారు, స్త్రీ విద్యను నిరసించేవారు, అంతులేని సంతానం కలవారు, ప్రపంచంలో ఎక్కడయినా సంపన్నులుగా, సహజీవనాన్ని గౌరవించేవారుగా ఉన్నారా? ఇంగ్లీషు చదువుకున్న వారికే ఉద్యోగాలు లేనప్పుడు, తెలుగు మాధ్యమం ద్వారా చదువుకున్నవారికి చివరి పంక్తిలో అరకొర ఉద్యోగాలొస్తుంటే, మద్రసాల్లో, అరబిక్‌లో చదువుకునేవారిని ఎవరు, ఎందుకు వినియోగించుకుంటారు? స్త్రీ విద్య, శాస్త్ర విజ్ఞానాధ్యాయనం, పరిమిత సంతానం, పరమత సహనం, సర్వ ధర్మ సమానత్వాల విషయంలో అభ్యుదయ సంస్కరణోద్యమం ముస్లిం సమాజంలో ఎంత వరకు ఉన్నయ్? ఇతర దేశాల నుండి వస్తున్న వందల





కోట్ల రూపాయలు, విద్యా సంస్థల నిర్మాణం కోసం వినియోగించ బడుతున్నాయా? వృత్తిపరమైన చాతుర్యాన్ని నేర్పడానికి ఉపయోగిస్తున్నారా? మైనారిటీ కాలేజీలను తమ అక్షరాస్యతతో, విద్యార్హతగల సంఖ్యతో సంబంధం లేకుండా, కొల్లలుగా పెట్టి, సీట్లను ఎంతమంది ముస్లిమేతరులకు అమ్ముతున్నారు? పాకిస్తాన్ ఇస్లామిక్ స్టేట్ అయినప్పుడు భారతదేశం సెక్యులర్ స్టేట్‌గా ఎందుకు వుండాలి? పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో మిశ్రమ సంస్కృతి లేనప్పుడు ఇక్కడే ఎందుకు ఉండాలి? వివాహ వేదికలూ, (షాదీఖానాలు) ఉర్దూ గృహాలు, ముస్లింలకై వేరుగా ఎందుకుండాలి? అటువంటివి పాకిస్తాన్‌లోనూ, బంగ్లాదేశ్‌లోను హిందువులకై ఉన్నాయా? కాశ్మీరులోయ నుండి తరిమికొట్టబడి, దేరాల్లో దశాబ్దంపైగా వుంటున్న మూడు లక్షల హిందువులను గురించి మాట్లాడకుండా, అహ్మదాబాద్‌లో రెండు నెలలపాటు దేరాల్లో ఉన్న ముస్లింల గురించి పదేపదే ఎందుకు మాట్లాడుతారు. గోధ్రాలో రైలు పెట్టెల్లో హిందువులను తగులపెట్టడం ముందు జరిగిందా లేక అహ్మదాబాద్ మతకలహాలు ముందు జరిగాయా? బాబరు భారతీయుడా? చివరికి అతని అస్థికలు భారతదేశంలో కాక, తన దేశంలోనే భూస్థాపితం చేయించుకున్నాడే? అతని స్మృతి చిహ్నం, రామ మందిరం కన్నా పుణ్యస్థలమా? ముస్లింలు అధిక జనాభాగా యున్న ప్రతిప్రాంతం విభజింపబడి వేరే జిల్లాగా యుండాలా? (కేరళలో మాలప్పురం)? ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాట్లాడే తెలుగు వేషభాషలున్న దూదేకుల ముస్లింలకు ఇప్పుడు అరబిక్, ఉర్దూలు ఎందుకు నేర్పుతున్నారు? వారు తెలుగువారు కాదనా? భారతీయులు కాదనా? "అపరిమిత సంతానం, చదువుకోకుండా ఉండటం మా హక్కు, మమ్మల్ని పోషించడం, ఉద్యోగాలివ్వడం మీ విధి. మా పరంపరలు, సంపర్కాలూ, సంబంధాలతో మీకు ప్రమేయం లేదు. కాని మా ఓట్లతో ఎవరు గెలుస్తారో మేం నిర్ణయిస్తాం" – ఈ ధోరణి ఎంతవరకు సబబు? హైదరాబాద్ పాతనగరంలో ఏ సెక్యులర్ పార్టీకి చెందిన ముస్లిం అభ్యర్థి అయినా యం.ఐ.యం. అభ్యర్థితో పోటీచేసి డిపాజిట్ దక్కించుకోగలడా?

6. ముస్లింలలో బాగా చదువుకున్నవారు, నేరప్రవృత్తి లేనివారు, దేశం యొక్క తమ యొక్క మంచిని కోరుకునేవారు భారతదేశంలో ప్రతి ఉన్నత పదవినీ పొందారు – దేశానికి అధ్యక్షులుగా, సుప్రీంకోర్టులో, హైకోర్టులో న్యాయమూర్తులుగా, ముఖ్య న్యాయమూర్తులుగా, వాయుసేనకు, ముఖ్య సేనానిగా, పదాతిదళాల్లో జనరల్స్‌గా, నౌకాసేనలో అడ్మిరల్స్‌గా, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా, గృహ మంత్రులుగా, దేశ రాయబారులుగా, విశ్వవిద్యాలయాల ఉపకులపతులుగా, పోలీసు బలగాలకు డైరెక్టర్ జనరల్స్‌గా, విదేశాంగ మంత్రులుగా, దేశంలోని ప్రతి పదవినీ పొందారు. చదువులేని వాళ్లకు ఇటువంటి ఉద్యోగాలెలా వస్తాయి? 1948కు పూర్వం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమం ద్వారా బోధన జరిగేది. వారు ఒక్క నైజాం ప్రభుత్వంలో దక్క మరెక్కడా ఉద్యోగార్హులు కారు, అందుకని ఉర్దూగాక, ఇతర విశ్వ విద్యాలయాల్లో మాదిరి ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశపెట్టబడింది. "మేం ముస్లింలము, మా భాష ఉర్దూ, మా సంఖ్య ఎక్కువ. మాకు ఉర్దూ యూనివర్శిటీ కావాలి" అని, ఓట్ల కోసం అర్రులు చాపే పార్టీల పాలన నుండి ఉర్దూ యూనివర్సిటీని పొందారు. దీనికి తెలుగు యూనివర్సిటీకి లేని వనరులూ, ప్రత్యేకతలూ పొందారు. ఎవరిని ఉద్ధరించడానికి? ఈ డిగ్రీలు పొందినవారు ఎవరితో పోటీచేసి ఉద్యోగాలు సంపాదించుకోగలరు? మేం ముస్లింలు కావడం మూలాన, మాకు అన్యాయం చేస్తున్నారని నినదించడానికా?

7. పాకిస్తాన్ ప్రేరిత జిహాదీలకు భారతదేశంలో ఎవరు ఆశ్రయం ఇస్తున్నారు? నేరగాళ్లను పట్టుకుంటే ముస్లింలను వేధిస్తున్నారు, మానవ హక్కులను హరిస్తున్నారని, అలవాటు, విశ్వాసం చొప్పున అరిచే, వామపక్షీయులతో తాడోపేడో వర్గాలతో కలిసి ప్రదర్శనలు, తీర్మానాలు, సభలూ ఎందుకు చేస్తున్నారు? ఈ నేరగాళ్ళకు ఆశ్రయం ఇవ్వకూడదని, పాలస్తీనీయుల కన్నా, ఇరాకీల కన్నా భారతీయులతో మనకు ఎక్కువ సంబంధం ఉంది. జిహాదీ ఉగ్రవాదుల నుండి, నరహంతకుల నుండి, కాశ్మీరు లోయలోని







హిందూ అల్ప సంఖ్యాకుల రక్షణ మన కర్తవ్యం అని ఎందుకు ఉద్యమించరు? వందల సంవత్సరాల నుండి హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ, తెలుగు నేర్చుకోని ముస్లింలకు తెలుగు నేర్చుకోండని, తెలుగును గౌరవించండని ఎందుకు ముస్లిం మేధావులు, రచయితలు చెప్పరు. ఉమర్ ఆలీషా, రుక్నుద్దీన్ వంటి వారు చాలా మంది ఎందుకు లేరు?

8. ముస్లిం మిత్రులు ఈ దేశం యొక్క చరిత్రంతా చదవాలి. ప్రపంచంలో ఏ దేశాలు, ఏ ప్రజలు ఎందుకు నిరుపేదలుగా, నిర్బలులుగా ఉంటున్నారో అర్థం చేసుకోవాలి. ప్రయోజనకరమైన, శాస్త్ర సాంకేతిక విద్య, పరిమిత సంతానం స్వహస్తాలలో వున్నయ్, ఎవరినో ఎందుకు నిందించాలి? 700 సంవత్సరాలు రాజ్యం చేసిన వీరుల సంతతికి, అస్పృశ్యతతో అలమటించిన అనుసూచిత కులస్తులకూ సామ్యమా? చారిత్రక సామాజిక పీడిత, సమానత్వం వంచిత అనుసూచిత కులస్తులకు రిజర్వేషన్‌లు తప్పని సామాజిక మానవతా న్యాయం. అవిద్య, అధిక సంతానం, అభివృద్ధి నిరోధక పరంపరలనూ స్వయంగా అంతమొందించకుండా, ఇతరులు మమ్ము ఉద్ధరించడం లేదనడం, వేర్పాటును పోషించుకుంటూ, మా జనాభా దామాషాలో మాకు ఉద్యోగాలు, పదవులూ, కావాలనడం ప్రజాస్వామ్య రాజ్యంలో ఆమోదయోగ్యం కావు. ఆత్మ విమర్శ, విద్య, సంస్కృతి, సహనం, సర్వధర్మ సమానత్వం, భారతదేశపు అవిచ్ఛిన్నత, భారతజాతి సమైక్యత, చేసిన తప్పుల్ని అన్యాయాలను ఒప్పుకోవడం వగైరా విలువలను అందరూ ఆదరించి పెంచాలి.

# 10. మైనారిటీ వృత్తి కళాశాలలు - ఘోరాలు, నేరాలూ

1. ప్రపంచంలో మరే దేశంలోనూ లేని వింత మనదేశంలో విచ్చలవిడిగా పరిఢ విల్లుతోంది. 15 కోట్లు దాకా ఉన్న ముస్లింలు మైనారిటీ ఆట, అందుకని వారికి, మెజారిటీ సంఖ్యాకులైన హిందువులకు లేని హక్కులూ, ఇతర మతస్తులకు వర్తించే చట్టాలు వారికి వర్తించకుండా ఉండటం, కేవలం వారి తీర్థయాత్రలకు మాత్రమే ప్రభుత్వ ధన వినియోగం చేయడం, ప్రార్థన చేసుకునేందుకు ఆఫీసుల్లో పనిచేయకుండా వెళ్ళిపోవడం, ఇటువంటి మరెన్నో ప్రత్యేకతలు వారికి సంక్రమింపజేయడం భారతదేశపు సెక్యులరిజానికి మెరుపునిచ్చే ప్రక్రియలట. ఈ ప్రత్యేకతల ఆభూషణమాలలో కలికితురాయి మైనారిటీ విద్యాసంస్థలు. ఈ విషయంలో, ముస్లింలతో బాటు క్రీస్టియన్లకూ ప్రత్యేకతలున్నాయి. ఇతర విషయాలను ప్రస్తుతానికి వదిలి, ఒక్క మైనారిటీ విద్యా సంస్థల పేరిట జరుగుతున్న అనౌచిత్యాన్ని, అక్రమాలనూ, అవినీతిని తిలకిద్దాం.

2. భారతీయ రాజ్యాంగం యొక్క అధికరణ 29,30ల ప్రకారం, మతపరమైన, భాషా పరమైన మైనారిటీ సముదాయాలు తమ ఇచ్ఛానుసారం విద్యా సంస్థలను స్థాపించి, నిర్వహిస్తూ పాలించుకోవచ్చు. దీని యొక్క ఉద్దేశం అల్ప సంఖ్యాకులు తమ మతాన్ని, భాషనూ సంరక్షించుకోవడటం, వాటిని సజీవం ఉంచుకోవడం, వాటికి సంబంధించిన సాహిత్యాన్ని, ఇతిహాసాన్ని, సంస్కృతిని ధృడ పరచుకోవడం, ఇది హర్షణీయమే.

ఇస్లామిక్ దేశాల్లో (పాకిస్తాన్, బంగ్లాదేశ్, సౌది అరేబియా, కువైత్, ఇరాన్...) మరో మతస్తులకు ప్రార్థనామందిర నిర్మాణం, బహిరంగంగా మత ప్రార్థనలూ, పండుగలు చేసుకోవడం నిషిద్ధాలు. కాని మన దేశంలో రాజ్యాంగపు అధికరణకు, సెక్యులరిజం ముసుగులో ప్రత్యేకాన్వయాన్ని సృష్టించి,మైనారిటీ సంస్థలూ, సంఘాలు







(కేవలం ఏ ఏడుగురైనా కలిసిపెట్టినవి) ఏరకమైన విద్యా సంస్థనయినా సరే, హద్దులేని సంఖ్యలో, తమ జనాభా యొక్క సంఖ్యతో, వారిలో ఉన్న నిర్దేశిత కనీస అర్హత ఉన్న సంఖ్యతో సంబంధం లేకుండా, మతం, భాషలతో సంబంధం లేని వృత్తి విద్యాలయాలను స్థాపించి, విద్యా వ్యాపారం చేస్తున్నాయి. ముస్లిం కంప్యూటర్, హిందూ కంప్యూటర్లూ, క్రిస్టియన్ బి.ఎడ్. హిందూ బి.ఎడ్. ముస్లిం పళ్ళూ, హిందూ పళ్ళూ, క్రిస్టియన్ సివిల్ ఇంజనీరింగ్, ముస్లిం ఎలక్ట్రానిక్స్, క్రిస్టియన్ ఎం.బి.ఎ, హిందూ ఎం.బి.ఎ, ముస్లిం గుండె చికిత్స, సిక్కు ఎలక్ట్రికల్, ముస్లిం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్... ఈ విధమైన మతం, భాష మీద ఆధారపడ్డ వైజ్ఞానిక సాంకేతిక వైవిధ్యం ఉండటం, ప్రపంచంలో ఒక్క లౌకికవాద భారతదేశంలో తప్ప మరెక్కడా చూడం.

ఈ అద్భుతాన్ని విద్యాసంస్థల ద్వారా మైనారిటీలు, వారితో కుమ్మక్కయి, నీతి నియమాలు లేని అధికారులున్నారో చూడండి. మన రాష్ట్రంలో క్రిస్టియన్ల జనాభా భారత ప్రభుత్వ గణాంకాలననుసరించి ఈ విధంగా ఉంది.

| సంవత్సరాంతం | 1971 | 1981 | 1991 | 2001 |
|---|---|---|---|---|
| రాష్ట్ర జనాభాలో శాతం | 4.19 | 2.68 | 1.83 | 1.44 |

రాష్ట్రంలో 303 బి.ఎడ్ కాలేజీలు ఉంటే అందులో 71 అంటే 23.4 శాతం, క్రిస్టియన్ మైనారిటీ సంస్థలు, సంఘాలవి. వీటిలో 8050 సీట్లు ఉంటే, కేవలం 3000 క్రిస్టియన్ విద్యార్థులు ప్రవేశార్హులయ్యారు. మిగతా 5050 సీట్లనూ ఎన్నో మంత్రాలనూ, తంత్రాలనూ ప్రయోగించి, హిందువులకు అమ్ముతున్నారు. ఈ అమ్మకాల ద్వారా దాదాపు 100 కోట్ల రూపాయలు ప్రోగుచేస్తున్నారు. ఈ విధంగా హిందువుల దగ్గర నుండి కొల్లగొట్టిన సొమ్మును మతాంతరీకరణకూ, ఊరూర చర్చిలను కట్టడానికి ఉపయోగిస్తున్నారు.

ఇంజనీరింగ్ కళాశాలల విషయం చూడండి. రాష్ట్రంలోని మొత్తం (217) కళాశాలల్లో 9 శాతం క్రిస్టియన్లవి. 1.44 శాతపు మైనారిటీ సముదాయానికి 9 శాతం ఇంజనీరింగ్ కళాశాలలెందుకు? సీట్లు హిందువులకు అమ్మి డబ్బు చేసుకుంటానికి అనేది ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. సాలీనా 90 కోట్ల రూపాయలు ఈ విధంగా క్రిస్టియన్ సంస్థలూ, సంఘాలూ దండుకుంటున్నాయి.

మన రాష్ట్రంలో ముస్లింల జనాభా 8.5 శాతం. వీరికి 22 శాతం ఇంజనీరింగ్, 4 శాతం మెడికల్, 8.5 శాతం ఎం.బి.ఎ, 13 శాతం బి.ఎడ్, 10 శాతం ఎం.సి.ఎ. కళాశాలలున్నాయి.

ముస్లింలలో అక్షరాస్యతే తక్కువ, అందులో వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశానికి, కనీసార్హతలున్నవారు, జనాభా శాతానికన్నా తక్కువే. అయినా, అవసరానికి మించిన సంఖ్యలో మైనారిటీ హోదాను ఉపయోగించి, స్థాపించి, క్రిస్టియన్ల మాదిరిగానే, సీట్లను హిందువులకు అమ్ముతున్నారు. ఒక్క ఇంజనీరింగ్ సీట్ల అమ్మకం ద్వారా సాలీనా 120 కోట్ల రూపాయల వీరు హిందువుల నుండి దండుకుంటున్నారు. ఈవిధంగా, ప్రతి సంవత్సరం మన రాష్ట్రంలో మతపరమైన మైనారిటీ కాలేజీలు దాదాపు 350 కోట్ల రూపాయలను హిందువులకు అమ్ముతున్నయ్.

ఇటీవలే భాషాపరమైన మైనారిటీ కళాశాలలు కూడా వెలుస్తున్నాయ్. మరాఠీ, కన్నడ సంస్థలు ఇంజనీరింగ్ కళాశాలలు పెట్టారు. సిక్కులూ, జైనులు కూడా ఇంజనీరింగ్ కాలేజీలు పెట్టారు.

మైనారిటీ కాలేజీలనే ప్రత్యేక హక్కులు ఎటువంటి దారుణ పరిణామాలకు దారితీస్తోందో చూడండి. ప్రకాశం జిల్లాలో ఒక ఘరానా కమ్మ ధనవంతుడు, బాప్టిజమ్ సర్టిఫికెట్ కొని, అనామక క్రిస్టియన్‌లను కొని, మైనారిటీ సంఘం పేర ఇంజనీరింగ్ కాలేజీ వ్యాపారం ప్రారంభించారు. ఒక సిక్కు మైనారిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 1500 మంది విద్యార్థుల్లో, సిక్కులు 20 మందికి లోపే. మేరీమాత







పేరున ఉన్న రెడ్డి కులస్థుల యాజమాన్యంలోని ఇంజనీరింగ్ కాలేజీలో 5 శాతం మాత్రమే నిజమైన క్రైస్తవులు. మిగతా వారిలో చాలమందికి అఫిషియల్ రికార్డులో ఈ క్రిస్టియన్ పేర వాస్తవంగా హిందువులే. చర్చి, జీసస్, మేరీలు ఎక్కడున్నారో? వారి పేరిట జరుగుతున్న మోసాలూ, నేరాలూ వారికి తెలిస్తే వారు క్రిస్టియన్ మతాన్ని రద్దు చేస్తారేమో?

ఇక హిందువుల దౌర్భాగ్యం చూడండి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 254 కులాలున్నయ్. ఏ పాతిక కులాలో తప్పితే మిగతా వారందరూ ముస్లింలకన్నా, క్రిస్టియన్ల కన్నా దీన స్థితిలో ఉన్నారు. జంగాలు, వడ్డెర, బుడబుక్కలవారు, మేరుకులస్థులు, ఇత్యాదుల పరిస్థితులు దయనీయం. వీరందరినీ, కులపరమైన మైనారిటీలుగా పరిగణించి వారిక్కూడా మైనారిటీ కాలేజీలు పెట్టుకునే ప్రత్యేక హక్కులిస్తే వారు కూడా ముస్లింలవలె, క్రిస్టియన్‌లవలె, ఇతర హిందువుల వలె డబ్బు దండుకొని బాగుపడవచ్చునేమో? లేకపోతే వీరందరూ క్రిస్టియన్ తీర్థం పుచ్చుకోవలసిందేనా?

మైనారిటీ కాలేజీలను ఆ సముదాయాల జనాభా నిష్పత్తి ననుసరించి, ప్రభుత్వం ఎందుకు నియంత్రించదు? ఇది చట్టానికి వ్యతిరేకం కాదే? మైనారిటీ కాలేజీలోని సీట్లన్నీ మైనారిటీలకే ఇవ్వాలని నియంత్రిస్తే, ఎన్నో కాలేజీలు మూతపడి, ఈ దొంగ వ్యాపారం అంతమవుతుంది కదా! మరో దారుణమయిన విషయం. మన రాష్ట్రంలో పల్లె ప్రాంతాల్లో, ఊరూరా చర్చిలు వెలుస్తున్నాయి. అలాగే పట్టణాల్లో వాడవాడల్లో, ప్లాట్లూ, ఇళ్ళూ కొనబడి చర్చిలుగా ఉపయోగింప బడుతున్నయ్. ఈ నేపథ్యంలో క్రిస్టియన్ల జనాభా శాతం తగ్గుతోందంటే, కేవలం 1.4 శాతం అనే సెన్సస్ సంఖ్య నమ్మశక్యంగా లేదు. క్రైస్తవ సంఘాలూ, చర్చి సంస్థలూ పత్రికల ద్వారా, వినతి పత్రాల ద్వారా తమ సంఖ్య 10 శాతం మించి ఉందనీ, కనుక చట్ట సభల ఎన్నికలకై సర్వేక్షణల ద్వారా తెలుస్తున్నదేమిటంటే షెడ్యూల్డ్ కులాల వారిని మతాంతరీకరించి, ఈ వాస్తవాన్ని ప్రభుత్వ రికార్డులలోకి

ఎక్కించవద్దని చెప్పడం యస్.సి.ల క్రింద వారికి ప్రత్యేకించబడిన సంక్షేమ, విద్యా, వ్యాపార, ఉద్యోగ ప్రాథమికతను, మతాంతరీకరణ తర్వాత కూడా పొందడమనే దురాలోచన దీనికి కారణం. కొన్ని క్రిస్టియన్ యాజమాన్యాలు ఇటువంటి క్రిప్టో-క్రిస్టియన్ యస్.సి. విద్యార్థుల పట్ల ఘోరమైన వివక్షతను చూపి, సీట్లను అమ్ముకునే ఉద్దేశంతో వారికి సీట్లు ఇవ్వడం లేదు.

మైనారిటీ కాలేజీల పేరుతో జరుగుతున్న విద్యా వ్యాపారం, రాజ్యాంగ చట్ట విడంబన, అవినీతి, నేరాలను, హిందువులకు జరుగుచున్న అన్యాయాన్ని వెంటనే ఆపవలసి యుంది. ముందుగా నిజనిర్ధారణకై ఒక యంక్వైరి కమిటీని తక్షణమే ప్రభుత్వం నియమించాలి. ప్రభుత్వాలే ఈ పరిస్థితికి మూలకారణం అనుకుంటే, న్యాయ స్థానాల్లో ప్రజావ్యాజ్యం వేయాలి. న్యాయం కోసం, నిజాయితీ కోసం నిరంతరం పోరాడుతున్నామంటున్న వామ పక్షీయ విద్యార్థి సంఘాలు ఒక ఉద్యమం ప్రారంభించాలి. ఉగ్రవాదులతో భయభ్రాంతులు కాని దేశ శ్రేయోభిలాషులు గళం విప్పాలి. కలం పట్టాలి.

**తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు**
**తవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు**
**తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు**
**చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు**

భా॥ ఇసుకను పిండైనా సరే అతికష్టమ్మీద దానిలోంచి నూనె తీయవచ్చు. ఎండమావుల్లోంచి నీళ్ళైనా తాగవచ్చు? కావాలనుకుంటే లోకమంతా తిరిగి ఎక్కడైనా కుందేటి కొమ్ము సాధించవచ్చు - కాని మూర్ఖుని మనసు సంతోషపెట్టడం చాలకష్టం.







# 11. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ప్రమాణాలు, చాలని ఉద్యోగావకాశాలు, అంతులేని వాగ్దానాలు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన జనాభా 35 కోట్లు. 57 సంవత్సరాల తర్వాత ఇప్పుడు 105 కోట్లు. మూడు రెట్లు పెరిగింది. ప్రతి సంవత్సరం మన జనాభా ఒక కోటి, ఎనభై లక్షలు పెరుగుతోంది! ఇది ఆస్ట్రేలియా దేశం యొక్క మొత్తం జనాభా కన్నా ఎక్కువ; అంటే ప్రతి సంవత్సరం మనం ఒక ఆస్ట్రేలియాను మించిన జనాభాను పెంచుతున్నాం! ప్రభుత్వం (కాకి) లెక్కల ప్రకారం, ఏ ఒక్క సంవత్సరంలోను ఒక కోటి మందికి మించి, దేశం మొత్తంలో ఉపాధి కల్పన జరగలేదు. అంటే ప్రతి సంవత్సరం, మనం 80 లక్షల మంది నిరుద్యోగులను పెంచుతున్నామన్నమాట! మరో విషయం, అధిక సంతానం ఎవరిలో ఉంది? మన ప్రత్యక్ష అనుభవం ప్రకారం, ఈనాడు చదువుకున్న వారికి ఉద్యోగం/ పనియున్న వారికి, సంపత్తి యున్నవారికి, ఒకరిద్దరికి మించి పిల్లలుండటం లేదు. వారికి ఎంత ఖర్చుకైనా వెనుకాడక, తల్లి తండ్రులు త్యాగం చేస్తూ శ్రద్ధతో మంచి చదువులు చెప్పించి, మంచి ఉద్యోగాలను పొందే అర్హతలను కలిగించి, అమెరికాకు "ఎగుమతి" చేస్తున్నారు. ఇలా పరిమిత పరివారం ఉన్నవారు సంపన్నులవుతున్నారు. ఎవరికయితే చదువులేదో, వారికి ఎక్కువ పిల్లలు, దాని మూలంగా దుర్భర పేదరికం; ఇదొక విషవలయం. ఇక ఓట్ల కోసం, పదవుల కోసం "ప్రజాసేవ" అనే వృత్తిలోకి దిగిన నాయకులు, అధిక, అత్యధిక సంపన్నులవుతున్నారు. బీదలు దుర్భర దారిద్ర్యంలోకి దిగజారుతున్నారు. మమ్ము గెలిపిస్తే, మేం అధికారంలోకి వస్తే, మీ సేవకే అంకితమై, దారిద్ర్యమనే శనిని తొలగిస్తాం. మీ అందరికి ఉపాధి; ఉచితంగా విద్యుత్, ఇళ్ళపట్టాలూ, స్థలాలు, ఇళ్ళూ, తిండి పదార్థాలూ, కిరోసిన్, పంచదార, సబ్సిడీ ధరలకిస్తాం. గురజాడ మహాకవి "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అంటే , మన రాజకీయ వ్యాపారులు "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే ఓట్లోయ్; దేశమంటే కోట్లోయ్"అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అందుకే, ఎన్ని ఎన్నికలు వచ్చినా,

ఎన్ని ప్రణాళికల (ఇంతవరకు పది ) మీద లక్షల కోట్లు ఖర్చుపెట్టినా, మన దేశంలో నిరక్షరాస్యతకు (35%) అంతులేకుండా, సాధన సంపత్తి, విద్య, అర్హతలు లేనివారిలో పిల్లలుండటం మూలాన మనదేశంలో నిరుద్యోగం పెరుగుతోంది, బీదతనం తగ్గడం లేదు. ఎక్కువ మంది పిల్లల్ని కన్న బీదతల్లి తండ్రులు పిల్లల్ని చదువుకు పంపగలుగుతారా? వారందరికీ తిండిపెట్టగలరా? లేదు, అందుకే పిల్లల్ని పనిలో పెడుతున్నారు. బాలకార్మిక వ్యవస్థ అనే రోగానికి మందు వేద్దామా? రోగం రాకుండా ఉండటానికి నిర్బంధ సంతాన పరిమితిని అమలు చేయాలి. ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులు తీసివేయడం, రాయితీలు (సబ్సిడీలు) తీసివేయడం అన్ని సంక్షేమ పథకాలకు అనర్హులుగా చేయడం జరగాలి. రాజకీయ పార్టీలు, నాయకులూ, కార్యకర్తలూ ప్రజలతో ఈ విషయాలను గురించి ప్రస్తావించి, ప్రజలందరనూ పరిమిత కుటుంబీకులుగా చేయాలి. "దేవుడు బిడ్డలను ఇస్తున్నాడ"నే వారిని, సంక్షేమం కోసం, ఇళ్లకోసం దేవుణ్ణే కోరుకోమని చెప్పాలి. మతం పేరిట ఎవ్వరికీ, ఈ నిర్బంధ పరిమిత పరివార పథకాల నుంచి మినహాయింపు ఇవ్వకూడదు.

ఇక విద్య, విద్యా ప్రమాణాలను పరిశీలిస్తే బాధపడటం తప్పదు. ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లల్ని పంపించడానికి నాల్గవ తరగతి ఉద్యోగులు గాని, దినసరి కూలి చేసేవారు సహితం ఇష్టపడటం లేదు. అక్కడ చదువులు లేవనేది కేవలం విశ్వాసమే కాదు, చాలా వరకు అక్షర సత్యము. అందుకే ప్రభుత్వ విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులు కూడా తమ పిల్లల్ని, తాము చెప్పే స్కూల్లో చేర్చడం లేదు. ఏ గ్రామంలోని స్కూల్లో వారు ఉద్యోగం చేస్తున్నారో, ఆ గ్రామంలో ఆ ఉపాధ్యాయులు నివాసం చేయడం లేదు. ఈ కారణాల వల్ల చదువు ఉచితమైనా ప్రభుత్వ విద్యాలయాలు హీనదశలో వున్నాయ్.

ఉన్నత, విశేషించి వృత్తి కళాశాలల్లో కూడా విద్యా ప్రమాణాలు చాలా హీనంగా ఉన్నాయి. మైనారిటీ వృత్తి కళాశాలలు, హిందూ విద్యార్థులకు హేయమయిన పద్ధతుల్లో సీట్లు అమ్మి, సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది







ఆ సొమ్ముతో మతం మార్పిడి వ్యాపారం చేస్తున్నారు. చదువులు చెప్పడానికి అర్హత, అనుభవం, ప్రతిభ వున్న ఉపాధ్యాయులు లేరు, హాస్టళ్లు లేవు. లైబ్రరీలు నామమాత్రం, విద్యార్థులు రోజుకు రెండు గంటలు కళాశాల – ఇంటి మధ్య ప్రయాణం చేస్తూ కాలం పఠనావకాశాన్నీ వ్యర్థం చేస్తున్నారు. మార్కులు చాలా వరకు వేయబడినవి కాని, సంపాదించుకున్నవి కావు. విద్యార్థులు 5 శాతం కన్నా, ఏ కంపెనీలోనూ పనికి రావడంలా. ఎంతో విత్తం వెచ్చించి డిగ్రీ పొందుతున్నారు. ప్రమాణికత, నాణ్యతలేని చదువు వల్ల ఎవరికి లాభం? ఎవరికి ప్రయోజనం?

భారతదేశంలో ఉన్నంత నిరక్షరాస్యత (35%) నాణ్యత లేని చదువులు (90%పైగా) ఇంత పరిమాణంలో పెరుగుతున్న జనాభా ఉన్న ఏ దేశం కూడా సంపన్న దేశమవలేదు. దారిద్ర్యాన్ని తగ్గించుకోలేదు. శాశ్వతమైన, నిజమైన సంక్షేమం, సంపత్తి, శక్తి కేవలం విద్యాధికృత, పరిమిత పరివారం, పొదుపుల వల్లనే సాధ్యం. ఎంత కాలమయితే ఓట్లు, అధికారం, స్వంత సంపత్తిని సమకూర్చుకోవడానికే ప్రయత్నించే వంచక నాయకత్వం, పార్టీలు శిక్షింపడకుండా దేశాన్ని ఓట్లుగా, కోట్లుగా చూడగలుగుతాయో అంత వరకూ భారత ప్రజలు బాధపడవలసిందే. అందుకే దేశం యొక్క ప్రజల యొక్క శాశ్వత సంక్షేమం, శుభం కోరేవారు మనదేశంలోని జనాబా పెరుగుదల, విద్యాన్యూనత, గురించి ఆలోచించి, వాటిని నిర్మూలించడానికి ఉద్యమించాలి.

# 12. నిర్బంధ విద్య

**25.11.2004**

శ్రీ చుక్కా రామయ్యగారి (దిక్సూచి 25-11-2004) అభిప్రాయాలు చాలా చోద్యంగా ఉన్నాయి. పిల్లల్ని బడికి పంపించని తల్లిదండ్రులపై జరిమానాను ఆయన వ్యతిరేకిస్తున్నారు. బాధ్యత లేకుండా ఎంతమందినైనా కనే హక్కు తల్లిదండ్రులకు ఉండాలి. వారిని పోషించే, చదివించే బాధ్యత మాత్రం సమాజం, ప్రభుత్వం వహించాలి అనే చుక్కాగారి వాదం సహేతుకం కాదు. పోషించలేని పిల్లల్ని కనడం కన్నా అసాంఘికమైన, బాధ్యతా రహితమైన ప్రవర్తన ఏదైనా వుందా? అటువంటి హక్కులు వుండాలనడం విజ్ఞతకు నిదర్శనం కాదు.

2. ప్రస్తుతం నాణ్యతలేని విద్యాబోధనకు కారణం ప్రభుత్వమే అంటున్నారు. అదనంగా ఉపాధ్యాయుల్ని నియమించాలని అంటున్నారు. ప్రభుత్వంచే నిర్వహింపబడే పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎంత చిత్తశుద్ధితో బాధ్యతతో బోధిస్తున్నారో, ఆ స్కూళ్ళలోని పరీక్షా ఫలితాలే నిరూపిస్తున్నాయి. ప్రభుత్వంచే నియమింపబడిన ఉపాధ్యాయులు తమ పిల్లల్ని, ప్రభుత్వ పాఠశాలలకు కాకుండా కాన్వెంట్, ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో చదివిస్తున్నారు. ఇందుకు మనం ప్రభుత్వాన్ని గర్హించాలా లేక, జీతాలు దండుకుంటూ సంఘాలు పెట్టుకుంటూ, బోధన యందు శ్రద్ధచూపని ఉపాధ్యాయులను గర్హించాలా?

3. ప్రైవేటు స్కూళ్ళలో 70% సీట్లను బీదవారికి కేటాయించే ఉద్దేశ్యం మంచిదేకాని ఆచరణీయం కాదు. దీనికి విరుగుడుగా ఈ సమాన విద్యను







నేర్పడం కోసం ప్రభుత్వం ప్రైవేటు స్కూళ్ళను ప్రోత్సహించకుండా, ప్రభుత్వమే వేలాది స్కూళ్ళను స్థాపించి, ఉపాధ్యాయులను నియమించి, కలిగివున్నవారి, లేనివారి పిల్లలందరిని ఆ స్కూళ్ళలో చదివించాలని సూచన చేస్తున్నారు. ఇది మాత్రం ఆచరణీయమా? నిరంకుశ ఏక పక్ష ప్రభుత్వాన్ని స్థాపించిన కమ్యూనిస్టు దేశాల్లో తప్ప, మరే సభ్య దేశాల్లోనూ ఇలా జరగడం లేదు. ఎన్నో నీతులు చెప్పే ఈ విద్యావేత్తలెంతమందో కోచింగ్ స్కూళ్ళను బెట్టి, అందులో ప్రవేశానికి పోటీ పరీక్షలు పెట్టి, కొంతమందిని మాత్రమే తీసుకుని, ఎంతో డబ్బు వసూలుచేసి, రాత్రింబవళ్ళు మోడల్ పరీక్ష పత్రాలకు సమాధానాలను నూరిపోసి '' మా యాత్ర విజయయాత్ర'' అని చెప్పుకునేవారు చేస్తున్న విమర్శలు ఎవరిని ఆకట్టుకుంటాయి? ఇటువంటి విమర్శలు, సూచనలు, ఆచరణలు ఒక్క 'వామపక్ష ప్రగతిశీల, సామ్యవాద, లౌకికవాదులకు మాత్రమే చెల్లుతుంది. హక్కులు ప్రతివారికీనూ, బాధ్యతలు ఎవరికీ వద్దా? అన్నీ ప్రభుత్వం చేయాలా? ఒకవైపు ప్రభుత్వ అసమర్థతను నిందిస్తూనే, ప్రభుత్వ ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యాన్ని కప్పిపుచ్చుతూ, మరోప్రక్క ఆ అసమర్థ ప్రభుత్వం, ఆ బాధ్యతారాహిత విద్యాలయాలను, ఉపాధ్యాయులను పెంచాలనడం, ఆలోచించ గల్గిన ప్రతి పాఠకుణ్ణీ ఆశ్చర్యపరచక మానదు.

చదివించిరి ననుగురువులు
చదివితి ధర్మార్థము ఖరశాస్త్రంబుల్నేఁ
జదివినవిగలవు పెక్కులు
చదువులవోమర్మ మెల్లఁజతివితిఁదండ్రీ

భాగవతం : సప్తమస్కందం

# 13. కుల నిర్మూలనం ఏ మేఆకు, ఎలా సాధ్యం

"హిందూమతం యొక్క ప్రధాన లక్షణం, ఆధారం కులం. క్రిస్టియన్ సమాజంలా, ముస్లిం సమాజంలా, హిందూ సమాజం అంటూలేదు. హిందూమతం సమాజాల కూటమి. సోదరభావం, ఇచ్చిపుచ్చుకోవడాలూ కులానికి మాత్రమే పరిమితం. అందునే హిందూ అభిప్రాయమంటూ, రాజకీయ లక్ష్యమంటూ, హిందూజాతీయత అంటూఉండటం లేదు. కులాలననుసరించి ఆధిక్యత, అసమానత లేర్పడ్డాయి. కులాలున్నంతవరకు హిందూ సమాజం, హిందూ రాజకీయ ప్రయోజనం, అందరికీ సమానావకాశాలున్న సమాజం, జాతి నిర్మింపబడలేవు. కులప్రాతిపదికపైనే అస్పృశ్యులు, వెనుకబడ్డవారు అంటూ కొన్ని వర్గాలు తయారయ్యాయి" అంటూ భారతరత్న భీమ్‌రావు అంబేద్కర్‌గారు ఎంతో ఆవేదనతో, ఎంతో అధ్యయనం, అనుభవం తర్వాత సిద్ధాంతీకరించారు. హిందువుగా ఉండి, కులవ్యవస్థనూ, కులమనస్థత్వాన్ని అంతమొందించలేక, కులాలులేని బౌద్ధాన్ని స్వీకరించి హిందూ అనుసూచిత కులాలవారందర్నీ, హైందవాన్ని త్యజించి, బౌద్ధంలో చేరమన్నారు.

హిందూ పండితులు, మేధావులూ, సంఘసంస్కర్తలూ భారతదేశంలోని ఏ ప్రామాణిక గ్రంథం, వేదాలతో సహా, కులాలు జన్మతః ఏర్పడినవి కావు, చేసే పని గుణాననుసరించి నాలుగు వర్గాలుగా విభజింపబడినవని, మనుషుల యొక్క స్వభావాలననుసరించి (పుట్టుకతోనే కాదని) బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర సముదాయాలుగా విభజింపబడ్డవనీ చెప్పారు. ఒకవేళ వేదాల్లోగానీ, మరే ఇతర దివ్య గ్రంథాల్లోగాని అస్పృశ్యతకు, అసమానతకు, వివక్షతకూ ఆధారాలూ, ఆదేశాలు ఉన్నట్లయితే, వాటిని సంపూర్ణంగా తిరస్కరిస్తానని మహాత్మాగాంధీ గారన్నారు. వేదాల్లోలేని పంచమ వర్ణాన్ని, అస్పృశ్యతనూ, జన్మతః సంక్రమించే కులవ్యవస్థనూ, సహేతుకంకాదు కాబట్టి, వీటిని త్యజించవలసిందేనని ఆర్య సమాజ స్థాపకులు స్వామి దయానంద సరస్వతి అన్నారు. స్వామి వివేకానందులు, తదుపరి రాజకీయ నాయకులందరూ, రాజకీయ పక్షాలన్నీ కూడా కులవ్యవస్థను







నిరసిస్తూ, దాన్ని అంతమొందించడానికి శపథాలు చేస్తూ, నినాదాలిస్తూ తమయొక్క సంస్కార, ప్రగతిశీలతలను ప్రదర్శిస్తున్నారు.

అంటరాని తనాన్ని చట్టం ద్వారా నిర్మూలించ ప్రయత్నిస్తున్నాం. చాలా వరకు కృతకృత్యుల మవుతున్నాం. వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక పథకాలు చేపడుతున్నాం. ఒకవైపు ఇలా సమాజం, ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, దీనివల్ల ప్రయోజనం లేదు, మీరు హిందూమతాన్ని వదిలేసి కులరహితమైన క్రీస్తుమతంలో చేరండని, అమెరికా, పాశ్చాత్య దేశాల నుండి దండిగా ద్రవ్య సహాయం పొందుతున్న క్రైస్తవ మిషనరీలు, నిరక్షరాస్యులనూ, నిమ్న కులస్థులను ఆర్థిక తదితర ప్రలోభాల ద్వారా, హిందూమతాన్ని విడిపించి క్రైస్తవంలోనికి ప్రవేశపెడుతున్నారు. వారిని ఇతర హిందువులపైకి ఉసికొల్పుతున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్‌ల లాభం పొందడానికి, మతమార్పిడిని కప్పిపుచ్చుతున్నారు. మరోవైపు క్రిస్టియన్ దళితులకు, హిందూ దళితులవలె రిజర్వేషన్ కల్పించమని ఉద్యమాలను చేపడుతున్నారు. అంటే క్రైస్తవంలో కూడా కులమూ, కులవివక్షత ఉన్నాయని మనం గమనించాలి. తమ మతంలో కులాలు లేవని చెప్పడం, మత మార్పిడికి మభ్య పెట్టడం కోసమేనని తెలుస్తోంది. అంతేకాదు. ఏ విధంగా హైందవంలో మొన్న మొన్నటి వరకూ దళితుల పట్ల నిర్లక్ష్యమూ, అస్పృశ్యతలు ఉన్నవో అదే విధంగా క్రైస్తవంలో కూడా కొనసాగుతున్నాయి. 1994 వరకూ దక్షిణ ఆఫ్రికాలో శ్వేతజాతి క్రిస్టియన్లు, ఆ దేశస్తులైన నల్లవారిని క్రైస్తవంలోకి మార్చి కూడా, వారిని అస్పృశ్యులుగా, బీదవారిగా ఉంచారు. అమెరికాలో నల్లవారిని (నీగ్రోలనబడేవారిని) క్రిస్టియన్లుగా మార్చికూడా, బానిసలుగా, అంటరానివారిగా ఉంచి శ్వేతజాతి క్రిస్టియన్లు తమ నిజ స్వరూపాన్ని చూపారు. మనదేశంలోని క్రిస్టియన్లు 75% పైన మతం మార్చబడిన హరిజనులే. వీరికి ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమం లేపుతున్న చర్చి అధిపతులూ, క్రిస్టియన్ సంఘాలూ, వారు నడుపుతున్న విద్యా, వైద్య, మత సంస్థల్లో మాత్రం క్రిస్టియన్ దళితులకు రిజర్వేషన్లు కల్పించడం లేదు. ఉదాహరణకు భారతదేశంలో 156 మంది రోమన్ క్యాథలిక్ బిషప్‌లు ఉంటే, వారిలో 150 మంది హిందూ

అగ్రకులాలనుండి మతం మార్చుకున్నవారే! అనుసూచిత కులాల వారిమని ప్రభుత్వోద్యోగం పొందిన దళితులు 85% క్రిస్టియన్ మతం పుచ్చుకొని, వాస్తవాన్ని కప్పిపుచ్చినవారని ఒక సర్వేద్వారా తేలింది. రిటైరైన రైల్వే జనరల్ మేనేజర్; ఇనెస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐ.ఏ.ఎస్) అటువంటివారు ఇప్పుడు తమ నిజ స్వరూపాన్ని బయటపెడుతూ (తమబోటి) దళిత క్రిస్టియన్‌లకు అబద్ధం చెప్పి ఉద్యోగం పొందే అవసరం లేకుండా, రిజర్వేషన్లు కల్పించాలని రాజకీయ పోరాటానికి నాయకులుగా ఉన్నారు. కాబట్టి కులం అస్పృశ్యతలనేవి ఒక్క హిందూమతజాడ్యమే కాదు, రెడ్డి, బ్రాహ్మణ క్రిస్టియన్లు కూడా ఉన్నారు. వారి వివాహాలు కూడా వారివారి కులంలోనే జరుగుతున్నాయి. చివరకు ముస్లింలలో కూడా కులాలు కొనసాగుతున్నాయి. కులాలులేని పాశ్చాత్య దేశాల్లో వర్గాలున్నాయి. వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక కూలీలు, భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, మతాధిపతులు అంటూ వేర్వేరు వర్గాలంటూ, ప్రభుత్వాధిపత్యం కోసం, దేశ సంపదలో భాగస్వామ్యం కోసం, వర్గవైషమ్యాలు పెంచుకోవడం, వర్గపోరాటాలు, సడపడం, అంతర్యుద్ధాలు చేయడం చరిత్ర చదివేవారికి సువిదితమే. అంతేకాదు, ఒకే మతంలో కూడా అనేక తెగలుండటం, మహాద్వేషంతో, అసహనంతో పరస్పర మారణహోమం జరుపుకోవడం కూడా జరిగింది, జరుగుతోంది. ఉదాహరణకు సున్నీ, షియా మహమ్మదీయుల మధ్య; క్యాథలిక్, ప్రొటెస్టంట్ క్రిస్టియన్ల మధ్య, ఇద్దరూ సున్నీలే అయిన కుర్ద్, అరబ్ ముస్లింలమధ్య ఇరాక్‌లో యుద్ధాలూ, పోరాటాలు జరుగుతున్నాయి.

హిందూ కులవ్యవస్థలో ప్రత్యేకత ఏమంటే, ఆదిలో పనినిబట్టి కులవిభజన జరిగితే, కాలక్రమేణా కులం జన్మతో సంక్రమించడం జరిగింది. ఇతర సామాజిక వ్యవస్థలో, ఏ వ్యక్తి అయినా వర్గం మార్చుకోవచ్చు. శ్రామికుడు ధనపతిగా, యజమానిగా, భూస్వామిగా ఎదిగి మరో వర్గంలో చేరవచ్చు. కాని హైందవంలో కులం మార్చుకోలేం, వృత్తి మార్చుకోవచ్చు. క్షత్రియుడుగా పుట్టిన గాధేయుడు బ్రహ్మజ్ఞానం సంపాదించి బ్రాహ్మణుడై విశ్వామిత్రుడయ్యాడు. బ్రాహ్మణుడిగా పుట్టిన పరశురాముడు, ద్రోణుడు క్షత్రియ కృత్యాల నొనర్చారు. ఇలా చూస్తే పంచమునిగా పుట్టిన అంబేద్కర్ బ్రాహ్మణుడు, సచ్ఛాస్త్రి అయ్యారు. సాధారణ







విద్య, శాస్త్ర సాంకేతిక విద్యలూ అధికాధికుల అందుబాటులోకి రావడం, గ్రామాల నుంచి ప్రజలు పట్టణాలకు తరలడం, వ్యాపార వాణిజ్య అవకాశాలు అందరికీ లభ్యమవుతూ ఉండటం మూలాన, ఎవరైనా ఏ వృత్తిలోకైనా ప్రవేశించే అవకాశం దొరుకుతోంది. కమ్మవారు తోళ్ల పరిశ్రమలను, బ్రాహ్మణులు చెప్పుల దుకాణాలను, మిఠాయిదుకాణాలను, దళితులు ఆస్‌బెస్టాస్ పరిశ్రమను నిర్వహించడం, పరిపాలనాధికారులుగా, న్యాయమూర్తులుగా, ముఖ్యమంత్రులుగా రాణించడం, బ్రాహ్మణులు డ్రైవర్లుగా, ప్యూనులుగా, లిఫ్ట్‌బాయ్స్‌గా ఉండటం చూస్తున్నాం. చదువుకున్న కమ్మవారు, రెడ్లు ఎంత మంది వ్యవసాయదారులుగా, పూజారుల యొక్క పుత్రులెంతమంది పూజారులుగా ఉంటున్నారు? మనం గమనించవలసింది కాలక్రమేణ, ఆర్థిక, రాజకీయ, పరిణతితో, అనువంశిక వృత్తికి తరతరాలుగా కట్టుబడి యుండరు. రెండు ఉదాహరణలు ఈ సత్యాన్ని చూపిస్తాయి. అమెరికాలో ఇప్పుడు దాదాపు 30 లక్షల భారతీయ సంతతికి చెందిన హిందువులున్నారు. భాషలు వేరు, కులాలువేరు, అయినప్పటికి వారి సంతతుల్లో కులం యొక్క ప్రభావం తగ్గుతూ, వృత్తి, మేధాసంపదల ఆధారంగా వివాహాలు జరుగుతున్నాయి. అదేవిధంగా మనదేశంలో బ్యాంకుల్లో, ఐ.టీ. కంపెనీల్లో పనిచేస్తున్న వివిధ కులాల వారు, వివిధ మాతృభాషలవారు పరస్పరావగాహనతో వివాహాలు చేసుకుంటున్నారు. వారి సంతానానికి కులం యొక్క స్పృహ, భేదాలు తగ్గిపోతూ ఉంటాయి. ఇటువంటి మార్పు పట్టణవాసం, సాంకేతిక, వ్యాపార, వైజ్ఞానిక విద్యావ్యాప్తి, ప్రపంచీకరణల వల్ల త్వరితమవుతుంది. భారతీయుల శ్రేయస్సును కోరేవారు, సౌభ్రాతృత్వాన్ని పెంచదలచినవారు, సమాజ సమగ్రతను పటిష్టం చేయతలచేవారు కులవిద్వేషాలను రేకెత్తించకుండా, కులాల్ని సమీకరించి రాజకీయం చేస్తున్నవారిని నిరసించాలి.

ప్రస్తుతం మనదేశంలో, విశేషించి మనరాష్ట్రంలో కులతత్వాన్ని, కులప్రాతిపదికగా పరస్పర విద్వేషాన్ని రాజకీయ నాయకులు పెంచుతున్నారు. కులస్తులను సమీకరించి, శంఖారావం, గర్జన, హుంకారం అనే నినాదాలతో హిందూ సమాజాన్ని మరింత ఛిన్నాభిన్నం చేస్తున్నారు. మన రాష్ట్రంలో రెండు కులాలు దక్క మిగతా 282 కులాలవారు, మేం వెనుకబడ్డవారం, వివక్షతకు గురి

అవుతున్నాం, మా జనాభా ఇన్ని కోట్లు, మమ్మల్ని వెనుకబడ్డ కులాల(ట్రైబ్స్) జాబితాలో చేర్చమని, ఇన్ని ఎం.ఎల్.ఏ, ఎం.పీ. సీట్లు ఇవ్వాలని, ఇంత మంది మా కులంవారు మంత్రి వర్గంలో ఉండాలని పోటీబడి జనసమీకరణ చేసి కుల స్పృహను, విభాజకతనూ, ద్వేషాన్ని ప్రజ్వలింపచేస్తున్నారు. రాజకీయ నాయకులు ఈ సమీకరణ అతిథులుగా, ప్రోత్సాహకులుగా పోషకులుగా ప్రత్యక్షమై, కులకలహాగ్నిలో ఆజ్యం పోస్తున్నారు. ఇక కులాలెలా పోతాయి? చట్టాలవల్ల కులాన్ని నిర్మూలించలేం. తల్లిదండ్రుల నుండి జన్మతో వచ్చిన కులాన్ని చట్టం నిర్మూలించలేదు. అందరికీ గుణవత్త ఉన్న సామాన్య విద్య, మానవతా విలువలను బాల్యం నుంచి నేర్పడం, ఆర్థికాభివృద్ధి వేగాన్ని పెంచడం, పట్టణీకరణ (అర్బనైజేషన్) ప్రపంచీకరణలతో పాటు అన్ని కులాలవారూ కలిసి నివసించే గృహసముదాయ నిర్మాణం, కులమత వివక్షతలేని కళాశాలలు, సామాజిక న్యాయం పేరిట ఏర్పరచిన రిజర్వేషన్ల లాభం తరతరాలుగా లబ్ధిపొందిన కుటుంబాలకేగాక ఎప్పుడూ లబ్ధిపొందనివారికి లభించేట్లుగా చేయడం, ఒక కులస్తులందరినీ కాక, ఒక మతస్తులందరినీకాక, నిజంగా వెనుకబడ్డ, బీదకుటుంబాల వారికి విద్య, ఉద్యోగ, వ్యాపార ప్రోత్సాహక పథకాలను అమలుచేయడం వల్ల కులాధారిత అసమానత, వివక్షత, వెనుకబాటుతనం పోగలవు. కొన్ని విచ్ఛిన్నకర దేశీ, విదేశీ శక్తులు హిందువులను కులప్రాతిపదికమీద విభజించి, కలహింపచేసి, అల్పసంఖ్యాకులను మతప్రాతిపదికమీద ఏకంచేసి, రాజ్యాధికారాన్ని పొందచూస్తున్నాయి. ఈ కుట్రను విఫలం చేయాలంటే కులతత్వాన్ని క్షీణించే ప్రభావంగా, ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించే తాత్విక ఆలోచనా, కార్యపథకం కావాలి.

కులముగలవాడు శౌర్యము
గలవాడును, నధికసేనగలవాడునుభూ
తలమున రాజనునామము,
విలసిల్లగఁదాల్చు మూడు విధములపేర్మిన్,

మహాభారతం : ఆదిపర్వం, షష్టాధ్యాయం







# 14. విమర్శనే

**28.02.2004**

శ్రీ వెంకటేశ్వరరావుగారు, కమ్యూనిస్టుల యొక్క సర్వత్ర, సదా అమెరికా వ్యతిరేకతను గురించి నే వ్రాసిన వ్యాసాన్ని విమర్శించారు. (ఆంధ్రభూమి 27.02.04) ప్రతి బలవత్తర దేశం బలహీనదేశాల్ని కబళించడం, వాటిమీద ఆధిపత్యం సాధించడం చారిత్రక సత్యం. ఒక్క అమెరికాయే కాదు, కమ్యూనిస్టు దేశాలు అమెరికాని మించిన సామ్రాజ్యవాద దేశాలుగా మానవ హక్కులను మత స్వేచ్ఛను, ఘోరంగా అణచివేశారు. కమ్యూనిస్టు రష్యా నాజీ జర్మనీతో 1939లో మిత్రత్వపు సంధి చేసుకుని లిథువేనియా, లాట్వియా, ఎస్థోనియా దేశాలపై అవ్యాజంగా దండెత్తి, ఓడించి, దానికింద కీలుబొమ్మ రాష్ట్రాలుగా కమ్యూనిస్టు నియంతృత్వంతో పాలించింది. అకారణంగా పొరుగుదేశమైన ఫిన్‌లాండ్ మీద దండెత్తి పరాభవం చెందింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పోలెండ్, జకోస్లోవేకియా, హంగేరీలలో తను చెప్పినట్లు వినే కమ్యూనిస్టు పార్టీలచేత ఒక కొత్త సామ్రాజ్యాన్ని ఏర్పరచింది. (యుగోస్లేవియా అధినేత, టిటో, స్టాలిన్‌ను ధిక్కరించి, అమెరికా గూఢ సహాయంతో సోవియట్ ఇంపీరియలిజమ్ నుండి బయటపడ్డాడు) ఏ ఒక్క కమ్యూనిస్ట్ పాలితదేశంలో కూడా భావప్రకటన, మత స్వేచ్ఛలేదు. కమ్యూనిస్ట్ పార్టీ యొక్క డిక్టేటర్‌షిప్ ఉండేది. ఎన్నికల్లో ఒకే ఒక్క కమ్యూనిస్ట్ పార్టీ అధీకృతలి స్టే; 99% ఓటు వేశారని, అందులో 99.5% కమ్యూనిస్టు పట్టిక అభ్యర్థులకు ఓటు వేశారని ప్రకటింపబడుతుండేది. సోవియట్ సామ్రాజ్యాన్ని కాని, కమ్యూనిస్టు నియంతృత్వాన్నిగాని, డెమోక్రసీ అనగలిగిన ధీరులు సొంత ఆలోచన ఉన్న వ్యక్తి ఒకవిధమైన రాజకీయ సిద్ధాంతంలో మూఢనమ్మకంలేని వారు, అనగలరా?

అమెరికా ఇతర దేశాల్లో కలిగించుకోవడం గర్హనీయమే. మరి కమ్యూనిస్టు దేశాలు ఎందుకు చేశాయి. కమ్యూనిస్ట్ చైనా, కమ్యూనిస్టు వియత్నాం మీద

ఎందుకు దండయాత్ర చేసింది? ఇప్పటికే కమ్యూనిస్ట్ ఏకచ్ఛత్రాధిపత్యం ఉన్న చైనాలో వియత్నాంలో ఉత్తర కొరియాలో, క్యూబాలో కమ్యూనిస్ట్‌లు గాక వేరే ఏ పార్టీలోనైనా ఉన్నాయా. ప్రభుత్వం చేతగాని, కమ్యూనిస్ట్ పార్టీల చేతగాని, ప్రకటింపబడే పత్రికలుగాని, నడపబడే రేడియో, టి.వి. స్టేషన్లు ఉన్నాయి. భారతదేశంలో తొమ్మిది కమ్యూనిస్ట్ పార్టీలుపైగా ఉంటే చైనా అటువంటి మరెవ్వరినీ వీటిని నిర్వహింపనీయరు. కమ్యూనిస్ట్ దేశాల్లో ఒకే కమ్యూనిస్టు పార్టీ ఏ ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని బట్టి ఉన్నది?

నైజాం రక్కసుడు గద్దె దిగడానికి కమ్యూనిస్ట్ పోరాటం కారణమా? భారత సైన్యాలు నైజాం సైన్యం మీద పోలీస్ యాక్షన్ తీసుకుని కేవలం 5 రోజుల్లో వారిని ఓడించడం కాదా? ఎందుకీ ఆత్మ వంచన, ఈ అబద్ధ ప్రచారం?

కమ్యూనిస్ట్‌లు 1947లో స్వతంత్ర్యం సంపాదించిన భారతదేశాన్ని నిజమైన స్వతంత్ర్య దేశం కాదని, ఆంగ్లో –అమెరికన్‌ల తొత్తు అని, ఆ ప్రభుత్వాన్ని పడగొట్టి, కమ్యూనిస్ట్‌ల ఆధీన ప్రభుత్వం ఏర్పరచాలనే కదా సాయుధ పోరాటానికి దిగింది. ఇలా పోరాడవలసిందని, సైద్ధాంతీకరించింది కమ్యూనిస్ట్ నేత స్టాలిన్‌కదా! ఈ పోరాటాన్ని ఆపేయవలసిందని, పాప్యులర్ ఫ్రంట్స్ ద్వారా నెహ్రూ ప్రభుత్వాన్ని ఎదుర్కోవాలని, సలహా ఇచ్చిందికూడా స్టాలినేకదా! ఇంకా ఎన్నెన్నో సత్యాలనూ, కమ్యూనిస్ట్‌ల యొక్క అనేకానేక తప్పిదాలను, క్షుణ్ణంగా తెలిపే గ్రంథం ఒక కమ్యూనిస్ట్ చేత్తో వ్రాయబడింది. ఆ మహనీయుడు దివంగత కామ్రేడ్ మోహిత్‌సేన్. ఆ పుస్తకం పేరు 'ఎ ట్రావెలర్ అండ్ ది రోడ్'. మోహిత్‌సేన్ చైనా కమ్యూనిస్టులకు పాఠశాల నిర్వహించిన దిట్ట. చంద్ర రాజేశ్వరరావుగారికి ఒకప్పుడు అతి సన్నిహిత శిష్యుడు. కమ్యూనిస్ట్‌లు నిజం చెప్పలేరు. అందులో మంచివారు అబద్ధాలను ప్రకటించరు అంటానికి మోహిత్‌సేన్‌గారు ఇలా బయల్పరిచారు. ఒకసారి, రాజేశ్వరరావుగారిని మీరు ఆత్మకథని ఎందుకు వ్రాయరు అని అడిగారట. రాజేశ్వరరావు గారి జవాబు: "నేను నిజాన్ని చెప్పలేను. అబద్ధం చెప్పడం నాకు ఇష్టం లేదు." ఈ మాటల్లో సచ్ఛీలుడైన ఒక కమ్యూనిస్ట్ వ్యక్తి ఎటువంటి







అంతర్మథనంలో పడుతాడో తెలుస్తోంది. సామ్రాజ్యవాదాన్ని, దోపిడీని ఎవరైనా ఎక్కడ ఉన్నా ఖండించవలసిందే, బయటపెట్టవలసిందే కాని తమ నిరంకుశపాలనను, సామ్రాజ్య వలస దేశపాలనను, తమ మారణహోమాన్ని చేసిన తప్పుల్ని ఏదో ఒక సాకుతో, కప్పుకుంటూ వస్తూ ఒక్క అమెరికాదేశాన్ని ఎల్లప్పుడు తెగడడం, నిజాయితీకి, సత్యాన్వేషణకూ చిహ్నాలు కావు. ఘోరమైన తప్పులు చేయడం. ఆ తప్పుడు పంథాలకోసం ప్రాణత్యాగం చేయడం; తర్వాత కొన్ని తప్పులు చేశాం అని చెబుతూనే ఇంకా తప్పులు చేస్తూ వుండడం ఇది కొందరియొక్క విశిష్టత, ప్రత్యేకత.

కొంతమందిని కొంతకాలం వంచించ వచ్చుకాని, ఆత్మను అందరినీ ఎల్లకాలం అసత్యాలతో నమ్మించగలమా? వంచించగలమా?

**విద్యనిగూఢగుప్తమగు విత్తము రూపము పురుషాళికిన్**
**విద్యయశస్సు భోగకరి విద్యగురుండు విదేశబంధుడున్**
**విద్య విశిష్టదైవతము విద్యకు సాటి ధనంబు లేదిలన్**
**విద్య నృపాలపూజితము విద్య నెరుంగని వాడు మర్త్యుడే**

భా॥ మనిషికి విద్య ఎవరికి కన్పించకుండా దాగి ఉన్నధనం. అది కీర్తిని, సుఖాన్నిస్తుంది. గురువులాగ ఆలోచన లందిస్తుంది. వేరే ప్రాంతానికి వెళ్ళినప్పుడు చుట్టం వలె ఆదుకుంటుంది. విద్య పవిత్రమైన, విశిష్టమైన దేముడివంటిది. విద్యతో సరితూచగల ధనం భూమ్మీద ఏదీ లేదు. రాజు చేత పూజింపబడేది. అవసరానికి ఆదుకునేది ఆలాంటి విద్యను నేర్చుకోని వాడు మనుష్యుడేనా?

# 15. భారతీయ సంస్కృతి శాశ్వత సజీవత్వం - మహా భారతం

మానవ చరిత్రలో మహోజ్వలమయిన ఈజిప్టు, గ్రీసు, పర్షియా, రోమ్, మాయా ఇంకా, ఆజ్టెక్ మాయా నాగరికతలు, సంస్కృతులూ చరిత్ర పుటల్లో తప్ప, సజీవంగా ఎక్కడా కూడా లేవు. ఒక్క భారతీయ నాగరికత, సంస్కృతి, సాహిత్యం, విశ్వాసాలు, జీవనశైలి, అది తెలియని కాలం నుండి, సహస్రాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా భారతదేశంలో, భారతీయుల్లో, వారి భాషల్లో సజీవంగా ఉంటున్నయ్. దీనికి కారణం , భగవద్గీతలోనే మరోసందర్భంలో చెప్పబడి యుంది.

"నాసతో విద్యతే భావో నాభావోవిద్యతే సతః" అసత్యానికి అస్తిత్వముండదు. సత్యమనేది అస్తిత్వం లేకుండా ఉండదు. భారతీయ తత్వము – దాన్నే మనం సనాతన ధర్మం, హైందవ ధర్మం, భారతీయత, హిందూ సంస్కృతి, ఆర్యం, వేదాంతికం, హిందుత్వం అనవచ్చు. ఇది సత్యము. అందుకే మనదేశం, మన ప్రజలూ, మన సనాతన ధర్మం ఎన్ని దండయాత్రలకు, దమన పాలనలకు, అమానుష పీడనలకు గురి అయినా ఏదో కొంత, ఎక్కడో లుప్తమయంది. కాని భరతఖండంలో, భారత ప్రభావితమైన ఇండోనేషియా, థాయిలాడ్ వంటి దేశాల్లో కూడా అవిచ్ఛిన్నంగా సజీవంగా యుంది. మీదు మిక్కిలి పాశ్చాత్య భావదాస్యానికి దూరంగా ఉన్న సాధారణ ప్రజల్లోనూ, నానా నాగరికతలనూ, సంస్కృతులనూ, సిద్ధాంతాలనూ, దర్శనాలనూ వివేకంతో పోషించగలిగిన మేధావుల్లోనూ సనాతన ధర్మం యొక్క దృష్టత తగ్గకుండా, గౌరవంతో ఉంటోంది. వర్ధిల్లుతున్న / పెరుగుతున్న భారతీయ సంస్కృతి యొక్క సజీవత్వానికి ప్రబల కారణం మనసాహిత్యం. ప్రపంచం యొక్క ఉత్పత్తి, స్థితి లయ హేతువులు, దైవమానవ నిర్ద్వంద్వత్వం, (అహంబ్రహ్మాస్మి) లోకసంగ్రహం, వివిధాశ్రమాల్లో (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస) ప్రతివ్యక్తి యొక్క విధులు, జీవన ప్రస్థానంలో, ఏ సందర్భాల్లో, ఏ సంకటాల్లో, ఏ ధర్మాన్ననుసరించాలో, మానవత్వం, వ్యక్తిత్వం ఎలా పరిణతి చెందుతాయో, పౌరాణిక







ఐతిహాస గాథల్లో మన సాహిత్యం విశదీకరిస్తోంది. అటువంటి సాహిత్య కృతుల్లో మహాభారతం సాటిలేనిది. వేదోపనిషత్తులు మహా పండితులకు మాత్రమే అర్థం కావచ్చు. కాని అందులోని నీతి, నియమ, ధర్మాలను అందరికీ అర్థమయేలా, ప్రతి ఒక్కరూ తన జీవితంలో సందర్శిస్తున్న, చవిచూస్తున్న అనుభవాలనూ, సమస్యలనూ, పురాణేతిహాసాల్లోని వ్యక్తులు ఏ విధంగా ఎదుర్కొన్నారో తెలియజేస్తున్నవి మనసాహిత్య కృతులు. వీటిలో ప్రజాబాహుళ్యాన్ని ఆకట్టుకున్నవి, ప్రామాణికంగా చూడబడుచున్నవి రామాయణ మహాభారతాలు.

రామాయణంలో మంచి చెడులు నిర్ద్వంద్వంగా కనిపిస్తాయి. ప్రతి వ్యక్తిలోనూ సంశయానికి తావు చాలా తక్కువ. రామునిలో సద్గుణం తప్ప దుర్గుణం కనిపించదు. అలాగే సీత, తదితర వ్యక్తులను గురించి సంశయానికి ఆస్కారం లేని అంచనా మనం సునాయాసంగా వేసుకోవచ్చు. కాని మహాభారతంలో అలా కాదు.

ప్రతివ్యక్తిలోనూ సత్వరజోగుణాలు ఎల్లవేళలా, ఒకే సమయంలో ఉంటున్నయ్. కాని ఇవి ఏ నిష్పత్తిలో ఉన్నయ్? సత్పురుషులు చదువు ద్వారా, బుద్ధిమత్తతను, వివేకమునూ, సాధన ద్వారా ఇంద్రియ నిగ్రహాలనూ, నిర్ణీత సమయంలో కావలసిన ఉదాహరణీయ వ్యక్తుల ప్రవర్తనా స్ఫురణనూ నేర్చుకుంటారు. దీనివల్ల సత్వగుణాన్ని వృద్ధి చేసుకోవడం, రజోగుణాన్ని అదుపులో ఉంచడం, తమోగుణాన్ని త్యజించడం జరుగుతుంది. సమకాలిక జీవితంలో వివిధ వ్యక్తులు ఎలా, ఎందుకు ప్రవర్తిస్తున్నారో, ఎలా ప్రవర్తించాలో, మహాభారత గాథల్ని చదివి విశ్లేషించుకుంటే, మనకు అర్థమవుతుంది. మనం చూస్తున్న ప్రతిరకమైన వ్యక్తులున్నారు మహాభారతంలో. ఆ ప్రవర్తన యొక్క ఔచిత్యానౌచిత్యాలనూ, తత్పర్యవసానమును భారతగాథలు మనకు తెలియ జేస్తున్నాయి. అదే మహాభారతం యొక్క విశిష్టత. ఇది తెలిపేందుకే నన్నయ గారు వ్రాశారు.

ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మ విధులు వేదాంత మనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని
కవివృషభులు మహా కావ్యమనియు
లాక్షిణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికులితిహాసమనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్ఛ
యంబని మహిఁగొని యాడు చుండ
వివిధ వేద తత్వవేది వేదవ్యాసుఁ
డాది ముని పరాశరాత్మ జుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరఁగుచుండ జేసె భారతంబు ॥

సమస్త శాస్త్రాంశాలనూ, నిశ్శేష నీతి నియమాలనూ, సర్వ కావ్య గుణ ప్రకటననూ, అపారైతిహాసిక వృత్తాంతాలనూ, బహుపురాణ గాథా సంకలనముంగనూ అనేక లక్ష్య సంపద కలిగినదిగనూ, మహాభారతాన్ని వ్యాసమహర్షి సంస్కృతంలో వ్రాశారు. ఆ మాతృకననుసరించి దాదాపు ప్రతి భారతీయ భాషలో, మహాభారతాన్ని మన కవులు వ్రాశారు. వారు పండితులేకారు. కవులేకారు. దైవభక్తి కలిగినవారు, తాత్వికులు, సామాన్యులకు కూడా అర్థమయే రీతిలో ధర్మ మీమాంస, నిర్ధారణ చేసిచూపిన చతురత కలవారు. అందుకే భారతదేశంలో తరతరాలుగా, వివిధ ప్రాంతపు జనులు తమ భాష ద్వారా, పఠనం, శ్రవణం, మననం వల్ల భారతకథా పరిచితులే గారు, ధర్మవర్తులుగా, ధర్మనిర్ణయ శక్తివంతులుగా ఉండగలుగుతున్నారు. ఇంత విలువ గలిగింది కనుకనే నన్నయగారన్నారు, అమితాఖ్యానక శాఖలం బొలిచి వేదార్థా మలచ్ఛాయమై సుమహావర్గ చతుష్క పుష్పవితతిన్ శోభిల్లి కృష్ణార్జునోత్తమనానాగుణ కీర్త నార్థ ఫలమై ద్వైపాయనోద్యానజాత మహాభారత పారిజాతామమరున్ ధాత్రీ సురప్రార్థ్యమై







ఎన్నో ఆఖ్యానాలు, కథలూ, గాథలు అన్నీ కలిసి నాల్గు వేదాల్లో ఉన్న జ్ఞానాన్నంతటినీ, పండిత పామరులకూ అవగతం అయే రీతిలో, కృష్ణార్జునుల మహత్కార్యాల ద్వారా విశేషించి భగవద్గీత ద్వారా, తరతరాల నుండి మహాభారతం మనకు బోధిస్తోంది. ప్రస్తుతం మనం సమాజంలో చూస్తున్న అమానుష, నీతిరహిత ప్రవర్తనలు భారతకాలంలో విశేషించి పాలకుల్లో కూడా ఉన్నవి. కొన్ని ఉదంతాలను పరికిస్తే మనకు ఆశ్చర్యం కలుగక యుండదు.

నేటి రాజకీయాల్లో ప్రలోభాలకు లోనై ఎందరో ప్రజా "ప్రతినిధులు" పార్టీ ఫిరాయింపుదార్లుగా అవుతున్నారు. శల్యుడు ధర్మాతులయిన మేనల్లుళ్ళు పాండవుల పక్షాన యుద్ధానికి వస్తున్నాడు కురుక్షేత్రం వైపు. ఆయనకు మద్యం అంటే ప్రీతి, భోజనాలన్నా, విలాసాలన్నా ఎక్కువ మక్కువ. ఈ గుణాన్నెఱిగి సుయోధనుడు మార్గ పర్యంతమూ అన్ని సదుపాయాలనూ శల్యునికి చేసిందెవరనేది తెలియపరచకుండా సమకూర్చాడు. పరమ సంతృప్తిని పొందిన శల్యుడు, ఇంతటి ఉపచార కర్తకు అడిగిన వరమిస్తానన్నాడు. దుర్యోధనుడు శల్యుణ్ణి తన పక్షాన పోరాడమన్నాడు. కర్ణునికి, కృష్ణ తుల్యమయినా సారథిగా యండమని కోరాడు. ఈ కాలంలో డబ్బుకో, పదవులకో అమ్ముడుపోయే డిఫెక్టార్స్, పార్టీ ఫిరాయింపుదార్లను, మనం శల్యునిలో చూడమా? అటువంటి ఫిరాయింపుదార్లు ముందే విధంగా ప్రవర్తిస్తారో అనేది శల్య సారథ్యం అనే పదాన్ని దేనికి పర్యాయంగా వాడతామో మనందరికీ తెలుసు. వివేక భ్రష్ట సంపాతాలెలా యుంటాయో శల్య వృత్తాంతం ద్వారా తెలుస్తోంది.

విగ్రహవాన్ ధర్మః అన్న శ్రీరాముని తర్వాత, అంతధర్మమూర్తి అని యుధిష్టిరుణ్ణి కొనియాడుతాం. అటువంటి ధర్మరాజు సప్తవ్యవసనాల్లో ఒకటియైన జూదం ఆడటం, అందులో అగ్ని సాక్షిగా పెండ్లాడిన ధర్మపత్నిని ఫణంగా పెట్టడం, అశ్వత్థామ హతః .... కుంజరః అనే సత్య సందిగ్ధ వాక్యంతో గురుహత్యకు దారితీయడం, ఇంత మాత్రాన ధర్మరాజును మనం గర్హించగలమా! ఆయన ధర్మ ప్రవర్తనకూ, నియమబద్ధతకూ, అనసూయతకు, యుద్ధ వ్యతిరేకతకూ,

గురువృద్ధులయందు గల గౌరవానికి, ఎవరికీ సంశయం లేదు. కాని కొన్ని సంక్లిష్ట పరిస్థితుల్లో నిర్ద్వంద్వమైన నీతిని నిలపడం మానవ మాత్రులకు సాధ్యం కాదని విశదమవుతోంది.

కర్ణుణ్ణి దుర్మార్గుడుగాని లేక దానశూర వీరోదాత్త పురుషునిగా అంచనా వేద్దామా? ధర్మాధర్మనిర్ధారణ చేసికోలేని పామరుడా? స్నేహం కృతజ్ఞత లేని సర్వోత్కృష్ట ధర్మాలా? దుర్యోధనుడు జ్ఞాతులకు చేస్తున్న అన్యాయం, చూపుతున్న అసూయ అసహనాలు, ద్రౌపదికి చేసిన అవమానంలోని అమానుషత్వం కర్ణునకు తెలియవా? కవచ కుండలాలు దానం చేయడం వల్ల, అర్జునుని చంపగలడనే సుయోధునునికి తనయందున్న విశ్వాసానికి అఘాతం కలిగించలేదా? కుంతికిచ్చిన వరాన్ని నిల్పుకుంటానికి, చేతిలో చిక్కిన ధర్మ, భీమ, నకుల, సహదేవులను చంపకుండా వదిలివేయడం తనను నమ్ముకున్న సుయోధనునకు అన్యాయం చేయడం గాదా? నీకు పట్టాభిషేకం చేయిస్తా, పాండవులు, ద్రౌపదేయులు, యాదవులు నిన్ను కొలుస్తారు. నీవు రాధేయుడవు గావు, సూర్య నందనా! కౌరవులను త్యజించు" అన్న కృష్ణ సందేశాన్ని తిరస్కరించి, పార్టీ ఫిరాయించనివాడు అనార్యుడని అనుకోగలమా! మిత్రుని కోసం, జన్మ రహస్యం చెప్పిన తల్లి కుంతిని త్రోసిపుచ్చిన కర్ణుని ఏవిధంగా కొలవగలం?

"అమ్మా! పాండవులతో యుద్ధం చేయడానికి వెళ్తున్నాను. నీకు జయమగుగాక అని నన్ను 'దీవించు' మని కోరిన సుయోధనునితో తల్లి గాంధారి ఏమంది? పుత్ర వ్యామోహంలో ధర్మ కాంక్షను వదలని మహామహితాత్మురాలు గాంధారి. కొడుక్కు జయం కోరలా "ఏ పక్షాన ధర్మం ఉందో, ఆ పక్షం విజయాన్ని వరిస్తుంది" అంది గాంధారి. ఎంత బాధ, దుర్యోధనుని యందు ధర్మంలేదు, కనుక అతనికి విజయం రాదుకదా, పై పెచ్చు మరణం తప్పదని విచారించి, ధర్మమే జయిస్తుందని , చావబోయే పుత్రునకు భారతీయ మాత చెప్పడం ఎంత ప్రభోదకరం! జూన్ 2003, 7వ తేదీన భారత రాష్ట్రపతి డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారిని భాగ్యనగరంలో ఒకసభలో ఒక సభికుడు ప్రశ్నించాడు.







"భారతదేశంలో లంచగొండితనం విలయ తాండవం చేస్తోంది. దీన్ని ఎవ్వరు, ఏవిధంగా నిర్మూలించగలరు?" అని. భారతరత్న డా॥ కలాంగారు ఈ ఉత్తరువునిచ్చారు "అవినీతిని, లంచగొండితనాన్ని నిర్మూలించడం చట్టాలకు గాని, ప్రభుత్వాలకుగాని, రాజకీయ, మరే ఇతర నాయకులకుగాని సాధ్యం కాదు. ముగ్గురే ముగ్గురు ఈ పని చేయగలరు. ప్రథమంగా తల్లి, ద్వితీయంగా తండ్రి, తృతీయంగా గురువు. టీచర్‌కాదు, అధ్యాపకుడు కాదు, గురువు" అన్నారు. గాంధారి అంత సాధ్వి, ధర్మ మెరిగిన మాతృమూర్తి దుర్యోధనుని నీతిపరునిగా చేయలేకపోయింది. ధృతరాష్ట్రుడి అపారమైన, వివేకరహితమైన అంధప్రేమ, సాందీపని వంటి ఆర్యులయిన గురువుల ఆశ్రమంలో గాక, ఇంటికి తెచ్చుకున్న 'ట్యూషన్ మాస్టారు' ద్రోణ శిష్యరికం వల్ల, దుర్యోధనుడు ఎన్ని రాజవిద్యలు నేర్చుకున్నా, నీతిని మాత్రం నేర్చుకోలేదు. సాందీపని ఆశ్రమంలో శిష్యత్వం జేసిన కృష్ణుడు జగద్గురువుగా, శాశ్వత ధర్మగోప్తగా, ఆచంద్రతారార్కం నిలుస్తున్నాడు, సంపదలున్నవి గదా, రాజులం కదా అని విద్యాశ్రమానికి వెళ్ళకుండా, భోగభాగ్య విలాసాలున్న రాజప్రాసాదాల్లోనే ట్యూషన్ మాస్టార్ను పెట్టుకుని చదువుకున్న కురు, పాండవులేమయ్యారు. దాయాదద్వేషం, ధర్మనిరపేక్షత, కితవ వ్యసనంల్లో చిక్కుకుని, కుత్తికలు కోసికొని కురుభూమిని మరుభూమిగా మార్చారు. నీతిలేని చదువులూ, శక్తి సామర్థ్యాలూ ఎల్లప్పుడూ ఒకే పరిణామానికి దారితీస్తుందని చెబుతోంది మహాభారతం.

ద్రౌపది ఎటువంటి వ్యక్తి. అయోనిజ, యాజ్ఞసేని, కారణజన్మురాలు అయి కూడా ఎటువంటి జీవితం? అత్తగారి మాట మన్నించి పంచ పాండవులను భర్తలుగా స్వీకరించి ఒకేరీతిగా సంసారం చేసింది. రాజసూయ యజ్ఞానికి విశిష్ట అతిథిగా వచ్చిన సుయోధనుడు మయ నిర్మిత ప్రాసాదంలో వేసిన తప్పటడుగులు పడిన భంగపాటును చూచి అనాలోచితంగా అనరాని మాటలు బిగ్గరగా అంది. "తలపులకు రాజులం మాటలకు బానిసలం" అన్న విజ్ఞతను మరచింది. నిండుసభలో తన వస్త్రాపహరణానికామాటలు, మూలకారణం

అయ్యాయి. జూదంలో ఓడిపోయిన భర్తలతో అరణ్యవాసం, అజ్ఞాతవాసం తను కూడా చేయాల్సివచ్చింది. అసూర్యంపశ్యకు ఎటువంటి అవస్త. కృష్ణునితో తన స్థితిని చెప్పుకుంటూ అంటుంది.

వరమునబుట్టితిన్ భరతవంశము జొచ్చితినందు పాండుభూ
వరునకు కోడలైతి జనవంద్యులఁబొందితి నీతి విక్రమ
స్థిరులగు పుత్రులం బడసితిన్ సహజన్ముల ప్రాపుగాంచితిన్
సరసిజనాభ ఇన్నిలు బ్రశస్తికి నెక్కిన దాననింతకున్ ॥

అంత ప్రశస్తిని పొందినప్పటికీ, రంజన చెడి అరిభంజనులైన పాండవ భర్తలతో బాటు, దాసిగా విరటుకొల్వుపాలయింది. దాసత్వంలో కూడా శాంతి లేదు. నీచుడైన కీచకుని కామేచ్ఛకు గురి అయింది. అధైర్య పడలా, కీచకుణ్ణి ఎంత భయానకంగా వారించిందో, తిక్కనగారి కవిత్వంలోనే చూడగలం.

దుర్వారోద్యమ బాహు విక్రమరసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతి వీరనిర్మథన విద్యా పారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతులేవురిపునిను దోర్లీలన్ వెసంగిట్టిగం
ధర్వుల్ మానము బ్రాణముంగొనుట తథ్యం బిమ్మెయిన్ ॥

ద్రౌపది యొక్క ప్రతీకారేచ్ఛ లేకపోయినట్లయితే కురుక్షేత్ర యుద్ధం జరిగేది కాదేమో! Helen of Troy, with a "face that launched a thousand ships" was the cause of the war between carthage and Troy. సీత లేక పోయినట్లుయితే రామ రావణ యుద్ధం జరిగేది కాదు. ధర్మాధర్మ నిర్ణయ సందర్భంలో, దుష్ట సంహార సమరంలో స్త్రీ యొక్క నిర్ణాయక పాత్ర భారతేతిహాసాల్లో ప్రస్ఫుటమౌతుంది. గాంధారి యుద్ధాన్ని ఆపటానికి పుత్రులకు హితవు చెప్పితే, ద్రౌపది భర్తలను రణానికి ప్రేరేపించింది. మాతృత్వానికి రాణిత్వానికి (పట్టమాహిషిత్వానికి) ఎంత అంతరం ఉంది.







భీష్ముని యొక్క చరిత్ర, పాత్ర ఎనలేనిది. కురురాజ్యాన్ని స్థిరపరిచింది, విస్తరించింది, రక్షించింది భీష్ముడు. తను ఆజ్ఞాపించినట్లయితే దుర్యోధనుడు, పాండవులకు సగం రాజ్యం ఇవ్వకుండా ఉండగలిగేవాడు కాదు. ధర్మం ఎవరి పక్షాన ఉందో విస్పష్టంగా తెలిసిన వ్యక్తి భీష్ముడు అయినా ఎందుకుమిన్నకున్నాడు – ద్రౌపదీ వస్త్రాపహరణ జరిగినప్పుడు, మాయా దురోదరం కళ్లారా చూచినప్పుడు, రాయభారం చేసి సంధి పొసగింపవచ్చిన శౌరిని అడ్డ దిడ్డంబులాడి అవమానిస్తున్నప్పుడు? “ధర్మం మా తరపున ఉందని తెలిసికూడా, తాతగారూ! కౌరవ పక్షాన ఎందుకు యుద్ధం చేస్తున్నారు” అని అడిగిన యుధిష్ఠిరునకు ఏం జవాబు ఇచ్చాడు “విత్తేన బద్ధో అస్మికౌరవైః” “కౌరవుల యొక్క ఉప్పు, కారం తింటున్నాను కనుక వారికే బద్ధుడనై యున్నాను అని భీష్ముడంతటి బుద్ధిమంతుడన్నాడు.

శాంతి పర్వంలో ధర్మాన్ని, రాజనీతినీ కృష్ణ సమక్షంలో పాండవులకే కాదు, సమస్త లోకానికీ బోధించిన భీష్ముడు పుణ్యపురుషుడా లేక విత్తబద్ధుడై ధర్మగ్లాని చూస్తూ ఊరుకున్న సామాన్యుడా?

ఇక కృష్ణ పరమాత్ముని గురించి ఏ అంచనా వేయగలము. శాశ్వత ధర్మగోప్త, జగద్గురు, దుష్కృతాంతకుడు, సాధుజన రక్షకుడు అని అందరం శ్లాఘిస్తున్నాము కదా. ద్రోణవధ కోసం ధర్మరాజును అసత్యం పలకమనడం, అర్జునుని కర్ణ నాగాస్త్రం నుండి తప్పించడం, నిరస్త్రుడైన కర్ణున్ని నిస్సంకోచంగా చంపేయమని అర్జునునకు చెప్పడం, దుర్యోధనుణ్ణి ఎక్కడ కొడితే చస్తాడో అని భీమునకు సంజ్ఞార్థముగా చెప్పడం, ఇవి ధర్మ విరుద్ధం కాదా అని మనకనిపించవచ్చు. కాని ధర్మాన్ని నిలబెట్టడానికి కొన్ని ధర్మ విరుద్ధంగా కనిపించే పనులు చేయవలసి రావచ్చుననేది మనం నేర్చుకుంటాం భారతం నుండి. ఎవరికి వారే స్వార్థం కోసం అధర్మాచరణం చేసి, తమను సమర్థించుకోవడానికి, భీష్మ, యుధిష్ఠిర, కృష్ణాదుల ధర్మచ్యుతిని ఉదాహరించవచ్చా? ఎన్నో ప్రశ్నలు. నిత్యజీవితంలో ఈ సమస్యలను ఎదుర్కొంటాం. అన్ని విషయాలనూ సమదృష్టితో ఆలోచిస్తే

ఉచితధర్మం మనకు కనిపిస్తుంది.

మదర్ థెరిసా ఎంతో కరుణతో, ఎంత మందో అభాగ్యులకూ, అనాధలకూ మంచి చేసిందని మనలను నమ్మమంటారు. కాని ఆవిడ మోసగాళ్ళ నుండి, నేరస్తుల నుండి క్షుద్ర మాదక పదార్థ వ్యాపారులనుండి కోట్లాది రూపాయలు విరాళంగా తీసుకున్నదనీ శిక్షలు పొందుతున్న అటువంటి నేరగాళ్లను దయతో చూడమని అమెరికాలోని నాయ్యమూర్తులకు స్వయంగా పత్రం వ్రాసిందని శ్రీఅరూప్ ఛటర్జీగారు ఎంతో వ్యయ ప్రయాసలతో రీసెర్చ్ చేసి సాక్ష్యాధారాలతో వ్రాసిన పుస్తకం 'ఫైనల్ వర్‌డిక్ట్" చదివిన వారికి మాత్రమే తెలుసు. థెరిసా వంటి వారుంటారని, వారి దానాలు గర్హనీయమని భారతం చెబుతోంది.

అన్యాయార్జితమునఁ జేయంబూనుదానంబు మూ
ర్ఖన్యాయంబది, దానఁ జేసి ఫల పాకం బేమియున్ లేదు యు
క్త న్యాయార్జిత మించుకంతయయినం గాలంబు దేశంబు స
మ్మాన్యం బై తగఁ బాత్రయోగమున సౌమ్యంబై ఫలించుంతుదిన్

ఆకాలమీకాల మేకాల మనకుండా, ఎల్లప్పుడూ పాటించవలసిన నీతులూ, ఆచరించవలసిన ప్రవర్తనలూ కొల్లలుగా తెలుపబడ్డాయి. ఉదాహరణకు:

ఎట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను
బెద్ద కాలమునికి తద్ద తగదు
పతులకడన యునికి సతులకు ధర్మువు
సతులకేడు గడయుఁ బతుల చూవె ॥

ఈ కాలంలో ఉద్యోగ రీత్యా భార్యా భర్తలు వేర్వేరు పట్టణాల్లో, దేశాల్లో విడిగా ఉండవలసి వస్తోంది. అందువల్ల జరుగుతున్న అనర్థాలను చూస్తున్నాం.

నుతజల పూరి తంబులగు నూతులు నూఱిటి కంటె సూనృత
వ్రత యొక బావిమేలు, మఱి బావులు నూరిటికంటె నొక్క







సత్క్రతువదిమేలు, తత్క్రతుశతంబునకంటె సుతుండుమేలు, త
త్సుతుశతకంబు కంటెనొక సూనృత వాక్యము మేలు సూడగన్ ॥

ఎప్పుడూ కూడా సత్యం పలకడం ఎన్నో మంచి పనులకన్నా మేలని చెబుతుంది భారతం. కాని భాగవతంలో

వారి జాక్షులందు వైవాహికములందుఁ
బ్రాణ విత్తమాన భంగమందుఁ
జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు
బొంకవచ్చునఘము పొందదధిప

అని శుక్రాచార్యుల వారు బలి చక్రవర్తికి హితవు చెప్పాడు. ఇన్ని సందర్భాల్లో అబద్ధం చెబితే పాపం రాదట. నిజమే చెప్పవలసిన సందర్భాలింకేవి మిగిలాయని అనుమానం మనకు రాదా?

కులము గలవాడు శౌర్యము
గలవాడును నధిక సేనగల వాడును భూ
తలమున రాజను నామము
విలసిల్లగ దాల్చు మూడు విధముల పేర్మిన్ ॥

ఎంత సత్యముంది ఈ పద్యంలో, ఈ కాలంలో కులాన్ని బట్టే గదా ఎం.ఎల్.ఏ., ఎం.పీ, ముఖ్యమంత్రి, ఉపకులపతి, న్యాయమూర్తి అవడం, అధిక సైనిక బలమున్న అమెరికాకే గదా ప్రపంచాధిపత్యం, శౌర్యం కలిగి యుండటం మూలానే గదా, కేవలం 60 లక్షల జనాభా యున్న ఇజ్రాయిలు, పదికోట్లకు పైగా జనాభా యున్న అరబ్ దేశాలపై, పైచేయిని సంపాదించగలుగుతోంది?

ఆవులింత తుమ్ము, హాసంబు నిష్ఠీవ
నంబు గుప్తవర్తనములు గాగ
జలుపవలదు నృపతిగొలువున్న యెడల బా

హిరములైనc గెలనికెగ్గులగుట ॥

ప్రతి వ్యక్తి ఏ పనులు పదిమంది చూస్తున్నప్పుడు, విశేషించి పెద్దవారి ముందు చేయకూడదో చెప్పబడింది. వ్యక్తిత్వ వికాసం అభ్యసించే వారికిది ఒక పాఠం.

ఈ విధంగా భారతంలో ఎన్నో విషయాలను గురించి క్షుణ్ణంగా మనం కథల ద్వారా, మునుల, వీరుల, రాజుల, ప్రజల ప్రవర్తనల ద్వారా, సదసద్వివేక చతురతను నేర్చుకొంటూ వస్తున్నాం. అందుచేతనే భారతీయ సంస్కృతి, జీవనసరళి, జీవితపరమార్థాలు అవిచ్ఛిన్నంగా సజీవంగా ఉంటున్నయ్. తెలుగువారల పుణ్యం నన్నయ తిక్కన ఎఱ్ఱనార్యుల వంటి పండితులు, దైవభక్తులు వ్యాస భారతాన్ననుసరించి, తెలుగులో పంచమ వేదమనే మహాభారతాన్ని మనకు ప్రసాదించారు. తెలుగునాట ఆబాలగోపాలం మహాభారత గాథల్ని, అందులోని వీరులనూ తెలుసుకుంటూ ఎంతో స్ఫూర్తిని పొందుతున్నారు.

ప్రతి వ్యక్తిలో, అనుదినం మహాభారతంలోని పాత్రలు ఎదుర్కొన్న సమస్యలూ, సంఘటనలూ, అనుభవాలు పునరావృతం అవుతున్నయ్. మహాభారత పఠనం వల్ల, అర్థం చేసుకోవడం వల్ల, విశ్లేషించడం వల్ల, విమర్శనాత్మకంగా తన యొక్క పరిస్థితిని అవలోకించడం వల్ల, మనం కూడా ఒక కురుక్షేత్రంలా ధర్మరక్షణకూ, పాలనకూ పాల్పడవచ్చు. పండితులు తమ వ్యాసాల్లో, వ్యాఖ్యానం ద్వారా భారతంలో యున్న గుహ్యాత్ గుహ్యతరమైన జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తారు. మహాభారతం ఎంతో జనరంజకం ఎంత ఆమోద్యమో అని తెలుసుకోవాలంటే దూరదర్శన్ వారు మహాభారత సీరియల్‌ను ప్రసారం చేసినప్పుడు భారతదేశం అంతటా ప్రజలు తమ పనులు మానేసి , టీవి సెట్ ముందు కూర్చునే వారు హిందువులే కాదు, తురకలూ, క్రిస్టియన్లు కూడా. ప్రతియొక్కరూ తమ అనుభూతిని మహాభారత పాత్రల్లో, ఘట్టాల్లో చూడగలిగారు. మన ప్రతిఒక్కర్లో కురుక్షేత్ర సంగ్రామం







జరుగుతోంది. అందుకే మహాభారతం, కేవలం ధాత్రీసుర ప్రార్థ్యమేగాక, సామాన్యులకు కూడా ప్రార్థ్యమే, పాఠ్యమే.

భారతీయ ధార్మిక విజ్ఞాన పరిషత్తు, శ్రీబోల్లేపల్లి సత్యనారాయణ గారి సంధానకత్వంలో 'మహాభారత వైజయంతి' నామ గ్రంథంలో మహాభారతంలోని విషయాలపై, వ్యక్తులపై, పండితులు, మేధావులు వ్రాసిన వ్యాసాలను సంకలనం చేసి తెలుగు చదువురుల కెంతో సేవ చేస్తోంది. ఈమహత్కార్యంలో భాగస్వాములయిన శ్రీ లంకాసూర్యనారాయణ గారికి తదితర పుణ్య పురుషులకు స్త్రీలకూ హార్దికాభినందనలు, అభినందనములూ సమర్పిస్తున్నాను.

**ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందు తాల్మి యున్**
**భూప సభాంతరాళమున పుష్కల వాక్చతురత్వ మాజీలూ**
**హాపటుశక్తియున్ యశమునందనురక్తియు విద్యయందు వాం**
**ఛా పరివృద్ధియున్ ప్రకృతి సిద్ధ గుణంబులు సజ్జనాళికిన్.**

భా॥ ఆపదవచ్చినప్పుడు ధైర్యాన్ని, ఐశ్వర్యము వచ్చినప్పుడు ఓర్పును, సభయందు చక్కటి వాక్చాతుర్యాన్ని, యుద్ధమందు శౌర్యాన్ని చూపడం, కీర్తి యందాసక్తి కలిగియుండడం, విద్యాభ్యాసం చేయాలనే నిరంతర ఆలోచన, ఇవి సజ్జనులకు స్వభావగుణాలు.

# 16. ఎన్నికలా? హింస?

ఆర్యా,

పౌరహక్కుల సంఘం నాయకులు శ్రీ కన్నాభిరామన్ సోమవారం 29.03.2004న "తెలంగాణ నుండి తెలంగాణా దాక" అనే పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతూ ఎన్నికల ద్వారా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం రాదనీ, 1968లో జరిగిన (హింసాయుత) ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, నక్సల్ ఉద్యమాలూ మహత్తరమైనవనీ ఉద్భోదించారు. అంటే ఇప్పుడు హింసారహితంగా జరుగుతున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమం నిరర్థకమనీ, ఎన్నికల ద్వారా ఏదీ సాధింపబడదనీ, వీరు పరోక్షంగా హింసను, సాయుధ పోరాటాన్నీ ప్రజలు అవలంబించాలని ప్రచారం చేస్తున్నారు. ఇది అసలైన, సిసలైన కమ్యూనిస్ట్ సిద్ధాంతం, విశ్వాసమూ, పౌరహక్కుల సంఘం పేరిట ప్రజాస్వామ్యంలోని, వాక్ స్వాతంత్ర్యాన్నీ ఇతర హక్కులనూ ఉపయోగించుకుంటూ, ప్రజాస్వామ్యాన్ని అంతమొందించి కమ్యూనిస్ట్ నియంతృత్వ ప్రభుత్వ స్థాపనకు సాయుధ పోరాటాలను జరుపుతున్న పీపుల్స్ వార్ గ్రూప్‌కు, చేదోడు వాదోడుగా ఎబవ్‌గ్రౌండ్ పనిచేస్తున్న కమ్యూనిస్ట్ మేధావుల నాయకుడు శ్రీ కన్నభిరాన్ అని అర్థమవుతుంది. ఇటువంటి వారిని పోటా క్రింద ఎందుకు శిక్షించరు?

అల్పుడెపుడు పల్కునాడంబరముగాను
సజ్జనుండుపల్కుచల్లగాను
కంచుమ్రోగునట్లు కనకంబుమ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ







# 17. కచ-దేవయాని-శుక్ర గాథను గురించి దురవగాహన

**'సౌందర్యం** ఎక్కడ వుందీ అంటే చూచేవాని కంటి'లో ఉన్నదని ఒకలోకోక్తి. కచుని, శుక్రాచార్యులను గురించి కొంతమంది మేధావులు చేస్తున్న వ్యాఖ్యానాలు పైలోకోక్తిని గుర్తు చేస్తున్నాయ్. ఒక గాథ ఎప్పుడు వ్రాయబడింది; ఏ సందర్భంలో; ఏ సందేశాన్ని ఇవ్వడానికి, అని మనం తెలుసుకోవాలి! ఏనాడో వ్రాసింది, ఇప్పుడెందుకు చదువుతున్నాం? దాన్నుంచీ ఏ గుణపాఠమైనా నేర్చుకోగలమా అని ప్రశ్నించుకోవాలి. రామాయణాన్నే కాదు; చరిత్రను కూడా పదేపదే, ఎంతోమంది ఎందుకు వ్రాస్తున్నారు? ఏనాటిదో అయిన కథా వస్తువు, చారిత్రక ఘటనల నుండి, ప్రస్తుత కాలంలో మనం ఎదుర్కొంటున్న సమస్యలకు ఏ పరిష్కారము నయినా మనం కనుక్కోవచ్చా అని ఆలోచించాలి. ఆ కథల వల్ల మనకు స్ఫూర్తి, జ్ఞానోదయం కలుగుతుంది. ఇలా ఆలోచించినట్లయితే కచుని వృత్తాంతం మన విద్యార్థులకు, యువతకు ఎంతో మేలు చేస్తుంది.

మనదేశంలో ఐ.ఐ.టీల్లో, ఐ.ఐ.యమ్‌లలో చదివి కొందరూ, స్నాతకోత్తర విద్యకై మరికొందరూ అమెరికా వంటి పాశ్చాత్య దేశాలకు వెళ్లి మనదేశాన్ని, బంధుమిత్రుల, దేశవాసుల హితాన్ని మరచి, ఆ విద్యాధికులు పాశ్చాత్య దేశాల్లోనే అనేక ప్రలోభాలకు, భోగలాలసకు వ్యామోహపడి అక్కడే స్థిరపడిపోతున్నారు; ఈ మేథోవలస గర్హనీయమని మనం విమర్శిస్తున్నాం. వారిలో దేశప్రేమ, భక్తిలేవని వాపోతున్నాం. ఈ సందర్భంలో కచ-దేవయాని- శుక్రాచార్యుల కథ మన చిన్నారులకెంతో నీతీ, స్ఫూర్తిదాయకం.

దేవతలు అధికాధిక సంఖ్యలో దానవులతో జరిగే యుద్ధాల్లో చంపబడుతున్నారు. రాక్షసులూ ఎక్కువ మందే చంపబడుతున్నారు. కాని వారి ఆచార్యుడైన శుక్రాచార్యులు జీవశాస్త్ర పారంగతుడు. తన ఉత్తమోత్తమైన విద్యతో, ఇంకెక్కడా లేని పరిజ్ఞానంతో, సాంకేతిక కుశలతతో మృతులను పునర్జీవులుగా చేస్తున్నాడు. మృత సంజీవని విద్యను నేర్చుకుంటానికి, మన విద్యార్థులు స్నాతకోత్తర

విద్యకోసం, పి.హెచ్‌డి; డాక్టరేట్ల కోసం అమెరికా వెళ్లుచున్నట్లు, కచుడు బయోటెక్నాలజీలో, విశేషించి మృతసంజీవని శాస్త్రంలో అధ్యయనం కోసం, పట్టభద్రత కోసం విదేశంలో యున్న శుక్రాచార్యుల వారి విద్యాలయానికి వెళ్లాడు. అమెరికాలో మనవాళ్లు చదువుకుంటున్నప్పుడు ఖర్చుల కోసం కూలీనాలీ పనులు చేస్తున్నట్లు, కచుడు కూడా, శుక్రాచార్యుల వారికి శుశ్రూష చేస్తూ, అక్కడి అసూయాపరులైన రాక్షసులు పెట్టిన బాధలు భరిస్తూ, ఎట్టకేలకు మృతసంజీవని శాస్త్రంలో పి.హెచ్‌డి., డాక్టరేట్ తెచ్చుకున్నాడు. ఆ ప్రక్రియకు పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణుడయాడు.

దేవయాని అనే సుందరాంగి, భువనమోహిని తన్ను వివాహమాడమన్నా, "కాదు; నా తల్లిదండ్రులకు, నా మాతృభూమికి, నా దేశవాసులకు నేను ఋణపడియున్నాను. ''జననీ, జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి'' అనే మహావాక్యమందు నాకు విశ్వాసం యుంది. కనుక స్వదేశానికి వెళ్లటం, విద్యకోసం వచ్చిన ప్రయోజనాన్ని సాధించాను కనుక, నా ధర్మం". కచదేవయాని కథను ఈ విధంగా ప్రస్తుత పరిస్థితులకన్వఇస్తూ విద్యార్థులకు చెప్పినట్లయితే ఈ విధంగా మేధోవలస ఎక్కువగా జరగదు. (మనదేశంలో, ఒక పెద్ద కుటుంబంలోని కుమారుడు ఇంగ్లాండ్ చదువుకోసం వెళ్లి, పరదేశీయ వనిత వలపుల్లో చిక్కుకుని, చదువు ముగించకుండా, మతం మార్చుకుని, పేర్చుమార్చుకుని ఆ వనితను పెండ్లాడి, మార్పుల్ని దాచి, దేశానికి వచ్చి చేసిన ''మేలును'' మనం ప్రతిదినం చర్చించుకుంటున్నాం.) కచ-దేవయాని కథను ఈ విధంగా, ప్రస్తుత సమస్యా సమాధానుకూలంగా మనం ఎందుకు విద్యార్థులకు చెప్పగూడదు?

ఇక శుక్రాచార్యుడు తన్ను నమ్ముకున్న, పోషిస్తున్న రాక్షసులకు గుహ్యాత్ గుహ్యాతరమైన విద్యను, కచునికి నేర్పి, ద్రోహం చేశాడని ఒకరు వ్రాశారు. అయితే ఎంతోమంది చైనీయులు భారతీయులూ అమెరికాల్లోని విశ్వ విద్యాలయాల్లో న్యూక్లియర్ ఫిజిక్సు, బయోటెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన, ప్రయోగాలు చదవటానికి వెళ్తూంటే, అమెరికా మన విద్యార్థుల మీద ఆంక్ష విధిస్తోందా? కొన్ని సబ్జెక్టులు విదేశీయులకు నేర్పవద్దని అక్కడ







విశ్వవిద్యాలయాలకు, ఆచార్యులకూ ఆదేశాలను ఇచ్చిందా? లేదు. విద్య అనే సంపద, ఇతరులకు ఇచ్చిన కొద్దీ పెరుగుతుందని ఆర్యోక్తి; మన అందరి ప్రత్యాక్షానుభవం. శుక్రాచార్యులు ఏమీ తప్పుచేయలా. కర్ణుడు కవచకుండలాలు ఇచ్చినందుకు, దాన కర్ణుడని మనం ప్రశంసించడంలా?

కచుణ్ణి కోవర్టుగానూ, శుక్రాచార్యుణ్ణి ద్రోహిగాను విమర్శించే వారి యొక్క మనస్తత్వం విచిత్రమైంది, విపరీతమైంది. వారికొక్క చట్రం ఉంది; ఒక విశ్వాసం ఉంది. ఒక సిద్ధాంతానికి బద్దులయి ఉన్నట్లయింది. అట్టివారు నవచరిత్రలో, ఏ దేశంలోని, ఏ కాలంలోని సంఘటనలనూ, పరిణామాలనూ వారు విశ్వసించిన, మార్పులేని, వాస్తవంతో సంబంధం పోయిన చట్రంలో ఇమడ్చాలి. అందుకే ఇప్పుడు తమ వర్గాల్లో , అనుచరుల్లో తమ శతృవుల యొక్క కోవర్టులున్నట్లు, కచుడటువంటి దేవతల కోవర్టు రాక్షసుల మధ్య ఉండి వారి రహస్యాలు కొట్టేశాడని చెబుతున్నారు. తమ ఉద్యమాల్లో, పార్టీల్లో వెన్నుపోటు దానవులకు వెన్నుపోటు దారని చెబుతున్నారు. విశ్వాసానికి, సాహేతుకతకూ ఎంతో వ్యత్యాసం ఉంది.

ఏనాడో భర్తృహరి చెప్పారు :

> తివిరి ఇసుమున తైలంబుఁదీయవచ్చు
> తవిరి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు
> తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు
> చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు ॥

తెలియని మనుజుని సుఖముగ
దెలుపందగు, సుఖతరముగ తెలుపగవచ్చున్
తెలిసినవానిం; దెలిసియు
దెలియని నరుఁదెల్ప బ్రహ్మదేవుని వశమే ॥

కనుక ముగిద్దాం.

# 18. కచదేవయాని కథ

**05.04.2004**

కచదేవయాని కథకు, ప్రస్తుత దేశకాల పరిస్థితుల్లో, మన విద్యార్థులకు ఎలా అర్థం, భాష్యం చెబితే స్ఫూర్తిదాయకంగా ఉంటుందో, శ్రీ హనుమాన్ చౌదరిగారు చక్కగా వివరించారు. (ఆంధ్రజ్యోతి 05.04.04) పెద్ద నాయకమ్మన్యుల కుటుంబాల్లో ఆగర్భ శ్రీమంతులుగా పుట్టి, విదేశీ చదువులకని కేంబ్రిడ్జ్, హార్వర్డ్‌లకు వెళ్ళి, చదువు ముగించకుండా, ఏ పట్టాన్ని తెచ్చుకోకుండా విదేశీ వనితలను మోహించో లేక ప్రేమకోసమో, పలుకుబడి కోసమో, వారు పన్నిన వలలో పడి, వారిని వివాహమాడి, కేవలం సుందరాంగులను, ప్రియురాళ్లను తెచ్చుకున్న ఘనులు మనదేశంలో ఎక్కువవుతున్నారు. బాల్యంలో, కచుని యొక్క దీక్షనూ, స్వదేశాభిమానాన్ని గురించి మన పిల్లలకు చెప్పి మీరు కూడా ఉన్నతమైన విద్య కోసం అమెరికా వెళ్లండి. చక్కగా చదువుకొని, స్నాతులై, దక్షులై, ఎవరి వలలోనూ పడకుండా, ఏ ప్రలోభాలకూ లొంగకుండా మన దేశానికి తిరిగివచ్చి మన సమాజానికి, దేశానికి మేలు చేయండని తల్లి దండ్రులూ, గురువులూ బోధిస్తే ఎంత బాగుంటుంది. కచుణ్ణి "కోవర్ట్" అని, శుక్రాచార్యులు ద్రోహి అనీ, రాక్షసులు బుద్ధిమంతులనీ చెప్పేవారియందు సదసద్వివేక చతురత లేదు. మనసాహిత్యాన్ని, సంస్కృతినీ నిరసించి వర్గపోరాటాన్ని ద్వేషాన్ని, అంతః కలహాలను పెంచి, దేశంలో అరాజకతను పెంచడమే వారి లక్ష్యంగా కన్పిస్తోంది.







# 19. క్రైస్తవుల జనాభా ఎంత?

**ఏప్రిల్ 2004**

గడచిన నాలుగైదు వారాల్లో పలుమార్లు క్రైస్తవ నాయకులు, వారి చర్చి సంఘాలు, ఎన్నో విలేకరులు సమావేశాలు జరిపి, ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవుల యొక్క జనాభా 60 లక్షలకు పైగా వున్నదని, మరొకపుడు 10% పైగా వున్నదని, ప్రతి పార్టీకూడా వారికి తగిన న్యాయం కోసం 28కి పైగా అసెంబ్లీ స్థానాలు, 4 లోకసభ స్థానాలు కేటాయించాలని, లేకపోతే స్వతంత్ర్య అభ్యర్థులను రంగంలో దింపుతామని, మరికొన్ని క్రైస్తవ సంస్థలు నేరుగా నాయకురాలు సోనియా గాంధీకే వినతి పత్రాలు పంపించడం పాఠకులకు తెలిసిందే.

వారు చెపుతున్న క్రిస్టియన్ జనాభా వాస్తవానికి దూరంగా, మహాశ్చర్య జనకంగా వుంది. భారత ప్రభుత్వం యొక్క జనాభా లెక్కల ప్రకారంగా ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ జనాభా 1971లో 4.19%, 1981లో 2.68%, 1991లో 1.83%, లేకపోతే 2001లో 1.44% ఉంది. అంటే క్రిస్టియన్లు తగ్గుతున్నారు గాని పెరగడం లేదు. 2001 సంవత్సర జనాభా లెక్కలు అన్నీ అబద్ధం అయివుండాలి. సీట్లు దండుకోవడం కోసం క్రిస్టియన్ నాయకులు, వారి మత సంఘాలు, వారి మతాచార్యులు అబద్ధాలు చెప్తున్నట్లు తెలుస్తుంది. ఊళ్ళలోనూ కొల్లలుగా ఎక్కడలేని చర్చిలు వెలుస్తున్నాయి. క్రైస్తవుల జనాభా పెరగడం మూలాన ఇవి వెలిస్తే, మత మార్పిడులు చేయించి ఆ సత్యాలను ప్రభుత్వం దగ్గర నుంచి దాచి వుంచుతున్నారా? ఇలా దాయడం అనేది హిందువులలో కొన్ని కులాలకు ఉద్దేశింపబడిన రిజర్వేషన్లను, వారికి దక్కనీయకుండా క్రిస్టియన్లు కొట్టి వేయడానికి, మార్పిడులను గోప్యంగా వుంచుతున్నారా? లేక కాకి లెక్కలు చూపించి, అటు ఇతర దేశాల నుంచి మత ప్రచారం కోసం, మత మార్పిడుల కోసం డబ్బును దండుకుంటున్నారా? నిజానిజాలను తేల్చవలసిన బాధ్యత ప్రభుత్వం మీద, నాగరిక సమాజం మీద, అవినీతిపరులు కాని మేధావుల మీద వుంది. ప్రభుత్వపు లెక్కలకు, వారిస్తున్న లెక్కలకున్న అగాధాన్ని ప్రజలకు వివరించవలసిన బాధ్యత, నీతి, నియమిత ప్రకటనలిస్తున్న, విలేకరుల సమావేశాలు తరచు జరుపుతున్న క్రిస్టియన్ నాయకుల మీద, ఆమతాచార్యుల మీద ఉన్నది.

# 20. గ్రామాభ్యుదయం
## ప్రణాళికలు - ప్రజల బాధ్యతలు

28.06.2005

**భారతదేశం** గ్రామాల్లో సజీవంగా ఉందని గ్రామస్థులు దేశానికి ఆయువు పట్టు అని మహాత్మాగాంధీ గారి దగ్గర నుంచి ప్రతి రాజకీయ నాయకుడు, చాలా మంది ఆర్థిక సైద్ధాంతికులు చెబుతూ ఉంటారు. కాని, ఎల్లకాలం మన జీవితం, మన ఆర్థిక సమృద్ధి గ్రామాల మీదే ఆధారపడి ఉంటుందనుకోవడం ఒక భ్రమ. రెండు శతాబ్దాల క్రింద ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ గ్రామ జీవనం ఉండేది. వారికి వ్యవసాయమే పని. దేశంలో ప్రతి సంవత్సరం జరిగే స్థూల ఉత్పత్తిలో 80%కి తగ్గకుండా వ్యవసాయ రంగం యొక్క భాగమే. పారిశ్రామికంగా అభివృద్ధి చెంది, సంపన్న దేశాలై ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలు ఎగుమతి దిగుమతులు చేసుకుంటున్న ఈ సమయంలో అభివృద్ధి చెందిన ప్రతి దేశంలో కూడా వ్యవసాయ రంగం నుంచి వచ్చే స్థూల ఉత్పత్తి కేవలం 2%-5% మధ్యే ఉంది. తదనుగుణంగా గ్రామాల్లో నివసించే వారు కాని, వ్యవసాయ రంగంలో పనిచేసేవారు కాని, 5% మించిలేరు. భారతదేశం కూడా వచ్చే 25 సం॥లలో పాశ్చాత్య దేశాల వలె అభివృద్ధి చెందిన దేశం అవ్వడం కోసం ప్రయత్నం చేస్తోంది. పర్యవసానంగా మనదేశంలో కూడా వ్యవసాయ రంగం నుంచి వచ్చే స్థూల ఉత్పత్తి 5%కి మించదు. ఇది కలకాదు. ప్రథమ పంచవర్ష ప్రణాళిక 1951లో ప్రారంభింపబడినప్పుడు వ్యవసాయ రంగం మనదేశపు స్థూల ఉత్పత్తికి 65% పైగా సంక్రమింపజేసేది. అది తగ్గుతూ, తగ్గుతూ ప్రస్తుతం 21%కి దిగజారింది. కనుక, వచ్చే 30 సం॥ల్లో ఇది ఇంకా తగ్గి 5% అవుతుంది. 1951లో భారతదేశంలో పనిచేసే వాళ్ళల్లో 70% గ్రామసీమల్లో వ్యవసాయానికి సంబంధించిన శ్రమ చేసేవారు. ఆ శాతం ప్రస్తుతం 65%కి తగ్గింది. వ్యవసాయ రంగం 65% మంచి 21%కి క్షీణించగా వ్యవసాయ సంబంధిత శ్రామికుల మాత్రం 70% నుంచి 65%కి మాత్రమే తగ్గారు. దీనివల్ల మనం అర్థం చేసుకోవలసింది వ్యవసాయ రంగంలో అవసరానికి మించిన శ్రామికులు ఉన్నారు. ఇతర దేశాల్లో పారిశ్రామిక ప్రగతి జరుగుతుంటే తదనుగుణంగా వ్యవసాయ రంగంలో పనిచేయవలసిన, చేసేవారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. అక్కడ పని చేసేవారు చదువుకుని పారిశ్రామికోత్పత్తికి కావలసిన నైపుణ్యాన్ని సంపాదించుకుని గ్రామాలను వదిలి పరిశ్రమలు ఉన్న పట్టణాలలో స్థిరపడ్డారు. అందుకనే పట్టణవాసుల యొక్క సంఖ్య 80% నుంచి 90%కి పెరిగింది. మనదేశంలో పారిశ్రామికాభివృద్ధి జరిగినప్పటికి, గ్రామాల్లో పనిలేని వారందరికి పని కల్పించేంతగా జరుగలేదు. అంతేకాకుండా, నిరక్షరాస్యత, ఉచిత విద్యలేకపోవడం, జనాభా పెరుగుతూ ఉండటం మూలానా, మన గ్రామసీమల్లో నిరుద్యోగులు ఎక్కువయ్యారు. పర్యవసానంగా తలసరి ఆదాయం పెరగడం లేదు. ప్రస్తుతం భారతదేశంలో పట్నవాసులు 28%, 72% మంది ప్రజలు గ్రామాల్లో ఉంటున్నారు. గ్రామస్తులకు పని చాలా వరకూ వ్యవసాయానికి సంబంధించిందే.ట్రాక్టర్‌లు, హార్వెస్టర్ తదితర యంత్రాలు వ్యవసాయ రంగంలో చోటు చేసుకోవడం మూలానా మానవ శ్రమ యొక్క అవసరం తగ్గుతోంది. శాస్త్రీయ పద్ధతులననుసరించి, వ్యవసాయం చేయడం మూలానా ఉత్పాదకత పెరుగుతోంది. 1951లో మన దేశంలో 5.5 కోట్ల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసేవారం. ప్రస్తుతం 22 కోట్లు ఉన్నాయి. పైగా ఉత్పత్తి చేస్తూ స్వయం సమృద్ధిని సాధించగా, పైన ఉదహరించిన వాస్తవాల దృష్ట్యా మనం తెలుసుకోగలిగింది ఇది.

భారతదేశంలో వ్యవసాయరంగంలో ఉత్పత్తులు ఎక్కువవుతూ ఉన్నప్పటికి శ్రామికుల అవసరం తగ్గుతూ వస్తోంది. కాని అక్కడి వ్యక్తులు విద్యగాని, యాంత్రిక నైపుణ్యాలు గాని, తగిన సంఖ్యలో పొందలేకపోవడం మూలానా, పాక్షిక శ్రామికులుగా ఉండవలసి వస్తోంది. పని ఉన్నప్పుడు దినసరి వేతనం పెరిగినప్పటికి, యాంత్రికీకరణముల వలన మానవ శ్రమ తగ్గుతూ ఉంది. పట్టణవాసుల యొక్క తలసరి ఆదాయం సం॥కి రూ. 56,000/- అయితే, గ్రామస్తుల తలసరి ఆదాయం రూ. 8,000/- కి ఉన్నది. ఇది శోచనీయమైన అసమానత.

అభివృద్ధి చెందిన దేశాల్లో పట్నవాసం పెరుగుతూ తలసరి ఆదాయం కూడా పెరిగింది. విద్య నైపుణ్యాలు ప్రజలు సంపాదించుకోగలిగారు. సంపత్తితో పాటు పరిమిత సంతానం యొక్క ఆవశ్యకతను వారు గుర్తించారు. అమెరికా, యూరప్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కుటుంబ సభ్యుల యొక్క సరాసరి సంఖ్య 3.5 మాత్రమే. అంటే ప్రతి కుటుంబంలో ఇద్దరు పిల్లలు కూడా లేరన్నమాట. కాని, మనదేశంలో కుటుంబ సభ్యుల యొక్క సరాసరి సంఖ్య 5కు పైనే. గ్రామాల్లోనూ, విద్యలేని కుటుంబాల్లోనూ, ముస్లింలలోనూ, హిందువుల్లో కొన్ని కులాల్లోనూ, విద్యలేని వారుగాని తక్కువగా ఉన్నవారిలోగాని, బీదవారిలోనూ, సంతానం సంఖ్య ఎక్కువగా ఉంటుంది. చదువుకున్న వారిలో, ఉద్యోగం ఉన్నవారిలో, సంపత్తి ఉన్నవారిలో, ఒకరిద్దరిని మించి సంతానం లేదు. కనుక ఈ వర్గం వారు అధికాధిక విద్యావంతులై, సంపన్నులై పట్నవాసులై పాశ్చాత్యుల వలె ఆర్థిక స్థాయిని పెంచుకుంటున్నారు. విద్య లేని అందులో విశేషించి గ్రామస్థులు పేదరికంలో ఉండటం మూలాన, విద్యను పొందే స్థోమత లేకపోవడం మూలానా, అధిక సంతానం ఉండడం మూలాన ఆర్థికంగా పురోగమించడం లేదు. చైనాలో ఒక అద్భుతమైన ప్రణాళిక గత 30 సం॥ల నుంచి అమలుచేయబడుతోంది. సంతానోత్పత్తిని అరికట్టారు. ఒక్క బిడ్డ ఎక్కువ కనడానికి వీల్లేదు. అందరిని నిర్బంధంగా చదివించారు. చాలా మందికి పారిశ్రామిక నిపుణతను నేర్పారు. అందుచేత పరిశ్రమల కొల్లలుగా స్థాపించి, వయోజనులందరకూ పని కల్పించారు. నిరక్షరాస్యత నిర్మూలించి ఆధిక సంతాన నిరోధించి, పట్నవాసం, శాస్త్రీయ పద్ధతుల్లో యంత్రాలను, ఎరువులను, సాగునీటిని ఉపయోగించి ఉత్పత్తికి పెంచి, ఆర్థికాభివృద్ధికి సాధించారు. ప్రతి చిన్న పట్నంలో కూడా విశేషించి గ్రామాల్లోకూడా గృహ పరిశ్రమలు విలసిల్లాయి. చెప్పులు, గుండీలు, దారం బంతులు , దువ్వెనలు, అద్దాలు మొదలైన నిత్యావసర వస్తువులు అన్నిచోట్ల చాలా మంది ద్వారా ఉత్పత్తి చేయబడుతున్నాయి. అందుకే ప్రపంచంలో ఏదేశంలో చూసిన చైనాలో చేయబడిన వస్తువులు ఉంటున్నాయి. మనం ఇప్పటికైనా మేల్కొని పరిమిత సంతానం, అందరికి నిర్బంధ విద్య, చాలా మందికి పారిశ్రామిక నిపుణత అనే లక్ష్యాలను పెట్టుకుని చిత్తశుద్ధితో, ప్రజలు ప్రభుత్వాలు







పనిచేయకపోయినట్లయితే పెరుగుతున్న గ్రామీణ జనాభా లేమినుండి బయటపడటం కష్టం. ఆర్థిక అసమానత సామాజిక శాంతికి వ్యతిరేకం అవుతుంది.

ఈనాడు అన్ని రాజకీయ పార్టీలు ప్రజల యొక్క హక్కులను గురించి మాట్లాడుతున్నవే కాని, హక్కుల కోసం పోరాడమని చెబుతున్నవేకాని, ప్రతి పౌరుని యొక్క బాధ్యతలను గురించి చెప్పడం లేదు. విద్యుత్తును, చదువును, గృహాలను, నీరును ఊరికినే గాని ఖర్చుకన్నా తక్కువైన ధరతో ఇస్తామంటూ శుష్క వాగ్దానాలు చేసి ఓట్లు సంపాదించుకుని పదవులు పొంది, వైయక్తిక సంపత్తిని పొందుతున్నారేగాని, నాయకుల యొక్క నిజమైన బాధ్యతలను నిర్వహించడం లేదు. ప్రపంచంలోనే బాధ్యతాయుతంగా ఎక్కువ కష్టపడి ధార్మిక జీవనం గడిపేవారని పేరుపొందిన భారతీయుల్లో స్వశక్తియందు, బాధ్యతలయందు, నమ్మకం తగ్గి, విలువపోయి, అన్నీ ప్రభుత్వం చేయాలనే భావన పెంపొందింపబడుతున్నది. దీనివలన ఎక్కువ నష్టపోయేవారు గ్రామస్థులే. వ్యవసాయ రంగంలో పనిచేసే కార్మికులే. పరిమిత కుటుంబాలు ప్రతివారి యందు విద్యాధికత నైపుణ్యం రావడానికి 25-30 సంవత్సరాలు పట్టవచ్చు. మరి ఇప్పుడున్న ప్రజలకు ఏ విధంగా మనుగడ చూపగలం. ఇదీ ప్రశ్న. భారత ప్రభుత్వం సంవత్సరానికి 60,000 కోట్ల రూ॥లు పైగా బీదవారని, వెనుకబడినవారని, బలహీన వర్గాలని అనబడేవారికి సబ్సిడీలుగా ఖర్చుపెడుతోంది. ఈ మొత్తం ఎక్కువవుతుందేగాని, తక్కువ అవడం లేదు. సబ్సిడీల ద్వారా జనాన్ని సంతుష్టి పరచకుండా, వారందరికి విద్యను, పారిశ్రామిక నైపుణ్యతను ఇచ్చినట్లయితే పాశ్చాత్య దేశాల్లో వలే, చైనాలో వలె మనం కూడా మరో తరంలో అభివృద్ధి చెందగలుగుతాము. ఎంతకాలమైతే పరిమిత కుటుంబం, విద్య యొక్క విలువలను మనం గుర్తించమో, గుర్తించకుండా ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తామో అంతవరకూ మన గ్రామసీమల్లో పేదరికం, ఆర్థిక అసమానత, నిరుద్యోగం ఉంటూనే ఉంటాయి.

# 21. తుది నిర్ణయం సోనియాదే...!

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కేశవరావుగారు మన ముఖ్యమంత్రిగారు, ఇతర కాంగ్రెస్ నాయకులు తెలంగాణా ప్రత్యేక రాష్ట్రాన్ని గురించి తుది నిర్ణయం చేసేవారు సోనియాగారే అని గర్వంగా చెపుతున్నారు. ఏడున్నర కోట్ల తెలుగువారు మెదడు, నోరులేనివారు కాబోలు. తెలంగాణా కావాలని ఉద్యమంచేపట్టినవారు నిర్వీర్యులు, నటులు మాత్రం కాబోలు. ఈ రాష్ట్రాన్ని గురించి ఎంతో మహత్తరమైన నిర్ణయం తరతరాల వారి భవిష్యత్తును రూపొందించే నిర్ణయం ఈ రాష్ట్రంలోని వారు కాని మరో ప్రాంతపు భారతీయులు కాని చేయరట. ఎక్కడో ఇటలీలో పుట్టి భారతీయుల జీవితంలో ఏ పాత్రా లేని, ఏ భారతీయ భాషా రాని, మన దేశపు సంస్కృతితో విశ్వాసాలతో పరంపరలతో సంబంధంలేని, స్వప్రయోజనం కోసం 15 సంవత్సరాల నివాసం తర్వాత పౌరసత్వం పుచ్చుకున్న విదేశీ మహిళ మన భవిష్యత్తుకు అదృష్టానికి సంబంధించిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పటానికి మన నాయకులు సిగ్గుపడటం లేదు. విశేషించి 'సగర్వంగా' చెపుతున్నారు. ఎంత దౌర్భాగ్యం!

భారతదేశాన్ని విభజించే నిర్ణయం కూడా భారతీయులైన కాంగ్రెస్ వారు తీసుకోలేదు. విజాతీయతను చాటిన 'ముస్లింలీగ్'ను సంతృప్తి పరచటం కోసం, భారతదేశాన్ని బలహీన పరచడం కోసం మనలను ఏలిన విదేశీ బ్రిటీష్‌వారే నిర్ణయించారు. ఆ పరంపరకు అలవాటుపడిన కాంగ్రెస్ నుంచి మరేం ఆశించగలం మనం. కాశ్మీర్ యొక్క భవితవ్యాన్ని కూడా కాంగ్రెస్ మహానాయకుడు నెహ్రూగారే విదేశీశక్తులకు, ఐక్యరాజ్య సమితికి అప్పగించారు. చరిత్ర నుంచి మనం ఏమీ నేర్చుకోవడం లేదు. చరిత్రనే వక్రీకరించే వారు విధాన నిర్ణేతలుగా వున్నప్పుడు మరేమి ఆశించగలం?







# 22. మానవతావాదమా? మూఢవాదమా?

శ్రీ కత్తి పద్మారావుగారు తమ వ్యాసంలో (ఆంధ్రజ్యోతి 24.03.04) బౌద్ధమతం ఆంధ్రప్రదేశంలో బహుజనాదరణను పొందిందనీ, అదొక "ప్రజా ఉద్యమంగా విస్తరిల్లిందని" వ్రాశారు. ఎందుకు అంతమయిందో వివరించలా. 'హిందూ' అనే పదం ప్రప్రథమంగా విజయనగర రాజుల శాసనాల్లో, మనదేశంలో ఉపయోగించబడింది. భారతదేశంలోని సనాతన ధర్మానికి, ప్రస్తుతం ప్రపంచమంతటా హిందూ "మతం" అని పేరువచ్చినందుకు నష్టమేమిలేదు. ఇండియా, హిందూస్తాన్‌లు అనే పదాలు కూడా భారతదేశం బదులు వాడబడుచున్నవి. బర్మా, గోల్ కోస్ట్, రోడీషియా, సిలోన్ వగైరా దేశాల్లాగా మనకి ఆత్మగౌరవం, దేశప్రేమ, మన వారసత్వం, ఇతిహాసం, సంస్కృతులయందు ఆదరణ ఉన్నట్లయితే , వారు తమ దేశాల పూర్వపు పేర్లను (క్రమంగా మియన్‌మార్, ఘనా, జింబాబ్వే, శ్రీలంక) స్వాతంత్ర్యానంతరం తిరిగి పెట్టుకొనినట్లు మనం కూడా, ఇండియా బదులు భారత్ అని సగర్వంగా పెట్టుకొని వాడుకలోకి తెచ్చుకునేవాళ్లం.

ఆంధ్రప్రదేశ్, భారతదేశపు ఇతర ప్రాంతాల్లో కూడా అతిప్రాచుర్యం చెందిన బౌద్ధం ఎందుకు కనుమరుగయింది? అనేక కారణాల్లో ప్రముఖమైన కారణాలు రెండు. మొదటిది హైందవ ధర్మం సహేతుకమయిన ప్రతిభావాన్ని స్వీకరిస్తుంది. ఆచరణలో ఉన్న నమ్మకాలనూ, పరంపరలనూ, వ్యవస్థనూ ఎవరికయినా ప్రశ్నించే స్వేచ్ఛను ఇస్తుంది. పృచ్ఛకుల శిరచ్ఛేదనం గాని, వారిని తగులపెట్టడం కాని హైందవుల్లో లేదు. వారిచే సహేతుకంగా చూపించబడిన మార్పులన్నింటినీ హైందవం తనదిగా చేసుకుంటుంది. ఆ పరంపరలో బౌద్ధం కూడా చాలావరకు హైందవాంతర్భాగమయింది. బుద్ధుడు, ఒక అవతారమయ్యాడు. ఒక్క బౌద్ధమేగాదు, అద్వైతం, విశిష్టాద్వైతం, శైవం, వీరశైవం, చార్వాకం, జైనం, స్వామి నారాయణం, సిక్కిజం ఇలా అనేకానేమైన "మతా"లు సంప్రదాయాలూ,

పూజా పునస్కార పద్ధతులూ హైందవ ధర్మ పరివార భాగాలుగా ఉన్నయ్. దీనికికారణం సహేతుకమైన మహావాక్యం. "ఏకం సత్, విప్రాబహధావదంతి". పరధర్మాలంటే ద్వేషించకుండా ఉండటం అన్ని మతాల వారికీ ఆశ్రయం ఇవ్వడం హైందవానికి సహజం. అందుకే అంబేద్కర్‌గారు క్రైస్తవం గాని, ఇస్లాంనుగాని తీసుకోలా. ఈ రెండింటినీ తిరస్కరించారు.

ఇక సంప్రదాయ పరమైన బౌద్ధం కొంచెంగా కూడా మిగలకుండా ఉండడానికి కారణం ఇస్లాం మత దురాక్రమణ దారులను ఎదుర్కొనలేకపోవడం, బౌద్ధం ఆఫ్ఘనిస్తాన్, సెంట్రల్ ఏశియా దేశాల్లో (ఉజ్బకిస్తాన్, కజకస్తాన్, తాజికస్తాన్, తుర్క్‌మేనిస్తాన్.) విలసిల్లుతుండేది. దౌర్జన్య, దురాక్రమణకూ, లూటీలకు గురియైనప్పుడు కూడా అహింసను అంటిపెట్టుకుని, ప్రతిఘటించకపోవడం మూలాన, సునాయాసంగా, అతి స్వల్పకాలంలో బౌద్ధ దేశాలు ఇస్లామిక్ దండయాత్రలకు లోబడి సంపూర్ణంగా మత మార్పిడులకు గురిఅయ్యారు. కాని హైందవాన్ని విస్మరించని, భారతదేశపు రాజులు, క్షత్రియులూ, ఇస్లాం ఆక్రమణదార్లతో ఏడువందల సంవత్సరాల పాటు యుద్ధాలు చేసి, ఇక్కడా, అక్కడా కొంతకాలం పరాధీనతలో ఉన్నప్పటికీ, హైందవాన్ని నిలుపుకోగలిగారు. ఈ విధంగా పోరాడి ఇస్లాంను ధిక్కరించి, మతం, భాష, భూష సంస్కృతిని కాపాడుకున్న మరో దేశంలేదు. చివరకు అస్పృశ్యులూ తథాకథిత నిమ్నకులస్తులు కూడా అసంఖ్యాకంగా, ప్రలోభాలకు లోబడి మతం మార్చుకోలా. సోమనాధ మందిరాన్ని ఇస్లాం దురాక్రమణదార్లు ఎన్నిసార్లు విరుగగొడితే అన్నిసార్లు హిందువులు పునర్నిర్మించారు. కాని నలందాలోని విశ్వవిద్యాలయం, బౌద్ధారామాల విషయం చూడండి. ఇస్లాం సేనాని బక్తియార్ ఖిల్జీ నలంద మీద దాడిచేస్తే, విశ్వవిద్యాలయాన్ని, గ్రంథాలయాన్నీ, శిల్పకళా నిర్మాణాలను ధ్వంసం చేస్తుంటే, భిక్షువులూ, విద్యార్థులు ప్రతిఘటించకుండా పారిపోయారు. వారితోపాటు బౌద్ధంకూడా పోయింది. అధర్మాన్ని, దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని వీరోచితంగా యుద్ధం చేసి ప్రతిఘటించాలనీ తత్కర్తవ్యంలో హింసకూ 'వెరువవద్దనీ శ్రీకృష్ణ పరమాత్ముని







గీతాబోధ, హైందవాన్ని, అసమానమైన రీతిలో నిలపెట్టింది. బౌద్ధం కమ్యూనిజం హైందవానికి వ్యతిరేకం కావు. కమ్యూనిస్ట్ రష్యాలో, కొన్ని తూర్పు యూరపియన్ దేశాల్లో ప్రజ్వరిల్లి, ప్రపంచఖ్యాతి గాంచి, ఇప్పుడు అక్కడసలు లేకుండా పోయినట్లే, ఆచరణలో ఎన్నో లోపాల వల్ల, బౌద్ధం మన దేశంలో చాలా తగ్గి, కొన్నిదేశాల్లో ఏవిధంగా కమ్యూనిజం ఇంకా పరిఢవిల్లుతోందో, అదే విధంగా బౌద్ధం భారతేతర దేశాల్లో వుంది.

ఎన్నో దేశాల్లోని ముస్లింలు భారతదేశం పట్ల ద్వేషంతో వున్నారు. ముస్లిం మతస్తులు ఎక్కడ ద్వేషం లేకుండా వున్నారు? భారతదేశం, సైప్రస్, తూర్పుటైమూర్, సెర్బియా, రష్యాలోని చెచెన్యా, చైనాలోని సింకియాంగ్, ఫిలిపైన్సులోని మిండనావో, మాసిడోనియాలోని పశ్చిమోత్తర భాగం.మన కాశ్మీర్‌లోని జిహాదీ ఉగ్రవాదులు కాశ్మీరులను ప్రేమిస్తున్నారా? 'మా మతమే నిజమైనది, ఇతర మతస్తులు పాపులు, వారందరినీ మా మతంలోకి మార్చడం మా విద్యుక్తధర్మం. మేము ఆధిపత్యంలో లేని చోట లౌకిక వాద ప్రభుత్వాలుండాలి. అక్కడమాకు ప్రత్యేక హక్కులుండాలి. మేం పరిపాలిస్తున్న దేశాల్లో మాది మత ప్రభుత్వం. మా మతేతరులకు మా కున్న హక్కులుండవు' అని చెప్పేవారు, ఇతర మతస్తులను ద్వేషించక ప్రేమిస్తారనుకుంటామా? అందుకనే అంబేద్కర్‌గారు అటువంటి మతాలను పేరుతో తిరస్కరించి భారతభూమిలో పుట్టిన, భారతీయులచే గౌరవింపబడుతున్న బౌద్ధాన్ని స్వీకరించారు. ఇతరులను ద్వేషిస్తున్న, ఇతర మతస్తులను పలువిధాల ద్వారా మతమార్పిడి వ్యవహారం నిర్వహిస్తున్న మతాలను తిరస్కరించారు. ముస్లిం పాకిస్తాన్‌లో ఒకప్పుడు 15% వున్న హిందూ సిఖ్ ప్రజలు ఈనాడు దాదాపు శూన్యం. (1% కన్నా తక్కువ) ముస్లిం బంగ్లాదేశంలో 1948లో 28 శాతం ఉన్న హిందూ, బౌద్ధ ప్రజల శాతం ఈనాడు 9%కి తక్కువ; బౌద్ధులు బహు సంఖ్యాకులుగా ఉన్న బంగ్లాదేశంలోని చిట్టగాంగ్ హిల్స్‌లో, వారు ఎటువంటి వివక్షతకు, దౌర్జన్యానికి అమానుషత్వానికి గురి అవుతున్నారో, వారి భూములు ఏ విధంగా ఆక్రమించబడుతున్నాయో ఐక్యరాజ్య సమితికి, విద్యావేత్తలకూ సువిదితమే.

కాశ్మీరులోయలో నుండి ప్రతి హిందువూ, సిఖ్ తరిమివేయబడి, కాందిశీకులుగా బ్రతుకుచున్నారనీ పత్రికలు చదివే ప్రతిభారతీయునికీ తెలుసు.

ఇక ఎవరిది మూఢ నమ్మకమో,అంధ విశ్వాసమో, ద్వేషపూరిత ప్రచారమో పాఠకులు నిర్ణయించుకోగలరని విశ్వసిస్తున్నాను.

**హర్తకుఁ గాదు గోచర మ హర్నిశమున్ సుఖపుష్టిసేయు స**
**త్కీర్తిఘటించు విద్యయను దివ్యధనం బఖిలార్థి కోటికిం**
**బూర్తిగ నిచ్చినం బెరుఁగు బోదు యుగాంతపువేళనైన భూ**
**భర్తలు దద్ధనాధికుల పట్టున బోదు యుగాంతపువేళనైన భూ**

భా॥ ధనమును తస్కరులు తస్కరించెదరు కాని విద్యాధనము తస్కరించుటకు శక్యముగానిది విద్యదివారాత్రములందు సుఖమిచ్చును. నిష్కళంకమగు కీర్తిదెచ్చును. ధనమెవరికైననిచ్చిన తరుగును. కాని విద్యాధన మెందర కిచ్చినను తరుగదు. ప్రళయకాలమందైనను విద్యకునశింపులేదు. కనుక విద్యాధికులవద్ద ధనపతులగు రాజులు గర్వములేక యుండుట మంచిది.







# 23. పిట్రోడా, రాహుల్, కాంగ్రెస్

శ్రీ సత్యేన్ శ్యాం పిట్రోడా మరోసారి భారత్‌కు వచ్చాడు. పత్రికలు తనను టెక్నాలజీకి ప్రతిరూపంగా, టెలికాం విప్లవ యువమేధావి'గా, చక్కటి పెంపకం విద్య కలిగిన వాడుగా, ఉత్తమ శక్తిసామర్థ్యాలున్నవాడిగా, అమెరికాలో అనేక పోటీ రంగాలలో పనిచేసిన సోనియాగాంధీ చెప్పారు, అది కాంగ్రెస్ పార్టీ నిర్ణయం కాదట. (కాంగ్రెస్ హై కమాండ్ అంటే 'సోనియా కమాండ్' అయితే తప్ప). భారత్ ఆయనకు మద్దతునివ్వాలట. పిట్రోడా యింకా చెపుతూ " ఈ ఎన్నికల సమయం నాకు నిజం చెప్పేందుకు మంచి అవకాశం. నిజం ఏమిటంటే. రాజీవ్‌గాంధీ సమాచార విప్లవానికి బీజం వేస్తే, నేడు బిజెపి వారు ఆ ఫలాలను కోసుకుంటున్నారు. రాజీవ్‌గాంధీ ఋణం తీర్చుకునేందుకు నేను వచ్చాను" అన్నారు. రాజీవ్‌గాంధీ పూర్తికాని ఎజెండాను తాను ముందుకు తీసుకుపోవాలనుకున్నట్లు, ఆయన (రాజీవ్ లేక పిట్రోడానా తెలియదు) భారత్‌పై గొప్ప కలలు కన్నారట. రాజీవ్ లేరు కనుక పిట్రోడా దీన్ని యువజనులకు, విద్యార్థులకు, వృత్తివ్యాపారస్తులకు చెప్పదలచుకున్నారట, ఆయన ఇంకా మాట్లాడుతూ, "విదేశీమూలం (సోనియా) సమస్య చాలా చిన్నది. ఒకసారి భారతీయుడితో వివాహమైతే భారతీయులైపోయినట్లే" అన్నారు. ఇవన్నీ 3 ఏప్రిల్ 2004 నాటి 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లోని జ్యోతిశర్మ టైమ్స్ న్యూస్ నెట్‌వర్క్ కథలోనివి.

పిట్రోడా నాకు బాగా తెలుసు. సీనియర్ టెలికాం నిపుణుడిగా గయానాలో ఐటియు/ యుయన్‌డిపి పనిమీద వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు 1985లో ఆయన్ను, తన చికాగో హోమ్‌లో మొదటిసారి కలిశాను. తరువాత పి అండ్ టి / డిఓటిలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా, విదేశీ సంచార్ నిగమ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన్ను కలుస్తుండటం, ఆయన కొంత కాలం టెలికాం కమీషన్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు, సెక్రటరీగా ఉన్నప్పుడు నేను భారత ప్రభుత్వం సి డాట్ పనితీరుపై 1990లో నియమించిన నంబియార్ కమిటీలో సభ్యునిగా ఉండటం (పిట్రోడా

చర్యలవల్లే సి డాట్ నిలదొక్కుకుంది) యివన్నీ, పిట్రోడా రాహుల్ గాంధీని సమర్థిస్తూ చేసిన ప్రకటనలని వ్యాఖ్యానించడానికి నాకున్న అర్హతలుగా భావిస్తాను.

పిట్రోడా భారత్‌లో టెలికాం విప్లవ పితామహుడు అనే విషయమై నేను జర్నల్ ఆఫ్ సెంటర్ ఫర్ టెలికాం మేనేజ్‌మెంట్ అండ్ స్టడీస్ శీర్షికన వ్యాసాలు వ్రాశాను. ఆ విషయం ఎంతవరకు నిజమో, ఎంతటి అబద్ధమో, రాజీవ్‌గాంధీతో కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కవడం వల్ల ఆయన టెలికాం సంస్కరణలను ఎంత దెబ్బతీశారో నేనందులో వ్రాశాను. చివరి విషయం వదిలేద్దాం. 1989లో రాజీవ్‌గాంధీ కొన్ని నెలల ముందుగా లోకసభను రద్దు చేసినప్పుడు, ఎన్నికలకు, పిట్రోడా డాట్ సెక్రటరీగా, ప్రభుత్వోద్యోగిగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ పనిచేసేవాడు. నేను పిట్రోడాకు చెప్పాను. ఆయన వచ్చింది టెలికాం అభివృద్ధి అనే ఓ మహాకార్యం కోసమని, కేవలం ఒక పార్టీ పనికోసం కాదని. ఆయన రాజీవ్ గాంధీతో, కాంగ్రెస్ పార్టీతో మమేకమై పనిచేసేవారు. రాజీవ్ కాంగ్రెస్ ఓడిపోతే ఏం జరుగుతుంది ఆయన తరిమికొట్టబడతాడు. పిట్రోడా తాను బాధపడనని, రాజీవ్, కాంగ్రెస్ తప్పక గెలుస్తారని అన్నారు. ఆయనకంత భరోసావద్దని నేను చెప్పాను. 'భారత ప్రజలు అపార రాజకీయ అనుభవమున్నవారు. తనకు ఎవరూ ఎదురులేరనుకున్న శ్రీమతి ఇందిరాగాంధీనే ఓడించారు. ఆమెతో పోలిస్తే రాజీవ్ ఏపాటి?' ఆయన నవ్వి నా భయాలను తోసిపుచ్చారు. రాజీవ్ కాంగ్రెస్ ఓడిన తరువాత ఆయనను తరిమికొట్టారు. చిన్నచూపు చూశారు. ఆయనకు వ్యతిరేకంగా ఎంక్వయిరీ వేయబడింది. ఆయనకు గుండెనొప్పి వచ్చింది. చివరకు డాట్‌ను, భారత్‌ను 1990లో ఆయన వదిలి పెట్టారు. కేవలం టెలికాం రంగంలోనే కాదు. ఆయన తన భావజాల ప్రసరణలో కూడా తనకు తానే సాటి అనిపించుకోజూశారు. ఒక ఆల్‌రౌండర్ ఐఏయస్ ఆఫీసర్‌గా మసలుదామనుకునేవారు. ఆయనకు నేనొకసారి భగవద్గీత శ్లోకాన్నుటంకిస్తూ ఓ లేఖ రాసాను.





వ్యవసాయాత్మికా బుద్ధి రేకే కురునందన
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధాయో అవ్యవసాయినామ్'

సాధకుడు కేవలం ఒక వస్తువు లేదా విషయంపై మనసు లగ్నం చేస్తాడు. సాధకుడు కాని వాడు చాలా పనులు పెట్టుకుంటాడు. ఈ శ్లోకాన్ని ఎందుకు ఉదహరిస్తున్నానంటే పిట్రోడాకు యింకా వేరే నిర్ధారిత కార్యక్రమాలు కూడా వున్నాయి. భారత్‌పట్ల ఆయనకున్న నిబద్ధత, భారతీయులను ఆయన అంచనా వేసే తీరు చూసి నేను షాక్ తిన్నాను. 1991లో యెమన్‌లో ఒక ఐక్యరాజ్య సమితికి సంబంధించిన పని నుండి తిరిగి వస్తున్నప్పుడు ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్ పోర్టులో ఆయన్ను కలిశాను. మాటల్లో ఆయన 'నేను భారత్‌ను మంచి కోసం వదిలి పెట్టాను. భారతీయులు లంచగొండ్లు. వాళ్ళు నైపుణ్యం ముందు నిలబడలేరు' అన్నారు. నేను షాక్ అయ్యాను. రాజీవ్ అనంతరం యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో ఆయన్ను బాధపెట్టిన తీరు, అణచివేతపట్ల ఆయనకు గల్గిన బాధ ఆయనకు మనస్తాపం కల్గించి ఉంటాయని నేను ఆయనకు చెప్పాను.

"బుల్ బుల్ కో గుల్ ముబారక్
గుల్‌కో చమక్ ముబారక్
హమ్ బేక సోంకో అప్‌నా
ప్యారా వతన్ ముబారక్' అని.

'భారతీయుడిగా టెలికాం సంస్కరణల కోసం అభివృద్ధి కోసం నాకు ప్రియమైన భారత్‌లో పనిచేస్తూనే ఉంటాను. నాకు అమెరికా వంటి స్వర్గోపభోగాలేం లేవు ఆగడానికి, భారత్‌ను సేవించే మరో అవకాశం కోసం ఎదురుచూడ్డానికి" అని కూడా అన్నాను.

పిట్రోడా చెప్పుకుంటున్న గొప్పల తాలూకు విలువలను చూద్దాం. ఆయన రాహుల్‌కు రాజీవ్‌కు ఆపాదించిన ఘనతను చూద్దాం. నిజంగా పిట్రోడా అలాంటి సాంకేతిక పరిజ్ఞానపు మంత్రగాడు అయితే, ఏభై పేటెంట్లను కల్గి ఉన్నట్లయితే,

భారత్‌లో టెలికాం విప్లవం తెచ్చేవాడే. ఆయన రాహుల్‌గాంధీ కంటే గొప్పవాడే. కనుక ఆయన అంతగొప్ప ఘనచరిత్ర గలిగి స్వయంగా లోకసభకు ఎందుకు పోటీచేయడంలేదు. రాహుల్‌గాంధీకి వంతపాటలెందుకు పాడుతున్నాడు. నైపుణ్యం నిరూపిత సామర్థ్యం కాకుండా చక్కటి కుటుంబంలో జన్మించడమే లోకసభ సభ్యుడు కావడానికి, ప్రధానమంత్రి కావడానికి సరైన అర్హతలని ఆయన నమ్ముతున్నారా? ఇది ఆయన శాస్త్రం మీ మాంసలో గల నమ్మకాన్ని తెలియజేస్తున్నది. ఇది పిట్రోడాను కేవలం ఒక ప్లేకార్డు పట్టుకునే వాడిగా, ఓ భక్తుడిగా, భజనపరుడిగానే మిగులుస్తుంది.

భారతదేశంలో నివసిస్తున్న వారెవరికీ రాహుల్ అనబడే ఈ యువకుడి సరైన పెంపకం, బ్రహ్మాండమైన విద్యగల్గిన నేపథ్యము గురించి తెలియదు. దీనితోపాటు అమెరికాలో పోటీ రంగాలలో ఆయన చేసిన పని తాలూకు వివరాలు కూడా ఎవరికీ తెలియవు. తెల్సిన విషయమేమిటంటే ఆయన ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో మార్కుల ఆధారంగా గాక, స్పోర్ట్స్ – విలువిద్యలో బహుమతిపొందాడనే సర్టిఫికెట్ వల్ల సీటు వచ్చిందని మాత్రమే. సెయింట్ స్టీఫెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ చెప్పినదాన్నిబట్టి అతను కళాశాల చదువు పూర్తిచేయలేదని తెలుస్తోంది. కాగా ఆయన హర్వార్డ్ వెళ్లాడు, కాని ఏ డిగ్రీకోర్సులోనూ సీటు దొరకలేదని పత్రికలు రాశాయి. సోనియాగాంధీ తాను కేంబ్రిడ్జిలో ఏదో చదువు వెలగబెట్టినట్లు చెప్పడం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో సోనియామైనోగాంధీ పేరున ఎవరికీ ఏ కళాశాలలోనూ అడ్మిషన్లు ఇవ్వలేదని తెలిసింది. ఆ తరువాత ఆమె ఆంగ్లం నేర్చుకోవడానికి ఒక ట్యూటోరియల్‌లో చేరారన్నారు. అది కేంబ్రిడ్జి పట్నపు ఓ వీధిలో ఉందట. నేను కూడా హర్వార్డ్ వెళ్ళాను. కాని అక్కడ భవనాలు చూట్టానికి, వీధుల్లో నడవడానికే. ఆ లెక్కన ఎంతో మంది భారతీయులు కూడా ఆ పనిచేసి ఉంటారు కానీ ఎవ్వరూ హర్వార్డ్‌లో చదివామని అనడంలేదే?







రాహుల్ సరైన పెంపకం గూర్చి ఎవరికీ మనదేశంలో తెలిసింది లేదు. భద్రత దృష్ట్యా అతను చాలా వరకు ఇంటినుంచి బయటకు వెళ్ళడు. ఇక బయటకు వెళ్ళక, ఎలాంటి విధంగానూ విద్యార్థుల, యువకుల సహచర్యంలేక ఎక్కడా మాట్లాడక, ఏమి రాయక అతను చక్కగా పెంచబడ్డాడని ఎలా చెప్పగలం? ఇందుకు భిన్నంగా సంజయ్‌గాంధీ కొడుకు వరుణ్‌గాంధీ చక్కటి ఆంగ్ల పద్యాలను వ్రాశాడని, అలాంటి పుస్తకం ఒకటి ప్రచురితమైందనేది తెలిసిన విషయమే.

రాహుల్‌కు మంచి సామర్థ్యముందని పిట్రోడా యిచ్చిన సర్టిఫికెట్ నిజంగా వింత. లక్షలాది భారతీయులు సామర్థ్యం ఉండడమేకాదు, దాని ప్రదర్శిస్తారు. ఉదాహరణకు వేలాది మన ఐ.ఐ.టి., ఐ.ఐ.యమ్ పట్టభద్రులు అంతర్జాతీయంగా అనేక పోటీ రంగ సంస్థలలో పనిచేస్తున్నారు. రాహుల్ సామర్థ్యం బహుశా వాళ్ళమ్మకీ, అక్కకీ మాత్రమే తెలుసునేమో! మహా అయితే పిట్రోడాకు కూడా తెలిసి ఉండవచ్చు. మరే భారతీయుడికి తెలియదు. భారతీయులకు సోనియాగాంధీ విద్యార్హతల గురించి కూడా సరైన సమాచారం తెలియదు, ఇక రాహుల్ దాకా ఎందుకు? అయితే పత్రికల ద్వారా, అతను ఒక కొలంబియా అమ్మాయితో స్నేహం చేస్తున్నాడని మాత్రం తెలిసింది. కాని ఆ తెల్లరంగు వాళ్ళను స్నేహితులుగా పొందడం గొప్ప కళే? అలాంటి కళను భారతీయులు గుర్తించాలా? అభినందించాలా? రాహుల్‌కున్న అంతరంగ ప్రతిభ గురించి..... భారత్ వెలుపల పోటీరంగాలలో ప్రదర్శించబడిన తీరు గురించి, అందుకోసం లోకసభ సభ్యుడయ్యేందుకు ప్రధానమంత్రి అభ్యర్థి అయ్యేందుకు అతనికివ్వ వలసిన మద్దతు గురించి పిట్రోడా చెప్పడం ఎంత సిగ్గుచేటు? అతని కుటుంబానికి భారత్ ఋణపడి ఉందా? విలువైన కాలాన్ని బయటి దేశాలలో గడిపి భారత్‌కు వచ్చి ఎం.పి. అవుదామనుకుంటే, అతన్ని ఎం.పిగా ఎన్నుకుని భారత్ ఋణం తీర్చుకోవాలా? ఈ దేశంలో టెక్నాలజీకి, టెలికాం విప్లవానికి మారుపేరుగా చెప్పబడిన పిట్రోడా వంటి మేధావులు ఈ ఎన్నికల సమయంలో రాజీవ్‌గాంధీ గురించి మనకు నిజం చెప్పేందుకు మంచి అవకాశమని పిట్రోడా అంటారు. రాజీవ్‌గాంధీ గురించిన నిజం దేశప్రజలను తెలియకనా?

రాజీవ్‌గాంధీని గూర్చిన "గలీగలీమే శోర్‌హై....." అన్న ప్రఖ్యాత హిందీ పదబంధాన్ని త్రోసిపుచ్చడం మినహా సమాచార విప్లవానికి ఆయన చేసిన అంకురార్పణ తాలూకు దాఖలాలేం వున్నాయి?

ఆయన ఐదేళ్ళ పాలనలో, ఐ.టి సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏవైనా ఆఫ్ షోర్ అభివృద్ధికి, భారత్‌లో సాఫ్ట్‌వేర్ విడుదలకు అంతర్జాతీయ శాటిలైట్ సర్క్యూట్‌లను లీజుకు తీసుకునేందుకు అనుమతింపబడ్డాయా? రాజీవ్‌గాంధీ ప్రధాని అవడానికి చాలా ముందు 1976 కు ఏర్పాటైన నేషనల్ ఇన్ఫర్‌మాటిక్ సెంటర్‌లో తప్ప ఐ.టి ఎక్కడ వాడబడింది? బిజెపి వాళ్ళు రాజీవ్ నాటిన వృక్షాల ఫలాలను అనుభవిస్తున్నారనే అనుకున్నా, మరి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్ (భవిష్యత్తులో ప్రియాంక కూడా కావచ్చు) లు వాళ్ళ తండ్రులు తాతలైన జవహర్‌లాల్, మోతీలాల్‌లు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవారి యోగదానం తాలూకు ఫలాలను అనుభవిస్తున్నట్లు కాదా? విత్తనాలు నాటినవాడే ఫలాలను అనుభవించడమనేది జరిగే పనికాదు.

పిట్రోడా తాను రాజీవ్‌గాంధీ ఋణం తీర్చుకునేందుకు మరోసారి వచ్చానని చెప్పుకున్నారు. పిట్రోడా కంటె సామర్థ్యం ఉన్న వారెందరికో రాజీవ్‌గాంధీ తల్లి ఆశ్రయం దొరకలేదు. రాజీవ్ ప్రాపకం వల్లే పిట్రోడాకు అంత ప్రభావం ప్రాప్తించింది. వినోద్‌ధామ్, వినోద్‌ఖోస్లా, మరెందరో యువభారతీయ మేధావులు తమ ప్రతిభను చూపినవారున్నారు కానీ, వారు ప్రాపకం పొంది తమకు తాము వెలిగి పోవాలని వెంపర్లాడలేదు.

రాహుల్‌కు భారత్ విషయమై ఒక "విజన్" ఉందని పిట్రోడా అంటాడు. ఇది ఎవరో కలగనాల్సిన మాట. ఏ భారతీయుడికీ దీన్ని గూర్చి తెలియదు. బహుశా అది వారి కుటుంబ రహస్యమేమో! తగిన సమయంలో పిట్రోడా ఆ వంశంవారికి చెపుతాడేమో! ఈ "విజన్" గురించి యువజనులకు, వృత్తి నిపుణులకు, విద్యార్థులకు పిట్రోడా చెపుతాడట. ఆయన భారత్‌ను 1990లో వదిలివెళ్ళాడు. ఆ తరువాత లక్షలాది మంది భారతీయ యువకులు, విద్యార్థులు,







వృత్తినిపుణులు భారత్‌ను ఒక శక్తివంతమైన సమాచార సాంకేతిక పరిజ్ఞాన ప్రోతస్సుగా తీర్చిదిద్దారు. పిట్రోడానుంచి ఓ సందేశం ఓ నైపుణ్యం ప్రసారం లేకుండా ఇది జరిగింది. ఇపుడు వాళ్లకు ఈయన అవసరమా? (లేక) ఆయన మరోసారి రాజీవ్ కుటుంబాన్ని భారతీయ సాంకేతిక వేదిక మీదకు తేవాలనుకుంటున్నారా?

పిట్రోడా పౌరసత్వం విషయమై భారతీయులకు సూచనలిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎవరైనా భారతీయుడు ఎప్పుడు అవుతారో ఆయన తెలియజేస్తున్నారు. ఆయన చెప్పేదేమంటే, ఎవరైనా భారతీయ పౌరులైన వారిని వివాహమాడితే ఆమె లేదా అతడు భారతీయ పౌరులౌతారట. కాని చట్టపరంగా ఇలా కాదు. సర్వసామాన్యంగా అర్థం చేసుకుని అంగీకరించ దగ్గ విషయమూ కాదు. ఎవరైనా భారత ప్రధానమంత్రి ఇంట్లో పెళ్ళి చేసుకున్నంత మాత్రాన అతనికి లేక ఆమెకు చట్టం వర్తించకుండా పోదు. సోనియా 15 సంవత్సరాల పాటు ఆమె వివాహానంతరం భారతీయ పౌరసత్వం తీసుకోలేదు. వివాహానంతరం 5 సంవత్సరాల తరువాత ఆమె ఏ భారతీయ భాష నేర్చుకోలా? సామాజిక, సాంస్కృతిక, ప్రజాజీవనంలో పాలుపంచుకోలా? ప్రధానమంత్రి కోడలయింది. కనుక ఓ విదేశీయురాలు పౌరసత్వం తీసుకోకుండానే ఓటర్ల లిస్టులో పేరు నమోదు చేయించుకోవచ్చా? పౌరురాలు కాకుండానే ఒక భారతీయ కంపెనీలో డైరెక్టరు పదవిని పొందవచ్చా? ఇదంతా చూస్తుంటే పిట్రోడాకు రాజీవ్ కుటుంబం యెడ ఎంత కృతజ్ఞతా భావం వుందంటే ఆయన తన శాస్త్రీయ దృక్పథాన్ని, వ్యవహార న్యాయాన్ని తుంగలో తొక్కి రాజీవ్ కుటుంబ ఋణం తీర్చుకునేందుకు తపన పడుతున్నట్లనిపిస్తోంది.

చివరగా ఆయన భారత టెలికమ్యూనికేషన్ రంగంలో తెచ్చిన విప్లవం ఏమిటి? పబ్లిక్ టెలిఫోన్‌లకు శారీరక వికలాంగుల కందజేసి వారి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్లు బస్‌షెల్టర్‌లు, గ్రోసరీ షాపుల్లో, గ్రామాల్లో, వీధి చివర్లో అవి నడపబడేలా చూసేందుకు మొట్టమొదట ఆలోచన చేసేవారెవరు, ఆయనా? ఆయన

కాకుండా మరెవరన్నారా? అనే విషయం ఆయన్ను నిజాయితీగా చెప్పమనండి. 1975 నుంచి అప్పుడున్న మొత్తం నిబంధనలన్నింటినీ త్రోసిరాజని నేను తీసుకున్న మొదటి నిర్ణయమది. నేను డి.ఓ.టి.లో వున్నప్పుడు ఆ వినూత్నమైన ఆలోచన వెలుగులోనికి వచ్చింది. ఎస్.టి.డి / ఐ.ఎస్.డి. పబ్లిక్ ఫోను ప్రతివీధి చివర ప్రత్యక్షమైంది. గ్రాసరీ షాపుల్లో, గ్రామాల్లో, నగరాల్లో కూడా భారత్‌కు ఎలక్ట్రానిక్ స్విచ్ లేదు. అందువల్ల గ్రామాలకు గ్రామాల్లో ప్రైవేటు, పబ్లిక్ టెలిఫోన్‌కు దీన్ని అందించడం సాధ్యం కాలేదు. పిట్రోడా దాన్ని అమెరికాలోని తన సంస్థ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశాడు. దానికతను ప్రశంసార్హుడే. దీన్ని సి-డాట్ రూరల్ ఎక్స్ఛేంజిల ఏర్పాటుకు వినియోగించాం. దీన్ని విస్తృత పరచడం ద్వారా గ్రామాలకు ఎస్.టి.డి. అందించే వీలు కలిగింది. పట్టణాల్లో, నగరాల్లో పిట్రోడా రాకముందే ఇవి ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది పిట్రోడా అన్న అబద్దపు ప్రచారం బాగా జరిగింది. ఐ.ఐ.టి. చెన్నైకి చెందిన డా॥ అశోక్ ఝుంఝున్‌వాలా, పిట్రోడా కంటే గొప్పగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. ఆయన కార్డ్‌లెస్, వైర్‌లెస్, డిజిటల్ ఎలక్ట్రానిక్ కార్డ్‌లెస్ టెలిఫోన్ (డి.ఈ.సి.టి)ను అభివృద్ధి చేశారు. దాని ద్వారా డబ్ల్యూ.ఎల్.ఎల్. (వైర్‌లెస్ ఇన్ ద లోకల్ లూప్) వ్యవస్థ రూపొందింది.

దీనివల్ల గ్రామాల్లో ఎస్.టి.డి. సౌలభ్యం ఏర్పడింది.

పిట్రోడాలాగే డా॥ అశోక్ ఝుంఝున్‌వాలాకు కూడా అన్నివైపుల నుంచి వ్యతిరేకత వుండేది. కాని ఆయన భారత్‌ను వదిలి వెళ్ళలేదు. ఆయన డిజైన్ చేసిన ఎక్విప్‌మెంట్ దేశం బయటవాడబడి తరువాత భారత్‌లో ప్రవేశపెట్టబడింది. ఆయన ప్రధానమంత్రి ప్రాపకాన్ని కోరలేదు. ఇతర భారతీయుల వలెనే ఆయన సంఘర్షణ చేసి విజయం సాధించాడు. ప్రతిపక్షంతో ఎదురుపడినపుడు భారతీయులు లంచగొండ్లు కాని ఆయన విదేశాలలో వ్యాఖ్యానించలేదు.

మరోసారి భారత్‌లో ప్రవేశించడం ద్వారా పిట్రోడా తన లక్ష్యాల కోసం రాజకీయ నాయకులపై ఆధారపడే నైజాన్ని బయటపెట్టుకుంటున్నాడు. 1989







ఎన్నికల్లో ఆయన రాజీవగాంధీతో, కాంగ్రెస్‌తో కుమ్మక్కు కావడం టెలికాం సంస్కరణలనే దెబ్బతీయడమే కాక ఆయన అదృష్టాన్ని కాలదన్నింది. ఆయన ఆ అనుభవం నుంచి ఏ పాఠం నేర్చుకుని ఉండాలి?

దేశానికి దేశ ప్రజలకు పరిచయం లేని వ్యక్తి లక్షణాలను గురించి ప్రచారం చేసే పోకడలు, పిట్రోడా మాత్రం తెలిసిన ఆ వ్యక్తి శక్తి సామర్థ్యాలు, విదేశీ పోటీ కంపెనీలకు ఆ వ్యక్తి శక్తి సామర్థ్యాలు, విదేశీపోటీ కంపెనీలకు సలహాలివ్వగలిగిన ఆ వ్యక్తి మేధాసంపత్తి, జయం సాధించలేవు.

ఇందిర ఓడిన తరువాత, రాజీవ్‌గాంధీ, భంగపడ్డ తరువాత ఇటలీలో జన్మించిన సోనియా మైనోగాంధీకైనా హర్వార్డ్ రాహుల్‌కైనా భారత ప్రజల నుంచి ప్రధానమంత్రి పదవిని చేజిక్కించుకోవడంలో విజయం సిద్ధించదు. ఇది కాంగ్రెస్ అధ్యక్ష పదవిని దక్కించుకున్నంత సులువు కాదు.

**విద్య నిగూఢగు ప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్**
**విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుఁడు**
**విద్య విశిష్టదైవతము విద్యకు సాటిధనంబు లే దిలన్**
**విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాఁడు మర్త్యుండే.**

భా॥ మనుజులకు విద్యయే దాచుకొనివిధనము. విద్యయే రూపమును. కీర్తింపదెచ్చును. సుఖింపజేయునది విద్యయే. విద్యగురువువంటిది. దేశాంతరముల కేగింప విద్యయేబంధువు. విద్యాధనమునకు దగినధనమీ ప్రపంచమున లేదు. విద్యయున్న దేవుని సహాయమున్నట్లే పండితులగు రాజులు విద్యను పూజింతురు. ఇటువంటి విద్యను నెఱుంగనివాడు ద్విపాద బశువని చెప్పుదురు.

# 24. చైనాలో ఆర్థిక ప్రగతి, పెరుగుతున్న అసమానతల సహ అస్తిత్వం

**23.08.2006**

మావోసేటుంగ్ మరణానంతరం (1976) డెంగ్ సియావ్ పింగ్ చైనా అధినేత అయిన అనతి కాలంలోనే దేశం యొక్క గతిని, ప్రజల యొక్క ఆకాంక్షలను మార్పు చేయపూనుకున్నాడు. మావో యొక్క సాంస్కృతిక విప్లవంలో ఎంతోమంది డెంగ్‌తో సహా వరిష్ట కమ్యూనిస్ట్ నాయకులు అవమానించబడ్డారు, వేధించబడ్డారు. దాదాపు 20 లక్షల మందికి పైగా వ్యక్తులు క్యాపిటలిస్ట్ రోడర్స్ అని ముద్రవేయబడి చంపబడ్డారు. విశ్వ విద్యాలయాలు మూసివేయబడి అందులోని ఆచార్యులు, విద్యార్థులు పల్లెలకు మామూలు శ్రమ జీవితం గడపమని నెట్టివేయబడ్డారు. అలాఅయితే గాని వారిలో నిజమైన విప్లవ భావాలు వుండవట. ఇటువంటి చర్యల పర్యవసానంగా ఆర్థిక సాంఘిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై పోతోంది, జనాభా పెరిగిపోతున్నారు. డెంగ్ గారు ఈ నష్టాలను, అథః పతనమును అంతమొందించడం కోసం రెండు సూక్తులు నుడిమారు. "సంపన్నులవడం మహోజ్వలమైన స్థితి". ఎలుకలను పట్టగలిగితే, పిల్లి యొక్క రంగు తెలుపు అయితే నేమి, నలుపైతేనేమి" దీని యొక్క పరోక్ష భావం పాత-మార్క్సిస్టు, మావోఇస్ట్ భావ చక్రాన్ని పక్కకు పెట్టి, ప్రతి వ్యక్తికీ స్వేచ్ఛనిచ్చినట్లయితే మనదేశం త్వరలో సంపన్న శక్తిగా , బీదతనాన్ని వెనకబెట్టి ఎదుగ గలుగుతాము. ప్రతీ పరిశ్రమ, వ్యాపారం ప్రభుత్వ పరంగా ఉండటం మూలానా, మన ఉత్పాదకత తగ్గింది. ప్రభుత్వ ధనాన్ని ప్రచ్ఛన్నంగా దోచుకునేవాళ్ళు ఎక్కువైయ్యారు. ఇక అంచలంచెలుగా ప్రభుత్వ ప్రమేయాన్ని తగ్గించి, వ్యక్తుల యొక్క , వారి యొక్క సంఘాలకు, కంపెనీలకు, స్వాతంత్ర్యం ఇచ్చి, పారిశ్రామిక, వ్యాపారవేత్తలుగా పెరగనిద్దాము. వ్యవసాయ రంగంలో రైతులను సమిష్టి వ్యవసాయం నుంచి విడుదలచేసి, వారికి దీర్ఘకాలిక లీజుమీద తమ స్థోమతకు తగినంత సేద్యపు భూమిని ఇద్దాము అని నిర్ణయించారు. పార్టీనంతటినీ ఈ భావజాలం వైపు తిప్పటంలో ఆయన కృతకృత్యుడైయాడు.







ఈ ప్రక్రియలో రష్యన్‌లు కమ్యూనిజం స్టాలిన్‌ని తిడుతున్నట్లు, మౌసేటుంగ్‌ను పల్లెత్తి ఒక్క మాటకూడా తెగడుతూ అనలేదు. మరి చిత్రపటాలకి, వారి శిలావిగ్రహాలని అలా ఉంచేశారు. కాని, ఈ క్రొత్త పంథాను పార్టీ వ్యతిరేకించే కుట్రదారులుగా ఒక దుష్టచతుష్టయం తయారైంది. మావో యొక్క భార్య ఈ చతుష్టయానికి నాయకురాలు. నిర్దాక్షిణ్యంగా ఈ నలుగురిని అదుపులో పెట్టి ముందుకుసాగారు. ఈ క్రొత్త పంథాలోకి అత్యద్భుతమైనటువంటి తక్షణ ప్రాధాన్యతను సంతరించుకున్న అంగం "కటు పరిమిత కుటుంబం". ఎంత అధిక ఆహారోత్పత్తిని సాధించినా, ఎంత సంపదను సృష్టించినా, జనాభా అంతులేకుండా పెరిగిపోతే వారందికీ విద్యా, వైద్య, ఆవాస సౌకర్యాలు కల్పించడం కష్టం కాబట్టి 1978సం॥ నుంచి పెళ్ళిళ్ళ మీద నియంత్రణ, ఒక్క బిడ్డకన్నా ఎక్కువగా ఉండకూడదనే నియమం పకడ్బందీగా అమలు చేస్తూ వచ్చారు. పెళ్ళి చేసుకోదలచుకున్న యువతీ, యువకులు తమకు ఏ రోగాలు లేవని, వారికి తగిన సంపాదన వుందని స్థానిక అధికారుల నుండి ధృవపత్రాలను తెచ్చుకున్నప్పుడే వారు పెళ్ళి చేసుకోవడానికి వివాహాల రిజిస్ట్రార్ పర్మిషన్ ఇచ్చి, అందులో ఒకే బిడ్డ నియమాన్ని జోడించి, ఆ వివాహ ధృవపత్రాన్ని వాళ్ళకి ఇస్తారు. ఒకరి కన్నా ఎక్కువ బిడ్డ పుట్టినట్లయితే 45,000 డాలర్ల జరిమానా లేక కొన్నేళ్ళ కఠిన శిక్ష విధించబడుతున్నాయి . దీనితో జనాభాపెరుగుదల దాదాపు ఆగిపోయింది.

క్లుప్తంగా చెప్పాలంటే 1978 సం॥లో ఒక్క క్షిపణి, ఆటంబాంబు రంగాలలో తప్ప భారత్ కన్నా వెనుకవున్న చైనా ఈనాడు ఎన్నో రెట్లు ముందున్నది. ప్రపంచంలో చైనా యొక్క జాతీయ, ఆర్థిక సంపద నాల్గవది. నాల్గయిదు ఏళ్ళలో రెండవ స్థానానికి ఎదగబోతోంది. ఆర్థిక, పారిశ్రామిక, వ్యాపార, వ్యవసాయక రంగాలను ప్రైవేటైజ్ చేస్తూ ఉండటం మూలానా, చారిత్రాత్మకమైన చైనీయుల వ్యాపార దక్షత దేశం యొక్క సర్వతోముఖ ప్రగతికి తోడ్పడుతుంది. కేవలం ఉత్పత్తి చేస్తే సంపద పెరగదు. వ్యాపారం చేస్తేనే పెరుగుతుంది. అదికూడా ప్రపంచ స్థాయిలో చేయాలి. అందుకని చైనా వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్

(డబ్ల్యు.టి.ఓ)లో చేరటానికి అమెరికా వంటి దేశాలు భయపడి వ్యతిరేకించి ఎన్నో షరతులు పెడితే, వాటిన్నటి మీద చర్చలు జరిపి, ఉభయామోద్యమైన అంగీకారంతో చైనా డబ్ల్యు.టి.ఓ. లో చేరి, ప్రపంచంలోని అన్ని దేశాలతో వ్యాపారం చేస్తోంది. అందుకనే ఇప్పుడు ఎక్కడ చూసినా, చైనా వస్తువులే, చైనాయంత్రాలే, చైనా ఆయుధాలే. అంతర రాష్ట్రీయ స్థాయిలో జరిగే సదస్సులలో అధికాధిక సంఖ్యలో చైనీయులు పాల్గొంటున్నారు. వ్యాపారం ద్వారా ప్రతి సంవత్సరం చైనా (ఫారెన్ ఎక్స్చేంజ్) విదేశీ ముద్రను విపరీతంగా గడిస్తోంది. ఆ దేశం చేసే ఎగుమతులు దిగుమతుల కన్నా చాలా ఎక్కువగా ఉండడం మూలానా దాని విదేశీ ముద్ర నిల్వలు భారత్ దేశానికన్నా 13 రెట్లు ఎక్కువ. డాలర్లలో 1,70,000 కోట్లు, రూపాయలలో 76,80,000 కోట్లు.

చైనా పౌరునికి తలసరి ఆదాయం విదేశీ ముద్ర సమానత గణనలో 1800 డాలర్లు (రూ. 81,000లు). ఇది భారతదేశానికన్నా 2.6 రెట్లు ఎక్కువ. ఇలా చూసుకుంటుపోతే ప్రతీ విషయంలో సైనిక బలం పటుత్వంతో కూడి, మనకన్నా చైనా శరవేగంతో అభివృద్ధి చెందుతూ అమెరికాకు సింహస్వప్నంగా తయారవుతోంది. అయితే చైనాలో జరుగుతున్న అభివృద్ధి దేశమంతటా జరగడం లేదు. తూర్పు తీరపు ప్రాంతంలోని, రాష్ట్రాలలో అందులోనూ పెద్ద పట్టణాలైన గ్వాంగ్‌షూ, షెంగ్‌జెంగ్, షాంఘాయ్ వంటి నగరాలలో మాత్రమే అత్యధికంగా ఉంది. పశ్చిమానికి వెళ్ళిన కొద్దీ అలాగే వాయువ్య దిశలోను అంటే టిబెట్ ఉన్న ప్రాంతంలోనూ అభివృద్ధి చాలా తక్కువగా ఉంది. గ్రామసీమలలోని ప్రజల తలసరి ఆదాయం పట్నవాసులలో మూడో వంతుగా ఉంటుంది. (ఇదే మన దేశంలో ఎనిమిదవ వంతుగా ఉంటుంది). విద్య, వైద్య, ఉపాధి అవకాశాలలో కూడా ఈ తారతమ్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఈ అసమతులిత అభివృద్ధికి ఈ గణాంకాలు దర్పణం పడతాయి.

జనాభాలోని అత్యున్నత దశకం (10%) చేతుల్లో దేశంయొక్క 45% సంపద ఉంది. అతి నిమ్నదశకం, (10%) చేతిలో కేవలం 1.4% సంపత్తి







మాత్రమే ఉన్నది. గ్రామంలో తలసరి ఆదాయం నాలుగు వందల (400) డాలర్లయితే బీజింగ్, షాంఘాయ్ వంటి పట్టణవాసుల తలసరి ఆదాయం 10 రెట్లయి 4,000 డాలర్లుగా ఉంది. విద్యావకాశాలు తక్కువగా ఉన్న ప్రాంతాలనుంచి విద్యార్థులు తండోపతండాలుగా కోస్తా ప్రాంతానికి వస్తుంటే వారందరికీ ప్రవేశాన్ని ఇవ్వలేకపోతున్నారు.

- ప్రతి సంవత్సరం ఒక కోటి తొంబై లక్షల (1,90,00,000) విద్యార్థులు విశ్వ విద్యాలయంలో ప్రవేశాన్ని కోరుకుంటున్నారు, యాభై లక్షల మందికన్నా ఎక్కువ మందికి ప్రవేశం దొరకడం లేదు. విశ్వవిద్యాలయాల్లో “విద్య మా జన్మహక్కు” అని మనదేశంలో అరచినట్లు అక్కడ అరవనీయరు.
- ప్రైవేటైజేషన్ ప్రారంభించిన తర్వాత ఎన్నో ప్రభుత్వ కంపెనీలు మూసివేయబడ్డాయి. కానీ, వారందరు నిరుద్యోగులవడం లేదు. వారు వేరే వృత్తి, ప్రభుత్వ సహాయంతో నేర్చుకుని ప్రైవేటు కంపెనీలలో కార్మికులుగా చేరుతున్నారు.
- రైతులకు ఎంతెంతో రాయితీలను ప్రభుత్వం ప్రకటిస్తోంది. 2006లో గ్రామీణ ప్రాంతపు అభివృద్ధికి రైతులకు సబ్సిడీలు గానూ చైనా ప్రభుత్వం 45 బిలియన్ డాలర్లు (రూ.లలో రెండు లక్షల రెండు వందల కోట్లు) ఇస్తుంది. వ్యవసాయదారుడు చేసిన ఏ పంటమీద కూడా, వారి భూమిమీద కూడా ఏ పన్నులు లేవు.
- పట్నాల చుట్టూ కొల్లలుగా స్థాపించబడుతున్న పరిశ్రమల కోసం లక్షలాది ఎకరాలు కావలసి వస్తోంది. అందుకని గత ఐదారు సం॥లలో ఒక కోటి మంది రైతులు తమ భూములను పరిశ్రమదారులకు అప్పగించవలసి వచ్చింది. కొన్ని కొన్ని గ్రామాలే మటుమాయ మైపోతున్నాయి.కాని ప్రభుత్వం ఇటువంటి విస్థాపిత రైతులందరికీ ప్రత్యామ్నాయ సదుపాయాలను, పొలాలను ఎక్కడో అక్కడ ఇస్తోంది. అక్కడ కమ్యూనిస్ట్ ప్రభుత్వం మాత్రమే

ఉండటం మూలానా మన దేశంలో ప్రతిదానిని వ్యతిరేకించే మేథాపాట్కర్‌లు, అరుంధతీరాయ్‌లను సహించబడరు కాబట్టి ఈ విస్థాపన, ప్రత్యామ్నాయ స్థాపన సాఫీగా సాగిపోతున్నాయి. ఈ మధ్యనే ప్రపంచంలోనే అతి పెద్దదైన త్రీగోర్జస్ డ్యాం పూర్తిచేయబడింది. కేవలం ఐదు సం॥లలో దాదాపు 40 లక్షలమంది వారి గ్రామాలు మునిగిపోవడం మూలానా వేరేచోట పునరావాసం, డ్యాం పూర్తి అయేసరికే ప్రభుత్వం తలపెట్టినట్టుగా ఏ వ్యతిరేకతనూ సహించకుండా చేసేసింది.

- ఫ్రీ మార్కెట్ (దీన్నే చైనీయులు మార్కెట్ సోషలిజం అని పిలుస్తారు) వ్యవసాయ రంగానికి మాత్రం వర్తింపజేయడం లేదు.

- కమ్యూనిస్ట్ పాలనా సమయంలో దేవుణ్ణి వెళ్ళగొట్టేశారు. మావో యొక్క సాంస్కృతిక విప్లవ సమయంలో చైనాయేకాక ప్రపంచానికే మకుటాయమానమైన మేథావి కన్ఫూషియస్ ఫ్యూడల్ వ్యవస్థ యొక్క బంటు అని, అతను చైనీయులకు నేర్పిన జీవనదృష్టి తిరోగమన పంథాన్ని అనుసరించిందని నానా తిట్లూ తిట్టి, ఆయన బొమ్మలను తగలేశారు. ఇప్పుడు అసమానతలు పెరుగుతున్న దృష్ట్యా, ప్రభుత్వం కాక ప్రతి కుటుంబం తమ సంక్షేమాన్ని తామే ఎక్కువగా చూసుకోవలసి వచ్చేసరికి ప్రజలలో విశేషించి గ్రామ ప్రాంతాలలో దేవుడు కావలసి వస్తున్నాడు. ఇదే అదను అనుకొని ప్రచ్ఛన్నంగా క్రైస్తవ మిషనరీలు దేశంలోకి ఏదో ముసుగులో చొచ్చుకు వచ్చి గ్రామాలలోని ప్రజలను మనదేశంలో వలె క్రైస్తవులుగా మారుస్తున్నారు. ఇది చైనా కమ్యూనిస్ట్ పార్టీకి, ప్రభుత్వానికి ఇష్టం లేదు. వారు తిరిగి బౌద్ధాన్ని, కన్ఫూషియాన్ ధర్మాన్ని ప్రజా బాహుళ్యంలోకి తీసుకురావడానికి ప్రచ్ఛన్న ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో రెండు భాగాలున్నాయి. చైనా పాశ్చాత్య మరియు ఆఫ్రికా దేశాలలో తన సంస్కృతిని చాటటం కోసం కన్ఫూషియస్ పేరిట సంస్కృతీ భవనాలను నిర్మిస్తోంది. మావోసేటుంగ్ భవనాలను కాదు. (ఇది మన కొక గుణపాఠం కావాలి. మనకేంద్ర విద్యామంత్రి అరబ్బు సంస్కృతీ పీఠాన్ని ఢిల్లీలో నెలకొల్పుతున్నాడు. సౌదీ అరేబియాలో, మరే అరబ్బు దేశాలలోకాని, భారతీయ సంస్కృతిని చాటే ఏ అశోకుని పేరో, రవీంద్రనాథుని పేరునో మహాత్మగాంధీ పేరునో, భారతీయ సంస్కృతి భవన్‌నో పెట్టడానికి అనుమతిని కోరలేదు. (ఇది చైనా, భారతీయ నాయకులలోని దేశభక్తిలో ఉన్న తారతమ్యాన్ని ఎత్తి చూపిస్తుంది). చైనాలో క్రిస్టియన్‌ల యొక్క సంఖ్య చైనీస్ క్యాథలిక్కులు 40 లక్షలు, వీరందరూ కూడా చైనీస్ పేట్రియాటిక్ క్యాథలిక్ అసోసియేషన్ అధ్వర్యంలో రోమ్‌తో ప్రమేయం లేకుండా తమ ప్రార్థనాలయాలను, పద్ధతులను నిర్వహిస్తారు. మిగతా 80 లక్షల మంది రోమ్‌లోని వ్యాటికన్‌కు విశ్వాసపాత్రులు, అనుయాయులు. కాని, పోప్ మాత్రం వీరి కోసం ఏ బిషప్‌ని నియమించలేదు. చైనా ప్రభుత్వం మీకు రోమ్‌తో, ఇంకెవరితోనూ సంబంధాలు ఉండకూడదు. మీరు చైనీయులు కాబట్టి మీఅంతటమీరే విదేశీయుల ప్రమేయం లేకుండా మీ బిషప్‌లను ఎన్నుకోండి అని కటువుగా శాసిస్తోంది. పూర్వ సహస్రాబ్దాంతంలో పోప్ చైనాను సందర్శిస్తానంటే, చైనా రానివ్వలేదు. శ్రీలంక రానివ్వలేదు. పాకిస్తాన్ లో కాలు పెట్టలేదు. భారతదేశం వచ్చి, తన అనుయాయులను వచ్చే సంవత్సరాల్లో ఈ దేశంనుంచి క్రీస్తుకు మీరు "ఒక పెద్ద పంటను" అందించాలని ఆదేశించిపోయాడు. ఫలితం మనం చూస్తున్నాం. ఊరూరా చర్చిలు, మత మార్పిడిలూ, వేలాది కోట్ల రూపాయలు వర్షించటం, సమాజంలో సంఘర్షణలు పెరగడం. ఇలా జరుగకుండా ఉండటం కోసమే చైనా మత ప్రచారాలను కొన్ని పరిధులకు పరిమితం చేసింది.

కొన్ని ప్రపంచ విఖ్యాతమైన విజయాలను చైనా ఇటీవల సాధించింది. ఇందులో ముఖ్యమైనవి.

- 40 కోట్ల మొబైల్ టెలిఫోన్ (సెల్‌ఫోన్) వినియోగదారులు, 36 కోట్ల ఫిక్స్‌డ్ టెలిఫోన్ వినియోగదారులు, 76 కోట్ల చైనాలోని టెలిఫోన్లు అమెరికా కన్నా మూడు రెట్లు ఎక్కువ.

- ప్యూడాంగ్ అనే అంతర్జాతీయ విమానాశ్రయం నుండి షాంగై నగరానికి 65 కి.మీ. దూరం ఈ రెంటినీ కలుపుతూ ప్రపంచంలో ఇంతవరకు లేనివిధంగా మాగ్‌లేవ్ అనే టెక్నాలజీని ఉపయోగించి ఒక రైల్వే లైన్

వేశారు. ఈ రైళ్లు గంటకు 430 కి.మీ. ల వేగంతో, 65 కి.మీ. దూరాన్ని కేవలం 7 ని॥లలో పూర్తి చేస్తున్నారు!

- ప్రపంచంలో రైల్వేల చరిత్రకు దాదాపు 170 ఏళ్ళు. ఇంతవరకు అత్యద్భుతమైన రైల్వే లైను రష్యాలో బాల్టిక్ సముద్ర తీరాన ఉన్న సెంట్ పీటర్స్‌బర్గ్ (కమ్యూనిస్ట్ యుగంలో దీనిపేరు లెనిన్ గ్రాడ్) నుండి తూర్పున పసిఫిక్ మహాసముద్రం తీరాన ఉన్న వ్లాడివోస్టాక్ వరకూ పదివేల కి.మీ. కాగా ఈ లైనంతా సమతల ప్రదేశంలో నుండి వెళుతుంది. చైనీయులు బీజింగ్ నుండి టిబెట్ రాష్ట్రానికి ముఖ్య పట్టణం అయిన ల్హాసా వరకూ దాదాపు నాలున్నర వేల కి.మీ. రైల్వే లైన్‌ను వేసి మొదట రైలును జూలై ప్రథమ సప్తాహంలో నడిపారు. వింత ఏమిటంటే ఈ రైల్వే ట్రాక్ మంచుతోబిగుసుకు పోయిన భూమిమీద వేశారు. మంచు కరగకుండా ఉండే పద్ధతిని కనిపెట్టి ప్రవేశపెట్టారు. గోబీ ఎడారి ద్వారా పోతుంది. ప్రపంచంలో అత్యున్నత మైన పీఠభూమి టిబెట్ దానిమీదకి వెళ్ళిపోతుంది. అటువంటి ఎత్తు ప్రదేశం గాలిలో ఆమ్లజని శాతం తక్కువ. ప్రయాణీకులకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తగ్గి గుండె దడపుడుతుంది. కనుక విమానాలలో ఏ విధంగా అయితే ప్రెషరైజ్ ఆక్సిజన్ సరఫరా ఉంచుతారో అదే విధంగా రైల్వే ప్రయాణీకులకు ఆక్సిజన్‌ను పీల్చే పరికరాలను, యంత్రాలను కూడా ఈ రైళ్ళలో పెట్టారు. ఈ విధంగా దేశం యొక్క అఖండత కోసం, అవిచ్ఛిన్నత కోసం రైల్, రోడ్, ఏరోప్లేన్ సదుపాయాలను అమితంగా పెంచుతోంది.

- గత ఏడెనిమిది ఏళ్ళలో 45,000 కి.మీ. నేషనల్ హైవేకి, ప్రతిదానికీ 8 ట్రాఫిక్ లేన్స్ ఉండేటట్లుగా నిర్మించింది. వచ్చేనాల్గేళ్ళలో మరో 50వేల కి.మీ. నిర్మించి, అమెరికాను అధిగమిస్తుంది.

- చైనా ప్రభుత్వం 10 ఏర్‌లైన్ కంపెనీలను స్థాపించి, దేశంలో కొన్ని వందల ఎయిర్‌పోర్టులను నిర్మాణం చేసింది. సం॥నికి 15 కోట్ల మంది దేశంలోనే విమానం ద్వారా ప్రయాణం చేస్తున్నారు. మనదేశంలో ఈ సంఖ్య 5 కోట్లకి దాటలేదు.







- పట్టణాలలో, గ్రామాలలో ఎక్కడా చూసిన బహుళ అంతస్తుల భవనాల నిర్మాణమే నిర్మాణం, అందరికి ఫ్లాట్స్, అందరికీ విద్య, అందరికీ ఉపాధి. అసమానతలను ఏ విధంగా తగ్గించాలి అనే ప్రశ్న చాలా క్లిష్టంగా తయారవుతుంది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 1978 సం॥ వరకూ కూడా మనకన్నా వెనుకబడి ఉన్న చైనా అమెరికాకు, ప్రపంచానికే సింహస్వప్నంగా తయారయ్యే దశకు ఎలా వచ్చింది. భారతదేశం ఎందుకు రాలేదు? రాగలదా? రెండు దేశాల మధ్య ఒకే ఒక్క మహా బేధం ఉంది. చైనాలో సింగిల్ పార్టీ నియంతృత్వం. ఇక్కడ 44 పార్టీలు తమలో తాము, ఇతరులతో అనుదినం కుస్తీ పట్టుకుంటూ, పార్టీలు మార్చుకుంటూ, ఇది చేశావంటే ప్రభుత్వాన్ని కూల్చేస్తాం అని జడిపిస్తూ తమ పాక్షిక ప్రయోజనాలను సాధించుకుంటూ, వ్యక్తి నాయకత్వంలోకి పార్టీల సంఖ్యను పెంచుకుంటూ పోతున్నది. మన రాజకీయ వ్యవస్థ వల్ల మనకు ప్రతి సంవత్సరం ఎలక్షన్లే. మద్యపాన ప్రవాహమే, ధనవర్షమే, రక్తపాతమే. ఈ అరిష్టాలు చైనాలో లేవు.

**ఆత్మశుద్ధిలేని యాచారమదియేల?**
**భాండశుద్ధిలేని పాకమేల**
**చిత్తశుద్ధిలేని శివపూజలేలరా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

భా॥ ప్రాచీన కాలం నుండి ఆచారంగా వచ్చే ఏ పనినైనా అంతఃకరణ శుద్ధితో ఆచరించాలి. శుద్ధిలేని ఆచారం వ్యర్థం. వంట చేసేటప్పుడు పాత్ర శుభ్రంగా ఉందా లేదా చూసుకోవాలి. స్నానాదులు, జపాదులు పైకి కన్పించే ఆర్భాటాలు కాక, తనలోని కామక్రోధాదులు లేకుండా ప్రశాంతంగా ఉండగలగాలి. మనసులో మాలిన్యముంచుకొని, పైకి ఆడంబరంగా శివపూజ చేసినా ఫలితముండదు.

# 25. మైనారిటీ స్కూళ్ళలో అవినీతి, అక్రమాలు

నర్సాపూర్, బందరు పట్టణాల్లో క్రిస్టియన్ మైనారిటీ స్కూళ్ళలో జరుగుతున్న అక్రమాలు ఇటీవలే బయల్పిడినాయి. అవినీతిపరులైన ప్రభుత్వ ఉద్యోగులతో కుమ్మక్కై ప్రభుత్వంలోని వారి మతస్తుల సహాయ సహకారాలతో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎయిడెడ్ పోస్టులను భర్తీ చేసుకోవడం తమ ఇష్టం వచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం వీరి కార్యకలాపాలు. అందులోనూ టీచర్ల నియామకంలో అనుసూచిత కులాలకు, తెగలకు ఉన్న రిజర్వేషన్లు పాటించకుండా వుండటం మరొక నియమోల్లంఘక దుస్సాహస దుశ్చర్య. ప్రభుత్వం యొక్క డబ్బును పొందుతూ ప్రభుత్వం ఉద్దేశించిన రిజర్వేషన్లు ఇవ్వకుండా, మేం మైనార్టీలం కాబట్టి యధేచ్ఛగా ప్రవర్తిస్తాం అని చెపుతున్నారు. ఈ మైనారిటీలు విశేషించి క్రిస్టియన్ దళితులు ప్రభుత్వంలోనే కాదు, ప్రైవేటు కంపెనీల్లో కూడా రిజర్వేషన్లు కావాలని డిమాండు చేస్తుంటే మైనారిటీ విద్యాలయాల్లో ప్రభుత్వ సహాయం పొందుతున్నప్పుడు, రిజర్వేషన్ నియమాలను వీరెందుకు పాటించరు?

ఇవన్నీ చూస్తుంటే మన భారతదేశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ కూడా మైనారిటీల ఆధీనంలోకి వెళ్ళిపోయినట్లు కనిపిస్తుంది. అవినీతిపరులైన నిజాయితీలేని, ఐతిహాసిక స్పృహ తప్పిన హిందూ ప్రభుత్వోద్యోగులు కూడా, ఈ దుష్ట సంప్రదాయాల్లో మునిగి పోతున్నట్లు కనిపిస్తోంది. దీనికి అడ్డుకట్టలేమా?







# 26. దళిత క్రైస్తవులు

'కుల వివక్షత, అంటరానితనము, బీదరికముతో బాధపెడుతున్న హిందు మతాన్ని, వదలి క్రైస్తవులుగా మారితే మీరు బాగుపడతారు' అని చెప్పి ఎన్నో దేశాలనుంచి చర్చిల ద్వారా డబ్బు తీసుకొచ్చి, ప్రలోభపెట్టి, హిందూ హరిజనులను క్రైస్తవంలోకి మార్చుతున్నారు. కాని కొన్ని తరాలుగా క్రైస్తవులుగా వున్నప్పటికిని, క్రైస్తవ సంస్థల్లోనే వారు వివక్షతకు గురి అవుతున్నారనే అంశాన్ని బాహాటంగా, క్రైస్తవ మతసంస్థల్లో 'మాకూ ఉన్నత స్థానాలు కావాలి' అని అందుకు వందలాది క్రైస్తవ మాదిగలు, హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో వున్న సెంట్‌జాన్స్ సెమినరీ హాలు ముందు ప్రదర్శన చేశారు. రాష్ట్రంలో వున్న పదమూడు బిషప్‌ల్లో ఒక్కటి కూడా మాదిగ క్రైస్తవులకు దక్కలేదు. వీరి సంఖ్య 50% నికి పైగా వున్నా వీరిని సంపూర్ణంగా కాదని, పదమూడు బిషప్‌ల నియామకాల్లో, అత్యల్ప సంఖ్యలో వున్న అగ్రవర్గాల వారికే నియమించారట. ఈ సత్యము వల్ల క్రైస్తవ నాయకుల యొక్క కుతంత్రం వెల్లడవుతోంది. వారి సంస్థలైన చర్చి, ఆసుపత్రి, విద్యాలయాల్లో దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ ఇవ్వకుండా, హిందూ హరిజనులకు ఉద్దేశింపబడిన రిజర్వేషన్లు క్రైస్తవులకివ్వాలని, దానికోసం చట్టాలను రాజ్యాంగాన్ని మార్చాలని కోరుతున్నారు. క్రైస్తవ ప్రచారకుల అబద్దాలను, శుష్క వాగ్దానాలకు నమ్మకూడదనీ, వారిచ్చే ప్రలోభాలకు అమ్ముడు పోకూడదని హరిజన సోదరులు స్పష్టంగా గ్రహించాలి. అందుకనే అంబేద్కర్‌గారు హరిజనులందరిని బౌద్ధులవమన్నారు కాని, క్రైస్తవులుగా గాని, ముస్లింలుగాగాని మారకూడదని ఉద్బోధించారు. అలా మారినంతనే వారు దేశ విద్రోహులవుతారని ఆయన హెచ్చరించారు.

# 27. సంస్కరణలు అభివృద్ధి కోసమా? వాటి వ్యతిరేకత యధాతథాన్ని శాశ్వతీకరణ కోసమా?

**మనదేశం జనాభా పెరుగుతున్నది. వారి తలసరి ఆదాయం పెరుగుతున్నది. దానితోపాటు వారికోరికలు నూతన పరికరాల అవసరాలు పెరుగుతుండటం మూలానా మొత్తం వ్యాపారమే పెరుగుతుంది. అంతేకాని, పరిమిత వ్యాపారం ఉండడం మూలాన పెద్దచేపలు చిన్నచేపలను మింగేసే పరిస్థితి రాలేదు. చివరకు ఇది ఒక్క చైనాలోనే కాదు. అమెరికా, యూరప్‌దేశంలో కూడా ఇంకా బ్రతికి ఉన్న వాస్తవం. బూచిని చూపించి మార్పును, మార్పువల్ల వచ్చే స్వీకృత యోగ్యమైన పరిణామాలను వ్యతిరేకించడం తగదు.**

మన దేశంలో ఒకప్పుడు కుమ్మరివాళ్ళు, కమ్మరివాళ్ళు, మంగలిలు, చాకళ్ళు, పల్లకీమోసేవాళ్ళు, గాడిదమీద సామాన్లు చేరవేసేవాళ్ళు లక్షలమంది ఉండేవాళ్ళు. ప్లాస్టిక్ వస్తువులు, సైకిళ్ళు, మోటార్‌సైకిళ్ళు, లారీలు, రైలుబండ్లు ఇత్యాది యాంత్రిక యుగ పరికరాలు రావడం మూలానా ఇత్యాదులు అదృశ్యమైనాయి. కాని ఆ వ్యక్తులు, ఆ కుటుంబాలు నాశనమైపోయాయా? లేదు, చదువుకుని యాంత్రిక నైపుణ్యాన్ని నేర్చుకుని మరో వృత్తుల్లో ఉంటున్నారు. టెలిగ్రామ్‌లు పోయి టెలెక్స్ వచ్చి, టెలెక్స్ పోయి ఫ్యాక్స్‌వచ్చి, ఇ-మెయిల్ వచ్చి ఫ్యాక్స్ పోతోంది. అదే విధంగా టెలిఫోన్ ఆపరేటర్‌లు పోయి, ఎవరికి వారే టెలిఫోన్ కాల్స్ చేసుకుంటున్నారు. శాస్త్ర జ్ఞానం, సాంకేతికజ్ఞానం, కాలంలో వృత్తుల్లో, జీవన సరళిలో మార్పులు తీసుకువస్తాయి. మార్పుకు అనుగుణంగా స్పందించనివారు, స్పందించలేనివారు నిరోధకులు నష్టపడతారు. విజ్ఞులైన వారు ప్రజలను మార్పుకోసం సిద్ధం చేయడానికి దానికి కావలసిన విద్యను, సమాజ , పారిశ్రామిక, విఫణి వ్యవస్థలను ప్రభోదించి ఆచరణలోకి తీసుకురావాలి.

నేనుంటున్నది పి అండ్ టి కాలనీ, కార్ఖానా, సికింద్రాబాద్‌లో. నా ఇంటికి కిలోమీటర్ వలయంలో దాదాపు పది చిల్లర దుకాణాలు (గ్రాసరీ దుకాణం) 15 సం౹౹ నుండి ఉన్నాయి. గత 5,6 సం౹౹లో మూడు సూపర్ మార్కెట్‌లు మా







క్షేత్రంలో వెలిశాయి. సహకార రంగంలోని సూపర్ మార్కెట్, అప్నాబజార్ మూసుకుపోయింది. మిగతా రెండు 200 మీటర్ల అంతరంలో ఉన్నాయి. ఇవి విరాజిల్లుతున్నాయి. కాని విస్తృతంగా విచారించిన తర్వాత 15 సం౹౹నుండి పనిచేస్తున్న పచారికొట్ల యజమన్యాలు చెప్పినదేమిటంటే ఈ సూపర్ మార్కెట్‌ల వల్ల వారి వ్యాపార .... తక్కువ అవ్వలేదు. ఈ 10, 15 సం౹౹లలో వందలాది క్రొత్త ఇళ్ళు వచ్చాయి, జనాభా పెరిగింది, మా వ్యాపారాలూ పెరుగుతున్నాయి. వాళ్ళ మార్కెట్ వాళ్ళది, మా గ్రాహకులు మావాళ్ళు. దేశం యొక్క జనాభా పెరుగుతుంది, వారి తలసరి ఆదాయం పెరుగుతోంది, దానితోపాటు వారికోరికలు, నూతన పరికరాల అవసరాలు పెరుగుతుండటం మూలానా మొత్తం వ్యాపారమే పెరుగుతోంది. అంతేకాని, పరిమిత వ్యాపారం ఉండటం మూలానా పెద్ద చేపలు చిన్న చేపలను మింగేసే పరిస్థితి రాలేదు. చివరకు ఇది ఒక్క చైనాలోనేకాదు, అమెరికా, యూరప్ దేశంలోకూడా నేటికి ఉన్న వాస్తవం. బూచిని చూపించి మార్పును, మార్పు వల్ల వచ్చే స్వీకృత యోగ్యమైన పరిణామాలను వ్యతిరేకించడం తగదు.

చైనా నుంచి, కొరియా నుంచి మనకు ఎన్నో వస్తువులు వస్తున్నాయి. చిన్న రేడియోలనుంచి, కారుల వరకు కూడా. బహుళ జాతి సంస్థలు ఆయా దేశాల్లోకొని, ఇక్కడ విక్రయిస్తున్నారు. ఆదేశాల విదేశీ వ్యాపారం వారి విదేశీ ముద్ర సముపార్జన బహుళ జాతి సంస్థల లాభాలు పెరుగుతున్నప్పటికీ మనదేశంలో పూర్వం కన్నా తక్కువ ధరలకే ఆ విదేశీ వస్తువులు అమ్ముడైపోతున్నాయి. దీని వలన మన ప్రజలు లాభం పొందడం లేదా!

ఉత్తర కొరియా, క్యూబా 16 సం౹౹ క్రితం వరకు తూర్పు జర్మనీ, విదేశీ వస్తువులను రానీయకుండా దుర్భేద్యమైన స్వదేశీ వాణిజ్య, పారిశ్రామిక, విద్యా వ్యవస్థలను నెలకొల్పుతున్నారు. సమీపంలో ఉన్న ఫ్లోరిడా, దక్షిణ కొరియా, పశ్చిమ జర్మనీ ప్రజలతో పోలిస్తే క్యూబా, ఉత్తర కొరియా, తూర్పు జర్మనీల ప్రజలు దారిద్ర్యంలో వున్నట్లు తెలుసుకోదలచిన వారికి సువిదితము. అంత దూరం ఎందుకు పశ్చిమబెంగాల్‌లో 25 సం౹౹ నుంచి ఏకఛత్రాధిపత్యంతో పాలిస్తున్న కమ్యూనిస్ట్‌లు స్వేచ్ఛా విఫణిని వ్యతిరేకించి వారి హయంలో ఏమి

సాధించగలిగారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం, గృహవసతి లేమి వంటి విషయాల్లో పశ్చిమ బెంగాల్ మనదేశంలోని రాష్ట్రాల్లో అగ్రశ్రేణిలోనే వుంది.

ఆత్యాసక్తికరమైన విషయాన్ని గురించి ఏ పార్టీకూడా, ఏ నాయకుడు కూడా మాట్లాడకుండా వుండడం మనకు విస్మయాన్ని కలిగించాలి. మనదేశంలో ప్రస్తుతం ఉన్న నిరక్షరాస్యతతో, సాంకేతిక నైపుణ్య విహీనతతో, ఆర్థిక వనరుల అభావంతో, అపరిమితంగా పెరుగుతున్న, విశేషించి బీదవారిలో, విద్యలేనివారిలో గ్రామీణ ప్రాంతాల్లోకి నిరుద్యోగులలో పెరుగుతూనే వున్న జనాభాని మనదేశం భరించగలదా? ఈ ప్రశ్ననే క్షుణ్ణంగా విమర్శించుకుని విజ్ఞతతో చైనా, సైద్ధాంతిక మౌఢ్యాన్ని 1978లో అవతలపెట్టి ఏతల్లిదండ్రులు కూడా ఒక్కరి కన్నా ఎక్కువ సంతానం ఉండకూడదు అని శాసించి అమలుచేశారు. తత్పర్యవసానంగా దేశం యొక్క స్థూల ఉత్పత్తి అద్భుతంగా పెరుగుతూ, తలసరి ఆదాయం కూడా పెరిగి 1978లో మన కన్నా అన్ని రంగాల్లో (అణ్వస్త్రాలు, క్షిపణులు తప్ప) వెనుకబడిఉన్న చైనా మనకన్నా మూడు రెట్లు తలసరి ఆదాయాన్ని సాధించింది. వచ్చే 20సం॥లో అమెరికానే అధిగమించే ప్రయత్నం చేస్తోంది. ఆ దేశంలో ప్రతిరంగంలో గుత్తాధిపత్యాన్ని తీసేస్తూ, దేశీయ, విదేశీయ పెట్టుబడులను ఎక్కువ చేయడం కోసం, ఆర్థిక విధానాన్ని సరళీకృతం చేస్తోంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ) చేరడం కోసం 15॥లు కృషిచేసి ప్రతి రంగాన్ని సరళీకృతం చేసి విదేశీ పెట్టుబడులను, కంపెనీలను ఆహ్వానిస్తోంది. దాంతోబాటు దూరదృష్టితో స్వదేశీయుల్లో విద్యను, ఆరోగ్యాన్ని, సాంకేతిక నిపుణతను, వాణిజ్య పటిమను పెంపొందిస్తోంది. ఒక్క పారిశ్రామిక, రిటైల్ వ్యాపార రంగంలోనే కాకుండా, విదేశీ విద్యాలయాలను కూడా చైనాలో ప్రవేశింపచేసింది. నిజంగా పోటీతత్వాన్ని పెంచి ఉత్పాదకతను పెంచడం, ప్రపంచ స్థాయిలో ఎదగడానికి చైనా యాజమాన్యంలోకి బహుళ జాతీయ వ్యాపార సంస్థలను చైనా ఎదిగి, పోషించి, విజృంభింపచేస్తోంది. అది మన నాయకుల యొక్క, రాజకీయ పక్షాల యొక్క, దేశభక్తుల యొక్క ధ్యేయం కావాలి. ఎటువంటి నైపుణ్యంతో చొరవతో, దృక్పథంలో మన ఐ.టి., బి.టీ కంపెనీలు ప్రపంచస్థాయికి ఎదుగుతున్నాయో, అటువంటి స్థాయికి ప్రతి రంగాన్ని మనం ప్రేరేపించి ఆత్మ విశ్వాసాన్ని సృష్టించి, నైపుణ్యతను సంపాదించేసి,







విజృంభింపచేయాలి. చివరిగా, విజాతీయ, రాజకీయ సిద్ధాంతాన్ని, మతాలను విచ్చలవిడిగా మనదేశంలో మన్నించడమేకాక, మన రాజకీయ నాయకత్వంలో కూడా విదేశీ ప్రత్యక్ష నివేశం (పారెన్స్ డైరెక్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్) ఒప్పుకున్న శక్తులు విదేశీ వాణిజ్య సంస్థలను రిటైల్ రంగంలో ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి.

**గమనిక:** మనదేశంలో పచారీ కొట్ల సంఖ్య ఒక కోటి ఇరవై లక్షలు. వారిలో ఉపాధి కలిగిన వారు రెండు కోట్ల పది లక్షలు.

**జలముల నగ్ని ఛత్రమునఁ జడమ యూఖం దండ తాడనం**
**బుల వృషగార్ధభంబులను బొల్పగు మత్తకరీంద్రముఁ సృణింప**
**జెలఁగుడు రోగ మౌషధము చే విషముందగు మంత్రయుక్తిని**
**మ్ములఁదఁజక్క జేయనగు మూర్ఖునిమూర్ఖతమాన వచ్చునే!**

భా॥ నీటిచేతనిప్పును, గొడుగుతో ఎండను, కొట్టుటచే వృషభ గార్దభములను, శూలముచే మదించిన యేనుగును, ఔషధమువలన రోగమును, మంత్రముచే విషమును నివారింపవచ్చును. కాని మూర్ఖుని మూర్ఖత్వమును మాన్పదగిన యౌషధము గాని మంత్రములు గాని లేవని చెప్పవచ్చును.

## 28. ఉమ్మడి పౌర చట్టం అవసరమే కాని.....

భారత జాతీయత సమైకత్యకు, పటిష్టతకు ఉమ్మడి పౌరసత్వ చట్టము ఎంత అయినా అవసరమే. కాని అటువంటి చట్టాన్ని ప్రవేశపెట్టే ధైర్యము గాని, విశ్వాసముగాని ఏ పార్టీకి కూడా లేవు. ఎవరు అయినా ప్రవేశపెట్టినట్లయితే, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వారు, వివిధ రకాలయిన సోషలిస్టులు ప్రాదేశిక పార్టీలు గగ్గోలు పెడతాయి. ముస్లీమేతర పార్టీలు ముస్లీముల ఓట్ల కోసం కాసుకు కూర్చునటువంటివి చాలా ఉన్నాయి. ఇవి ఈ చట్టాల్ని పూర్తిగా వ్యతిరేకిస్తాయి. కాని, ఈ దేశానికి ప్రజలకు హాని చేస్తున్న విషయాలను గురించి రెండు చట్టాలు ఎంత అయినా అవసరం. ఒక్కడు బహు భార్యలను కలిగి ఉండుటను, కుల, మత ప్రాతిపదిక లేకుండా నిషేదిస్తూ ఒక చట్టము కావాలి. దేశంలో ప్రజోత్పత్తి విపరీతంగా జరుగుతోంది. దానివలన మనము సాధించిన ప్రగతి నీరు కారిపోతుంది. ఎవరు అయితే బీదవారో, ఎవరు అయితే నిరక్షరాస్యులో, వారిలో అంతులేని సంతానము కలుగుతోంది. విశేషించి ముస్లీములలో అదే పనిగా ఒక పథకం ప్రకారం తమ సంతానము ఎక్కువ చేసుకోవడం, బహు భార్యలను కలిగి ఉండటము జరుగుతోంది. ముస్లీము కుటుంబాలలో 5 నుంచి 50 వరకు పిల్లలు కలుగుతున్నారు. ఈ సంకటము నుంచి చైనా ఏ విధంగా రక్షించుకుందో భారతదేశంలో కూడా, ఇద్దరి కన్నా ఎక్కువ మందిపిల్లలు ఉండకూడదు. ఎవరికి అయితే ఇద్దరిని మించి పిల్లలు ఉంటారో వారికి ఓటు హక్కు తీసివేయాలి. వారికి ఏ విధమైన ప్రభుత్వ రాయితీలు ఉండకూడదు. ఈ రెండు చట్టములు తీసుకొని వచ్చినట్లయితే, కామన్ సివిల్ కోడ్ వలన పొందే సత్ఫలితాలు 90శాతం వరకు పొందవచ్చు. ఎంత మంది హిందువులు వ్యతిరేకించినా, ప్రజా కళ్యాణం కోసం, ప్రజా శ్రేయస్సు గురించి, హిందూ వివాహం, పౌరసత్వం గూర్చి వేరు వేరు చట్టములను తీసుకుని వచ్చాయి. ఈ సిద్ధాంతం ఆధారంగా, మతం వ్యతిరేకిస్తునా ఈ రెండు చట్టములు తక్షణమే తీసుకుని రావాలి. దేశభక్తికి ఇది గీటురాయి.







## 29. ఉమ్మడి పౌరసత్వ సంహిత

**వం**దేమాతర వ్యతిరేకతను సహిస్తున్న, పాకిస్తాన్ జెండాల ఎగవేతను
నిస్సహాయతతో చూస్తున్న, ఆయుధాలను ప్రార్థనా స్థలాలలో సమీకరిస్తే
మిన్నకుంటున్న పార్టీలు, ప్రభుత్వాలు, ముస్లిం వ్యతిరేకతను పట్టించుకోకుండా
ఉమ్మడి పౌరసత్వ సంహితను ప్రవేశపెట్టే ధైర్యవంతులా?

ఏవిధంగా, ఎంతమంది హిందువులు వ్యతిరేకించినా, విడి విడిగా వారసత్వాన్ని గురించి, వివాహాలను గురించి ప్రజల మేలుకై హిందువులనుద్దేశించి చట్టాలు చేశామో, అదేవిధంగా దేశశ్రేయస్సు కొరకుబహుభార్యాత్వాన్ని నిషేధిస్తూ ఒక చట్టం, ఇద్దరికన్నా ఎక్కువ బిడ్డలున్న వారికి పౌరసత్వం, ఓటు హక్కు, సంక్షేమ పథకాలకు అర్హత తీసివేసే మరో చట్టం చేయాలి. ఈ చట్టాలు జాతి,మత, కుల, ప్రాంత వివక్షతలేకుండా అందరికీ వర్తించాలి. బహుభార్యత్వం వల్ల స్త్రీలకు అన్యాయం జరుగుతోంది. దీంతోపాటు అంతులేని సంతానం వల్ల, అందులోనూ నిరక్షరాస్యుల్లో, బీదవారిలో, ఉదరపోషణకు సామర్థ్యం లేని వారిలో అసంఖ్యాకమైన పిల్లల వల్ల దేశం బీదరికంలో మగ్గవలసి వస్తోంది. అందుచే తక్షణం, బహుభార్యాత్వం, అధిక సంతానం నిషేధించే చట్టాలను చేయాలి. మిగతా విషయాలు తరువాత చూసుకోవచ్చు.

# 30. సిగ్గుచేటు

తెలుగుదేశం అధినేత ముస్లింల ఓట్లకై ఎటువంటి హేయమైన పనికైనా సిద్ధపడతారని మరోసారి నిరూపిస్తున్నారు. హైదరాబాద్ నాంపల్లిలో హాజ్ హౌజ్ కట్టడానికి లౌకికనీతి మాది అని ఘోషించే చంద్రబాబు గారి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఇచ్చారు. ఇప్పుడు దాని ప్రక్కన వున్న మరో స్థలాన్ని ప్రభుత్వం స్వాధీన పరచుకొని హజ్‌హౌజ్‌కి దానం చేయాలని, ఆలా చేయనట్లయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తానని ఘోషిస్తున్నారు. ప్రతి జిల్లాలో ఒక ఉర్దూ ఘర్‌ను, ఒక షాదీఖానాను ముస్లింలకై కట్టి వాళ్ళ మసీదుల మరమ్మత్తుకై ప్రభుత్వపు సొమ్మును దానం చేసినప్పటికీ హైదరాబాదులో ముస్లిం ఆధిక్యం వున్న ఒక్క వార్డులో కూడా మునిసిపల్ ఎన్నికల్లో తెలుగుదేశపు లౌకికవాద ముస్లింలు గెలవలేదు. మతతత్వ ఎం.ఐ.ఎం. తో తలపడి డిపాజిట్‌లు కోల్పోయారు. అయినప్పటికీ కళ్ళు తెరుచుకోలేదు. గాంధీ- నెహ్రూ-ఆజాద్‌లకు మొండి చేయి చూపించిన ముస్లిం ఓటర్లు, చంద్రబాబు లాంటి బిక్షాటకులకు ఓట్లు వేస్తారా? ప్రభుత్వాధికారం కోసం ముస్లిం ఓట్లకై హిందువుల మనోభావాలను తృణీకరిస్తూ వారు చెల్లించే సొమ్మును మైనారిటీలకు వెచ్చించటమా? ఇటువంటి హేయ ప్రవర్తనను జాగరూకులైన భారతీయులు గ్రహించి, సరియైన బుద్ధి చెప్పాలి.







# 31. బుష్‌కు స్వాగతం

భారతదేశం అనాదినుంచి అతిథి దేవోభవ అని విశ్వసిస్తూ, ఎంతోమందిని గౌరవిస్తూ వచ్చింది. ప్రపంచానికంతటికి ఉగ్రవాదాన్ని నేర్పి, మానవబాంబులను తయారుచేయించి, వందలాది మందిని పొట్టనబెట్టుకున్న, నిర్దోషులైన బాలబాలికలను, క్రీడాకారులను , ఇతరులను అపహరించి కుత్తుకలు కోయించిన పాలస్థీనా యొక్క యాసేర్ అరాఫత్‌కి మన దేశంలో స్వాగతం చెప్పి, సన్మానాలు చేసి, గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశాము. మన దేశానికి అతిథిగా వచ్చి ఈ భూభాగంలో ఉన్న హిందువులను, బౌద్ధులను ఈ సహస్రాబ్దంలో క్రిస్టియన్‌లుగా మార్చండని మిషనరీలకు, చర్చిలకు సందేశం ఇచ్చిన పోప్‌జాన్‌పాల్-2 కి ఘనంగా సత్కరించాము. కూలీలుగా, ఇంజనీర్లుగా పనిచేయించుకోవడానికి హిందువులను రప్పించుకుంటూ, వారు తమ దేవుళ్ల యొక్క బొమ్మలను తమతో ఉంచకూడదని, హిందూ మతం ప్రకారం ప్రార్థనలుగాని, బొట్లు లాంటివి పెట్టుకోకూడదని శాసించిన సౌదీ అరేబియా రాజును గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా పిలిచి సత్కరించాము. హిందీ-చైనా భాయి భాయి అని నినాదం చేయించి, తదుపరి మన దేశం మీద దండయాత్రను చేసిన, టిబెట్‌ను ఆక్రమించి, లక్షలాది బౌద్ధులను మనదేశంలో కాందిశీకులుగా చేసిన చేపిక్-లాయ్‌ని ఆహ్వానించి ఘన సత్కారాలు చేశాం. హంగేరీ, జకోస్లోవేకియా, పోలెండ్ , తూర్పు జర్మనీ, ఆఫ్ఘనిస్తాన్‌ల మీద సైన్యాలను పంపి, ఆ దేశాల్లోని స్వాతంత్ర్యోద్యమాన్ని టాంకర్‌లతో, బాంబర్లతో అణచివేసిన కృశ్చేవ్, కోసిగిన్, బ్రేజ్‌నేవ్ వంటి కిరాతక కమ్యూనిస్టులను సోవియట్ రష్యానుంచి ఆహ్వానించి స్వాగతం చెప్పాం. వీరందరికన్నా ఎక్కువ నేరాలు బుష్ చేయలేదు. భారతదేశంయొక్క ఆర్థిక ప్రగతిని, మిలటరీ శక్తి సామర్థ్యాలను, మేథోసంపత్తిని, ప్రజాస్వామ్యం యొక్క దృఢత్వాన్ని గుర్తించి, మన స్నేహం కోరుతూ వున్న బుష్‌ను మనదేశంలో వ్యతిరేక ప్రదర్శనలు చేయడం భారతదేశానికి ద్రోహం. ఇలా వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నవారు దాదాపు 70

సం॥ నుండి కలసి మెలసి భారతదేశ విభజనకు, బలహీనతకు, వెనుకబాటుతనానికి, పేదరికానికి కారకులైన శక్తులు. పిట్టకొంచెం, కూత ఘనం అన్నట్లు , ఈ ప్రదర్శన కారులకు ప్రజాభిమానం లేదు. కాకపోతే, వేలమందిని శాశ్వత ప్రదర్శకులుగా పోషిస్తున్న శక్తులే ఈ ప్రదర్శనలను నిర్వహించుతున్నాయి. భారత్ – అమెరికాల మైత్రి మన ఆర్థిక ప్రగతికి బాట. ప్రపంచశాంతికి దోహదకారి. పరదేశీయ మతప్రేరితులైన భారతీయం కాని, రాజకీయ సిద్ధాంత మోహితులైన వారు మాత్రమే ఈ ప్రదర్శనలు చేస్తున్నారని, వారి వెనుకదేశీయుల పెట్టుబడి ప్రేరణ ఉన్నాయనేది విజ్ఞులకు సువిదితమే.

మన నగరంలో తరచూ హింసాత్మకమైన అల్లర్లను చాలా శుక్రవారాల్లో మాదిరిగా తిరిగి అల్లకల్లోలం చేస్తారనే భయంతో కొన్ని స్కూళ్ళు కూడా మూసేస్తున్నారు. దీన్ని బట్టి వ్యతిరేక ప్రదర్శన కారుల యొక్క రూపం వారి ప్రయోజనాలు, వారి లక్షణాలు సామాన్య ప్రజలకు కూడా తెలుసు. ప్రభుత్వం ఉపేక్షించక, ఈ దుష్టశక్తులను నిర్బంధించి ఉండవలసింది.

**అల్పబుద్ధి వాని కధికారమిచ్చిన**
**దొడ్డవారి నెల్లఁ దొలగ చేయు:**
**చెప్పు తినెడి కుక్క చెరకు తీపెరుగునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

భా॥ అల్పమైన బుద్ధికలిగిన వాడికి అధికారమిస్తే, మంచి వారందరరినీ ఉన్నతాధికారులందరిని తీసివేస్తుంటాడు. వారిగొప్పతనాన్ని గుర్తించలేడు. చెప్పులు తినేకుక్కకు చెరుకుగడ అందిస్తే దానిరుచి, రసంలోని మాధుర్యం గ్రహించలేదు.





# 32. మైనారిటీల వెనుకబాటుతనం

ఇందిరమ్మ రాజ్యంతో, ఇంటింటా సౌభాగ్యం తెచ్చేందుకేమో, సోనియా నిర్దేశిత యు.పి.ఏ ప్రభుత్వ, మైనారిటీ (ముస్లింలకు మారుపేరు)ల యొక్క సాంఘిక, ఆర్థిక, విద్యాస్థితిని అధ్యయనం చేసి, వారి ప్రగతికి ప్రత్యేక సూచనలివ్వాలని జస్టిస్ రాజేందర్ సచ్చర్ కమిటీని వేసింది.

ముస్లింలు 700 ఏళ్లు ఈ దేశాన్ని ఏలినా, మేం వెనుకబడ్డవాళ్లం, మాకు రిజర్వేషన్లు, మరితర రాయితీలు కావాలనీ, ఈయకపోతే పెద్ద ఉద్యమం లేపుతామని అంటున్నారు. ఆ ఉద్యమం ఎలా ఉంటుందో, శుక్రవారం, ఫిబ్రరి 17న చవిచూశాం హైదరాబాద్ పాతనగరంలో, బీదరికానికి, వెనుకబడటానికి అసలు కారణమేమిటో మరోసారి హైదరాబాద్‌లో చూస్తున్నాం. అహమ్మద్ బిన్ సలాం, సబేరా బేగం దంపతులకు 9 కూతుళ్లూ, ఒక కొడుకూ, వెరసి పదిమంది సంతానం. చదువులేదు. ఉద్యోగం లేదు. ఇద్దరి పిల్లల్ని అరబ్ దేశమైన ఓమన్‌లోని వృద్ధులకు పదేసి వేలు రూపాయలు తీసుకొని పెళ్లి చేసాడు. మరో అమ్మాయిని 80 ఏళ్ల ఓమన్ అరబ్ వృద్ధునకు, పదివేలు తీసుకుని, పెండ్లి చేశాడు. 20–27 ఏళ్ల పిల్ల, ఈ ముసలి వాడు నాకొద్దో అని ఏడుస్తుంటే, ఇరుగు పొరుగువారు ప్రోగై, కలుగజేసుకొన్నారు. ఒక పోలీస్ కేసు నడుస్తోంది.

ఈ విధమైన ఉదంతాలు వేలల్లో ఉన్నయ్. కారణాలు ఈ మైనారిటీల్లో అంతులేని సంతానం, ఉద్యోగాలకు పనికి వచ్చే చదువుగాక మద్రసాల్లో కురాన్ పఠనం, ఉర్దూలో కొంత ప్రవేశం. విద్యావ్యాప్తికి పనిచేయకుండా, అమిత సంతానాన్ని ఆపకుండా, బీదరికం, వెనుకబాటు తనం ఎలా పోతాయి? ఆ సముదాయపు మతాధికారులు, నాయకులూ అసలు కారణాలకు విరుగుడు పెట్టకుండా ‘ మా ఇష్ట మొచ్చినంత మందిని కంటాం, మీరనుకునే చదువులు గాక , మాఇష్టమొచ్చినవి నేర్చుకుంటాం! మా సంక్షేమం మీ బాధ్యత, మేం కోరినవి ఇవ్వకపోతే సంక్షోభం, అలజడిని సృష్టిస్తాం. ఖబడ్దార్” అంటున్నారు. ఇది సముచితమా? క్షంతవ్యమా?

# 33. మహామనీషి డా॥ భీమ్‌రావ్ అంబేద్కర్

ఏ పట్నాలలో అయితే తన జీవిత కాలంలో పిడికెడు తిండికై భిక్షాటన చేశాడో అటువంటి నూరుపట్టణాలు, చనిపోయిన గ్రీక్ మహాకవి హోమర్‌ను , మా పట్టణపు బిడ్డ అంటే మా పటణవాడని వాదులాడుకున్నాయట. అదే విధంగా తన జీవితకాలంలో ఎంతో బీదతనాన్ని, వివక్షతను, అంటరానితనాన్ని, నిరసనను, శతృత్వాన్ని, ఎదుర్కొన్న మహామేధావి, అఖిల దళిత బంధువు, సంఘసంస్కర్త, ద్రష్ట, దేశభక్తుడు, భారత రాజ్యాంగ నిర్మాతలలో ప్రధాన పాత్రదారుడు అయిన డా॥ భీమ్‌రావ్ అంబేద్కర్‌ను మనసమాజంలోని ప్రతివర్గం స్ఫూర్తి ప్రదాతగా ఎంచుకొని నివాళులర్పిస్తున్నారు. గ్రామ గ్రామాల్లో, వాడవాడల్లో వారి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠాపిస్తున్నారు. "అగ్రకులాల ఆధిపత్యాన్ని శాశ్వతంగా ఉంచడానికి ప్రయత్నిస్తోందని" విమర్శించబడే రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ తమ ఏకాత్మతా స్తోత్రంలో వ్యాస, వాల్మీకాది మహర్షులతో పాటు అంబేద్కర్ గారిని కూడా ప్రాతః స్మరణీయులుగా చేర్చారు.

అంబేద్కర్‌గారు బహుముఖ ప్రజ్ఞాశాలి, దూరదృష్టిగల మేధావి, అలోచనపరుడు. హిందువులలోని అస్పృశ్యుల ఉద్ధరణకు ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన ధైర్యశాలి. అంటరాని తనంతో, బీదరికంతో, కుల వివక్షతతో పీడితుడైనప్పటికీ, తన మేధాశక్తితో రాణించి మహోన్నత పదవులను అలంకరించిన మహావ్యక్తి. నిరంతరం దళితుల యొక్క ఉన్నతికి కృషి చేసాడని, అందుకే గొప్పవాడని కొందరనుకుంటారు. కాని దేశ భవిష్యత్తును గూర్చి భారతదేశం యొక్క సురక్షిత భద్రత, అఖండతలను గురించి వారు ప్రదర్శించిన దేశభక్తి ఎనలేనిది. రెండు మూడు విషయాలను గురించి ప్రస్తావిస్తే, ఈ విషయం సువిదితమవుతుంది. మహమ్మదు ఆలీ జిన్నా నాయకత్వాన భారతదేశంలో నివసిస్తున్న ముస్లింలు మా మతాన్ననుసరించి, మేము భారతీయులంకాము. మాకు హిందువులకు పొత్తు







కుదరదు. ఒకేదేశంలో ఒకే జాతీయతతో ఉండటానికి మేము అంగీకరించము అని వాదిస్తూ దేశ విభజనకై పాకిస్తాన్ సృష్టికై ఎన్నో మత సంఘర్షణలను ప్రారంభించారు. అంబేద్కర్‌గారు ముస్లింల ఈ పంథాను చారిత్రాత్మకంగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసి హిందువులు ముస్లింలు శతాబ్దాల నుంచి భారతదేశంలో ఒకరికొకరు శత్రువులు. ఒకరి వీరులు మరొకరికి ద్రోహులు, రాక్షసులు. భారతసైన్యంలో ముస్లింలు వున్నట్లయితే వారు భారతదేశంపై ఏ ముస్లిం దేశం దండయాత్ర చేసినా, వారు విశ్వాసపాత్రులుగా వుండలేరు. ఇటువంటి విభాజక శక్తులతో భారతదేశం అవిభాజ్యమైన, బలవంతమైన, సంపన్నమైన దేశంగా వుండలేదు. మత కలహాలతో బలహీనపడుతుంది. పాకిస్తాన్ ఏర్పడి తీరుతుంది. అది ఇవ్వడమే మంచిది. హిందూ ముస్లిం రాష్ట్రాలుగా భారతదేశాన్ని విభజించాలి. భారతదేశంలోని ముస్లింలందర్నీ పాకిస్తాన్‌కు, పాకిస్తాన్‌లో ముస్లిమేతరులందరినీ భారతదేశానికి శాంతియుతంగా ఒక పథకం ప్రకారం పంపాలి. మొదటి ప్రపంచయుద్ధానంతరం టర్కీ తన యొక్క ఆక్రమిత క్రిస్టియన్ దేశాలను పోగొట్టుకొంది. అప్పుడు 'లీగ్ ఆఫ్ నేషన్స్' పర్యవేక్షణలో ముస్లిం, క్రిస్టియన్ జనాబా మార్పిడి జరిగింది. ఇలాగే భారతదేశంలో కూడా జరగాలి అని వాదిస్తూ ఒక మహద్గ్రంధాన్ని వ్రాసారు. వారి ఈ దృక్పథాన్ని జిన్నా ఒప్పుకున్నారు, కాని గాంధీజీ, కాంగ్రెస్ ఒప్పుకోలేదు.

పర్యవసానం – రక్తపాతంతో జరిగిన దేశవిభజన. పాకిస్తాన్ నుంచి హిందువులు, సిక్కులు అందరూ తరిమి వేయబడ్డారు. ఆనాడు తూర్పు పాకిస్తాన్, ఈనాటి బంగ్లాదేశమైన ఇస్లామిక్ రాష్ట్రం నుండి 1947 జనాభాలో 28% వున్న హిందువులు, బౌద్ధులు 9%నికి తగ్గిపోయారు. ఇంకా తగ్గిపోతూనే వున్నారు. పాకిస్తాన్ కోసం కల్లోలాన్ని సృష్టించి విభజన కోసం పోరాడి తదనుకూలంగా ఓట్లు వేసిన ముస్లిములందరూ భారతదేశంలో వుండటమేగాక జనాభాలో 8% నుంచి 14% వరకు పెరిగి దేశ విభజనకు పూర్వం వున్న ముస్లిం–హిందూ సమస్యను యధాతథంగా, కాదు, తీవ్రతరం చేయుచున్నారు. అంబేద్కరుగారి

వాదాన్ని మనం 1943లోనే అంగీకరించినట్లయితే, ఈ సమస్య సమసిపోయి వుండేది.

భారత రాజ్యాంగాన్ని రూపొందిస్తున్నప్పుడు నెహ్రూ సలహా మేరకు షేక్ అబ్దుల్లా, అంబేద్కర్ గారిని కలిసి జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక పౌరసత్వం రాజ్యాంగం, స్వయం ప్రతిపత్తి వుండాలని, భారతదేశపు చట్టాలన్నీ తమ అంగీకారం లేకుండా అమలు కాకూడదని ఇంకా ఎన్నో కోరికలను ఏకరువు పెడుతూ పోతుంటే, అంబేద్కర్ ఇలా అన్నారు. "చాలు, చాలు, ఆపండి. భారతదేశ సైన్యం మిమ్ము పాకిస్తాన్ యొక్క దురాక్రమణ నుండి రక్షించాలా? మీ అభివృద్ధికి, మీ ప్రభుత్వానికి అయ్యే ఖర్చు భారతదేశం ఇవ్వాలా? మీ కాశ్మీరీలు భారతదేశంలో ఎక్కడైనా స్థిరాస్తులు సమకూర్చుకోవచ్చా! కాని భారతీయులుకాశ్మీర్‌లో స్థిరాస్తిని ఏర్పరచుకోకూడదా. నేను భారతీయుడిని. భారతదేశానికి నష్టం కలిగించే ఏ ప్రతిపాదనను అంగీకరించను, అని సంభాషణను ముగించి, షేక్ అబ్దుల్లాను పంపించారు. మన దురదృష్టవశాత్తు నెహ్రూ తన పంతాన్ని నెగ్గించుకొని రావణ కాష్టంలా కాలే కాశ్మీరు సమస్యను మనకు ప్రసాదించారు.

భారతదేశానికి పాకిస్తాన్‌కి పంజాబ్‌లోని నదీ జలాలను పంచుకొని వినియోగించడంలో వివాదం 1947లోనే ఏర్పడింది. రెండు దేశాల మధ్య మంత్రిస్తరేయ చర్చలు జరిగాయి. భారతదేశం తరపున పాల్గొన్న మంత్రి కాకా సాహెబ్, ఎన్.వి.గాడ్గిల్. వారి సలహా దారు డా. అంబేద్కర్. విభజన సమయంలో ఇవ్వబడిన 'రాడిక్లిఫ్' అవార్డు ప్రకారం రెండు నదుల జలాలను, భారతదేశం మూడు నదుల జలాలను పాకిస్తాన్ ఉపయోగించుకోవచ్చు. మన భూభాగంలో వున్న ఒక జలాశయం నుండి పాకిస్తాన్ కాలువలకు నీరు వెడుతుండేది. మీరు వేరే జలాశయాన్ని నిర్మించుకొని మా మీద ఆధారపడకుండా వుండడానికి మీకు 5 సం॥ల వ్యవధిని ఇస్తామని గాడ్గిల్ గారు ఎవరితోనూ సంప్రదించకుండా పాకిస్తాన్ ప్రతినిధికి చెప్పారు. అప్పటికే పాకిస్తాన్ సైన్యాలు విశ్వాసఘాతుకంగా కాశ్మీరులోకి ప్రవేశించాయి. పాకిస్తానీయుల మనస్తత్వాన్ని , అవిశ్వసనీయతను







బాగా అర్థం చేసుకున్న అంబేద్కర్ సాహసించి గాడ్గిల్ గారికి వెంటనే ఒక చీటీ మీద, 'మీరు చేస్తున్న వాగ్దానం భారతదేశానికి హానికరమైనది. దీన్ని మీరు తక్షణం వుపసంహరించుకోవాలని', వ్రాసి ఇచ్చారు.

గాడ్గిల్ గారు తన తప్పును ఒప్పుకొని అంబేద్కర్‌గారి దూరదృష్టిని మెచ్చుకొని ఇలా అన్నారు. 'పాకిస్తాన్ మిత్రమా, మీరు నా వాగ్దానాల్ని 5 నిమిషాల లోపుగా అంగీకరించకపోతే దాన్ని విరమించుకుంటాను' అని గట్టిగా చెప్పారు. 5 నిమిషాల వరకు పాకిస్తానీయులు మాట్లాడలేదు. గాడ్గిల్‌గారు 5 సం॥లు గడువు ఉపసంహరించుకున్నాం అని అన్నారు. ఈ విధంగా అంబేద్కర్ గారు భారతదేశం యొక్క శ్రేయస్సును ఎంతగా ఎటువంటి దూరదృష్టితో కోరేవారో మనం వూహించవచ్చు.

అంబేద్కర్‌గారు నెహ్రూ మంత్రివర్గంలో వున్నప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని తనదైన భావాలను పదవీ వ్యామోహంలో ఎప్పుడూ రాజీపడలేదు. దశాబ్దాలుగా హరిజనుల యొక్క శ్రేయస్సుకు ఆయన ఎంత పాటుపడినా, ప్రభుత్వం నుంచి హిందూ సమాజాన్నుంచి తగినంత స్పందన రాకపోవడం వారిని ఎంతో బాధించింది. నెహ్రూతో విభేదించి మంత్రి పదవిని త్యజించారు. చివరకు ఇలా అన్నారు ''పుట్టటమయితే హిందువుగా పుట్టాను. కాని హిందువుగా చావదలచుకోలేదు''. తక్షణమే ముస్లిములు, క్రిస్టియన్లు వారిని ప్రాధేయపడి వారిని, వారి అనుచరులను తమతమ మతాల్లోకి రావాలని, పోటీ వాగ్దానాలను చేస్తూ వారి వద్దకు వచ్చారు. ఆలోచించి చెప్తానని, వారికి చెప్పి, కొంతకాలమైన తరువాత ఇలా ప్రకటించారు, 'నేను క్రిస్టియన్ మతాన్ని పుచ్చుకోను, ఎందుకంటే క్రిస్టియన్‌గా మారితే భారతీయులుగా వుండలేము. ఇస్లాం మతాన్ని అసలే పుచ్చుకోను. ఆ మతం ప్రకారం సౌభ్రాతృత్వమనేది, ఆ మతాన్ని అనుసరించే మహమ్మదీయులకు మాత్రమే పరిమితమైంది. కనుక ఇస్లాం విశ్వమానవ సౌభ్రాతృత్వానికి అనుకూలించదు. భారతీయుడుగా భారతదేశానికి ఏ నష్టమూ వాటిల్లకుండా వుండాలని, నేను ఈ దేశంలో పుట్టిన మరో మతాన్ని స్వీకరిస్తాను''.

"అది బౌద్ధం. నా దళిత సోదరులందరినీ తక్షణమే బౌద్ధాన్ని స్వీకరించమని కోరుతున్నాను." ఎంతటి దేశభక్తి, ఎంతటి ధైర్యం ఎటువంటి విశ్వాసం! అంబేద్కర్ బౌద్ధాన్ని కాక ఇస్లాంనో, క్రీస్తు మతాన్నో పుచ్చుకున్నటయితే మనదేశానికి ఎటువంటి అరిష్టం సంభవించేదో మనం వూహించలేము. ఈ నిర్ణయానికి భారతీయులందరూ అంబేద్కర్‌గారికి ఎంతో ఋణపడవలసి వుంది. అంబేద్కరుగారు నిమ్నకులాలకు, విశేషించి ఒకప్పుడు అస్పృశ్యతకు గురియైన దళితులకు సాటిలేని సేవ చేశారు. వారి ఆత్మగౌరవానికి ఆత్మస్థైర్యానికి బీజం వేసారు. ఆయన జీవితకాలంలో వారియొక్క ఉత్కృష్టత, విశిష్టత దేశభక్తిని అన్ని వర్గాల వారు గుర్తించలేదు. కాని ఒకటి రెండు దశాబ్దాల నుంచి మనం తప్పును దిద్దుకుంటున్నాము. ఊరూర, వాడవాడల్లో వారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపిస్తున్నాం. వారి పేర ఎన్నో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు క్రొత్త నగరాలు వెలుస్తూ వచ్చాయి. కాని గడచిన ఐదారు సంవత్సరాల నుంచి వారిపేరు మరుగున పడుతున్నట్లుంది.

ఇటీవల పోప్‌గారు తమ భారతదేశ పర్యటనలో ఈ మూడవ సహస్రాబ్దంలో భారతీయులను క్రిస్టియన్లుగా మార్చాలని పిలుపునిచ్చారు. వేలాదికోట్ల రూపాయలు విదేశాల నుంచి క్రైస్తవ మిషనరీలకు, మతమార్పిడీ వుద్యమం కోసం వస్తున్నాయి.

ప్రతిఊరిలో ఒక చర్చి కట్టాలని కోట్లాది సంఖ్యలో నిరక్షరాస్యులు, బీదవారిని, రోగులను క్రైస్తవులుగా మార్చడానికి ముమ్మరమైన, రోజు రోజుకూ పెరుగుతున్న వ్యాపారం జరుగుతోంది. బౌద్ధమతాన్ని స్వీకరించవలసిన ప్రజలు కిరస్తానీయులుగా ప్రలోభాల వలలో పడుతుండడం మూలాన అంబేద్కర్ గారి పేరు మరుగునపడుతోంది. వారికివ్వవలసిన నివాళులు, గౌరవ మర్యాదలు క్రైస్తవీకరణం కోసం నెలకొల్పబడుతున్న చర్చిలకు, బాల ఏసు, మేరీమాత పండుగలకు స్వస్థతా కూటములకు మరల్చబడుతున్నాయి. విద్యావంతులు ప్రబోధితులైన భారతీయులు ఏ అనుపాతంలో అంబేద్కరుగారిని గౌరవించడం పెరుగుతోందో తద్విరుద్ధమైన అనుపాతంలో క్రైస్తవీకరింపబడిన హరిజన తదితర వర్ణాలలోని వారిచే మరువబడుతున్నారు. దీనివల్ల రుజువవుతున్న సత్యమేమనగా







మతాంతరీకరణ స్వదేశీ సంస్కృతీ పరంపరలకు విఘాతం కల్పిస్తుంది. అంబేద్కర్‌గారి రచనలన్నీ ఎనిమిది సంపుటాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆంగ్లంలో ప్రచురించింది. వీటిని ప్రతి గ్రంథాలయంలో వుంచాలి. అంబేద్కర్ గారి సామాజిక ఆర్థిక రాజకీయ ఆలోచనా సరళిని మనం క్షుణ్ణంగా చదివి వారి ఆశయ సాధన కోసం కృషి చేయవలసి వుంది. ఆర్థిక అసమానత తగ్గనిచో సాంఘిక సమరసత ఉండదనే అంబేద్కర్ గారి సిద్ధాంతం అక్షర సత్యం.

**తెలియని మనుజుని సుఖముగఁ**
**దెలుపందగు సుఖతరముగఁ దెలుపఁ వచ్చుం**
**దెలిసినవానిం దెలిసియుఁ**
**దెలియని నరుఁ దెల్ప బ్రహ్మ దేవుని వశమే.**

భా॥ ఏమియు జ్ఞానములేని వాని కేవిషయమైనను సుఖముగాఁ దెలియఁజేయఁ వచ్చును. జ్ఞానము కలవానికి సుఖతరముగా తెలియజేయవచ్చును. కాని కొంత తెలిసియుఁ గొంత తెలియకయు మెలగువాని కేవిషయమైన బ్రహ్మగూడ బోధింపఁ జాలఁడు. ఇతరులసలే తెలుపలేరు.

# 34. పోలవరం ప్రాజెక్టు పేరు

పోలవరం ప్రాజెక్టుకు ప్రఖ్యాత ఇంజనీరు, మచ్చలేని మంత్రి, దేశంలోని ఇంజనీర్లందరికీ ఆదర్శప్రాయుడైన కె.యల్.రావుగారి పేరు పెట్టుచున్నందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. రాజీవ్ పేరు, అలవాటు చొప్పున పెట్టకుండా ఉండటం హర్షనీయం.

తెలుగు వెలుగుకు, ప్రాచీన భాషగా గుర్తింపుకూ, విద్యాబోధన తెలుగు మాధ్యమంలోనే కనీసం పదవ తరగతి వరకూ, అని అందరూ కోరుతుంటే, మరి రావుగారి పూర్తి పేరున, కోమఠ్రాజు లక్ష్మణరావుగా, ఆ ప్రాజెక్టుకు నామకరణం చేయడం, మన సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించినట్లువుతుంది. అలా చేయాలని అశేష తెలుగు ప్రజానీకం ప్రభుత్వాన్ని కోరాలి.

**క్షమ కవచంబు గ్రోధ మది శత్రువు జ్ఞాతి హుతాశనుండు మీ**
**స్త్రము దగుమందు దుర్జనులు శత్రువు జ్ఞాతి హుతాశనుండు మీ**
**త్తము చితలజ్జ భూషణము దాత్తకవిత్వము రాజ్య మీక్షమా**
**ప్రముఖపదార్థముల్ గలుగు పట్టునఁ దత్కవచాదు లేటికిన్?**

భా॥ క్షమగలిగియున్నచో బాధలుదప్పించుకొనుటకు వేఱుగా కవచమక్కర లేదు. క్రోధమును మించిన శత్రువులేదు. సమస్తము నిర్మూలించుకు దాయాదియున్న చాలును. వేఱుగానగ్ని హోత్రుడక్కరలేదు. స్నేహితుని మించిన ఔషధము లేదు. ప్రాణములు తీయుటకు దుర్జనులున్నచో సర్పములక్కరలేదు. విద్యయే ధనము. తగినంత లజ్జకలిగియుండుటయే అలంకారము. లోకులను వశము చేసికొనుటకు మంచి పాండిత్యముగాని కవిత్వముగాని యుండిన చాలును. రాజ్యమక్కరలేదు.







# 35. మనపట్టణాల, మన వ్యక్తుల పేర్లు

గమనించారు గదా! బర్మా, మియన్మార్ అని, సిలోన్ శ్రీలంక అని రోడేసియా జింబాబ్వే అని, గోల్డ్‌కోస్ట్ ఘనా అని, స్వతంత్ర్యము వచ్చిన తరువాత ఆత్మగౌరం, ఆత్మస్థైర్యం వున్న ప్రజలు సగర్వంగా వలస పాలకులు ఇచ్చిన పేర్లను త్యజించి, తమ చరిత్ర చెప్పిన తమ సంస్కృతి చాటిన తమ భాషలోని పేర్లను తమ దేశాలకు పెట్టుకున్నారు. మరి మన దౌర్భాగ్యమేమో, ఏ భారతీయ భాషల్లోనూలేని, మనమీద దండయాత్రలు చేసి విదేశీయులు వాడిన 'ఇండియా' అనే పదాన్ని, చదువుకున్న వాళ్ళం, నాగరీకులైన వాళ్ళం, బుద్ధిజీవులనబడే వాళ్ళం ఇంకా వాడుతూనే వున్నాం. పండితులు మాత్రం "భరతఖండంలో భరతవర్షం, భారతదేశ"మనే అంటున్నారు.

మహారాష్ట్రులు బాంబేను, ముంబై అని, బెంగాలీలు కల్‌కటాను కోల్‌కతాగాను, కర్నాటకులు బాంగలూరును, బెంగళూరుగానూ, తమిళులు మద్రాసును చెన్నైగాను, కేరళులు త్రివేండ్రంను తిరువనంతపురంగాను సరి దిద్దుకున్నారు. మరి మనం? కర్నాటక ముఖ్యమంత్రిగారు ఆంగ్లేయం చేయబడ్డ మరికొన్ని పట్టణాల పేర్లను కర్నాటకీయం చేయబోతున్నారు. మరి మనం?

ఇలా చేయడానికి ప్రయత్నించండి.

| | |
|---|---|
| మహబూబ్‌నగర్ | పాలమూరు |
| మహబూబాబాద్ | మానుకోట |
| నిజామాబాద్ | ఇందూరు |
| హైదరాబాద్ | భాగ్యనగరము |
| మూసీ | ముచికుంద |
| కర్నూలు | కందెనవోలు |

కొంచెం శ్రమతీసుకుని ఉర్దూ అయిన వ్యక్తుల పేర్లను కూడా తెలుగుపై పరంపరలో వ్రాయాలని మీరు ఉద్బోధిస్తే బాగుంటుంది.

ఉదా: రామచంద్రరావు – రామ చందర్ రావు కాదు
నాగేంద్రగౌడ్ – నాగేందర్ గౌడ్ కాదు.

# 36. విస్తృత రిజర్వేషన్లు - కొన్ని పర్యవసానాలు

ఒక వైపున మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి అర్జున్‌సింగ్ గారు, మరోవైపున సాంఘిక న్యాయపు మంత్రిణి మీరా కుమార్‌గారు రిజర్వేషన్లను మరికొన్ని వర్గాలకు, మరికొన్ని రంగాల్లో ప్రవేశపెట్టడానికి సగర్వంగా ఆవేశంతో ప్రయత్నిస్తున్నారు. అర్జున్‌సింగ్‌గారు ప్రపంచ స్థాయిలో ఖ్యాతి గడించిన మనదేశపు ఐ.ఐ.టి లలో, ఐ.ఐ.ఎంలలో, టి.ఐ.ఎఫ్.ఆర్‌తో కలిపి ఒక వంద విద్యా సంస్థలలో 27% ఒబిసిలకు రిజర్వేషన్‌లు ఉండాలంటుంటే, మీరాకుమార్ (జగ్‌జీవన్‌రామ్ గారి కుమార్తె) ప్రైవేటు కంపెనీలలో షెడ్యూలు కులాలు, తెగలవారికి రిజర్వేషన్లు స్వచ్ఛందంగా కంపెనీలు అమలు చేస్తే సరేసరి, లేకపోతే చట్టం – ద్వారా రిజర్వేషన్ కల్పిస్తాం అని బెదిరిస్తున్నారు. అర్జున్‌సింగ్ గారి యొక్క మైనారిటీ, అంటే ముస్లింలు, క్రిస్టియన్‌ల మీద ఎంత ఘాటైన ప్రేమంటే కోకొల్లలుగా ఉన్న మైనారిటీ విద్యా సంస్థలలో దురదృష్టవశాత్తు మెజారిటీ అనబడే హిందువులలోని ఒ.బి.సి లకు రిజర్వేషన్లు లేకుండా, వారి సంస్థలలో అన్ని సీట్లనూ ఎవరికి వారే నిర్ణయించుకోవచ్చును. తథాకథిత మెజారిటీ హిందువులు సామాజిక న్యాయం కోసం తమ సంస్థలలో రిజర్వేషన్లు కల్పించాలట. కాని, సామాజిక న్యాయకల్పన బాధ్యత మైనారిటీలకు ఉండకూడదట. మైనారిటీలంటే ఎంత ఉదారత! లేక వారి సామూహిక ఓట్ల సముపార్జనయే అర్జున్‌సింగ్ గారి యొక్క లక్ష్యమా?

50ఏళ్ళపై నుంచి షెడ్యూళ్ళు తెగలకు, కులాలవారికి ప్రభుత్వంలో, ప్రభుత్వరంగ కంపెనీలలో ఉద్యోగాలకు, వృత్తి విద్యాలయాలలో ప్రవేశానికి రిజర్వేషన్‌లు ఇస్తూవచ్చాం. దీనివల్ల ఎవరికి ఎంత బాగు జరిగింది, ఆ కులాల, తెగలలోని వారికి కొంతమందికి బాగు జరుగకపోతే, ఎందుకు జరగలేదు అనే అధ్యయనం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలుగాని,అటు కేంద్ర ప్రభుత్వంకాని చేయలేదు. షెడ్యూలు కులాలలో కూడా ఎన్నో ఉపకులాలున్నాయని, రిజర్వేషన్లయొక్క లాభం ఒక ఉపకులం వారికి మాత్రమే ఎక్కువగా పొందుతున్నారు. అందువల్ల వారిలో







కూడా వర్గీకరణ జరగాలని, వర్గముల యొక్క నిష్పత్తిలో ఎస్.సి.లకు వున్న రిజర్వేషన్లను పెంచాలని మన రాష్ట్రంలో మాదిగ కులం వారు కృష్ణమాదిగ గారి నాయకత్వంలో కొన్న సం॥ల నుంచి భీకరమైన ఉద్యమం నడుపుతున్నారు. రిజర్వేషన్ల యొక్క అత్యధిక లాభాన్ని ఎస్.సి లలో అల్పసంఖ్యాకులైన మాలలు మాత్రమే పొందుతున్నారని, వర్గీకరణకు వారి వ్యతిరేకతయే దీనికి నిదర్శనమని కృష్ణమాదిగ గారు అంటున్నారు. రిజర్వేషన్ల వల్ల లక్ష్యించిన వారందరికీ ప్రయోజనం కలగడం లేదు, ఒకసారి లాభం పొందినవారి యొక్క పుత్ర పౌత్రులకు పారంపరికంగా లాభం చేకూరుతుందని చాలమందికి తెలుసు. దీనికి నిదర్శనం భారతదేశం యొక్క మాజీ రాష్ట్రపతి నారాయణన్‌గారే. వారు షెడ్యూలు కులానికి చెందినవారు, ఒక క్రిస్టియన్ బర్మాయువతిని పెండ్లాడారు. వారు నామినేషన్ ప్రాతిపదికన విశిష్ట వర్గానికి చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో (ఐ.ఎఫ్.ఎస్)లో ఉద్యోగం సంపాదించారు. వారి కూతురు అమెరికా విశ్వవిద్యాలయాలలో ఎంతో ఖర్చుతో చదివింపబడినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలో మాత్రమే ప్రభుత్వోద్యోగాన్ని సంపాదించ గలిగింది. ఈ విధంగా సామాన్యులకు ఉద్దేశింపబడిన రిజర్వేషన్ ప్రయోజనాలు వంశపారంపర్యంగా కొంతమందికి మాత్రమే వస్తున్నాయనేది సువిదితము. అంటే, రిజర్వేషన్ ద్వారా ప్రభుత్వ బ్రాహ్మణులనే మరో కులం జన్మతః లాభం పొందుతోందన్నమాట. రిజర్వేషన్లు ఇందుకోసం ఉద్దేశింపబడలేదే!

మరో విషయం.ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్, మెడిసిన్, కళాశాలల్లో 50సం॥లపై నుంచి ఎస్.సిలకు ,ఎస్.టిలకు క్రమంగా 15%,7.5% ప్రవేశాలను కల్పించాం. కాని మన రాష్ట్రంలో ఇంజనీర్లు, డాక్టర్ల యొక్క మొత్తం సంఖ్యలో ఇంజనీర్లలో ఎస్.సిలు కేవలం 6%, ఎస్.టి.లు 1.08%, డాక్టర్లలో ఎస్.సిలు 6.2%, ఎస్.టిలు 1.35% మాత్రమే ఉన్నారు. ఎందువలన? దీన్ని అధ్యయనం ఎవరూ చేయలేదు.

ఐ.ఐ.టిలలో, ఎస్.సి, ఎస్.టిలకు రిజర్వేషన్లు ఉన్నాయి. వారికి కేటాయించిన స్థానాలన్నింటినీ నింపేందుకే ఆ కులాలనుంచి వ్యక్తులు లేరు.

అందుచే ఆ సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయి. ఇతర కులాలకు చెందిన వారు ఎంతో గొప్ప మార్కులు వచ్చినప్పటికీ కూడా ఎస్.సి, ఎస్.టీలకు కేటాయింపబడిన, ఖాళీగా ఉన్న సీట్లను పొందలేకపోతున్నారు. దీనికి కారణం ఏమిటి? ఎవరు అధ్యయనం చేయట్లేదు. సామాజిక న్యాయం కోసం, బీదవారికోసం రిజర్వేషన్లు ఉండాలి అని, ఎన్నో వేదికల నుంచి మాట్లాడుతూ, ఎన్నో పత్రికలలో వ్యాసాలు వ్రాస్తూ, ఎన్నో టి.వి. ఛానల్స్‌లో నీతులు చెబుతూ వున్న ఒక వామపక్షీయ విద్యావేత్త, ఆయన నిర్వహించే కోచింగ్ క్లాసులకు ప్రవేశానికై, ప్రవేశ పరీక్ష పెడుతున్నారు. ఈ ప్రవేశ పరీక్షలలో సెలక్టు చేయబడటం కోసం ఎందరో విద్యార్థులు, మరొక విద్యా వ్యాపార సంస్థలలో కోచింగ్ తీసుకుంటున్నారు. ఇదంతా వింతకాదా?

కొన్ని దశాబ్దాల క్రితం తమిళనాడులో బ్రాహ్మణ విద్వేషం నెరిగి వారు ప్రభుత్వంలోనూ, కళాశాలలోను ప్రవేశం పొందకుండా ఉండటానికి రిజర్వేషన్లను పెట్టి, సామాజిక న్యాయం కోసం ఇవి తలపెట్టినవని, ఇంత వరకూ వివక్షత చూపించబడిన కులాల వారిని పైకి తీసుకువరావడం కోసం రిజర్వేషన్లు పెట్టామని, ద్రవిడియన్ పార్టీలు గొప్పగా చెప్పుకుంటున్నాయి. మరి, ఆ రాష్ట్రంలోనే ఇంకా ఎన్నో నిమ్న కులాలవారు బ్రాహ్మణేతర అగ్రకులాల వారు, మాకు అన్యాయం చేస్తున్నారని ఎన్నెన్నో రాజకీయ పార్టీలను పెట్టి ఉద్యమాలు నడుపుతున్నారు. ఈ అన్ని ఉదంతాల దృష్ట్యా ఉద్దేశించిన ఫలితాలు లేవనీ, రిజర్వేషన్ల యొక్క అమలు పద్ధతిని పునః అధ్యయనం చేయాలని తెలుస్తోంది. కాని అమలు చేయకుండా పాత పద్ధతిలో వాటిని విస్తృతం చేస్తే పాత ఫలితాలే తిరిగి సంభవిస్తాయి. క్రొత్తగా ఆలోచిస్తున్న రిజర్వేషన్ల వల్ల విద్యార్థులలో, ఇతర వర్గాలలో, అన్ని కులాలలో పరస్పర వైషమ్యాలు, శతృత్వాలు చెలరేగుతున్నాయి. అసలే హిందూమతం అనేది లేదని, కొన్నివేల కుల సముదాయాలకు హిందూమతం అనే పదం వాడబడుతోందని, వీళ్ళల్లో ఉన్న ప్రతీ ఒక్క కులాన్ని కూడా ఒక మైనారిటీగానే పరిగణించవచ్చు అనే భావన కూడా ఉంది. వాస్తవానికి 60 ఏళ్ళకు ముందు







డా॥ అంబేద్కర్ గారు "ఇస్లాం మతం ఉంది, క్రిస్టియన్ మతం ఉంది, కాని హిందూ మతం అంటూలేదు. వీళ్ళలో కులాలు మాత్రం ఉన్నాయి. వీరిలో వ్యవహారికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా అసమానతలు ఉన్నాయి" అన్నారు. ఇటువంటి వారి నందరిని కలిపి, వీరిని మెజారిటీ అనీ, ఒక నిర్వచనబద్ధమైన ముస్లింలను, క్రిస్టియన్‌లను మైనారిటీ అనడం రూపురేఖలు, నిర్వచనం లేని సముదాయాన్ని హిందూమతం అనడం, వారికి లేని హక్కులనూ, విశిష్ట అధికారాలను ముస్లింలకు, క్రిస్టియన్‌లకు కల్పించడం మహా అన్యాయం కాదా!

ఈ సైద్ధాంతిక ప్రశ్నలను వదిలి అర్జున్‌సింగ్ గారు, మీరాకుమార్‌గారు అనుకున్నట్లుగా రిజర్వేషన్లను పెడితే ఎటువంటి పర్యవసానాలుంటాయి అని ఆలోచిద్దాం. ప్రవేశపరీక్షలలో అత్యధిక మార్కులను సంపాదించుకోవడమే మెరిట్ కాదంటున్నారు కొందరు. అటువంటి మార్కులను సంపాదించుకోవడం, ప్రైవేటు సంస్థలలో ఎక్కువ ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకోగల సంపన్నులకు మాత్రమే మార్కుల, ర్యాంకుల పంట వస్తుంది. కాబట్టి నిమ్న కులాలవారూ, బీదవారూ అధిక మార్కులనే మెరిట్ సంపాదించుకోలేకపోతున్నారని అంటున్నారు కొందరు. ఇవన్నీ పాక్షిక సత్యాలే. ప్రవేశపరీక్షలోని మార్కులే మెరిట్ సూచకాలు అనుకుని రిజరేష్వన్లు పెడితే తత్ఫలితంగా ప్రవేశాలు పొందనివారు ఏమి చేయాలి? మెరిట్‌కు మాన్యత లేకపోతే విద్యాప్రమాణాలు పడిపోతాయని, కంపెనీల పోటీపాటవం తగ్గిపోతుందని వాదనలు ఉన్నాయి. ఇవీ పాక్షికంగా సత్యాలే. ఈ పరిస్థితులలో రిజర్వేషన్ల వల్ల కలిగే నష్టాలను, కష్టాలను ఎలా అధిగమించవచ్చో చూద్దాం.

- భారతదేశంలోని సంపన్నులు కూడా తమ బిడ్డలకోసమై, తమ వర్గీయులకోసమై మారిషస్, మాల్దీవులు, నేపాల్, భూటాన్, సింగపూర్, శ్రీలంకలలో కళాశాలలను, విద్యా సంస్థలనూ స్థాపించుతారు. ఇప్పటికే మారిషస్‌లో భారతీయులు మెడికల్ కాలేజీలు స్థాపించారు. నేపాల్‌లో భారతదేశానికి చెందిన ఒక ప్రైవేట్ విద్యాసంస్థ విశ్వ విద్యాలయాలు స్థాపించి, ఇంజనీరింగ్, మెడికల్ డిగ్రీలను ఇస్తోంది. బొంబాయిలో మరొక

సంస్థ దుబాయ్‌లో మేనేజ్‌మెంట్ కాలేజ్‌ని పెట్టింది. ఈ విధంగా భారతీయులు ఎన్నో విశ్వవిద్యాలయాలను, కళాశాలలను ఇతర దేశాలలో స్థాపించి, స్థోమత, ప్రతిభ వున్న విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను కల్పిస్తారు. మన దేశం యొక్క సొమ్ముతో ఇతర దేశాలు బాగుపడతాయి.

- ఇప్పటికే ఒక్క అమెరికాలోనే 80వేల మంది భారతీయ విద్యార్థులు ఏటా 10వేల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తూ చదువుకుంటున్నారు. ఈ సంఖ్య 4, 5 లక్షలకు పైగా అయిపోతోంది. మనం ప్రతి సంవత్సరము విద్యకై అమెరికాలో రు. 50 వేల కోట్లు ఖర్చు చేస్తాము. ఆస్ట్రేలియా నుంచి, ఇంగ్లండు నుంచి చివరికి చైనా నుంచి కూడా ఆయా దేశపు విశ్వవిద్యాలయాలు భారతదేశపు విద్యార్థులను చదువుకోసం ఆ దేశాలకు రమ్మని పోటీపడి ప్రచారం చేస్తూ ఆహ్వానిస్తున్నాయి. ఈ విధంగా తమ ఆస్తిపాస్తులను అమ్ముకుని ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువుకోసం ఇతర దేశాలకు పంపిస్తారు.

- ఒక ఉద్యోగాల విషయంలో ప్రతిభ, మేధస్సు ఆంగ్లభాషా పరిజ్ఞానం ఉన్నవారికి ఈ దేశంలో ఏమిటి ప్రపంచీకరణం మూలానా ఏ దేశంలో అయినా ఉద్యోగం దొరుకుతోంది. ఏ విధంగా తమిళనాడు నుంచి ప్రభుత్వ ఉద్యోగుల్లోంచి బహిష్కృతులైన బ్రాహ్మణులు దేశ విదేశాల్లో ఉద్యోగాలు పొంది, వ్యాపారవేత్తలై రాణిస్తున్నారో, ఆ విధంగా రిజర్వేషన్ల వల్ల బహిష్కృతులైన భారతీయులు భారతదేశంలో ప్రపంచంలో నలుమూలల్లో రాణిస్తారు. సంపన్నులౌతారు, విశిష్ట వ్యక్తులౌతారు. 10ఏళ్ళలోనే కొన్ని డజన్ల భారతీయులు ప్రపంచస్థాయిలో సంపన్నులుగా పరిగణింపబడుతున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరుగుతోంది.

- మనదేశపు కంపెనీలు ఇతర దేశాలలో కార్యాలయాలను, స్థాపించి, ప్రతిభ పాటవాలు ఉన్న భారతీయులనే కాక, విదేశీయులను కూడా రిక్రూట్







చేసుకుని తమ కంపెనీలను ఇతర దేశాలలో నడుపుతారు. ఇప్పటికే ఒక్క చైనాలోనే టి.సి.ఎస్ వారు 500 మందిని, సత్యం కంప్యూటర్స్ వారు 300 మందిని, ఇతర ఐ.టి. కంపెనీలు అన్నీ కలిపి 3000 మందినీ తమ ఉద్యోగులుగా అక్కడ పనిచేయిస్తున్నారు. తూర్పు యూరోపియన్ దేశస్తులు, ఇంగ్లీషువారు స్వీడీష్‌వారు, చివరికి అమెరికన్ వారు కూడా ఇండియా ఐ.టి. కంపెనీలలో పనిచేస్తున్నారు. ప్రపంచీకరణ మూలానా బహుళా జాతి సంస్థలుగా ఎదుగుతున్న భారతీయ కంపెనీలకు నేటి ప్రభుత్వాలు చేయగలిగిన చేటు తగ్గిపోతోంది. రిజర్వేషన్ ఆయుధాలను ఉపయోగించేవారు తమ కంటిలో తామే పొడుచుకున్నట్లౌతుంది.

- విద్యాసంస్థలు ఒక్క భూమిమీద ఉండవలసిన అవసరం లేదు. విద్యాపరమైన కొన్ని అమెరికన్ కంపెనీలు కొన్న ఓడలను ఒకదేశం యొక్క తీరాన్నుండి 30 కి.మీలు సమీకరించి, వాటినే విద్యాలయాలుగా, వసతి గృహాలుగా, ప్రయోగశాలలుగా, పరిశోధనాలయాలుగా ఉపయోగించి డిప్లొమాలను, డిగ్రీలను ఇస్తున్నాయి. దీన్ని ఆపడానికి ఏ ఒక్క దేశం యొక్క గాని, అంతర్దేశీయం యొక్క గాని, చట్టాలుగానీ, అధికారాలు లేవు. ఏవిధంగా మన దేశంలోనే దూరవిద్య ద్వారా పట్టాలు ఇవ్వబడుతున్నాయో అదే విధంగా ఇతర దేశాల విశ్వవిద్యాలయాలు బహుదూర విద్య ద్వారా పట్టాలు ఇస్తే ఎవరాపగలరు? ఇప్పటికే మన దేశంలో విశ్వవిద్యాలయాల యొక్క క్షేత్రసీమలో, పరిధులు దూరవిద్య ద్వారా అంతమౌతున్నాయి.

- ఎవరైతే ఈ రిజర్వేషన్లు సమర్థిస్తున్నారో, వారిలో చాలా మంది యొక్క సంతానం ఇతర దేశాలలోనే ఏం మార్కులు లేకపోయినా, ఏదో విధంగా సీట్లు సంపాదించి తమకే నష్టం రాకుండా ఉండేటట్లుగా చూసుకుంటున్నారు. ఎవరికైతే రాజకీయంగా గానీ, ఆర్థికంగా గాని, మరే కారణంగా గానీ అవకాశం లేదో వారు మాత్రమే నష్టపోతారు. ఇదొక విపరీతమైన సామాజిక న్యాయమనే అన్యాయం.

మెడికల్, ఐ.ఐ.టీ, ఐ.ఐ.ఎం విద్యార్థులు రిజర్వేషన్లవల్ల వచ్చే దుష్పరిణామాలను వారి కాలపరిమితమైన ఆందోళన ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చారు. వారి ఉద్యమం విఫలమవవచ్చు. ఎందుకంటే ఈ నాటి రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు ఆత్మవంచనలో ఒకరికన్నా ఒకరు ముందుంటున్నారు. తలచినదానిని మాట్లాడేవారు, పరోక్షంగా చేస్తున్నదానికి పొంతనలేదు. వారందరికీ చిత్తశుద్ధి కనుక ఉన్నట్లయితే మన తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన, మన కన్నా ఎక్కువ బీదతనంలో ఉన్న దేశాలు సాధించిన అందరికీ విద్య, మనమూ సాధించే వాళ్ళమే. అందరికీ విద్యకు ప్రాధాన్యత ఇవ్వకుండా రెండు రూపాయలకు బియ్యం, ఇంటికో టి.వి. సెట్, కుటుంబానికో ఆవు, గదికో ఉచిత విద్యుత్, దేవుని భూమిని తీసుకుని, ఇళ్ళ స్థలాలను ఇవ్వడం, ఉచితంగా బియ్యాన్ని, మంగళసూత్రాన్ని, వివాహ వస్త్రాలను , వస్తువులనూ గృహోపకరణాలను ఇస్తామంటూ, నిరక్షరాస్యుల, అర్థవ్యర్థ విద్యావంతుల ఓట్ల కోసం పోటీపడే రాజకీయాలున్నప్పుడు దేశం సాధించగల సమృద్ధిని సాధించలేం. సమానత్వం అనే, పేదరికాన్ని సమానంగా పంచిపెట్టి తాము మాత్రం కొన్ని తరాల వరకూ కావలసిన సంపత్తిని సమకూర్చుకోవడం చాలా మంది రాజకీయ వర్తకులకు పరిపాటి అయింది, ఇది అధిక బహుజన సమ్మతం అవుతోంది. ఈ రుగ్మత కొంతకాలం ఉంటుంది. కలకాలం ఉండదు. కాబట్టి అందరూ కలవర పడవలసిన అవసరం లేదు. తమ శక్తియుక్తులను ఉపయోగించుకొని, తమ ధీ శక్తినీ ప్రతిభనూ పెంచుకుంటూ యువకులు ముందుకు పోవాలి. ప్రపంచీకరణం జరుగుతున్న తరుణంలో చొరవకు, ప్రతిభకు ఎన్నో అవకాశాలున్నాయి







# 37. గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ దాడులు

**గాజా**లో, లెబనాన్‌లో, పాలస్తీనా హమాస్, హిజుబుల్లా టెర్రరిస్టులు ఇజ్రాయిల్ నాగరికులను, సైనికులను అపహరించినందుకు , ఇజ్రాయిల మీద విచక్షణా రహితంగా క్షిపణులను ప్రయోగించి, ప్రాణ, మాన, ధననష్టం కలిగిస్తున్నందుకు, ఇజ్రాయిల్ టెర్రరిస్టుల యొక్క స్థావరాలపై, వారికి ఆశ్రయమిచ్చిన లెబనాన్‌పై దాడులు చేయడం కేవలం ఆత్మరక్షణ చర్య మాత్రమే. ఇజ్రాయిల్ స్థాపించబడిన తర్వాత పాలస్తీనీయులు, అరబ్బులు, ఇతర ముస్లిం దేశాలు కలిసి నాల్గుసార్లు ప్రత్యక్ష యుద్ధం చేయడమే కాక, ఈ 58 సం॥లలో నూ అమానుషమైన రాక్షస చర్యలకు పాల్పడుతూ, విమానాలను హైజాక్ చేస్తూ, స్కూళ్ళపైన బాంబులు విసురుతూ, భయంకరమైన, అపారమైన నష్టాన్ని కల్గిస్తూ వస్తున్నారు. కవ్వించడం, పర్యవసానంగా ఇజ్రాయిల్ ఆగ్రహానికి గురి అవ్వడం, తద్వారా ఇతర దేశాల సానుభూతిని పొందదల్చడం, పాలస్తీనీయులకు, జిహాదీయులకు ఒక పంథా అయింది. మానం, ధైర్యం, ఆత్మగౌరవం, పౌరుల రక్షణ బాధ్యత గుర్తించిన ఏ స్వతంత్ర దేశమైనా ఉగ్రవాదులకు కఠినమైన శిక్ష విధిస్తాయి. ఇజ్రాయిల్ భారతదేశం వంటి “అతి మెత్తని” రాజ్యం కాదు. ఇస్లామిస్ట్ ఉగ్రవాదులు గడచిన దశాబ్దాల నుంచి 50,000 మందికి పైగా భారతీయులను అమానుషంగా చంపినప్పటికీ , మన పార్లమెంట్‌మీద, దేవాలయాలమీద, రైళ్ళమీద బాంబులు కురిపిస్తున్నప్పటికీ, బంగ్లాదేశ్ సైనికులు, మన సరిహద్దు సైనికులను అపహరించి చిత్ర హింసలకు గురిచేసినప్పటికీ ఏమీ చేయలేక, సెక్యులరిస్టులమని, శాంతి కాముకులమని, సహసం చూపే ఉదార స్వభావులమని, మైనారిటీలను పువ్వులలో పెట్టి రక్షించుకోవాలని, భారతీయ పౌరులు ఎంతమంది చంపబడినా ఊరుకోవడం మన గొప్పతనం అనడం ఒక్క సెక్యులరిస్టు ఇండియాకే సరిపోతుంది. చివరకు సౌదీ అరేబియా ఆ దేశంలోని జిహాదీ ఉగ్రవాదులను అలాగే మక్కామీద దాడిచేసిన ఇజ్రాయులను నిర్దాక్షిణ్యంగా

చంపేసింది. ఇజ్రాయిల్ మరేదేశం యొక్క బానిసకాదు. ఆత్మగౌరవం, శౌర్యం, పరాక్రమం కలిగి పౌరుల రక్షణ బాధ్యతను ఎరిగి, అందుకోసం ఎంత త్యాగం చేయడానికైనా సిద్ధపడే స్వతంత్ర్య దేశం. ఓట్ల కోసం నానాపాట్లు పడే పార్టీలు, నాయకులు అక్కడ లేరు. ఇక్కడ మైనారిటీలు ఏమి చేసినా చెల్లుతుంది. కానీ, మైనారిటీ పేరో, మరోపేరునో క్రూరత్వాన్ని, హింసను, దుష్టచర్యలను చేసేవారిని ఇజ్రాయిల్ ఎంతదూరమైనా వెళ్ళి ఎక్కడైనా సరే వారికి అపార నష్టాన్ని, భయాన్ని కల్గిస్తుంది. అలా చేయని మనకు, మనమీద దయతలచి, మన సెక్యులిరిజాన్ని మన్నించి, మనదేశంలో జిహాదులు టెర్రరిస్టు చర్యలు ఆపుతున్నారా? ఇజ్రాయిల్‌ను మనం శ్లాఘించాలి. బలపరచాలి. ఆ దేశం టెర్రరిస్టులను చీల్చి చెండాడుతున్నట్లుగా మనం కూడా చేయాలి.

**చెప్పులోన రాయి, చెవిలోన జోరీగ,**
**కంటిలోన నలుసు, కాలి ముల్లు**
**ఇంటిలోని పోరు నింతంత కాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ**

భా॥ చెప్పులో దూరిన రాయి; చెవిదగ్గర రొదచేసే జోరీగ, కంటిలో పడ్డ నలుసు, కాలిలో గుచ్చుకున్నముల్లు, ఇంటిలో గయ్యాళిభార్య రోజు పెట్టే పోరు వీటితో కలిగే బాధ యింత, అంతయని చెప్పలేం. అనుభవించిన వానికే తెలుస్తుంది.







# 38. సీ.పీ.ఐ అరబ్ ముస్లింల ఏజెన్సీయా?

**జులై 2006**

**శు**క్రవారం 21 జూలైన సి.పీ.ఐ., గాజా, లెబనాన్‌పైన, టెర్రరిస్టులపై ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధ చర్యలకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శనను నిర్వహించి, ఇజ్రాయిల్‌ను అమెరికా తొత్తుగా అభివర్ణించి ఆ రెండు దేశాలనూ తెగనాడారు. పాలస్తీనా ఉగ్రవాదుల మీద వీరికి ఎంత ఘాటు ప్రేమయో? ముంబాయి రైళ్లలో ఎస్.ఐ.ఎం.ఐ లేక పాకిస్తాన్ సంబంధిత, ప్రేరిత టెర్రరిస్టులు, బాంబుల ద్వారా వందల మందిని చంపి, క్షతగాత్రులను చేస్తే సీ.పీ.ఐ. ఏ నిరసన ప్రదర్శననూ నిర్వహించలేదు. పైపెచ్చు సి.పి.ఐ. యొక్క పెద్దన్న సీ.పీ.యం నాయకుడు బిమాన్ బోస్ ముంబాయి ప్రేలుళ్లు ఆర్.యస్.యస్. పనే అని అభాండం వేశాడు. ఇవన్నీ గమనిస్తుంటే కమ్యూనిస్టులు, ముస్లింల మద్దతు కోసం స్వాతంత్ర్యం రాకపూర్వం, దేశాన్ని విభజించి పాకిస్తాన్‌ను సృష్టించాలన్న ముస్లిం సంతుష్టీకరణ, భారత జాతీయ ప్రయోజనాల వ్యతిరేక ధోరణినే కొనసాగిస్తున్నారని విశదమవుతోంది.

**స్వవశము హితంబు మూడతా చ్ఛాదనంబు**
**గాఁగ నీగతి నిర్మించెఁ గమలభవుఁడు**
**సర్వ విదులగు సుజనుల సభలలోన**
**మౌనమె విభూషణము మూఢ మానవులకు**

భా॥ మూర్ఖులు తమ మూఢత్వమును మూసి పెట్టుకొనుటకై బ్రహ్మ వారికి మౌనము సృజించినాడు. మౌనమే వారికి పండిత జనుల నడుమ నొకయలంకారము వలె నున్నది కాన వారు మాటలాడకుండుటయే శ్రేయము.

# 39. మరింత సేవ

**1.** సమాచార స్వాతంత్ర్యం హక్కు శాసనం అక్టోబర్ 13, 2006 నుండి అమలులోకి వచ్చింది. దీన్ని అమలుపరచడం కోసం ప్రతి విభాగం, ప్రతి ఉచ్ఛాయుక్త నిర్దేశకుని, మండలాధికారి యొక్క కార్యాలయంలో సూచనాధికారి (ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్) యొక్క నియుక్తి జరగాలి. సమాచార సంగ్రహం కోసం, ప్రజలు ఆ అధికారికి విన్నపం పంపాలి.

1.2 కనుక ఆంధ్రప్రదేశ్ పత్రిక ప్రభుత్వ సూచనాధికారుల హోదా, చిరునామా, టెలిఫోన్, ఫ్యాక్సు, ఇ-మెయిల్ వివరాలను ప్రచురిస్తే చాలా మేలు చేసిన వారవుతారు. చేయకోరుతున్నాను.

2. అక్టోబర్ సంచికలో "తొలి తెలుగు పద్యానికి స్మారక స్థూపం" అన్న సమాచారం ఎంతో ఆనంద పరచింది. తరువోజ యొక్క ఛందస్సు గొప్పది, అందుకు ఆ పద్యాలు వినసొంపుగా ఉంటయ్.

3. శ్రీ చుక్కా రామయ్యగారి రచనలూ, సమాధానాలు బాగున్నయ్. కాని వారు ఒక విషయం గురించి వివరాలిస్తే బాగుంటుంది. వారు ఐ.ఐ.టీ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. అభ్యర్థించిన వారందరికీ ఇవ్వరు. వారికి పోటీ పరీక్షపెట్టి, ఉత్తమ శ్రేణివారిని, ఏరికొని గాని కోచింగ్ ఇవ్వరు. ఉత్తములకే కోచింగ్ ఇచ్చినప్పుడు, వారందరూ ఐ.ఐ.టీ ప్రవేశార్హతను పొందుతుంటే, రామయ్యగారి కోచింగ్ ఘనత ఏముంది. సగటువారికి, వెనుకబడ్డ వారికి కోచింగ్ ఇచ్చి, ఐ.ఐ.టీ ప్రవేశార్హతను ప్రసాదిస్తే అదీ ఘనత.

బి) మరో విషయం. కార్పోరేట్ విద్యాసంస్థలు, లాభం కోసమే పనిచేస్తున్నయ్యంటున్నారు. రామయ్యగారు ఎంతమందికి ఉచితంగానో,







రాయితీతోనో, కోచింగ్ ఇస్తున్నారో చెబితే బాగుంటుంది, మార్గదర్శకంగా ఉంటుంది.

సి) బాసరలో ఐ.ఐ.టీ ఉంటే ఆ పరిసరాలు ఆర్థికంగా, పారిశ్రామికంగా, మరో విధంగా అభివృద్ధి చెందుతాయనా? మరి ఖరగ్‌పూర్‌లో ఐ.ఐ.టీ, ఫిలానీలో బిట్స్ దశాబ్దాల నుండి ఉన్నప్పటికీ ఏ అభివృద్ధి జరుగలేదు కదా!

డి) శ్రీరామయ్యగారి అందరికీ విద్య, వృత్తివిద్యల్లో నాణ్యతలను గురించి సమాజ స్పృహను పెంచుతున్నారు. శ్లాఘనీయులు. హాస్టళ్లు లేని ఇంజనీరింగ్ కాలేజీలను మూసి వేయాలనే ఉద్యమాన్ని వారు ప్రారంభిస్తే బాగుంటుంది. విద్యార్థులు రోజూ మూడు గంటల వరకు, పట్నం నుంచి సుదూరంలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళిరావడానికే వృథా అయిపోతున్నాయి. హాస్టల్లో ఉంటే ఈ సమయాన్ని, లైబ్రరీలో, ప్రయోగశాలల్లో , క్రీడాస్థలంలో సదుపయోగం చేసుకోవచ్చు. "నాల్గోవంతు గురువుల దగ్గర నుండి, మరో నాల్గో వంతు సహాధ్యాయుల నుండి, ఇంకో నాల్గవ వంతు స్వమేధస్సు తోను, చివరి నాల్గు భాగం కాలక్రమేణ (జీవన పర్యంతం చదువు) విద్యాబుద్ధులను నేర్చుకుంటామనే"ది ఆర్యోక్తి. హాస్టల్లో వివిధ వర్గాల, వివిధ భాషా సంస్కృతులు గల విద్యార్థులతో సహజీవనం వల్ల ఎంతో సహిష్ణుతను, పరస్పర శ్రేయోభిలాషను, మిత్రత్వాన్ని నేర్చుకుంటాం. ఒక్కసాంకేతిక నిపుణతయేగాక, ఈ సద్గుణాలను పెంపొందించడం కూడా విద్యయొక్క లక్ష్యమై యుండాలి. అందుచే హాస్టలు ఉండాలనీ, అందులో ఉండే ఇంజనీరింగ్ విద్యనభ్యసించాలనే ఉద్యమం రామయ్యగారు చేబడితే, ఎంతో సేవచేసిన వారవుతారు.

# 40. ఇరాన్ అణ్వస్త్రాలు - భారతదేశానికి ముప్పు

**2006**

**భారతదేశం** ఐ.ఎ.ఇ.ఎ. (ఇంటర్నేషనల్ ఎటామిక్ ఎనర్జీ ఏజన్సీ) బోర్డులో చైనా, రష్యా, అమెరికా దేశాలతోపాటు ఇరాన్ రహస్యంగా అణ్వస్త్రాలను తయారుచేస్తోందని, దాన్ని ఆపడానికి సెక్యూరిటీ కౌన్సిల్‌కి ఈ విషయాన్ని అప్పగించాలని ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఓటుచేసింది. ఇరాన్ మనతో స్నేహం కలిగిన దేశం. ఇరాన్‌కి వ్యతిరేకంగా ఓటు వేయడం యు.పి.ఎ ప్రభుత్వం చేసిన పెద్ద తప్పు. దీన్ని మేము సహించం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తాం అని వామపక్షీయులు, మరికొన్ని సెక్యూలర్‌లమని చెప్పుకునే పార్టీలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. అసలు విషయాలు చెబుతారు?

జ. ప్రతి దేశానికి తన రక్షణకు కావలసిన అస్త్రాలను, క్షిఫణులను తయారుచేసుకునే సార్వభౌమాధికారం ఉన్నది. ఆ విశ్వాంతోనే మనం అణ్వస్త్రాలను క్షిపణులను మరెన్నో ఆయుధాలను కనిపెడుతూ, తయారు చేసుకుంటున్నాం. వాటిని ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాం. అలాగే పాకిస్తాన్ చేస్తోంది. చైనా చేసింది. ఇరాన్ చేయదలచుకుంటోంది. కాని, ఇరాన్ యొక్క ఉద్దేశ్యం ఏమిటి? ఇరాన్ మనకు మిత్రదేశమా? మన భద్రతను, మన అభివృద్ధినీ కోరుతోందా? మనకు పాకిస్తాన్‌తో, చైనాతో ఉన్న సమస్యలలో ఇరాన్ యొక్క పాత్ర ఏమిటి? ఇలా ఆలోచించి, మనదేశం ఇరాన్ అణ్వస్త్రాలను నిర్మించదలచుకుంటే ఏ నీతిని అవలంభించాలి. మన దేశం యొక్క భద్రత ఏవిధంగా ప్రభావితమవుతుంది.

కొంతమంది ఇరాన్‌కి, మనకు చారిత్రాత్మక సంబంధాలున్నాయి. అది మన మిత్రదేశం, అలీన దేశాల కూటమిలో మనతో పాటు ఇరాన్ ఉంది ఇరాన్ అమెరికాకు శత్రువు. అమెరికా మన శ్రేయస్సును కోరదు కాబట్టి. అమెరికా యొక్క శత్రువుఅయిన ఇరాన్ మన మిత్రదేశం. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటువేస్తే







మనం అమెరికాకు తల ఒగ్గినట్లే" అని వామపక్షీయుల, సెక్యులర్ పార్టీల వాదన. ఇందులో కించిత్ అయినా పసలేదు.

ఇరాన్ మన మిత్రదేశం అని ఎలా చెప్పుకుంటాం. ఇరాన్‌కు చెందిన నాదీర్షా గతంలో మనదేశం మీద దండెత్తి ఢిల్లీని లూటీచేసి వేలాది మంది హిందువులను చంపి ఢిల్లీలోని మయూర సింహాసనాన్ని, మనదైన కోహినూర్ వజ్రాన్ని కోట్లాది ధనంతో పాటు ఎత్తుకుపోయాడు. అంతకు ముందు మహ్మదీయ మతం పుచ్చుకున్న తర్వాత ఆ దేశంలో అనాది నుంచి జోరాష్ట్రీయన్ మతస్తులను బలవంతంగా మతమార్పిడి చేశారు. మార్పిడికి ఒప్పుకోని వారు ఆదేశం నుండి పారిపోయి వచ్చి మనదేశంలో ఆశ్రయం పొందారు. వారిని మనం పార్సీలు అని అంటాం. ఏ ఒక్క పార్సీ కూడా తిరిగి ఇరాన్ వెళ్ళాని కోరుకోడు. ఎందుకంటే అక్కడ మతస్వాతంత్ర్యం లేదు.

ఇరాన్ 58 రాజ్యాల ఇస్లామిక్ కూటమిలో (ఓ.ఐ.సి) సభ్యత్వం ఉన్న దేశం. వారిలో బహు సంపన్నదేశం. ఈ కూటమి ఎన్నోసార్లు భారతదేశం కాశ్మీరులోని ముస్లింల మీద జులుం చేస్తోంది, ముస్లిం మతస్తులను భారతదేశపు సైన్యాలు అన్యాయంగా మానవ హక్కులు హరించి, నానా బాధలు పెట్టి హింసిస్తోంది. కాశ్మీరు ముస్లింలు స్వయంప్రతిపత్తికి, స్వాతంత్ర్యానికి పోరుతుంటే భారతదేశం వారిని సైనిక బలంతో హింసిస్తోంది అనే తీర్మానాలు చాలా సార్లు చేశాయి. ఇరాన్ ఈ తీర్మానాలన్నింటినీ బలపరచింది. అటువంటి దేశాన్ని మనం మిత్రదేశంగా ఎందుకు అనుకోవాలి. 1962 లో చైనా మనమీద దాడిచేసి, మన భూభాగాన్ని ఆక్రమించుకున్నప్పుడు ఇరాన్ అటువంటి అలీన దేశాలు చీమకుట్టనట్టుగా కూర్చున్నాయి. ఇది మిత్రత్వం యొక్క లక్షణమా?

1979 నుంచి ఇరాన్ మతమౌఢ్యం ఉన్న మతాలచే పాలింపబడుతోంది. ఇటీవలే అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన మహానుభావుడు, ఇజ్రాయిల్ దేశాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న యూదులందరినీ వెళ్ళగొట్టేసి, ఆ దేశాన్ని ప్రపంచ చిత్రపటంలో

లేకుండా చేసేస్తాను అని బాహాటంగా అన్నాడు. అంతేకాదు. ప్రపంచమంతా ఎదిగినప్పటికీ, చారిత్రక సత్యమైనప్పటికినీ జర్మనీలో నాజీ హిట్లర్ 60 లక్షలమంది యూదులను చంపించాడు అనేది సత్యం కాదని ఘోరమైన అభాండాన్ని చాటాడు. ఇటువంటి పాలకులు ఉన్న ఇరాన్ అణ్వస్త్రాలను చేయలేదంటే ఎలా నమ్ముతారు. ప్రపంచంలో చమురు ఉత్పత్తి చేసే దేశాల్లో 2వ స్థానంలో ఉన్న ఇరాన్‌కి అణు విద్యుత్తుని ఉత్పత్తి చేయవలసిన అవసరం ఎందుకు వస్తోంది. ఈ మిషతో అణ్వస్త్రాలను తయారు చేయపూనుకుందని 90% ఐ.ఎ.ఈ.ఎ. సభ్య దేశాలు నమ్మి ఇరాన్‌కు వ్యతిరేకంగా తీర్మానించాయి.

భారతదేశం ప్రక్కన రెండు దేశాలు అణ్వస్త్రాలను, క్షిపణులను తయారుచేసుకుని, మనతో సత్సంబంధాలు లేకుండా వున్నవి. మన ప్రక్కలో బల్లెం లాగా మూడవ శక్తిగా ఇరాన్ ఉంటే మన భద్రతకు ముప్పు. అందులో ఇరాన్ సెక్యులర్ దేశం కాదు. అది ఇస్లాం దేశాలకు నాయకత్వం వహించాలని కోరుకొంటోంది. ఇరాన్‌కు అణ్వస్త్రాలను తయారు చేయడానికి శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని, వస్తువులను పాకిస్తాన్ ఇస్తోంది. తన దగ్గర వున్న బాంబును పాకిస్తాన్ ఇస్లామిక్ అణ్వస్త్రంగా అభివర్ణిస్తోంది. మరి ఇరాన్ దగ్గర కూడా ఇస్లామిక్ అణ్వస్త్రాలు ఉండటం మన భద్రతకు ముప్పుకాదా?

ఈ విషయాలన్నింటినీ క్షుణ్ణంగా ఆలోచించినట్లయితే దేశం యొక్క క్షేమం, సురక్ష దృష్ట్యా భారతదేశం ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం నూటికి నూరుపాళ్ళు సవ్యమైన చర్య. మనం యు.పి.ఎ. ప్రభుత్వాన్ని ఈ విషయంలో శాఘించవలసిందే. కమ్యూనిస్టులు భారతదేశం యొక్క సమగ్రతకు కాని, ఆర్థిక ప్రగతికి కాని, ఎప్పుడూ దోహదం చేయలేదు. పాకిస్తాన్ సృష్టికి వీరే సైద్ధాంతికమైన కారణాలు చూపించారు. అత్యధిక కమ్యూనిస్టులు భారతదేశంపైన 1962లో చైనా చేసిన దురాక్రమణను బలపరచారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆయన స్థాపించిన ఆజాద్ హిందూ ఫౌజ్‌ను సామ్రాజ్యవాదుల బంట్లుగా తెగనాడారు. చైనా అణ్వస్త్రాలను , క్షిపణులను తయారుచేసినప్పుడు ఆ దేశాన్ని శ్లాఘించారు.







మనదేశమే ఆ పనులు చేసినప్పుడు బీదవాళ్ళం, మనం అలా చేయకూడదు అన్నారు. 1975-77 కాలంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలనను ఒక కమ్యూనిస్టు పార్టీ బలపరచింది. ఈ విధంగా ఎన్నో సంధర్భాలలో కమ్యూనిస్టు పార్టీలు భారతదేశం యొక్క అఖండతకు భద్రతకు, క్షేమానికి వ్యతిరేకంగా నడిచింది. ఇరాన్ విషయంలో కూడా వారి విమర్శ మన దేశానికి అనుకూలం కాదు. చైనా, రష్యా వంటి దేశాలే ఇరాన్‌ని తప్పుపడుతున్నారు, కేవలం అమెరికాతో పాటు మనం ఓటు వేశామని , ఇలా చేయడం అమెరికాకు తలవొగ్గడం అని విమర్శించడం సబబు కాదు.

**ఆకాశంబుననుండి శంభునిశిరం బందుండి శీతాద్రి సు**
**శ్లోకంబైన హిమాద్రినుండి భువి భూ లోకంబు నందుండి య**
**స్తోకాంభోధిఁ బయోధినుండి పవనాం ధోలోకముం జేరె గం**
**గాకూలంకమ పెక్కుభంగులు వివేక భ్రష్టసంపాతముల్.**

భా॥ త్రిలోకంబులందును ఖ్యాతివహించిన గంగానది మొదట స్వర్గమందుండి, మహేశ్వరు మస్తకమునందును అక్కడనుండి హిమాలయ పర్వతముమీదను, మిగుల యెత్తయిన హిమత్పర్వతమునుండి భూమియందును, దాని నుండి సముద్రమునందును, సముద్రము నుండి పాతాళలోకమునకును వరసగా పడుచువచ్చెను. ఈ విధముగ స్థానమునుండి జారువారి కనేక విధముల క్రిందుగాబోవుట కలుగుచున్నది. అట్లే మూర్ఖుల పాట్లనేక విధములుగా నుండును.

# 41. మైనారిటీల పేర మహా మోసం

**నూ**ట పదిహను (115) మైనారిటీ బి.ఈడి కాలేజీల్లో 78కి మైనారిటీ హోదా రద్దుచేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్లాఘనీయమైన పనిచేసింది. మనరాష్ట్రంలో మైనారిటీ బి.ఎడ్, ఇంజనీరింగ్, యం.సి.ఏ, యం.బి.ఏ కాలేజీలు పుట్టగొడుగుల్లా స్థాపించబడి, మెజారిటీ హిందువుల నుండి సీట్ల అమ్మకం ద్వారా అపార ధనాన్ని దోచుకుని, మతాంతరీకరణకు, దేశ సమగ్రతా విచ్ఛిన్నకర కార్యకలాపాలకూ, ఆ డబ్బును వినియోగిస్తున్నయ్. 12శాతానికి యున్న ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలు 330 బి.ఎడ్ కాలేజీల్లో 115 అంటే 35శాతం కాలేజీలను పెట్టారు. ఇంకా వందల మైనారిటీ బి.ఎడ్ కాలేజీలను పెట్టకూడదనే ప్రభుత్వ నియమం లేదట! క్రిస్టియన్ల జనాభా 1.44 శాతం, వారి బి.ఎడ్ కాలేజీల శాతం 23.4! వారి కాలేజీల్లో, 8,050 సీట్లు ఉంటే , ప్రవేశపరీక్షలు వ్రాసి అర్హులైన క్రిస్టియన్ల సంఖ్య 3000 మాత్రమే. 8,050 లో 70శాతం 5,635 సీట్లను క్రిస్టియన్ విద్యార్థులకు నియమ ప్రకారం ఇవ్వాలి. కాని అంతమంది అర్హులు లేరే! అందుచే నియమ, నీతి విరుద్ధంగా, 5000 సీట్లను హిందూ విద్యార్థులకు అమ్మి దాదాపు 50 కోట్లు గడించారు ఈ విధంగానే, ముస్లిం బి.ఎడ్ కాలేజీల యాజమాన్యాలు కూడా, హిందూ విద్యార్థులకు సీట్ల నమ్మి డబ్బు దండుకుంటున్నయ్.

ఇంజనీరింగ్ కళాశాలలో కూడా ఈ అవినీతి, నియమబాహ్య విద్యా వ్యాపారాన్ని మైనారిటీలు సాగిస్తున్నారు. 22 క్రిస్టియన్ ఇంజనీరింగ్ కళాశాలలో 7,430 సీట్లున్నయ్. పరీక్ష వ్రాసిన క్రిస్టియన్ విద్యార్థులు 2,831; అందులో ప్రవేశార్హత పొందిన వారు కేవలం 2,170! కావున క్రిస్టియన్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్‌లు దాదాపు 5,200 సీట్లను అమ్మి దాదాపు రూ. 100 కోట్లు హిందువుల నుండి దండుకున్నారు.

ముస్లిం మైనారిటీ ఇంజనీరింగ్ కళాశాలలు 36; వారి సీట్ల సంఖ్య 11,000 ఎమ్‌సెట్ పరీక్ష వ్రాసిన ముస్లిం విద్యార్థులు 8,833; ప్రవేశార్హతను పొందినవారు







4,000. ముస్లిం ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్లు 7,000 సీట్లనమ్ముకొని రూ. 140 కోట్లు సంపాదించి యుంటారు. యం.సి.ఏ కాలేజీలు రాష్ట్రంలో 313 ఉంటే 1.44% ఉన్న క్రిస్టియన్ మైనారిటీ యం.సి.ఏ కాలేజీలు 20.4% ఉన్నయ్, యం.బి.ఏ విషయంలో, రాష్ట్రంలోని 217 కాలేజీల్లో, 11% క్రిస్టియన్‌లవి. ఈ విధంగా జనాభా నిష్పత్తితోగాని, అర్హుల సంఖ్య శాతానికి గాని పొంతనలేనన్ని కాలేజీలను అపరిమితంగా పెట్టుకుపోతూ, విద్యా వ్యాపారం చేసి, హిందువులను దగాచేయడం ఏసుక్రీస్తు, ప్రవక్త మహమ్మద్‌లను, వారి నీతి బోధనలనూ అవహేళన చేయడం కాదా?

ఈ మోసపూరితమైన మైనారిటీ కాలేజీల విద్యా వ్యాపారాన్ని క్షుణ్ణంగా విచారింపజేసి, అవినీతిని అన్యాయాన్ని అరికట్టించవలసిందని ఈ వ్యాసకర్త, డా॥ నార్ల తాతారావు, శ్రీ టీ.యస్.రావు, డా॥ డి.సి. రెడ్డి, ప్రొ॥ సి. సుబ్బారావు, డా॥ బాలసుబ్రహ్మణ్యం, డా॥ అల్లాడి ప్రభాకర్, మేజర్ జనరల్ బగ్గా లాంటి ప్రముఖ నాగరికులు రాష్ట్రపతి కలాం, ముఖ్యమంత్రి డా॥ రాజశేఖర్‌రెడ్డి గార్లకు, ఒక లేఖను 2005, జూలై 10న వ్రాశారు; ఈ విషయాన్ని గురించి విస్తృత సమాచారాన్ని మేధావుల ముందు, ప్రజల ముందూ పెట్టి మైనారిటీ విద్యా సంస్థల, అనుచిత, అనియమిత, అవినీతిమయమైన వ్యాపారాన్ని, హిందూ విద్యార్థుల నుంచి డబ్బు దండుకోవడాన్ని ఆపడానికి సజ్జనులందరూ పూనుకోవాలి.

పరీక్ష వ్రాసేవారికన్నా మైనారిటీ కాలేజీల్లో ఎక్కువ సీట్లున్నప్పుడు, ముస్లింలకు మైనారిటీయేతర విద్యాసంస్థల్లో 5% రిజర్వేషన్ ఎందుకు? వెనుకబడ్డ వారమని చెప్పుకుంటున్నప్పుడు, మైనారిటీ కాలేజీల్లో ఉన్న అన్నిసీట్లనూ, ప్రవేశపరీక్షలలో వచ్చిన మార్కుల ప్రమేయంలేకుండా, ఇంటర్ పాస్ (బీ.యి.సీట్లకు) లేక ఏదో ఒక డిగ్రీ (యం.సి.ఏ, యం.బి.ఏ, బి.ఎడ్ సీట్లకు) యున్న, మైనారిటీ విద్యార్థులకు ఇవ్వవచ్చు గదా. వాళ్ళకోసం పెట్టిన మైనారిటీకాలేజీలు, మైనారిటీ విద్యార్థుల నోట్లో మట్టికొట్టి, సీట్లను అధిక సంఖ్యాకులైన హిందువుల కమ్మడం దేనికి?

మరో ముఖ్య సూత్రప్రాయమైన విషయం. మతపరంగా, భాషాపరంగా యున్న మైనారిటీలకు రాజ్యాంగంలోని 30వ అధికరణం ద్వారా వారిచ్చగించిన విద్యాసంస్థలను, మెజారిటీ హిందూ యాజమాన్యాలకు అనువర్తించే నియమాల సడలింపుతో పెట్టుకోవచ్చు. ఈ అధికరణం యొక్క ఉద్దేశం, అటువంటి విద్యాసంస్థలు మత,భాషాపరమైన, తత్సంబంధిత చరిత్ర, సంస్కృతి విషయాలను బోధించే అవకాశం కోసమేకాని, ఇంజనీరింగ్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, వైద్యం, దంత చికిత్స, విద్యాబోధనాశాస్త్రం (బి.ఎడ్) మతానికీ, భాషకూ సంబంధించినవి కావే? ముస్లిం కంప్యూటర్, క్రిస్టియన్ దంతవైద్యం, మరాఠీ ఎలక్ట్రానిక్స్ అంటూ లేవే? ఇవన్నీ మతంతోగాని, భాషతోగాని ప్రమేయంలేనివే అయినప్పుడు ఈ శాస్త్ర బోధనకై మైనారిటీలకు ప్రత్యేక విశిష్ట హక్కుల నెందుకు కల్పిస్తున్నారు? ఐక్యరాజ్య సమితి సభ్యత్వం ఉన్న 191 దేశాల్లో, ఒక్క భారతదేశంలో తప్ప, మరే దేశ రాజ్యాంగంలో గాని, ఆచరణలోగాని, మన దేశపు మోస్తరు మైనారిటీ విద్యాసంస్థలు లేవు. ఏ ఒక్క దేశంలోకూడా మెజారిటీ మతస్థులకు లేని విశిష్ట హక్కులు మైనారిటీలకు లేవు. భారతదేశం నుండి మతప్రాతికపదికన విడిపోయిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల్లో మైనారిటీలగు హిందూ, సిక్కు, బౌద్ధులకు ఇటువంటి హక్కులు లేవు. మన రాజ్యాంగాన్ని రచించిన మేధావులు, దేశభక్తులు, హిందువులు దోపిడీ చేయబడటం కోసం, ముస్లిం,క్రిస్టియన్ మతస్తులకు ఇటువంటి విశిష్ట నిరుపమానమైన హక్కులను ప్రసాదించియుంటారా? నిస్సందేహంగా అలా యోచించి యుండరు. కాని కాలక్రమేణ మైనారిటీలను తుష్టిపరచి, వారి మూకుమ్మడి ఓట్ల ప్రాప్తి కోసం కొన్ని రాజకీయ పార్టీలు, వారి ప్రభుత్వాలు మెజారిటీ అనబడే అనేక కులాల సముదాయమైన హిందువులకు చేస్తున్న అన్యాయం, అపచారం అని తోస్తోంది. ఈ దోపిడీకి బలిగాకుండా ఉండాలని రామకృష్ణ మతానుయాయులు, మేం హిందువులం కామని, వేరే మతస్తులుగా గుర్తింపు కావాలన్నట్లు, ప్రతికులం వారూ, మాది వేరే మతం, మేం కూడా మైనారిటీ మతస్తులుగా గుర్తింపబడాలని, ఉద్యమిస్తారేమో? ఇంతవరకూ పోటీపడి వెనుకబడ్డ తనాన్ని ప్రభుత్వం గుర్తించాలనేవాళ్ళు, ఇక ప్రతి కులస్థులూ, తమది







వేరయిన, మైనారిటీ మతమని పోటీబడి చెప్పుకోవలసి వస్తుందేమో. ఈ విసంఘటిత, విభాజక భావాలు పెరగకుండా ఉండాలంటే మైనారిటీ విద్యాసంస్థలను మత సంబంధిత బోధనకు మాత్రం పరిమితం చేయడం మన తక్షణ కర్తవ్యం.

**వేరుపురుగు చేరి వృక్షంబు చెరచు**
**చీడపురుగు చేరి చెట్టు జరచు;**
**కుత్సితుండు చేరి గుణవంతుచెరచురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

భా॥ వేరు తొలిచే పురుగు చేరి చెట్టు మూలాన్నే తిని నాశనం చేస్తుంది. ఆకులు తినే చీడపురుగుపట్టి మొక్క పైభాగాన్ని పాడుచేస్తుంది. అలాగే దుర్బుద్ధికలిగినవాడు చేరి గుణవంతుణ్ణి పాడుచేస్తాడు.

**మకరముఖాంతరస్థ మగు మానికముం బెకలింపవచ్చుఁ బా**
**యక చలదూర్మికానికర మైనమహోదధి దాటవచ్చు మ**
**స్తకమున బూవుదండవలె సర్పమునైన భరింపవచ్చు మ**
**చ్చిక ఘటింప మూర్ఖజన చిత్తముఁదెల్ప నిసాధ్యమేరికిన్.**

భా॥ ఒకానొకప్పుడు శింశుమారమను మొసలినోటియందుండు మాణిక్యమును సులభముగాఁ దీయవచ్చును. సదా తరంగములతో గూడిన మహాసముద్రమునైనను దాటవచ్చును. బుసకొట్టుచున్న సర్పమును ఎట్లో మంత్రణాద్యుపాయముల రంజింపఁ జేయుట సాధ్యముగాదు. అదెవ్వరికిని శక్యము కాదు.

# 42. జనాభా నియంత్రణ అవసరమా?

ప్రభుత్వమూ, ఎందరెందరో మేధావులూ అధిక సంతానం అరిష్టదాయకం అని వాపోతుంటే– మరికొందరు ప్రత్యేకించి ప్రగతిశీలురుగా పేర్కొనబడేవాళ్లు – జనాభా ఎక్కువగా ఉంటేనే దేశానికి శ్రేయోదాయకం అంటుంటారు. ఇంతకీ ఈ వాదనలో నిజమేది – అనేదే ప్రశ్న?

భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, అనేకమైన ఆఫ్రికన్ దేశాల్లో – ఒక్కో కుటుంబంలో అభివృద్ధి పొందిన దేశాల్లో కంటె పిల్లలు ఎక్కువ సంఖ్యలోనే ఉంటున్నారు. ఈ దేశాలన్నింటిలో గూడా – సగటు తలసరి ఆదాయం అభివృద్ధి చెందిన దేశాల్లో – నూటిలో అరవై శాతం వరకు మాత్రమే ఉన్నాయి. ఈ దేశాల్లో జనాభా వృద్ధి శాతం 1.8 నుంచి 3 వరకు ఉంటున్నది.

సంపన్నదేశాలైన అమెరికా, పశ్చిమ ఐరోపా, జపాన్, ఆస్ట్రేలియాల్లో ఒక్కో స్త్రీకి సగటున ఒకటిన్నర బిడ్డలు మాత్రమే పుడుతున్నారు. కుటుంబసభ్యుల సంఖ్య మూడున్నరకి మించి ఉండదు – భారత్‌వంటి పేదదేశాల్లో ఇది 5 నుంచి 7 దాకా ఉంటున్నది. విశేషించి మనదేశంలో విద్య, ఆర్థిక స్తోమత, ఉద్యోగం ఉండే కుటుంబాల్లో ఒకరిద్దరికి మంచి పిల్లలు ఉండటంలేదు. ఇలా ఉన్న పరిమిత కుటుంబాల్లో పిల్లలకు చక్కని విద్య, ఆరోగ్యం ఉంటాయి. వీళ్లు విద్యాధికులై, ఆరోగ్యవంతులై ఆశించిన మేరకు ప్రగతిశీలురు, సంపన్నులు ఔతున్నారు. ఏ కుటుంబాలల్లోనైతే ఎక్కువ మంది పిల్లలుంటారో అక్కడ వాళ్ళకి విద్య తక్కువగా ఉంటుంది. పేదరికం కారణంగా వాళ్లు పిల్లలకి చదువు చెప్పించుకోలేక బాల కార్మికులుగా తమ పిల్లలను పనులకి పెడుతున్నారు. బాలకార్మిక వ్యవస్థకి అధిక సంతానం గూడా ఓ ముఖ్యకారణం. విద్యా విహీనత, పేదరికాలతో జతగూడి ఇది ఒక విషవలయంగా పరిణమిస్తున్నది.

పది పంచవర్ష ప్రణాళికల ద్వారా మనం ఎంతో సమృద్ధి సాధించాం. ఐతే జనాభా అదుపనేది లేకుండా పెరిగిపోతూండటం వల్ల తలసరి ఆదాయం పెరగలేదు. ఇదీగాక మనం సాధించిన ఆర్థికాభివృద్ధి ఫలాలు విద్య గల ఏ కొద్ది కుటుంబాలకు మాత్రమే ఉపయోగపడ్డాయి. ఈ కారణంగా ఈ వర్గాల వారికి, అధిక సంతానం, నిరక్షరాస్యత గల వర్గాలకు మధ్య ఆర్థికంగా, సాంస్కృతికంగా అఘాధం, వ్యత్యాసం ఏర్పడ్డాయి.

ఈ సందర్భంగా చైనా అనుభవం మనబోటి పేదదేశాలకు మార్గదర్శకంగా ఉంది. 1978 వరకు చైనాలో గూడా జనాభా పెరుగుదల విపరీతంగా ఉండింది. పంచవర్ష ప్రణాళికలతో స్థూల ఉత్పత్తి పెరుగుతునే ఉన్నా, జనాభాలో వృద్ధివల్ల తలసరి ఆదాయం పెరగలేదు. బీద, బిక్కి ప్రజల ఆరోగ్యం, గృహవసతి, పౌష్టికత్వం ఎదగలేదు. మావ్‌సేటుంగ్ మరణానంతరం చైనా అధినేతయైన డెంగ్ సియాన్‌పింగ్ నాయకత్వంలో చైనాలో మౌళికమైన మార్పులు వచ్చాయి. మన తలసరి ఆదాయం పెరిగే వరకు మనం జనాభాను నియంత్రించుకోవాలి. అందుకై కేవలం పరిమిత కుటుంబం మాత్రమేగాక ఎవరు ఏ యీడులో పెళ్లి చేసుకోవాలని అనే నియమాన్ని గూడా ఆయన నిర్దేశించారు. వివాహం చేసుకొనే ముందు యువతీ యువకులు ఆరోగ్యవంతులని, ఏ వ్యాధిలేనివారని, ఆర్థిక స్తోమత గలవారని ధృవపత్రం (సర్టిఫికెట్) ఉంటే తప్ప పెళ్ళి చేసుకోకూడదనీ, పెళ్ళి అయ్యాకా ఒక్క బిడ్డకు మించి ఎక్కువ సంతానం ఉండగూడదనీ ఆంక్షలు విధించి, వాటిని కఠినంగా అమలు జరిపించారు. దీని ఫలితంగా చైనాలో జనాభా 1980లో ఎంత ఉందో – నేడు గూడా అంతే ఉంది. ఇలా నియంత్రించడం వల్ల చైనాలో ఈరోజున అందరికీ విద్య, అందరికి ఆరోగ్యం, అందరికీ పని లభ్యం అవుతున్నాయి. కానైతే మన దేశంలో పెళ్ళి ఎవరు ఎప్పుడు చేసుకోవాలి, ఎందరు పిల్లల్ని కనాలి వగైరా నియమాలు లేక పోవడం వల్ల మనదేశంలో 1951 నుంచి ఈనాటి వరకు జనాభా మూడు రెట్లకు పైదాటి పెరిగిపోయింది. (ఇప్పటికీ మనదేశంలో ఎన్నో చోట్ల అడ్డాలలో బిడ్డలకు పెళ్ళిళ్లు చేయిస్తున్నారన్న విషయం ఎందరికి తెలుసు?) మన రాజ్యాంగం 6–14 ఏళ్ళ నడుమ వయస్సుగల ప్రతి ఒక్కరికి నిర్బంధ విద్యాబోధన జరగాలి అని నిర్దేశిస్తున్నది– కాని ఆర్థికాభావం వల్లనూ, చిత్తశుద్ధి

లేకనూ స్వతంత్రం వచ్చి 55 ఏళ్లుగడిచినా 65%కి మించి విద్యాధికులు లేరు – అక్షరాస్యతా, విద్యా లేకపోతే కూలికి తప్ప మరోపనికి ఎవరైనా పనికివస్తారా? ప్రస్తుతం మన దేశంలో జనసంఖ్య ఏటా కోటి యెనభై లక్షల రేటున పెరుగుతోంది. మనదేశంలో ఏఏడూగూడా కోటికి మించి ఉపాధి కల్పించలేకపోతున్నాం. ఫలితంగా అధిక సంతానం వల్ల, నిరక్షరాస్యత వల్ల – పేదరిక నిర్మూలన, ఉపాధికల్పన కష్టతరం ఔతున్నాయి. కాబట్టి అభివృద్ధి , సంపదలు ఆశించిన మేరకు లేని దేశంలో అభివృద్ధి చెందుతున్న చైనా వలే సంతాన నిరోధం, జనాభా నియంత్రణ అవసరం. చైనా చేపట్టిన చర్యల వల్ల స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెరిగాయి. మనకన్నా చైనాలో తలసరి ఆదాయం రెండున్నర రెట్లు ఎక్కువ.

అభివృద్ధి సాధించిన సంపన్న దేశాల్లో పనిచేసేవాళ్లు క్రమంగా తక్కువైపోతున్నారు. అలాగే పనిచేయజాలని వృద్ధుల సంఖ్య ఎక్కువవుతుంది. దీనితో సంపద క్షీణిస్తుంది. అలా జరగకుండా జాగ్రత్తపడేందుకు అమెరికావాళ్లు – తక్కువ తలసరి ఆదాయం ఉన్న పొరుగు దేశం మెక్సికో వంటి చోట్ల నుండి పనికోసం మనుషుల్ని తెచ్చుకొంటున్నాయి. మేథోసంపత్తికని ఇండియా ఆదిగా గల దేశాల నుండి మేధావులను రప్పించుకొంటున్నారు. కాబట్టి సంతానం తక్కువైనా ఆరాటపడకుండా పనిచేసే వాళ్ళకనీ, మేధస్సు ఆధారంగా పనిచేసే వాళ్ల కోసమూ శ్రమించి కృషి చేస్తున్నారు. పశ్చిమ ఐరోపా దేశాలలో శారీరకంగా పని చేయడం కోసం, వారి పూర్వ వలస దేశాల నుంచి – తమ దేశాలకు వచ్చేందుకు పనులు చేపడుతున్నారు. కానైతే అలా వచ్చేవాళ్ళు తెల్లవారు కారు. ఇస్లాం మతస్తులైన అరబ్బులు, నల్లజాతుల ఆఫ్రికనులు, అంటే జాతిలోనేగాక, మతంలోగూడా ఐరోపా దేశస్తులతో విభేదించేవారు. ఇలా వచ్చిన వాళ్ళు శ్వేతజాతి క్రైస్తవులలో ఇమడలేక పోవడం వల్ల సంఘర్షణలు తలెత్తుతున్నాయి. మత, వర్ణ ప్రాతిపదికపైన పశ్చిమ ఐరోపా దేశాలల్లో, ఇంగ్లండు, ఫ్రాన్స్, బెల్జియం, స్పెయిన్, జర్మనీ, డెన్మార్కు మొదలైన దేశాల్లో సాంఘిక సంక్షోభం మొదలయ్యింది. కనుకనే ఆయా దేశాల్లో పిల్లలను కనకుండా ఉండటం పొరబాటు అనీ, ప్రతి







కుటుంబంలోనూ కనీసం ముగ్గురు పిల్లలు ఉండాలనే భావం కలుగుతోంది.

సింగపూర్, చైనాల్లో గూడా క్రమేపీ అధికమయ్యే సంపత్తి దృష్ట్యా అక్కడ పనిచేసేందుకు కావలసినంత మంది జనం ఉండరేమో అనే శంకతో సంతాన నియంత్రణ నిబంధనలు సడలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రబలమవుతున్న ఈ సంస్కరణలను మనం అవగాహనకు తెచ్చుకోవాలి. లేకుంటే తలసరి ఆదాయం మనం ఆశించిన మేరకు పెరిగే వరకూ సంతాన నియంత్రణ అవసరమే – కానైతే ఆ పరిమితికి మించి ఆదాయం, సంపద ఉంటే, కేవలం ఒకరు ఇద్దరు పిల్లలేగాక, ముగ్గురైనా ఉండటం అవసరం అనే అభిప్రాయం కలుగుతుంది. ఇక తథాకథిత ప్రగతిశీల సామ్యవాదులు, వామపక్షీయులు, దీని యందు ఇమిడియున్న సత్యాన్ని ప్రకటించకుండా, చైనాలో ఉన్న పరిస్థితిని మరుగుపరచి – సుసంపన్న దేశాలు తమ రాజ్యాల్లోని వాస్తవ పరిస్థితుల్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతున్నా – ఒకవేళ చేసుకొని గూడా నిజాన్ని వక్రీకరించడం వల్ల– మన దేశంలో ఇక సంతాన నియంత్రణ అవసరం లేదని, ఈ పథకం మూలంగా బీద, బిక్కి, బడుగు వర్గాలకు, అల్ప సంఖ్యాకులకు (మైనారిటీలకు) అధికారం దక్కకుండా జాగ్రత్త పడటం కోసం "ఇవి సంపన్నులు చేస్తున్న దుష్ప్రచారాలే" అంటున్నారు. పేదలు, నిరక్ష రాస్యులు లేకపోతే ఎవరికి ఈ సిద్ధాంతాలు–ఇలా అర్థ సత్యాల్ని చెప్పి, అసూయనూ, విద్వేషాన్ని రెచ్చగొట్టగలరు? వాళ్ళ ఓట్లను ఎలా గుంజుకోగలరు? ఇక్కడే ఇంకో విషయాన్ని గమనించాలి. చదువుకొన్న, సంపన్నులైన, ఉద్యోగాలు చేసుకొనే హిందువుల్లో కుటుంబ నియంత్రణను పాటించడం ఎక్కువగా జరుగుతోంది. "మతపరంగా మేం దీన్ని అంగీకరించం" అంటున్న మైనారిటీల కుటుంబాల్లో జనాభా వృద్ధి పొందుతునే ఉంది. ఒకస్థాయికి ఎదిగిన విద్యావంతులు, సుసంపన్నులు, ఆర్జనపరుల్లో గూడా హిందూ కుటుంబాలల్లో తక్కువ మంది పిల్లలు, ఇతర మతస్తులలో ఎక్కువగా పిల్లలు ఉండటం మనం చూస్తున్నాం. ఈ వాస్తవాన్ని గురించి మాట్లాడే వాళ్ళను, రాసేవారిని హిందూమత ఛాందస వాదులనీ, మైనారిటీలకు వ్యతిరేకులనీ, తథాకథిత ప్రగతిశీలురు, సామ్యవాద పక్షీయులు –

హేళనచేస్తూ వారిని తెగడుతుంటారు. జనాభా పెరుగుదలపై వివిధ మతావలంబకుల్లో ప్రతికూలత, అసమానత ఉన్నట్లయితే, దేశం యొక్క స్థితి పూర్తిగామారిపోతుంది. ఉదాహరణకు : మలేసియాలో 40 ఏళ్ల క్రిందట మైనారిటీలుగా ఉండిన ముస్లింలు – శరవేగంతో పెరిగిపోయి మెజారిటీ స్థాయికి చేరుకొని – తుదకు ఆ దేశం ఒక ఇస్లామిక్ రాజ్యంగా మారిపోయింది. అలాగే లెబనాన్‌లో చదువు ఉన్నా 40 ఏళ్లలో క్రిస్టియన్ మెజారిటీ తమ బహు సంఖ్యను కోల్పోయి, ఈ రోజు ఒక ముస్లిం దేశం అయిపోయింది. ఇంకా అనేక ఇతర దేశాల్లో ఇలాగే అసమానత పెరిగి సంఘర్షణల రేకెత్తిస్తున్నది. కనుక ఒక సమగ్ర దృక్పథంతో ఆలోచించినట్లయితే అభివృద్ధి మార్గాన పయనించే దేశాల వ్యాసాలు వ్రాస్తున్న వాళ్ళల్లో , ప్రత్యేకించి అక్షరాస్యత, విద్య మరీ తక్కువగా ఉన్న దేశాల్లో – కొంత కాలం వరకు యావత్ప్రజానీకానికీ వర్తింపచేసే కుటుంబ నియంత్రణ విధానాన్ని ప్రభుత్వం నిర్బంధంగా అమలు చేయాలి అని చెప్పక తప్పదు. అలాకాని నాడు మనం అష్టకష్టాలు ఎంతో కాలం అనుభవించవలసి ఉంటుంది. రాజకీయ మేధావులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు – అమెరికా వంటి దేశాలకు, ఎందుకైనా కావచ్చు, వలసపోతున్నారు – ఈరోజున బాగా చదువుకున్న, చొరవ ఉన్న, ఎందరెందరో తరుణ వయస్కులు (కమ్మ, కాపు, రెడ్డి, బ్రాహ్మణ కులాలవాళ్లు) అమెరికాకు వెళ్ళిపోవడం మనం కళ్ళారా చూడ్డం లేదా? హద్దూ, అదుపూ లేకుండా ఇది ఇలా సాగుతూపోతే – భారతదేశాన్ని సెక్యులర్, సోషలిస్ట్ దేశంగానేగాక – వెనుకబడిన వర్గాల అల్ప సంఖ్యాకుల దేశంగా కూడా పిలవవలసి వస్తుందేమో – ఆలోచించండి!







# 43. మత మార్పిడి వ్యాపారం

నిజామాబాద్ పరిసర గ్రామాల్లో మత ప్రచారం కోసం ఒక క్రిస్టియన్ పాస్టర్ యొక్క నాయకత్వంలో సంచరిస్తున్న మూకపై కొంతమంది హిందువులు, బలవంతంగా, జబర్దస్తీగా మతమార్పిడులకు ప్రయత్నిస్తున్నారనే నేరారోపణతో, విరుచుపడి దేహశుద్ధి చేసి, మత ప్రచారకులనూ, మార్పిడి దార్లనూ తరిమికొట్టారని పత్రికలు 13 జనవరి 2006న వ్రాశాయి. ఇంకేముంది, కమ్యూనిస్ట్ పార్టీలు, వారి అనుబంధిత విద్యార్థి తదితర సంఘాలు, ఆల్ ఇండియా క్రిస్టియన్ కాంగ్రెస్ అధ్యక్షులు మరికొంత మంది వామ పక్షీయులు, అల్ప సంఖ్యాకుల మీద , అంటే క్రిస్టియన్లు, ముస్లింలను హిందూ ఫాసిస్టు మతచాంధస మూతాలు దారుణంగా హింసిస్తున్నారని భారతదేశంలో మతస్వాతంత్ర్యం హరించుకుపోతోందని, మైనారిటీలకు రక్షణ కల్పించాలని పత్రికా ప్రకటనలు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని, ఉదంతాన్ని ప్రపంచ వ్యాప్తంగా మతమార్పిడి వ్యాపారం చేస్తున్న క్రిస్టియన్ మిషనరీలు పాశ్చాత్య ప్రభుత్వాలకు, విశేషించి అమెరికన్ ప్రభుత్వానికి, భారతదేశంపై మతప్రచార, మతమార్పిడి స్వాతంత్ర్యాన్ని రక్షించే విధంగా భారత ప్రభుత్వంపై ఒత్తిడి చేయించే ప్రయత్నంలో వున్నారు. అసలు వాస్తవాలు ఏమిటి?

బ్రిటీష్ వాళ్ళు పాలించిన దాదాపు 200 సం॥ల కన్నా స్వతంత్ర్య భారతంలో, గత ముప్పై ఏళ్ళల్లో క్రిస్టియన్ మిషనరీలు ఎక్కువ మార్పిడులను సాధించారు. విశేషించి క్రిందటి పోపు భారతదేశ పర్యటన సందర్భంలో మూడవ సహస్రాబ్దిలో అసియా దేశాల్లోని హిందువులను, బౌద్ధులను క్రైస్తవ మతంలోకి మార్చాలని మిషనరీలకు మత ప్రచారకులకు, చర్చిలకు పిలుపునిచ్చారు. ఇది జగద్విదితము. అప్పటి నుంచి వేలాది కోట్ల రూపాయలు ప్రభుత్వానికి తెలిసియో, ఎక్కువగా తెలియకయో, మతమార్పిడులకై క్రైస్తవ మిషనరీలకు, చర్చిలకు వాటితో సంబంధం వుండే అదే లక్ష్య సాధన ఉద్దేశిస్తున్న ప్రభుత్వేతర సంస్థలకు అందుతున్నాయి. మన రాష్ట్రంలో ఒక ప్రక్కన దేవాలయాలు శిథిలమైపోయి, పూజలు లేకుండా

మూతపడుతుంటే అదే గ్రామాల్లో ఎన్నో చర్చిలు వెలుస్తున్నాయి. ఈ క్రింది పట్టికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎండోమెంట్ డిపార్టుమెంట్ తయారుచేసిందే.

**దేవాలయాలు, మసీదులు, చర్చిల వివరాలు**

| జిల్లా | దేవాలయం | చర్చి | మసీదులు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 12,346 | 3,347 | 18,482 |
| అనంతపూర్ | 14,008 | 4,892 | 9,328 |
| చిత్తూరు | 26,120 | 9,098 | 12,320 |
| కడప | 22,982 | 7,241 | 14,223 |
| తూర్పు గోదావరి | 8,220 | 12,123 | 9,230 |
| గుంటూరు | 9,302 | 16,388 | 5,429 |
| హైదరాబాద్ | 13,144 | 3,204 | 15,203 |
| కాకినాడ | 7,203 | 8,585 | 5,274 |
| కరీంనగర్ | 4,129 | 1,648 | 9,714 |
| ఖమ్మం | 5,210 | 7,203 | 5,922 |
| కృష్ణా | 8,929 | 8,462 | 3,769 |
| కర్నూల్ | 6,549 | 5,203 | 9,293 |
| మచిలీపట్నం | 5,000 | 8,320 | 6,493 |
| మహబూబ్‌నగర్ | 3,299 | 3,128 | 7,235 |
| మెదక్ | 6,302 | 3,203 | 3,234 |
| నెల్లూరు | 7,993 | 6,782 | 7,323 |
| నల్లగొండ | 6,882 | 2,412 | 5,239 |
| నిజామాబాద్ | 4,638 | 3,203 | 9,366 |
| ప్రకాశం | 4,255 | 5,583 | 4,932 |
| శ్రీకాకుళం | 7,339 | 9,879 | 2,140 |
| వరంగల్ | 1,393 | 6,320 | 1,342 |
| పశ్చిమ గోదావరి | 3,293 | 5,464 | 2,765 |
| విశాఖపట్టణం | 6,430 | 3,203 | 4,203 |
| విజయనగరం | 3,891 | 3,100 | 3,500 |

రాష్ట్రంలో 2001 జనాభా లెక్కల ప్రకారం 86% హిందువులకు వున్న దేవాలయాల కన్నా (ఇందులో చాలా వరకు మూతపడినవే) 1.5% కన్నా తక్కువ జనాభా వున్న క్రైస్తవులకు, దేవాలయాలను మించిన సంఖ్యలో చర్చిలు ఉండటం ఎలా జరుగుతుంది? ఎందుకు జరుగుతోంది? వీటి నిర్మాణానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి. ఈ నిర్మాణాలకు చట్ట ప్రకారం కావలసిన అనుమతులు వున్నాయా? ఆదాయ పన్ను డిపార్టుమెంటు వారు, ఆదాయం కన్నా ఎక్కువ సంపద వున్నవారిని అనుమానంతో ప్రశ్నిస్తారు. దాడులు చేస్తారు. సోదా చేస్తారు. కేసులు పెడతారు. మరి ఈ చర్చి సంస్థల మీద వాటి నిర్మాణానికి సంబంధించిన ధన వనరులను గురించి ఎందుకు అడగడం లేదు? నిర్దేశింపబడిన అనుమతులు ఉన్నాయా? లేవా? అని సంబంధిత కార్యాలయాలు ఎందుకు అడగడం లేదు?

భారత రాజ్యాంగ చట్టం మతాచరణకు, ప్రసారానికి స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. కాని సుప్రీంకోర్టు యొక్క ఒక తీర్పు ప్రకారం మత మార్పిడులను చేసే హక్కు ఇవ్వలేదు. క్రైస్తవ మిషనరీలు, మతబోధకులు, మత ప్రచారకులు మత మార్పిడులను ఒక ఉద్యమంగా, ఒక వ్యాపారంగా తదేక దీక్షతో చేస్తున్నారు.

మన రాష్ట్రంలో చూస్తే, ఏ జిల్లాలో, ఎంత మంది హిందువులున్నారో, ఏఏ కులాల సంఖ్య ఎక్కడెక్కడ ఎంతో, వారి యొక్క ఆర్థిక స్తోమత ఎంతో, ఇలాంటి వివరాలను సేకరించి, ఒక్కొక్క సంవత్సరానికి ఇంత మందిని మార్పిడి చేయాలంటే ఎంత డబ్బు అవసరమో, ఎంత మంది ప్రచారకులు, సహాయకులు ఇతర సిబ్బంది కావాలో, ఎన్ని వాహనాలు కావాలో, ఎన్ని కార్యాలయాలు కావాలో అనే బృహత్పథకాన్ని తయారుచేసి ఎన్నో దేశాల నుంచి డబ్బు తెచ్చుకుని, నిరుద్యోగులను మత మార్పిడిచేసి క్రైస్తవ ప్రచార ఉద్యోగాలిస్తున్నారు. నెలకు రూ. 3000 నుండి రూ. 10 వేల వరకు ఇస్తున్నారు. వీరిని దళాలుగా విభజించి ఊళ్ళమీదకి ప్రచార సాధనాలతో పంపుతున్నారు. బైబిలును, తదితర పుస్తకాలను ఇంటింటా పంచుతున్నారు. హిందూ దేవతల స్తోత్రాలను అదే మాటలలో, రాగాలతో, హిందు దేవతల పేర్లు తీసి, క్రీస్తు, మేరి వంటి పేర్లుపెట్టి పాటలు తయారు చేసి పాడుతూ, క్యాసెట్లను పంచుతున్నారు. గ్రామాల్లో చర్చిలమీద లౌడ్‌స్పీకర్లు పెట్టి ఈ క్రీస్తు పాటలు ప్రసారం చేస్తున్నారు. పల్లెల్లో, పట్నాల్లో, స్వస్థతా కూటములు ఏర్పరచి, సామాన్యులను ఆకర్షించి గారడీ మాటలచేత ఊరట కల్పిస్తూ నాటకీయమైన స్వస్థతను తత్కాలమే చూపిస్తూ, ఇది 'ఏసు మహిమ' అని చెప్పి మతాంతరీకరణకు, బృహత్‌ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి ఉద్యమానికి కోకోకోలాను, కార్లను, చీరలను, అమ్మే వ్యాపార సంస్థలకు ఏం బేధం వుంది? వ్యాపార సంస్థలు ఏ విధంగా ఎగ్జిబిషన్స్ ద్వారా, ఎడ్వర్‌టైజ్‌మెంట్స్, హోర్డింగ్స్ ద్వారా తమ వస్తువులకై ప్రజలను ఆకర్షిస్తున్నారో అదే విధంగా ఈ క్రిస్టియన్ సంస్థలు మతమార్పిడి అనే వ్యాపారం సాగిస్తున్నారు. ఈ వ్యాపారాన్ని మత ప్రసార స్వాతంత్ర్యం అని అనడం హాస్యాస్పదమే కాదు, మత స్వేచ్ఛ అనే పదానికి అవహేళన. వ్యాపారస్థుల యొక్క మోసాలనుండి గ్రాహకులను, కొనుగోలుదార్లను, కాపాడటానికి చట్టాలున్నాయి. కాని ఈ మతమార్పిళ్ళ వ్యాపారస్థుల స్వస్థతా కూటములు తదితర మత ప్రయోగాల నుండి అమాయకులకు, పీడితులకు చట్టపరమైన రక్షణ అవసరం లేదా? ప్రభుత్వం యొక్క ఉదాసీనత, నిష్చేష్టతలను అధిగమించడానికి ఎన్నో రంగాల్లో, ఎన్నో స్వచ్ఛంద, పౌర రక్షక సంఘాలు







ఉంటున్నాయి. అదే విధంగా మతమార్పిడి వ్యాపారస్థుల మానసిక హింసను ఎదుర్కొనడానికి, వారి మోసం నుంచి రక్షించడానికి హిందూ సమాజం సంఘటితమవ్వాలి.

ఇటీవల ఒక టివి ఛానల్‌లో మతమార్పిడుల మీద జరిగిన చర్చలో ఒక క్రిస్టియన్ సంస్థ యొక్క కార్యాధికారి "మేము మార్కెట్ షేర్ కోసం, మతాల బజారులో వ్యాపార విధానాలను ఉపయోగించటంలో తప్పేముంది? రాజకీయ పక్షాలు, తమ పార్టీ మద్దతు కోసం సభ్యులను సంపాదించుకోవడం కోసం ఇటువంటి ప్రచారాలు చేపట్టటంలేదా? అసలు మేం మతం మార్చుతున్నా మంటారెందుకు? హిందూయిజం మతంకాదని, వారి సాధువులు, మేధావులు. హిందూత్వవాదులు చెపుతున్నారు కదా? అలా ఏ మతమూ లేని, కేవలం కులాల కూటమికి సంబంధించిన వారికి ఒక ప్రపంచ వ్యాప్తమైన సందేశాన్ని యిచ్చి ఒక మతాన్ని ప్రసాదిస్తున్నాం. మతం లేనివారి మతాన్ని మేం మారుస్తున్నామని మాపై ఎందుకు అభియోగం చేస్తున్నారు?"

"కొంతమంది హిందూ మేధావులు, అన్ని మతాలు ఒకటే బోధిస్తున్నాయని, లక్ష్యం ఒకటేనని చెపుతున్నారు కదా! అటువంటప్పుడు మా బోధనలకు, మా సేవలకు, మా సహాయానికి ఆకర్షితులై, మా మతం పుచ్చుకుంటే, మేం ప్రసారం చేస్తుంటే మీకెందుకు బాధ".

ఎటువంటి మతమార్పిడులు ఆమోదయోగ్యమో, ఏవి వుచితమో అనేది అసలు ప్రశ్న. విదేశీ మత ప్రచారకులు గాంధీగారిని "మేము ఆసుపత్రుల ద్వారా, విద్యా సంస్థల ద్వారా, పేదవారికి సహాయం ద్వారా, ఎంతో సేవ చేస్తున్నాం. అటువంటప్పుడు, మా కార్య కలాపాలను మీరెందుకు వ్యతిరేకిస్తున్నారు? స్వాతంత్ర్యానంతరం మతంతారీకరణను నిషేధిస్తామంటున్నారు. ఇది న్యాయమా?" అని అడిగితే గాంధీగారిలా చెప్పారు, "మీ దేశంలో (అమెరికా, యూరప్) పేద వారు లేరా? వారికి సేవచేయకుండా, ఆ డబ్బు తెచ్చి ఇక్కడే ఎందుకు చేస్తున్నారు. మీ సేవలు దురుద్దేశ పూరిత మైనవి. మా దేశంలో ప్రతి పేదవానిలో కూడా

ఆధ్యాత్మికత, దైవభక్తి, చింతన వున్నాయి. ఇవి మీరు ప్రసాదించవలసిన అవసరం లేదు. హిందూమతాన్ని త్యజించి క్రైస్తవులవగానే, వారు తమ సంస్కృతిని, తమ పరంపరను త్యజించటమే కాక హిందువులుగా వున్న తమ బంధువులను కూడా త్యజిస్తున్నారు. మత మార్పిడులు దేశద్రోహానికి, సమాజంలో స్పర్ధలకు దారితీస్తున్నాయి" అన్నారు. భారతరత్న భీమ్‌రావ్ అంబేద్కర్ గారు దళిత ప్రజల మేలుకోసం ఆత్మగౌరవం కోసం, కులవివక్షతను, అస్పృశ్యతను నిర్మూలించడం కోసం హిందూ మతాన్ని సంస్కరించాలని ఎన్నో వుద్యమాలు నడిపి, తగిన మార్పును తీసుకురాలేనందుకు నిస్పృహ చెంది "నేనైతే హిందువుగా పుట్టాను గాని హిందువుగా చావను" అని చెప్పినంతనే 'మా మతాన్ని స్వీకరించమని' ముస్లింలు, క్రిస్టియన్లు ప్రాధేయపడ్డారు. నిజాం నవాబు, 'నీవు ఇస్లాం స్వీకరిస్తే,నీకు ఏడుకోట్లు రూపాయలిస్తానని కబురు పంపాడు. దేశవిదేశాల నుంచి క్రైస్తవ మత ప్రచారకులు ముస్లింలతో పోటీపడి ఎక్కువ ప్రలోభాలను చూపించారు. అంబేద్కరుగారు కొన్ని సంవత్సరాలు తీవ్రంగా ఆలోచించి ఈ క్రింది అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

"ముస్లింలలో కులాలు వర్గాలు వున్నాయి - షేక్, సయ్యద్, ముగల్, పఠాన్, అష్‌రాఫ్, అజలాఫ్.. ఇస్లాంలో సౌభ్రాతృత్వం ఆ మతస్థులకు మాత్రమే పరిమితం. ఇతరులు కాఫిర్లు. కాబట్టి ఇది విశ్వజనీనమైనదికాదు.." ఏనాడైతే హిందువు క్రిస్టియన్‌గా మారతాడో, ఆనాటి నుంచి అతడు భారతీయుడుగా వుండడు... కాబట్టి నేను ఈ రెండు మతాలను స్వీకరించను".

"దళితులను ఇస్లాంను పుచ్చుకోవద్దని అంబేద్కరు నిషేధించారు. భారతదేశానికి మతాంతరీకరణ వలన ఏ హాని జరుగరాదు. ముస్లింగా / క్రిస్టియన్‌గా మారితే హానిజరుగుతుంది. కాబట్టి ఈ దేశంలో పరిణతి చెందిన, ఈ జాతికి, సంస్కృతికి హాని కలిగించని, విశ్వజనీనతను ఘోషించే బౌద్ధాన్ని నేను స్వీకరిస్తాను. నా దళిత సోదరులంతా బౌద్ధాన్నీ స్వీకరించాలి. అంతేకాని, ఇస్లాంను, క్రిస్టియన్ మతాన్ని ముట్టుకోకూడదు."







1956లో మూడు లక్షల మంది అనుయాయులతో, అంబేద్కరు గారు బౌద్ధాన్ని స్వీకరించారు. మరో ఆశ్చర్యకరమైన విషయము, అంబేద్కర్ ఆదిశంకరులను, వారి భోధకులను కూడా బౌద్ధులని వర్ణించారు.

డా॥ రాధాకృష్ణన్‌గారు, "బుద్ధుడు హిందూమతాన్ని పవిత్రం చేయదల్చుకున్నారు. అంబేద్కర్‌గారు కూడా చేసింది ఇదే. వీరసావర్కర్‌గారు, ఇలా అన్నారు. "బౌద్ధ అంబేద్కర్‌గారు వాస్తవానికి అసలైన హిందూ అంబేద్కర్‌గారు".

వైదికము కాని బౌద్ధాన్ని స్వీకరించినప్పటికీ బౌద్ధం కూడా భారతావని యొక్క ధర్మాల కూటమిలో ఒకటి కాబట్టి ఆయన బౌద్ధ హిందువు అన్నారు. హిందూ సమాజం బుద్ధుణ్ణి ఒక అవతార పురుషునిగా ఒప్పుకుని గౌరవిస్తోంది. అంబేద్కరు గారి యందు శ్రద్ధ, భక్తి, విశ్వాసము, వున్న హరిజన సోదరులు, ఆయన ఆదర్శాలను, భావజాలాన్ని, దేశభక్తిని గుర్తించి, మత మార్పిడులకు ప్రలోభపడరాదు.

క్రైస్తవాన్ని పుచ్చుకున్నంత మాత్రాన కులవివక్షత పోతుందని, దారిద్ర్యం పోతుందని, అంటరానితనం పోతుందని అనుకోవడం అపోహ. 300ల సం॥లకు పైగా క్రైస్తవులుగా మారిన ఫిలిప్పైన్ దేశస్థులు తూర్పు ఆసియాలో అన్ని దేశస్థులకన్నా బీదవారిగా వుంటున్నారు. 1994 వరకు దక్షిణాఫ్రికా దేశంలో శ్వేతజాతి క్రిస్టియన్లు అధిక సంఖ్యాకులైన కృష్ణవర్ణ ఆఫ్రికన్లను క్రిస్టియన్లుగా మార్చిన వందలాది ఏళ్ళ తరువాత కూడ అస్పృశ్యులుగా చూశారు. క్రిస్టియన్లు ఆఫ్రికన్ దేశస్థులను మతం మార్చి, వందలాది సంవత్సరాల వరకు అస్పృశ్యులుగా, బానిసలుగా అమెరికాలో బాధపెట్టారు. చైనాను ఎదుర్కొనడం కోసం అమెరికా భారత స్నేహాన్ని కోరుతోంది. కాని భారతీయులు అస్మదీయులుగా (క్రిస్టియన్లుగా) వుండాలంటే వారిని అస్మదీయులుగా చేయుట అమెరికన్ పాలకుల ధృఢ లక్ష్యం.

దక్షిణ కొరియాలో 30 ఏళ్ళ క్రితం వరకు 90% ప్రజలు బౌద్ధులు. కాని కేవలం రాజకీయ సైనిక స్నేహితులుగా మాత్రమే కాక, ఆత్మీయులుగా చేయడం కోసం అమెరికన్లు మతాంతరీకరణను సంధించి దాదాపు 70% మందిని

క్రిస్టియన్లుగా మార్చారు.

అలాగే భారతీయులను కూడా క్రిస్టియన్లుగా మారిస్తే అమెరికాతో ఆత్మీయతను కలిగి వుంటారని, పరోక్షంగా, ప్రభుత్వ ప్రోత్సాహంతో క్రిస్టియన్ అనుయాయులు మన దేశంలో మతాంతరీకరణ మూకలకు అన్ని విధాల సహాయం చేస్తున్నాయి. అటువంటి విచ్ఛిన్నకర శక్తులకు, మత వ్యాపారస్తులకు ప్రభుత్వ రక్షణ కల్పించాలా లేక నిరోధించాలా? మతస్వాతంత్ర్యం అనే ముసుగులో దేశం విచ్ఛిత్తికోసం జరిగే ఈ వ్యాపారానికి ప్రజలు అంగీకరించరు. క్రైస్తవులుగా మారి, దేశం నుండి విడిపోతామని ఉద్యమాలు చేపట్టిన మిజోరాం, నాగాలాండ్, మణిపూర్ వంటి ఈశాన్య భారతదేశం మనకు గుణపాఠం. శాంతియుతంగా సంఘటితంగా, దేశ విచ్ఛిన్నకర మతమార్పిడి వ్యాపారాన్ని, బహుళజాతి వ్యాపార సంస్థల ఆధిపత్యాన్ని, కుట్రలను ఎలా నిరసిస్తున్నామో, ఆ విధంగా సంఘటితంగా, వ్యూహాత్మకంగా మత మార్పిడి వ్యాపారాన్ని అరికట్టడం మనందరి తక్షణ కర్తవ్యం.

దేశహితమైన ప్రభుత్వాలు ఈ శాంతియుత ప్రతిఘటనకు చేయూతనివ్వాలి. దగుల్బాజీ మతాంతీరీకరణ వ్యాపారాన్ని నిరోధించాలి. వ్యక్తిగతంగా ఆలోచించి ఏ విధంగా మనం రాజకీయ పార్టీలను మార్చుకుంటున్నామో అదే విధంగా అన్నీ తెలుసుకుని, నిజానిజాలను పరిశీలించి, వ్యక్తిగతంగా మతం మార్చుకోవడం తప్పుకాదు. కాని మత వ్యాపారానికి ప్రలోభిత బలిపశువుగా మారకూడదు. అలాచేసి దేశ, సమాజ విచ్ఛిత్తికి దోహదకారులం కాకూడదు.







# 44. గ్రామాలు ఎలా బాగుపడతాయి?

**విజ్ఞానయుగం, ఇన్ఫర్మేషన్ యుగం, బ్రాడ్‌బ్యాండ్ టెలికమ్యూనికేషన్ వ్యవస్థను గ్రామాలకు విస్తరింపజేసి ఏ విధంగా హైదరాబాద్ నుండి దేశ విదేశాల కంపెనీలకు బి.పి.ఓ. మరియు ఐ.టి.ఇ. మరియు సాఫ్ట్‌వేర్ సేవలను అందిస్తున్నామో అదేవిధంగా గ్రామాల నుంచి ప్రతిసేవను ప్రపంచంలోని ఏ దేశంలోని కంపెనీకైనా ఇవ్వవచ్చు. తద్వారా ఎక్కువ జీతం వచ్చే ఉపాధికల్పన మన గ్రామాలలో నివసించే పట్టభద్రులకు ఉపాధికల్పన చేయవచ్చు. ఇలా చేయవచ్చని సత్యం కంప్యూటర్ అనుబంధ సంస్థ బైరాజు ఫౌండేషన్, భీమవరం పరిసర గ్రామాలలో చేసి చూపిస్తున్నారు. ఈ యోజనను "గ్రామ్ ఐ.టి." అంటున్నారు. ఒక్కొక్క గ్రామంలో నెలకు 5 లక్షల రూపాయల పైగా జీతాలు లభ్యం అవుతున్నాయి. ఇంత సొమ్ము ఒక గ్రామంలోకి ప్రతినెలా వస్తుంటే, అక్కడ ఎంత ప్రగతినైనా సాధించలేమా?**

ఎన్నో వ్యాసాల ద్వారా, ప్రసంగాల ద్వారా భారతదేశము అమెరికా, యూరప్‌లవలె అభివృద్ధి చెందినప్పుడు, గ్రామస్థుల జనాభా 5 శాతం – 10 శాతానికి పడిపోతుందని కేవలం వ్యవసాయం మీద ఆధారపడేవారు యజమానులు కాని, పనివాళ్ళు కాని అదే నిష్పత్తిలో ఉంటారని తెలియజేస్తూ వస్తున్నాను. ఇలా జరగడానికి కొంతకాలం పడుతుంది. ఈ వ్యవధిలో ప్రస్తుతపు పరిస్థితులలో తరగని జనాభాతో పెరగని చదువులతో పూర్తిగాగాని, పాక్షికంగాగాని పనిలేని వారితో గ్రామాలు ఉన్నంత వరకు ఏ విధంగా దుర్భర పరిణామాల నుండి కాపాడుకోగలమో ఆలోచించాలి. ఈ నేపథ్యం ఆధారంగా చర్చించేదే ఈ వ్యాసం.

ఏనాడో భాగవతంలో పోతనగారు అనుక్షణం, అనుదినం ఏదో ఒకపనిలో నిమగ్నమై ఉన్నరాక్షసుడు హిరణ్యకశపుని చేత తన ఏకైక పుత్ర బాలకుడికి ఇలా చెప్పించాడు.

చదువని వాడజ్ఞుండగు
జదివిన సదసద్వివేక చతురత కలుగున్
జదువగ వలయును మనుజులకు
చదివించెద నిను అర్యులొద్ద, చదువుము తండ్రీ ॥

ప్రతి తల్లిదండ్రులూ ఈ పద్యములో జ్ఞానాన్ని రంగరించుకోవాలి. ఒకరిద్దరికన్నా పిల్లలు లేకుండా చూసుకుని వారికి అత్యున్నత ప్రమాణము కలిగిన శాస్త్రజ్ఞానంతో పాటు నీతి నియమాలను, బాధ్యతలను, సత్ప్రవర్తనను నేర్పే విద్యను ఏర్పాటు చేయాలి. గ్రామస్థుల యొక్క బాధ్యత, తమ గ్రామంలో ఉన్న పాఠశాలలోని అధ్యాపకులు గుణవంతులుగా ఉండేటట్లు చూడాలి. బాల బాలికలను సంపూర్ణ మానవులుగా వికసింపచేసేటట్లు చూడాలి. అధ్యాపకులు గ్రామంలోనే నివసించేటట్లు చూడాలి. ప్రతిరోజూ మరొక పట్నమో, గ్రామాన్నించి వచ్చి వెళ్ళడమనే పద్ధతిని సహించకూడదు. ఏ పాఠశాలలో వారు ఉపాధ్యాయులో వారియొక్క పిల్లలను ఆ పాఠశాలోనే చేర్చించాలని నిర్బంధించాలి. ఈ రెండు నియమాలకు ఒప్పుకున్న వారే మా గ్రామంలో ఉపాధ్యాయులుగా ఉండగలుగుతారు, ఇటువంటి నియమం తీసుకురావాలని ప్రభుత్వాన్ని ఒప్పించడానికి ఉద్యమించాలి.

కొన్ని గ్రామాలలో (ప్రైమరీ హెల్త్ సెంటర్స్) ప్రాథమిక వైద్య కేంద్రాలను ప్రభుత్వం స్థాపించి, డాక్టర్లను అక్కడ పనిచేయమని నియమించింది. ఇటువంటి చాలా కేంద్రాలలో డాక్టర్లు ఉద్యోగమైతే పొందారేకాని, దీర్ఘకాలిక శెలవుమీద పోయి, ఎక్కడో ధనార్జన చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా గ్రామస్థులు ఉద్యమించి, నియమితులైన డాక్టర్ని ఆ గ్రామంలో ఉండటానికి ఇల్లు, ఇతర వస్తువులు కల్పించి, వారి పిల్లలను కూడా ఆ గ్రామంలోని స్కూల్‌లోనే చేర్పించేటట్లుగా కృషిచేయాలి. ఎప్పుడైతే ఉపాధ్యాయులు వారి పిల్లలను డాక్టర్లు అదే గ్రామంలో నివసిస్తారో, ఆ గ్రామంలోని స్కూల్‌లోనే చేర్పిస్తారో, అప్పుడు విద్య, వైద్యసేవలు పట్టణ స్థాయికి చేరుకోగలవు.

చాలా గ్రామాలలో రక్షిత త్రాగునీరు కరువైపోతోంది. నాంది సంస్థవారు ఎక్కువ పెట్టుబడి అవసరం లేని పరికరాలతో ఆరోగ్యకరమైన మంచినీటిని లీటరుకు







కేవలం 10 పైసలుకు సరఫరా చేసే పద్ధతిని చాలా గ్రామాలకు విస్తరిస్తున్నారు. సత్యం కంప్యూటర్స్ అనుబంధమైన బైరాజు ఫౌండేషన్ ద్వారా 143 గ్రామాలలో ఈ వ్యవస్థ నడుస్తోంది. గ్రామస్థులు చొరవ తీసుకుని, బైరాజు ఫౌండేషన్‌కు అర్జించిన తడవుగానే, వారు ముందుకు వస్తున్నారు. ఉదా: వ్యాసరచయిత స్వగ్రామమైన అంగలూరులో 8 వారాల వ్యవధిలో ఈ వ్యవస్థను నెలకొల్పుతున్నారు. పంచాయితీ మరియు గ్రామపెద్దల సహకారం భాగస్వామ్యం అత్యవసరం.

ఏ గ్రామాలలో అయితే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప్రణాళిక ప్రవేశపెట్టబడిందో అక్కడ దీనిక్రింద అయ్యే ఖర్చును వృధాపోనీయకుండా, గ్రామంలో కావలసిన పనుల జాబితాను, గ్రామసభలో సర్వాంగీకారంతో తయారుచేయాలి. ఈ పనుల ప్రయోజనం రోడ్ల నిర్మాణానికి, ఉన్న రోడ్ల మరమ్మత్తుకు, చెరువు, కాలువ బోధిలలోని పూడిక తీయడానికి, రోడ్ల వెంట ఇరువైపులా చెట్లను, పచ్చగడ్డిని నాటి, పెంచి, పోషించడం, శిథిలావస్థలో ఉన్న మరమ్మత్తులు లేని గృహాల పునర్నిర్మాణం కోసం ఈ నిధులు లబ్ధిని పొందేవారికి, నిర్వహించే పద్ధతిలో ప్రవేశపెట్టాలి. ఊరియొక్క పారిశుధ్యత కూడా ఈ నిధి నుంచి సాధించాలి.

ప్రతిగ్రామంలో చిన్నలైబ్రరీ భవనాన్ని నిర్మించుకుని, వార్తా పత్రికలను, పుస్తకాలను సంగ్రహించి, గ్రామస్థులలో విషయజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగించుకోవాలి.

చాలా గ్రామాలలో విద్యావంతులైన యువతీ యువకులు సుదూర ప్రాంతపు పట్నాలకో, ఇతర దేశాలకో వెళుతున్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల యొక్క జీవితం దిన దినం దుర్భరమౌతోంది. యువకుల వలస ఎక్కువైన గ్రామాలలో, వృద్ధుల సంక్షేమం కొరకు సీనియర్ సిటిజన్స్ హోమ్‌ని నిర్వహించాలి. పట్నాలకన్నా తాము పుట్టిపెరిగిన పల్లెల్లో ఉంటేనే వృద్ధుల జీవితం ఆహ్లాదకరంగా, నిశ్చింతంగా ఉండగలదు. ఈ ప్రక్రియలో వ్యాసరచయిత స్వగ్రామం అంగలూరు చూపించిన బాటను ఇతరులు అనుసరించవచ్చు. 'అన్నా' అనే ట్రస్టును హైదరాబాదులో స్థాపించి జన్మతః అంగలూరు వారైన వందలమంది ఒక్క హైదరాబాదే కాక, దేశ విదేశాలలోని

వారందరూ ఈ ట్రస్టు ద్వారా సీనియర్ సిటిజన్ హోమ్‌ను అంగలూరులో ప్రారంభించారు. ఆ ఊరిలో ఇద్దరు, ముగ్గురు వదాన్యులు ఇంటితోపాటు ఇంటి స్థలాన్ని కూడా ఈ కార్యార్థం ఉచితంగా ఇచ్చారు. దీనితోపాటు ఒకప్పుడు చక్కగా నడచి, కొంతకాలం క్రింద మూతబడ్డ ఆసుపత్రి భవనాన్ని మరమ్మత్తు చేయించి, అందులో ఒక డాక్టరును నియమించి, ఆయన ద్వారా గ్రామస్థులకు సామాన్య వైద్యసేవలను ఇచ్చే ప్రణాళికను 15 ఆగస్టు 2006 నుంచి ప్రారంభించబోతున్నారు.

గ్రామంలో ఉన్న ప్రతిహైస్కూల్‌కి ఒక వర్క్‌షాప్‌ని ఏర్పాటు చేసి అక్కడ విద్యార్థి, విద్యార్థినులకే కాక, వయసున్న వారికి కూడా కార్పెంటరి, ఎలక్ట్రికల్ రిపేర్, ప్లంబింగ్, విద్యుత్ పరికరాల మరమ్మత్తు, కుట్టు, బొమ్మలు తయారుచేయడం, ఇటువంటి పనులలో నేర్పరితనాన్ని నేర్చుకునే అవకాశం కల్పించాలి. ఉత్తరోత్తర ప్రతి గృహస్థుడు కూడా, ఇటువంటి పనులను పాశ్చాత్య దేశాలలో వలె తనే చేసుకోవలసిన అవసరం వస్తుంది.

రోజు రోజుకు వైద్యసేవలు గగన కుసుమంలా ఉంటున్నాయి. ఆసుపత్రిలో చేరడం కన్నా చావడం మంచిది అనుకునే రోగులు ఎక్కువవుతున్నారు. దీనికి విరుగుడు ప్రతి కుటుంబం కూడా ఆరోగ్య భీమా పాలసీని తీసుకోవడమే. గ్రామసభలలో దీని అవసరాన్ని ప్రజలకు తెలపాలి. భీమా కంపెనీలను ఆహ్వానించి, తమ పథకాలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురమ్మని అర్థించాలి.

ప్రతి బడిలో ఈ క్రింది కార్యక్రమాలు చేయించినట్లయితే విద్యా ప్రమాణం పెరుగుతుంది. సంఘీభావం అలవడుతుంది.

1) విద్యార్థులచేత స్టాంపులు, నాణాల సేకరణ, వారి వార్షిక ప్రదర్శన.

2) విద్యార్థులయందు సాహిత్యంలో, మూల్యాలలో అభిరుచి కల్గించడానికి, వారి జ్ఞాపక శక్తిని, ఉచ్చారణను అభివృద్ధి చేయడంకోసం శతక సాహిత్య పఠనం, వల్లించడంలో పోటీలు పెట్టి వారికి బహుమతులు ఇవ్వడం.

3) ఆ గ్రామంలో జన్మించి, ఇతర చోట్ల వివిధ రంగాలలో రాణిస్తున్న వ్యక్తులను, ఆహ్వానించి వారేవిధంగా పైకి వచ్చారో, దాన్ని గురించి విద్యార్థులకు,







ఉపాధ్యాయులకు, గ్రామస్థులకు చెప్పించడం.

గ్రామాలలో మన పూర్వీకులు దేవాలయాలను నిర్మించారు. అవి కేవలం పూజకోసమే కాదు. అక్కడ మంచి వ్యక్తుల చేత ప్రవచనాల ద్వారా, కథాశ్రవణం ద్వారా, భజనల ద్వారా, హరికథల ద్వారా, ప్రసంగాల ద్వారా, దేశం యొక్క జాతి యొక్క చరిత్రను, సంస్కృతినీ అందరికీ ఆకళింపుకు తీసుకురావడం, ప్రజలలో సోదరభావం పెంపొందించడం, క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పడం. ఇవి ముఖ్యోద్దేశ్యాలు. కాబట్టి మనం దేవాలయాలను పునరుద్ధరించి పైన చెప్పిన కార్యక్రమాలను చేపట్టాలి.

ఇందులో ఒక ప్రత్యేక అంగంగా మన హరిజన సోదరులను దేవాలయాలలోనికి ఆహ్వానించి, ఆదరించి, వారిని మనలను మించిన సజ్జనులుగా, నాయకులుగా, ఉద్యోధకులుగా, ధర్మపరి రక్షకులుగా తయారుచేయాలి. కొన్ని పండగలలో సహ పంక్తి భోజనాలను, కులవివక్షత లేకుండా అందరూ కలసి చేసేటట్లుగా నిర్వహించాలి.

సంవత్సరానికి ఒకసారి గ్రామంలో ఒక సాంస్కృతికోత్సవం జరిపి, పౌరాణిక నాటకాలు, బుర్రకథలు, కోలాటం, వీధి భాగవతాలు, తోలుబొమ్మలాట ఇటువంటివి ప్రదర్శించాలి. ఇదే సందర్భంలో సైడ్‌షోగా పిల్లలు, స్త్రీలకు, బొమ్మలకు పెయింటింగ్‌లకు తగిన ప్రదర్శన ఏర్పాటుచేయాలి.

**గ్రామ నగరీకరణ:**

**విజ్ఞానయుగం, ఇన్ఫర్మేషన్ యుగం, బ్రాడ్ బ్యాండ్ టెలికమ్యూనికేషన్ వ్యవస్థను గ్రామాలకు విస్తరింపజేసి ఏ విధంగా హైదరాబాద్ నుండి దేశ విదేశాల కంపెనీలకు బిపిఓ మరియు ఐ.టి.ఇలు మరియు సాఫ్ట్‌వేర్ సేవలను అందిస్తున్నామో అదేవిధంగా గ్రామాల నుంచి ప్రతిసేవను ప్రపంచంలోని ఏదేశంలోని కంపెనీకైనా ఇవ్వవచ్చు. తద్వారా మన గ్రామాలలోనే నివసించగలిగిన పట్టభద్రులకు ఎక్కువ జీతం వచ్చే ఉపాధికల్పన చేయవచ్చు. ఇలా చేయవచ్చని సత్యం కంప్యూటర్ అనుబంధ బైరాజు ఫౌండేషన్ భీమవరం పరిసర గ్రామాలలో చేసి చూపిస్తున్నారు. ఈ యోజనను 'గ్రామ్ ఐ.టి.' అంటున్నారు. ఒక్కొక్క గ్రామంలో నెలకు 5 లక్షల రూపాయల పైగా జీతం లభ్యం అవుతున్నాయి. ఇంత సొమ్ము ఒక గ్రామంలోకి ప్రతినెలా వస్తుంటే,**

అక్కడ ఎంత ప్రగతినైనా సాధించలేమా?

ఐ.టి. రంగంలో పనిచేసే ఈ యువతీయువకులు సమాజ స్పృహతో, మంచిరోడ్లు, వైద్య సదుపాయాలు, మంచి విద్య గ్రామపరిశుభ్రత, లైబ్రరీ, రక్షిత మంచినీటి సరఫరా లాంటివి సమకూర్చవచ్చు. అప్పుడు ఉద్యోగంకోసం పట్నాలకు వెళ్ళవలసిన అవసరం ఉండదు.

ఈ వ్యాసంలో వ్రాసిన కార్యక్రమాలన్నీ చేపట్టడానికి ఆ గ్రామంలో పుట్టి పెరిగిన సంపన్నులైనవారు, ఆ గ్రామంలోనే నివసిస్తున్నవారు కలిసి పనిచేయాలి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తుల ఎన్నికల కోసం కేవలం గ్రామస్థాయిలోనే లక్షల రూపాయలు వృధాగా ఖర్చుఅవుతున్నాయి. ఆ ధనాన్నే గ్రామ వికాసం కోసం ఉపయోగిస్తే, అక్కడ విద్యాలయాలకు, ఆసుపత్రులకు ఖర్చుపెడితే పట్నాలకన్నా గ్రామవాసాలు మెరుగ్గా ఉంటాయి.







# 45. గ్రామాభ్యుదయం ఎలా జరుగుతుంది?

సెప్టెంబర్ 2006

“మా పిల్లలు వ్యవసాయం చేయకూడదు. మా పిల్లలు గ్రామాల్లో ఉండకూడదు. మా పిల్లలు పట్నాల్లో, విదేశాల్లో చదువుకొని అక్కడే సంపన్నులవ్వాలి. మీ పిల్లలు ఊళ్లోనే ఉండి, ప్రభుత్వ పాఠశాలల్లో, తెలుగు మాధ్యమంలో చదువుకొని, ఓటరు మూకలుగా తయారై, మా నాయకత్వాన్ని బలపరచండి. మీ హక్కుల గురించి, మీ బాగుని గురించి మేం పోరాడుతాం” – ఇంతే గదా వాస్తవం?

రైతులనూ, వ్యవసాయ రంగాన్ని పల్లె ప్రజల అభివృద్ధినీ ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయనీ, గ్రామాల్లో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోతున్నాయనీ, భారతదేశ జనాభాలో 72 శాతం గ్రామాల్లో నివసిస్తూంటే వారి బాగోగులను నిర్లక్ష్యం చేయడం అనుచితమని విపక్షం అంటుంది. పాలకపక్షంలో లేని పార్టీలు, నాయకులూ, అనాదిగా ప్రతిపక్షంలోనే ఉంటున్న వామపక్షాలూ, వారి మేధావులూ తరచూ విమర్శలు చేస్తున్నారు. వ్యాసాలు వ్రాస్తున్నారు. సభలు జరుపుతున్నారు, మేధావులు గోష్ఠులు పెడుతున్నారు. స్వతంత్రం వచ్చి 59 సంవత్సరాలవుతున్నా, పది పంచవర్ష ప్రణాళికలు పూర్తయినా, ఇంకా రైతాంగం, పల్లె ప్రజలూ, వ్యవసాయంమీద ఆధారపడి జీవించేవాళ్లూ, నానారకమైన వ్యథలతో జీవిస్తున్నారు, వివక్షతకు గురవుతున్నారు అని ఈ విమర్శకులూ, రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు. వీరందరూ ఈ క్రింది ప్రశ్నలకు నిజాయితీతో జవాబులిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయి.

రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులూ, శాసనసభ సభ్యులు చాలా మంది గ్రామప్రాంతాల్లో పుట్టిపెరిగినవారే; చాలా మంది వ్యవసాయం చేసుకునే కుటుంబాల్లో నుంచి వచ్చినవారే. వీరిలో ఎంతమంది ఇంకా గ్రామాల్లోనే నివసిస్తున్నారు? ఎంతమంది పట్నాల్లో, హైదరాబాద్‌లో నివసిస్తున్నారు? ఎంతమంది తమ తాత తండ్రుల వృత్తులలో ఉన్నారు? రైతు, చదువుకున్న తమ బిడ్డలను, రైతు వృత్తిలోనే ఉంచకోరుతున్నాడా, లేక ప్రభుత్వోద్యోగం కోసమో, ప్రైవేటు కంపెనీలో పనికోసమో, వ్యాపారం కోసమో కోరుకుంటూ గ్రామంలోని తరతరాల నాటి వృత్తిని వదిలి పట్నాలకు

వెళ్ళమంటున్నాడా? మరీ నిరుపేద దక్క, ఏ గ్రామస్థుడైనా, భూమి ఉన్న ఏ రైతయినా తన బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలో చదివించకోరుతున్నాడా లేదా ఇంగ్లీషు మీడియంలో చదువులు చెప్పే, ఎక్కువ ఫీజులు తీసుకొనే ప్రైవేట్ 'కాన్వెంట్'లో చదివించకోరుతున్నాడా?

వ్యాసాలు వ్రాస్తూ, ప్రభుత్వం రైతులపై ఉపేక్ష చూపిస్తోందని విమర్శించే నాయకులు, మేధావులు ఎంతమంది తమ పిల్లలను అమెరికా పంపించాలని కోరుకుంటున్నారు. ఎంత మంది రైతు నాయకులు, రైతు హితైషులు వారి పిల్లల్ని చదువులకోసం అమెరికా, తదితర దేశాలకు పంపించారు. రైతాంగంలో నుంచి గ్రామ ప్రాంతాలనుండి వచ్చిన, నాకు తెలిసిన ముఖ్యమంత్రులు, శాసనసభ్యులు, మేధావులు, వామపక్షీయులు చాలామంది వారి పిల్లలను అమెరికాకు ఎగుమతి చేశారు!

ఇటువంటివారు గ్రామాభివృద్ధిని గురించి, వ్యవసాయ రంగం మేల్పరచడాన్ని గురించి మాట్లాడుతుంటే, వ్రాస్తుంటే ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే, ఇదేమి నిజాయితీ అని ఆశ్చర్యం వేస్తుంది.

మరో విషయం – మనదేశం 2020 సంవత్సరానికల్లా పాశ్చాత్య దేశాలలాగా అభివృద్ధి చెందిన దేశం అవుతుందని, శక్తివంతమై, ప్రపంచాన్నే ప్రభావితం చేసే రాష్ట్రంగా తయారవుతామని, రాష్ట్రపతి కలాంగారినుంచి, కాంగ్రెస్, భాజపా, తెలుగుదేశం పార్టీల రాజకీయ నాయకులు చెబుతున్నారు. అభివృద్ధి చెందిన ఏ దేశంలో కూడా జపాన్, అమెరికా, ఇటలీ, జర్మనీ, కొరియా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్ ఇత్యాదుల్లో గ్రామీణ ప్రజలు 10 శాతం కన్నా ఎక్కువలేరు. వ్యవసాయమీద ఆధారపడేవారు, వ్యవసాయ రంగంలో పనిచేసేవారు ఐదు శాతం లోపే, ఆ దేశాల స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా రెండు, ఐదు శాతాల మధ్య ఉంది. మనదేశంలో 1951 ( ప్రథమ పంచవర్ష ప్రణాళికారంభం)లో దేశ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం యొక్క వాటా 70 శాతం. పనిచేసే వాళ్ళల్లో 70 శాతం వ్యవసాయ రంగంలో ఉండేవారు. కాని 2005 సంవత్సరానికి, వ్యవసాయ రంగం వాటా 18 శాతానికి తగ్గింది. అయినప్పటికి పనిచేసేవారిలో 65 శాతం,







వ్యవసాయ రంగంలోని ఉన్నారు. దీనికి కారణం పల్లె ప్రజల్లో నిరక్షరాస్యత, అధిక సంతానం. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ జరుగుతోంది. పొలం దున్నటానికి ఎద్దులు నాగళ్ల బదులు ట్రాక్టర్లు, కోతకు, నూర్పిడికి మనుషులూ, పశువుల స్థానంలో హార్వెస్టర్లు వచ్చాయి. ఎరువులు వేసి మేలి విత్తనాలను వాడి క్రిమికీటక సంహారపు మందులనుపయోగించి, విద్యుత్ ద్వారా భూగర్భ జలాలను తోడి భూసారాన్ని పిండి ఎకరానికి తలసరి ఉత్పత్తిని పెంచుతున్నాం. అందుచేత 1951లో ఐదు కోట్ల టన్నుల ఆహార ధాన్యోత్పత్తి చేస్తే, ప్రస్తుతం ఇరవై రెండు కోట్ల టన్నులపైగా ఆహార ధాన్యోత్పత్తి జరుగుతోంది. అంటే శాస్త్రీయ సాంకేతికాధారిత వ్యవసాయంవల్ల, తక్కువ పనివాళ్లతో ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఇతర నేర్పరితనాల లేమివల్ల, వారికి ప్రత్యామ్నాయ ఉపాధులు లేవు. తమకు తెలిసిన పనికి డిమాండ్ తగ్గిపోతోంది. పర్యవసానంగా గ్రామస్థుల తలసరి ఆదాయం 8000 రూపాయలయితే, పట్న నగరవాసుల తలసరి ఆదాయం రూ. 56వేలు అంటే ఏడు రెట్లుగా ఉంది. చైనాలో ఇది మూడున్నర.

దూరదృష్టిగల, బాధ్యత గలిగిన, నిజాయితీ ఉన్న నాయకులు, మేధావులు, పార్టీలు ప్రజలకు వాస్తవాలను తెల్పాలి. భారతదేశం ఆర్థికంగా అభివృద్ధిచెంది సంపన్నదేశం అవుతోంది. చదువున్న వారూ, వృత్తుల నేర్పరితనం ఉన్నవారు, చొరవ ఉన్న ఔత్సాహికులు త్వరగా సంపన్నులవుతారు. పరిమిత సంతానం ఉంటే, పిల్లలకు ఉన్నత ప్రమాణాలున్న ప్రపంచ స్థాయిగల విద్య, నేర్పరితనాన్ని పొందవచ్చు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన ప్రతిదేశంలో లాగా మనదేశంలో కూడా వ్యవసాయం మీద ఎక్కువమంది ఆధారపడలేరు. ఈ విషయాలను గమనించి మన దృక్పథంలో, మన మూల్యాల్లో, లక్ష్యాల్లో, కుటుంబ సంఖ్యలో, విద్యలో మార్పు తెచ్చుకోవాలి. నిజమైన నాయకులూ, దేశభక్తి కలిగిన పార్టీలు దీర్ఘకాలపు ప్రజాహితాన్ని సంక్షేమాన్ని కోరే మేధావులూ ఉద్బోధించాలి. అంతేకాని చౌకబారు నినాదాలతో అసాధ్యమైన వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టరాదు.

గ్రామాలనే, పట్నసమానంగా చేసే అవకాశం లభిస్తోంది. అప్టికల్ ఫైబర్ కేబుల్స్‌ద్వారా చివరి కిలోమీటర్‌లో వైర్‌లెస్ (రేడియో తరంగాలు)ను ఉపయోగించి, ప్రతి గ్రామానికి ఆశ్చర్యకరమైన తక్కువ పెట్టుబడితో, బ్రాడ్‌బ్యాండ్ టెలికాం వ్యవస్థను

విస్తరింపచేయవచ్చు. ప్రస్తుతం బ్రాడ్ బ్యాండ్ సదుపాయం ఉన్న హైదరాబాద్ వంటి పట్నాల్లో ఉన్న కంప్యూటర్ సర్వీసెస్ కంపెనీలకు, అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లోని వ్యాపార సంస్థలు, తమ కంపెనీ పనులను అవుట్ సోర్స్ (ఇతరులతో చేయించడం) చేస్తున్నారు. ఆ పనులను, బ్రాడ్ బ్యాండ్ సదుపాయం ఉన్న గ్రామాల్లోనే కంప్యూటర్ విద్యలో ప్రావీణ్యత ఉన్న యువతీ యువక పట్టభద్రులతో చేయించుకోవచ్చు. అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లోని, ప్రజ్ఞ ప్రతిభా పాటవాలున్న వారికి తమ గ్రామాల్లోనే ఉపాధి కల్పన జరుగుతుంది. ఇది సుసాధ్యమని సత్యం కంప్యూటర్ కంపెనీవారు బైర్రాజు ఫౌండేషన్ ద్వారా, భీమవరం పరిసర గ్రామాల్లో నిరూపిస్తున్నారు. జల్లికాకినాడ అనే గ్రామంలో వందమంది యువతీయువక పట్టభద్రులకు ఇంగ్లీషులో, కంప్యూటర్ ఉపయోగంలో ఉత్తమశ్రేణి నేర్పరితనాన్ని అలవరచి, వారికి కంప్యూటర్ ఆధారిత సేవలందించే ఉపాధిని కల్పించారు. జనవరి 9, 2006వ తేదీన రాష్ట్రపతి కలాం , ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారు ఈ వ్యవస్థను తిలకించి, అధ్యయనం చేసి ముగ్ధులయ్యారు. ఈ ప్రక్రియ నిజమైన, దీర్ఘకాలిక గ్రామాభ్యుదయకారిణి. ఒక ఊరికి మంచి రోడ్డు వేయాలంటే ప్రతి కిలోమీటర్‌కూ ఒక కోటి రూపాయలు ఖర్చవుతోంది. అదే బ్రాడ్‌బ్యాండ్ టెలికాం నిచ్చే ఆప్టికల్ ఫైబర్ వ్యవస్థకు ఖర్చు మూడు లక్షలకన్నా తక్కువ! అమెరికన్, తదితర పాశ్చాత్య దేశపు కంపెనీలు, హైదరాబాద్ వంటి పట్నాలకు గాక, జల్లికాకినాడ వంటి గ్రామాలకు తమ పనిని పంపితే, గ్రామాలే పట్నాలవుతాయి. గ్రామాల్లోనే విద్య, వైద్య, ఉపాధి సదుపాయాలు కలుగుతాయి. ఈ ప్రత్యామ్నాయపు ప్రగతిపథాన్ని మనం కోరి, ఆహ్వానించి, కార్యాన్వితం చేయాలి.







# 46. ఎందుకీ దుష్ట సంప్రదాయం?

అమెరికన్ సంస్కృతి భారతదేశంలో తాండవిస్తోందనడానికి ఈమధ్య మన యువతీ యువకులు వారి పేర్లను వ్రాసే విధానం ద్వారా తెలుసుకోవచ్చు. మన సంప్రదాయం ప్రకారం ముందు ఇంటిపేరు తరువాత మన పేరు వ్రాస్తాం, చెబుతాం. కానీ అమెరికన్ సంస్కృతికి సమ్మోహితులైనవారు, పులిని చూచి నక్కవాతలు పెట్టుకున్నట్లుగా మరికొంత మంది తమ పేరును కుదించి ఇంటిపేరును వ్రాస్తున్నారు. ఉదాహరణకు పి.ఆర్.గొట్టిపాటి. అమెరికాలో ఫ్యామిలీ (వంశం) పేరును సాధారణంగా వాడతారు. దానికి అనుకూలంగా అమెరికాలో ఉన్నప్పుడు వారి సంప్రదాయం ప్రకారం మన వాళ్ళు వారిపేరును పి.ఆర్. గొట్టిపాటి అని అక్కడ వ్రాసుకోవచ్చు, చెప్పుకోవచ్చు. కాని మన దేశంలో మన సంప్రదాయం ప్రకారం గొట్టిపాటి ప్రభాకరరావు లేకపోతే గొ.ప్రభాకర్‌రావు అని చెప్పడం ఉచితం. మన సంప్రదాయాన్ని విడిచిపెట్టి అమెరికన్ సంప్రదాయాన్ని స్వీకరించినంత మాత్రాన అమెరికన్‌లకు సమానులం కాము. మన వారసత్వాన్ని ఆధారంగా మన సంస్కృతికి అనుగుణంగా మనం, విద్యావంతులం, వ్యాపారస్థులం, ధనవంతులం, శాస్త్రవేత్తలం అవ్వాలి.

# 47. విద్యలేని బతుకు మిథ్య

(ఆంధ్రభూమి 12-12-05)

విద్య అంటే చాలామంది పుస్తకాల్ని మాత్రమే చదవటం, పరీక్షలు పాసై డిగ్రీలు తెచ్చుకోవడం అనుకుంటారు. కేవలం పుస్తకజ్ఞాన సముపార్జనం నిష్ప్రయోజనం. పక్షులు ఎగరటం, చేపలు ఈతకొట్టడం కూడా విద్యయే! మానవునిలో అంతర్గత శక్తుల్ని అభివృద్ధి చేసి, సమాజాభివృద్ధికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేది, అంధకారం నుండి విముక్తి కలిగించి వెలుగువైపు నడిపించేది, దుష్ప్రవర్తన నుంచి సత్ప్రవర్తనవైపు మనిషిని తీసుకువెళ్ళేది విద్య.

మనిషికి విద్య అవసరమా? అంటే నూటికి నూరుపాళ్ళు అవసరమనే చెబుతారు. విద్య మనిషికి మూడోనేత్రం. ఇంకా అన్యాయం, అక్రమం, అజ్ఞానం, మూఢత్వం, క్రూరత్వం, దురాచారం... లాంటి చీకట్లను పారద్రోలి 'మంచి' అనే వెలుగుల్ని చూడగలిగిన జ్ఞాననేత్రం. విద్యలేనివాడు వింత పశువు అని పూర్వం అనేవారు. మరి నేడు విద్య ఉన్నవాడు, వికృత పశువు అనక తప్పడంలేదు. చెడు స్నేహాలు,సమయం వృథా చేసే షికార్లు, డబ్బులివ్వమంటూ తల్లిదండ్రుల్ని బాధించడం, కాపీలు కొట్టనివ్వలేదని అక్షరబ్రహ్మ, గురువుపైకే కొట్లాటకు దిగటం నేటి విద్యార్థుల వికృత చేష్టల పరాకాష్ట. శీలం, నడవడి, సద్గుణం, సద్బుద్ధి, దేశభక్తి, మంచి , వినయం, సేవాభావం, విధేయతలు లేకుండా తలపై ఎన్ని డిగ్రీల కొమ్ములు మొలిచినా వృథాయే!

శ్రద్ధలేనిదే విద్యరాదు. మనకోసమే చదువుకుంటున్నామను భావన విద్యార్థుల్లో కలగాలి. వారి తల్లిదండ్రుల కోసమో, వారి ఉపాధ్యాయులకోసమో, విద్యాసంస్థల కోసమో చదువుకుంటున్నామను అపోహ తొలగాలి. పుట్టపర్తి నారాయణాచార్యుల వారు పండితులు, గొప్ప కవి. ఆయన తన 20వ ఏట మదరాసు విశ్వవిద్యాలయంలో 'విద్వాన్' పరీక్షకు కూర్చొన్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన సంగతి ఏమంటే ఆ సంవత్సరం ఆయన పరీక్షకు చదువవలసిన పాఠ్య గ్రంథాలలో ఒకటైన 'పెనుగొండ లక్ష్మి' అనే







తాను రాసిన కావ్యం అయి ఉండటం. దీని వల్ల జ్ఞానానికీ, చదువుకి సంబంధం లేదని తెలుస్తున్నది.

వస్త్రం, వాక్కు, విద్య, వినయం, శరీర సౌష్టవం అన్నీ వున్న వారే సమాజంలో మంచివారుగా గుర్తింపబడతారు. ఏ ప్రదేశంలోనైతే ఉత్తమమైన విద్యను నేర్చుకునే అవకాశం వుండదో, ధన సంపాదనకు వీలుకాదో, మనస్సుకు సుఖం లభించదో అట్టిచోట ఒకరోజు కూడా నివసించకూడదు. ఈ మూడు పొందగలిగిన ప్రదేశమే నిజమైన స్వర్గం. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల వైభోగం చెప్పనలవి కాదు. కారుల్లో రావటం దగ్గర్నుంచి క్లాసులో ఫ్యాన్లు, ఏసిలవరకూ అన్నీ సుఖాలే! కష్టపడటం విద్యార్థికి తెలియటం లేదు. తల్లిదండ్రులు 'మేం ఎటూ కష్టపడి పైకి వచ్చాం గనుక మా పిల్లలు కష్టపడకూడదనే' భ్రమలో ఉన్నారు. కష్టమంటే కేవలం శారీరక శ్రమ చేయ్యటమే కాదు - వ్యాయామం, డబ్బు విలువ, విద్య విలువ, మనిషి విలువల్ని తెలుసుకోవడం. సుఖమొక్కటే రావాలంటే కష్టమనే బీజాన్ని నాటాల్సిందే, శ్రమ అనే నీటిని పొయ్యాల్సిందే! కష్టపడి చదవాల్సిన విద్యార్థి దశలోనే సుఖాల్ని కోరితే వారికి విద్యరాదు. విద్యలో ఉత్తమ ఫలితాల సాధనకోసమే కృషిచేసే వారికి సుఖాలు దొరకవు. కాబట్టే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలనుకునేవారు, విద్యాలయంలో చేరిన మొదటిరోజు నుంచే దీక్షగా చదవాలి. ఇలాంటి శ్రద్ధ, ముందు చూపులేకుంటే ఉత్తమ ఫలితాన్ని ఇటు చదువులోనూ, అటు జీవితంలోనూ సాధించలేరు. క్రమబద్ధమైన ప్రణాళికను తయారు చేసుకోవడం, సద్బుద్ధి ఉన్న స్నేహితులతో స్నేహం చెయ్యడం, సంపూర్ణ సమయ సద్వినియోగం, తల్లిదండ్రులు, గురువు చెప్పిన మంచిబాటలో నడచి సిసలైన విద్య అసలైన డిగ్రీ పొందవచ్చు. విద్యార్థుల్లో బద్ధకం, సోమరితనం, అహంకారం, నిరుత్సాహం, అనవసరమైన కోపం, అప్రస్తుత వృథా ప్రసంగం కన్పిస్తున్నాయి. పరీక్ష నెగ్గకపోవడానికి కారణం ఏదైనాసరే చింతిస్తూ కూర్చోరాదు. పరీక్ష జీవితంలో ఒక భాగం. పరీక్షే జీవితం కాదు. నేటి ప్రతి అపజయం రేపటి విజయానికి నాంది. థామస్ అల్వా ఎడిసన్ రెండువందల సార్లు అపజయం చవిచూశాకే చివరికి కరెంటు బల్బును తయారుచేసి విజయాన్ని

సాధించాడు. శాస్త్రం కోసం, శాస్త్రప్రకారం విద్యలో హిమవత్పర్వతాలు అధిరోహించి 'ఫాదర్ ఆఫ్ మిస్సైల్స్'గా పేరుబడి రాష్ట్రపతి కాగల్గారు అబ్దుల్ కలాం గారు.

విద్యలేనివారిని హీనులుగా చూస్తారందరూ. అవిద్య మూలంగా దోపిడీకి గురికావచ్చు. రౌడీయిజం, తీవ్రవాదం, దొంగతనం, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు విద్యాలోపం వల్లనే కలిగే దుష్ఫలితాలు. ఇలాంటివారిపట్ల ఇటు ఇంట్లోను అటు సమాజంలోను చిన్నచూపుతో వ్యవహరిస్తారంతా. కావున విద్యా సంపదే అన్ని సంపదలకన్నా శ్రేష్ఠమైన సంపద.







# 48. తెలంగాణా వెనుకబాటుతనం పోయేదెలా?

**తెలంగాణా వెనుకబాటుతనాన్ని పోగొట్టడానికి పథకాల అమలుకు ఎంత మొత్తం అవసరమో అంచనా వేయడానిక ఒక నిపుణుల కమిటీని నియమించడమే మంచిదనిపిస్తుంది. ఈ పథకాలను రాష్ట్రప్రభుత్వం కాక ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఒక కమిషన్ లేదా కార్పోరేషన్, గవర్నర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో అమలు చేయాలి. ఇందుకోసం గవర్నర్‌కు ఒక ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ కమిషనర్‌ను ఇవ్వవచ్చు. సమీక్షా సమావేశాల్లో గవర్నర్ కొంతమంది రాష్ట్రమంత్రులు, అధికారులను కూడా చేర్చుకోవచ్చు.**

తెలంగాణా వెనుకబాటుతనం అనేది నిరంతర సమస్య అని ఎన్‌టి రామారావు తొలి మంత్రివర్గంలో తెలుగుదేశం మంత్రి, ఆ తర్వాత కాంగ్రెస్ వాది అయిన జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్ని ప్రోత్సాహక చర్యలు చేపట్టినా ముస్లింలు వెనుకబడి ఉండటం లాంటిదే ఇది కూడానని చెప్పవచ్చు. ఈ మాటను కాంగ్రెస్‌వాదులు, సెక్యులరిస్టులు కూడా అంగీకరిస్తున్నారు. 1956లో రాష్ట్రాల పునర్విభజన దృష్ట్యా రాష్ట్రాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 371(2) అధికరణం కింద గవర్నర్లకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ రాజ్యాంగాన్ని సవరించిన విషయం మనలో చాలా మందికి తెలియకపోవడం ఆశ్చర్యకరం. మహారాష్ట్ర గవర్నర్‌గా తన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో వెనుకబడిన ప్రాంతాలైన మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో ఉన్న నిబంధనను తాను ఎలా ఉపయోగించుకున్నారో కేంద్ర ప్రభుత్వంలోను, ఐక్యరాజ్య సమితిలోను ఎన్నో బాధ్యతాయుతమైన, ఉన్నత పదవులు చేపట్టిన, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలకు సెక్రటరీలగా ఉన్న పి.సి. అలెగ్జాండర్ తన 'త్రూ ది కారిడార్స్ ఆఫ్ పవర్' పుస్తకంలో సోదాహరణంగా వివరించారు.

ఒక రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి గవర్నర్‌కు ప్రత్యేక బాధ్యతలను రాష్ట్రపతి అప్పగించడానికి రాజ్యాంగంలోని 371(2) అధికరణం వీలు కల్పిస్తోంది. అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందడం కోసం వేర్వేరు అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేయడానికి కూడా ఈ ఆర్టికల్ వీలు కల్పిస్తోంది. చారిత్రక

కారణాల వల్ల కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక లాంటి భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు దారితీసిన రాష్ట్రాల పునర్విభజన దృష్ట్యా ఈ అధికరణాన్ని తీసుకువచ్చినప్పటికీ, ఈ రాష్ట్రాల్లోని రాజకీయ నాయకులు మాత్రం గవర్నర్ రాష్ట్రపతి నియమించిన వ్యక్తిగత ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం లేదని, ఆయనకన్నా ఎన్నికైన ప్రజాప్రతినిధులుగా రాజకీయ నాయకులు మాత్రమే ప్రజలకు మేలు చేయగలరన్న నమ్మకంతో గవర్నర్‌కు ప్రత్యేక అధికారాలు అప్పగించడానికి ఆసక్తి చూపించడం లేదని అలెగ్జాండర్ అంటున్నారు. 1984 జూలైలో మహారాష్ట్ర అసెంబ్లీ , శాసన మండలిలు గవర్నర్ తన అధికారాలను చెలాయించడానికి వీలు కల్పించాలని రాష్ట్రపతిని కోరుతూ ఒక తీర్మానాన్ని అమోదించాయి. అయితే కేంద్రప్రభుత్వం ఈ దిశగా ఎలాంటి చర్యాతీసుకోలేదు. పి.వి.నరసింహారావుగారు ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణాతో పాటుగా తాను ఒకసారి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన విదర్భ ప్రాంతాల వెనుకబాటు గురించి బాగా తెలిసినవారు కావడంతో రాజ్యాంగంలోని అధికరణాన్ని మహారాష్ట్ర చట్టసభలు చేసిన తీర్మానాన్ని అమలుచేయడానికి అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి శరద్‌పవార్‌ను ఒప్పించగలిగారు. గవర్నర్‌కు రాజ్యాంగరీత్యా సంక్రమించిన అధికారాలతో గవర్నర్ వెనుకబడిన ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేయవచ్చో సమగ్ర దృక్పథం, జాతీయ వైఖరి కలిగిన సమర్థుడైన అధికారి అయిన అలెగ్జాండర్ ఆదర్శంగా నిలిచారు. అప్పుడు కేంద్రంలో హోంమంత్రి, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎస్.బి.చవాన్ చట్టప్రకారం ఎన్నికయిన ప్రజా ప్రతినిధులకున్న అధికారాలను గవర్నర్లు అమలు చేయడాన్ని వ్యతిరేకించారని అలెగ్జాండర్ తన పుస్తకంలో పేర్కొన్నారు. చవాన్ వ్యతిరేకించినప్పటికీ చెదరని అలెగ్జాండర్, మహారాష్ట్ర చట్టసభల తీర్మానబలంతో విదర్భ, మరాఠ్వాడా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేసారు. రాష్ట్ర జనాభాలో విదర్భలో 21.3 శాతం, మరాఠ్వాడాలో 16.1శాతం ఉంటే, మిగతా ప్రాంతాల్లో 62.59 శాతం ఉన్నారు. పూర్తిగా జనాభా ప్రాతిపదికపై నిధుల కేటాయింపు జరపడం వల్ల చిరకాలంగా ఈ ప్రాంతాల్లో ఉన్న వెనుకబాటుతనం తొలగించలేమని అలెగ్జాండర్ భావించారు. అందువల్ల వెనుకబాటు తనాన్ని అంచనా వేయడానికి, ప్రతి ప్రాంతంలో







ఉన్న వెనుకబాటుతనాన్ని పోగొట్టడానికి ఎంత సొమ్ము అవసరమో సూచించడం కోసం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. 1984 నాటికి వెనుకబాటుతనం బ్యాక్‌లాగ్ విలువను ఒక ప్రభుత్వ కమిటీ 3,187 కోట్ల రూపాయలుగా అంచనావేసింది. అయితే ప్రభుత్వం మాత్రం ప్రతి ఏటా కేవలం 200 కోట్లనుంచి 500 కోట్లు మాత్రమే బ్యాక్‌లాగ్ క్లియర్‌ను చేయడానికి కేటాయిస్తూ ఉంది. అలెగ్జాండర్ ఈ నివేదికతో సంతృప్తి చెందలేదు. 1995లో ఆయన మరో నిపుణుల కమిటీని నియమించారు. ఆ కమిటీ బ్యాక్‌లాగ్ మొత్తం 14వేల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా వేసింది. నాలుగేళ్లలో బ్యాక్‌లాగ్‌ను తొలగించడానికి నిధుల కేటాయింపులను పెంచాలని గవర్నర్‌గా తనకు ఉన్న అధికారాలతో ఆదేశాలు జారీ చేశారు. దీంతో 1984లో కేవలం 500 కోట్ల రూపాయల మేరకు మాత్రమే ఉన్న నిధుల కేటాయింపులను 2001-02 నాటికి 1720 కోట్లకు, ఆ తర్వాత మరింత ఎక్కువకు పెంచారు. గవర్నర్ కృతనిశ్చయంతో చేపట్టిన ఈ చర్యలే రాష్ట్రంలో వెనుకబాటుతనాన్ని దాదాపుగా తొలగించాయి.

ముఖ్యమంత్రిని, ఇతర నాయకులను ఆయన చాకచక్యంగా దారికి తెచ్చుకోవడం నిర్ణయించిన నిర్దిష్ట గడువులే అసమానతలు గణనీయంగా తగ్గడానికి ప్రధాన కారణాలని చెప్పాలి. ప్రొఫెషనల్ కోర్సుల్లో వెనుకబడిన ప్రాంతాల వారిని ఎక్కువ మందిని చేర్చుకునేలా యూనివర్శిటీల చాన్సలర్‌గా ఆయన తీసుకున్న చొరవ కూడా తోడ్పడింది. అంతేకాక ప్రభుత్వ కార్యాలయాల్లోను, ప్రభుత్వరంగ సంస్థల్లోను జరిగే రిక్రూట్‌మెంట్లలో అన్ని ప్రాంతాల వారికి సమాన ప్రాతినిధ్యం లభించేలా గవర్నర్‌గా ఉన్న సమయంలో ఆయన మహారాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

తెలంగాణా వెనుకబాటుతనం అంశం తరచూ ఉద్యమాలు, ఆందోళనలకు కారణం అవుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కూడా రాజ్యాంగంలోని 371(2) ఆర్టికల్‌ను ఎందుకు అమలు చేయలేదు? ఇందుకు ఒక కారణం ఇప్పుడు కొంతమంది కాంగ్రెస్ నాయకులు చెప్తున్నట్లుగా తెలంగాణా రాజకీయ వేత్తలు ఈ ప్రాంతం వెనుకబాటుతనాన్ని సరిచేయడానికికాక, దాన్ని అధికారం పొందడానికి

ఉపయోగించుకోవడమే. 1969లో తొలి తెలంగాణా ఉద్యమం తర్వాత కొంతమంది నాయకులకు ముఖ్యమంత్రి పదవితోపాటు మంత్రిపదవులను తెచ్చి పెడ్తే, 2004లో ఉద్యమం లేక పోయినప్పటికీ కొంతమంది కేంద్రంలోను, రాష్ట్రంలోను మంత్రి పదవులు సంపాదించుకున్నారు కదా అనేది ఒక వాదన! డాక్టర్ సి.రంగరాజన్ తప్ప ఆంధ్రప్రదేశ్ గవర్నర్లలో దాదాపు అందరూ రాజకీయవేత్తలే. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సంక్షేమాన్ని వారు పట్టించుకోకపోవడానికి అది కూడా ఓ కారణం అయి ఉండవచ్చు. డాక్టర్ రంగరాజన్ ఆర్థిక రంగంలో గొప్పమేధావే అయినప్పటికీ ఆయన ఎక్కువ చొరవ గల వ్యక్తికాదు. అలెగ్జాండర్ లాంటి సమర్థుడు ఆంధ్రప్రదేశ్‌కు గవర్నర్‌గా వచ్చి గవర్నర్ రాజ్యాంగం తనకు ఇచ్చిన అధికారాలను పూర్తిగా చెలాయించడానికి అనుమతించాలని రాష్ట్రపతిని కోరుతూ మహారాష్ట్ర అసెంబ్లీ లాగా రాష్ట్ర శాసనసభ కూడా ఓ తీర్మానం ఆమోదిస్తే అయిదేళ్ల కాలంలో బహుశా అంతకన్నా తక్కువ సమయంలోనే తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్ర లాంటి వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో ఉన్న వ్యత్యాసాలు తొలగిపోయి తరచూ తలెత్తే ప్రాంతీయ విభేదాలు, రాజకీయ నాయకుల ఆందోళనల తలనొప్పులు ఉండవు. ఈ పథకాలను రాష్ట్రప్రభుత్వం కాక ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక కమిషన్ లేదా కార్పోరేషన్, గవర్నర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో అమలు చేయాలి. ఇందుకోసం గవర్నర్‌కు ఒక ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ కమిషనర్‌ను ఇవ్వవచ్చు. సమీక్షా సమావేశాల్లో గవర్నర్ కొంతమంది రాష్ట్ర మంత్రులు, అధికార్లను కూడాచేర్చుకోవచ్చు. ఈ మార్గం కాకుండా మామూలు ప్యాకేజీలను అమలు చేసినట్లయితే ఈశాన్య భారతం, జమ్మూ, కాశ్మీర్‌లలో వేలాది కోట్ల రూపాయల ప్యాకేజీలలో జరిగినట్లు గానే ఆ ప్యాకేజీ కూడా సూట్‌కేసుల్లోకి మారిపోయి అందరూ తినేస్తారు. ఫలితంగా ఎప్పటికీ వెనుకబాటుతనం, వేర్పాటువాదం, ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయి.







# 49. "ఏకపక్ష దౌర్జన్యం" కాదు

"ఏకపక్ష దౌర్జన్యం" అనే శీర్షిక క్రింద వ్రాసిన (వార్త సంపాదకీయం) కొన్ని వాస్తవాలను ప్రక్కనబెట్టి ఏకపక్షంగా వ్రాయబడింది. "స్థానికంగా సంబంధిత మతస్థులతో మొదట చర్చించి, వారిని ఒప్పించే ప్రయత్నాలేమైనా చేసిన దాఖలా లేదు. ఉందికానీ, మీకు అది తెలియకపోవడం మూలానో, తెలిస్తే వాటిని ఉదాహరించకుండా ఉండడమో జరిగింది. బందరు పురపాలక సంఘం అధికారులు 20 హిందూ దేవాలయాల యాజమాన్యాలతో సంప్రదించి, ఓ స్థలంలో పడగొట్టబోయే దేవాలయములను వేరేచోట నిర్మిస్తామని నచ్చజెప్పి, వారి అంగీకారంతో ఏ గొడవ, ఏ హింస లేకుండా 20 దేవాలయాలను పడగొట్టారు. ముస్లిం దర్గా ఒక ప్రార్థనాలయం కాదు. అది వారు పవిత్ర స్థలంగా విశ్వసించే కట్టడం. ఇది ప్రభుత్వానికి చెందిన స్థలంలో, ఇంకా ఎన్నో దర్గామసీదులవలె (ఉదా: హైదరాబాద్‌లో ట్యాంకుబండ్ రోడ్డులో పశ్చిమవైపున దారికి అడ్డంగా ఒక దర్గా ఉంది. ఇదే విధంగా సర్దార్ పటేల్ రోడ్, సికిందరాబాద్ సిటిఓ వద్ద సరిగ్గా దారి మధ్యలో ఒక దర్గా ఉంది. ఇటువంటి భూములన్నీ ప్రభుత్వానివి కాదని నిరూపించాలా!) ఉంది. మున్సిపల్ అధికారులు ఈ దర్గా యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. వేరే స్థలంలో దీన్ని పునర్నిర్మిస్తామన్నారు. కాని వారు దానిని ససేమిరా ఒప్పుకోలేదు. ఒక ప్రక్కన హైకోర్టు యొక్క ఆజ్ఞ ఇటువంటివి పడగొట్టమని. మరొక ప్రక్క హిందువులు ఒప్పుకున్నారు కాని ముస్లింలు ఒప్పుకోవడంలేదు. అల్పసంఖ్యాకులైన ముస్లింలను తుష్టీకరణ చేయడం ప్రజాస్వామికమా, అదే లౌకిక వాదమా! అవును మాస్టర్ ప్లాన్ అనేది ప్రజల కోసమే. ప్రజలంటే ఒక్క మతస్థులేకాదు. అత్యధికులైన ముస్లిమేతరులు కూడా ప్రజలే. రోడ్లమీద ప్రయాణం చేస్తున్న ప్రతివ్యక్తీ, ప్రతిదినం రోడ్లను ఆక్రమించుకుంటున్న దేవాలయాలు, మసీదులు, దర్గాలు, చర్చిలు ప్రజాకంటకం అని, ఎవరి ఘనత కోసం అవికట్టబడినవో వారిని రోజూ తిట్టుకుంటూ ఉంటున్నారు. 'వార్త' అటువంటి ప్రతిష్ఠాత్మక దినపత్రిక కొన్ని సత్యాలను కప్పిపుచ్చి ముస్లింలకు

వ్యతిరేకంగా గుజరాత్ ప్రభుత్వం మీద అభాండం వేయడం తగనిపని. భర్తృహరి సుభాషితం ఏనాడో చెప్పింది.

తివిరి యిసుమునఁ దైలంబుఁ దీయవచ్చుఁ
దవిరి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చుఁ
దిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చుఁ
జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు.





# 50. ఆంధ్రప్రదేశ్‌కు కొత్తరాజధాని నగరం

శంషాబాద్‌లో అధునాతనమైన అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించబడుతున్న సందర్భంలో ఆ పరిసరాలలోనే ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని నగరాన్ని నిర్మించాలనే తలంపును ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారు బహిర్గతం చేశారు. ఈ ఆలోచన బహు సమర్ధనీయమైనది, ఉచితమైనది. హైదరాబాద్‌లో దినదినం పెరుగుతున్న రద్దీని, క్షీణిస్తున్న నివాస యోగ్యతను ఆరికట్టాలంటే ఇక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలనూ, ఇక రాబోయే కొత్త వ్యాపార సంస్థలు, పరిశ్రమలు కూడా హైదరాబాద్ చుట్టూకాక, మరొక నవ నిర్మిత నగరంలో ఉండటం చాలా అవసరం. ప్రస్తుతం భారతదేశంలో ఏ ఒక్క నగరం కూడా నూతన, ఆర్థిక, సాంఘిక సమాజానికి అనుకూలంగా, యోగ్యంగా ఉన్నవికావు. నగరీకరణ జరుగుతున్నప్పుడు ఈ పట్టణాలలోకి జనాభా, వారితోపాటు వ్యాపార పరిశ్రమల సంస్థలు ఉద్భవించడం వల్ల అసలే అంతంత మాత్రం నివాసయోగ్యంగా ఉన్న పట్టణాలు విశాలమైన అనేకానేక మురికివాడల సముదాయంగా తయారవుతాయి. ఈ పట్టణాలలో ఉన్న నీరు, విద్యుత్తు, వైద్య, విద్య, ఆవాస, ప్రయాణ సౌకర్యాలు అతి క్లిష్టమౌతున్నాయి. అలా జరగకుండా ఉండటం కోసం నవ నగర నిర్మాణం ఎంతైనా అవసరం. ఇటువంటి దూరదృష్టితోనే ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాలు తమ రాజధాని నగరాలను కొత్త ప్రదేశాలలో నిర్మించారు. భారతదేశంలో కూడా దేశ విభజన జరిగిన తర్వాత పంజాబ్ రాష్ట్రం యొక్క రాజధానిని అమృత్‌సర్, లుధియానా వంటి పట్టణాలలో గాక చండీఘడ్ అనే నూతన రాజధాని నగరాన్ని నిర్మించి, దాన్ని పరిపాలనా కేంద్రంగా చేశారు. ఇంకా గతంలోకి వెళితే బ్రిటీష్‌వారు భారతదేశం యొక్క రాజధానిని కలకత్తా నుంచి తరలించు కోదలచినప్పుడు న్యూఢిల్లీ నగరాన్ని టాట్యన్స్ అనే వాస్తుశిల్పి చేత రూపకల్పన చేయించి సువిశాలంగా, సుందర నగరంగా నిర్మించారు.

అయితే రాష్ట్ర రాజధాని నగర నిర్మాణానికి కొన్నివేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రాన్ని విభజించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించాలనే

ఉద్యమాన్ని ఒక్క తెలుగుదేశం, కమ్యూనిస్టు పార్టీలు తప్ప ఎవరూ తిరస్కరించడం లేదు. ఈ ఉద్యమం అప్పుడప్పుడూ పునఃప్రారంభం చేయబడుతోంది. ఆశించిన పదవులు దక్కనప్పుడు కొంతమంది రాజకీయ నాయకులు వెనుకబాటుతనం అనే నినాదంతో ఇతరులు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలతో వేర్పాటు ఉద్యమాన్ని ప్రారంభిస్తారు. దానికి తాత్కాలికంగానైనా పెద్ద ఊపు ఉంటుంది. ఈ విధంగా ఈ రాష్ట్రాన్ని విభజించాలనే ఉద్యమాలు పదేపదే వచ్చి, రాష్ట్రాభివృద్ధిని ప్రశ్నార్థకం చేస్తున్నప్పుడు ఈ జాడ్యాన్ని వదిలించుకోవడం కోసం ఒక తుది నిర్ణయాన్ని తీసుకోవడం మంచిది. తెలంగాణ రాష్ట్రసమస్యని ఇప్పుడు తేల్చకుండా వేలాది కోట్లతో శంషాబాద్ పరిసరాలలో కొత్త రాజధాని నగరాన్ని నిర్మించి దాని తర్వాత రాష్ట్రాన్ని విభజించినట్లయితే తిరిగి కోస్తా ఆంధ్రకు,రాయలసీమకు వేర్వేరు రాజధాని నగరాలను నిర్మించవలసి వస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే కొంతకాలం వరకైనా హైదరాబాద్‌లోనే రాష్ట్ర రాజధాని ఉండటం వల్ల తీవ్రమైన నష్టంలేదు.

కనుక, ఉమ్మడి రాష్ట్రానికి కొత్త రాజధాని నగరం ఎంతో ఆవశ్యకమైనప్పటికీ, రావణకాష్టంగా రగులుతున్న తెలంగాణ రాష్ట్ర సమస్యకి పరిష్కారం చూపకుండా శంషాబాద్ పరిసరాలలో రాజధాని నగరం నిర్మించడం దీర్ఘంగా ఆలోచించి చేయవలసిన పని. ముందుగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామో లేదో అనే నిర్ణయాన్ని తీసుకుని, చేయవద్దనుకున్నట్లయితే చట్టంద్వారా దాన్ని నిరోధించే పద్ధతిని చూపిన తర్వాత కొత్త రాజధాని నగర నిర్మాణాన్ని చేపట్టాలి.







# 51. ఐ.ఎ.ఇ.ఎ. ఇరాన్

"ఐ.ఎ.ఇ.ఎ.లో ఇరాన్ విషయంపై భారత్ ఓటు" శ్రీ విది కుమార్ పై శీర్షిక యొక్క విషయంలో నా అభిప్రాయాన్ని నిరసిస్తూ వ్రాసారు. ఇరాన్‌కి వ్యతిరేకంగా ఒక్క భారత్ కాదు, కమ్యూనిస్టు చైనా, ఒకప్పుడు కమ్యూనిస్టు దేశమైన అమెరికాకు ప్రతిద్వంది అయిన రష్యాలు కూడా వ్యతిరేకంగా ఓటువేసాయి. చైనా రష్యాలను కూడా భారత్‌ను జడిపించినట్లే, అమెరికా జడిపించి బెదిరించి తొత్తుగా చేసుకొని ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయించినదా? లేక చైనా రష్యాలు తమ దేశ ప్రయోజనం కోసం తమ దీర్ఘకాలిక భద్రత అవసరాల కోసం ఇరాన్‌కు న్యూక్లియర్ శక్తిగా ఎదగనీయకూడదనే ఉద్దేశ్యంతో అమెరికాతోపాటు , ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశాయా?

మనదేశంలో కొన్ని తెగల వామపక్షీయులకు అమెరికా సర్వకాల సర్వావస్థలయందు దుష్టశక్తిగా గోచరించే మనస్తత్వం పాతుకుపోయింది. కమ్యూనిస్టు చైనా, కమ్యూనిస్టు వియాత్నాంలు అమెరికాతో ఏ ఒప్పందాలనైనా చేసుకోవచ్చు, అమెరికాతో సహకరించవచ్చు. అమెరికన్ విశ్వవిద్యాలయాలు వాణిజ్య సంస్థలు కమ్యూనిస్టు చైనాలో, వియాత్నంలో ఏ రంగంలోనైనా పెట్టుబడిపెట్టవచ్చు. విద్యాలయాలు స్థాపించవచ్చు. కాని భారత్ మాత్రం అమెరికాను, సర్వదా విమర్శిస్తూ వ్యతిరేకిస్తూ నిరసిస్తూ వుండాలని వీరి ఆకాంక్ష.

భారతదేశం యొక్క ప్రయోజనం తన చుట్టుప్రక్కలో తన ఎడల శత్రుత్వంతో అసహనంతో వున్న ఏ దేశం కూడా మనపైన సైనిక ఆయుధ ఆధిపత్యాన్ని సంపాదించుకోకుండా చూడటం. మన సరిహద్దుల్లో మనకు వ్యతిరేకులైన అణుబాంబులు – క్షిపణులు కలిగిన రెండు దేశాలు ఉండనే ఉన్నాయి. మన ఎడల ఎపుడు మిత్రత్వం చూపని ఇరాన్ మరో శక్తిగా ప్రభవించడం మన దేశభద్రతకు అపాయం. అందుకని ఇటువంటి వుద్దేశ్యంతోనే చైనా, రష్యాల వలే మనం కూడా ఇరాన్ యొక్క అణ్వస్త్ర పెంపుదలను వ్యతిరేకించాలి, వ్యతిరేకించాం. అమెరికా

కూడా అలా చేస్తే యాదృచ్ఛికంగా, మనకు మంచిదే. ప్రతిచోట అమెరికా బూచిని చూడటం ఒక మానసిక పరిస్థితి.

గత సంవత్సరంలో మనదేశ ఎగుమతులు లక్ష నాలుగు కోట్ల రూపాయలు. మన దిగుమతులు లక్ష డెబ్బై ఆరు వేల కోట్లు చమురు దిగుమతుల కోసం, చమురు బదులు మనం అణు ఇంధనాన్ని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తిచేస్తే, అంతర్జాతీయ వాణిజ్యంలో దిగుమతులకన్నా, మన ఎగుమతులు ఎక్కువై చైనావలే విదేశీముద్రను అత్యధికంగా చేకూర్చుకోగలం.

ఈ ప్రయోజనం కోసం అమెరికాతో మనం చేసుకున్న ఒప్పందం ఉచితమైనదే. విదేశాంగ వ్యవహారాల్లో జ్ఞానం వున్న ఏ దేశము కూడా సిద్ధాంతాలకు గాక సూత్రాలకు కాక దేశ ప్రయోజనం కోసం ప్రాధాన్యత నివ్వాలి. ఒక రాజకీయవేత్త అన్నట్లు 'దేశానికి శాశ్వత సిద్ధాంతాలు కాదు, శాశ్వత ప్రయోజన సాధన తదనుగుణమైన విదేశాంగ నీతి అవసరం'.







# 52. మార్క్సు మదర్‌సా శిక్షణలో కమ్యూనిస్ట్ ఫత్వాలు

కాంగ్రెస్‌ను చీల్చి సొంత పేరుతో వేరుకుంపటి పెట్టుకునేందుకు , ఆ తరువాత మిగతా కాంగ్రెస్ గ్రూపుల మీద విజయం సాధించేందుకు ఇందిరాగాంధీకి కమ్యూనిస్టులు ఎంతో సహాయం అందించారు. ఆ ఉపకారానికి బహుమతిగా ఇందిరాగాంధీ వాళ్ళకి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని అప్పజెప్పారు. కమ్యూనిస్టులు అంతటితో ఊరుకోలేదు. మోహన్‌కుమారమంగళం వంటి సెంట్రల్ కమిటీ సభ్యులు ఇందిరా కాంగ్రెసులో చేరిపోయి మంత్రులయ్యారు. వీళ్ళే 'గరీబీహటావో', 'బ్యాంకులు, గనుల జాతీయకరణ' వంటి జనాకర్షక కార్యక్రమాల్ని రూపొందించారు. అంతేకాదు. ఇతర కాంగ్రెస్ గ్రూపులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున ప్రచారం సాగించి ఇందిరా కాంగ్రెస్‌కు పూర్తి బలం చేకూర్చిపెట్టారు. ఇందిరా కాంగ్రెస్ ఏర్పడిన నాటినుంచే మన దేశంలో పార్టీలు వ్యక్తిగత ఆస్తులుగా మారిపోయాయి. తరువాత అదే తరహాలో కాంగ్రెస్ (జె), సమాజ్‌వాదిపార్టీ, ఆర్‌జెడి, టిడిపి, జెడి(యు), జెడి (ఎస్), బిఎస్‌పి, తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలెన్నో పుట్టుకొచ్చాయి.

ఇందిరా కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రచారం చేసిపెట్టినందుకు 1971లో కమ్యూనిస్టులు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం బహుమతిగా పొందారు. ఆ యూనివర్శిటీని ఏర్పాటు చేసినప్పుడే అధ్యాపకులుగా మార్క్సిస్టు మేధావుల్ని ఏరికోరి నియమించింది అప్పటి ప్రభుత్వం. జె.ఎన్.యులో సైన్స్, ఇంజనీరింగ్ సబ్జెక్టులు కనిపించవు. చరిత్ర, సమాజశాస్త్రం, అంతర్జాతీయ సంబంధాలు, అర్థశాస్త్రం వంటి బోధనాంశాల ముసుగులో వామపక్షభావజాలం ప్రచారమవుతుంది. ఈ విశ్వవిద్యాలయంలో తయారైన మార్క్సిస్ట్ అధ్యాపకుల్ని ఇతర యూనివర్శిటీల్లో నియమించారు. ఎక్కడున్నా వీళ్ళంతా ఒక జట్టుగా, గుంపుగా పనిచేస్తారు. ఒకరి ప్రయోజనాన్ని మరొకరు జాగ్రత్తగా కాపాడుతారు. ఇలాంటి వామపక్షవాదుల మార్గదర్శనంలో చదువుకున్న వేలాదిమంది విద్యార్థులు మార్క్సిజం-

లెనినిజం–స్టాలినిజం– మావోయిజాల వీరభక్తులుగా రూపొందుతున్నారు. వీళ్ళే ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లోకి చొరబడుతున్నారు. జెఎన్‌యు నుంచి జ్ఞానభిక్ష పొందిన మేధావులే మానవవనరుల మంత్రిత్వ శాఖలో కూడా ప్రధాన పదవులు అలంకరిస్తున్నారు.

మార్క్సిస్టులు మూకుమ్మడి దాడిచేసి ఆక్రమించుకున్న మరో రంగం జర్నలిజం. అందుకనే వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో జరిగే చర్చ వామపక్ష భావజాలానికి అనుకూలంగా హిందూ వ్యతిరేక ధోరణిలోనే సాగుతుంది. అంతేకాదు భారత్‌ను ఛిన్నాభిన్నం చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న శక్తులకు వత్తాసు పలుకుతుంది. జెఎన్‌యు, తదితర విశ్వవిద్యాలయాల్లోని మార్క్సిస్టు చరిత్రకారులు రాసిన గందరగోళపు చరిత్ర స్కూలుపిల్లల మనస్సుల్ని కూడా కలుషితం చేస్తోంది. ప్రపంచంలో ఇస్లామ్ మాత్రమే గొప్పదని, ప్రపంచాన్ని ఏలగలిగిన అర్హత ముస్లింలకే ఉందని మదర్సాల్లో ఎలా నూరిపోస్తారో అలాగే మార్క్సిజమే మానవజాతికి ముక్తిమార్గమని జెఎన్‌యులో బోధపరుస్తారు. జెన్‌యు అంటే మార్క్సిస్ట్‌ల మదర్సా.

ఈ మార్క్సిస్ట్‌ల మదర్సాకి భారత ప్రభుత్వమే నిధులందిస్తోంది. ఇక్కడ తయారయ్యే మేధావులంతా హిందూధర్మానికి, హిందూ సమాజానికి వ్యతిరేకంగా ఆలోచించి, పనిచేసేవాళ్ళే. వీళ్ళు మానవహక్కులు, పౌరహక్కులు, మైనారిటీ హక్కులు, శాస్త్రీయ సోషలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, సామ్రాజ్య వ్యతిరేకవాదం, అలీనోద్యమం అంటూ వివిధ వాదాల పేరున సృష్టించే సంస్థలన్నీ జాతీయభావాల్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తాయి.

మార్క్సిస్ట్ మదర్సాల్లో తయారైన మేధావులు వివిధ సందర్భాల్లో అనేక ఫత్వాలు కూడా జారీచేస్తూ ఉంటారు.

- ప్రభుత్వం పిఎఫ్ వడ్డీరేటును ఎట్టి పరిస్థితిలోనూ తగ్గించడానికి వీలులేదని ఒక ఫత్వా, కానీ ఇప్పుడున్న వడ్డీరేటు చాలా ఎక్కువగా ఉందని, అది ఖజానా మీద ఎంతో భారం మోపుతోందని వాళ్ళు గుర్తించరు.







- ఇరాన్ అణుకార్యక్రమాన్ని గురించి ప్రశ్నించకూడదు. అయితే ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేస్తే భారత్‌కు ముప్పు కలుగుతుందనే సంగతి వాళ్ళకు పట్టదు.
- రిటైల్ రంగంలో భారత్ విదేశీ పెట్టుబడులకు అవకాశం ఇవ్వకూడదని ఇంకో ఫత్వా. కానీ కమ్యూనిస్టు చైనాలో ఇప్పటికే వాల్‌మార్ట్, కారీఫోర్ వంటి బహుళజాతి కంపెనీలు జోరుగా వ్యాపారం సాగిస్తున్నాయన్న విషయం మాత్రం వీళ్ళకి కనిపించదు.
- విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతినివ్వరాదని మరింకో ఫత్వా అయితే చైనా ఇప్పటికే రెండు బ్రిటీష్ విశ్వవిద్యాలయాలకు అవకాశం ఇచ్చింది.
- "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముస్లింలకు కల్పించిన ఐదుశాతం రిజర్వేషన్లు, ఎలాంటి కోర్టు ఆ దేశాలతో సంబంధం లేకుండా, వెంటనే అమలు చేయాలి. అంటే షాబానో కేసులో ముస్లింలను సంతోషపెట్టేందుకు రాజ్యాంగసవరణ చేసినట్లే ఇప్పుడు కూడా మైనారిటీల ప్రయోజనాల్ని కాపాడాలి".
- అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో మైనారిటీలకు యాభైశాతం కన్నా ఎక్కువ సీట్లను ఇవ్వడానికి వీలులేదని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తిరగరాయాలి. అందుకు అవసరమైతే రాజ్యాంగ సవరణ తేవాలి."
- "ముంబై, ఢిల్లీ ఎయిర్‌పోర్టుల విస్తరణ పనులు ఏ ప్రైవేటు సంసకీ అప్పగించకూడదు. ఎంత డబ్బు వృథా అయినా ఫరవాలేదు".

ఇలా ఎన్నో ఫత్వాలతోపాటు మార్క్సిస్ట్ మదర్సా మేధావులు కొన్ని హిందూ వ్యతిరేక వాదనల్ని కూడా వినిపిస్తుంటారు.

- స్వామి రామ్‌దేవ్ టివిలో చూపే యోగాసనాలను నిరసించడం, ఆయుర్వేద మందులపై దుష్ప్రచారం చేయడం, క్రైస్తవ మిషనరీలు నిర్వహించే స్వస్థత

కూటముల గురించి ఏనాడూ నోరెత్తని వీళ్ళు బత్తిన సోదరులు ఇచ్చే చేపమందుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తారు).

– ముస్లింనే బీహార్ ముఖ్యమంత్రిని చేస్తానని కంకణం కట్టుకున్న రామ్‌విలాస్ పాశ్వాన్‌కు సిపిఐ పూర్తి మద్దతు నిస్తుంది. అవినీతిలో పీకలోతు కూరుకుపోయిన లాలూప్రసాద్ యాదవ్‌ను సిపిఎం సమర్థిస్తోంది. సోనియా కుటుంబ స్నేహితుడు, బోఫోర్స్ కుంభకోణంలో కీలకపాత్రధారి అయిన కత్రోచికి చెందిన 23 కోట్ల రూపాయల్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం బదిలీ చేస్తే పల్లెత్తుమాటైనా అనదు.

దేశభద్రతకు ముప్పుగా పరిణమించిన జిహాద్ శక్తులకు ఆంధ్రప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాలు కేంద్రాలుగా మారుతున్నాయి. మార్క్సిస్టుల మద్దతున్న కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలే అందుకు కారణం. 1940లో మతం ఆధారంగా దేశవిభజన జరగాలంటూ తలెత్తిన వాదానికి పూర్తిగా మద్దతు పలికిన కమ్యూనిస్టులే ఇప్పుడు పాక్ ప్రేరేపిత జిహాదీ శక్తులను, మతమార్పిడులు సాగించే క్రైస్తవ మిషనరీలను సమర్థిస్తున్నారు.

మార్క్సిస్టులు, మిషనరీలు, జిహాదీవాదుల వల్ల కలుగుతున్న ముప్పు ఊహించలేనిది. అది సోనియా మైనోగాంధీ నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ చేస్తున్న చేటుకంటే ఎక్కువే అని చెప్పాలి. అందుకనే జాతీయభావాలున్న ప్రజానీకం, నేతలు ఈ మార్క్సిస్టు – లెనినిస్ట్, స్టాలినిస్టు – మావోయిస్ట్ పార్టీలను ఒక కంట కనిపెట్టి ఉండాలి.







# 53. ఓపికకూ ఓ హద్దుంటుంది!

ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధానికి మొత్తం మీద తాత్కాలికంగానైనా తెరపడింది. నెలరోజులుగా సాగుతున్న దాడులను ఆపడానికి ఐక్యరాజ్యసమితి చేసిన ప్రయత్నాలు ఫలించి ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతంలో తిష్టవేసుకున్న హిజ్‌బుల్లా అంటే 'దేవుని పార్టీ' అని అర్థం. ఉగ్రవాదులు ఆ దేశం ప్రభుత్వాధీనంలో లేకుండా సిరియా, ఇరాన్ దేశాల నుంచి రాకెట్‌లను, బాంబులను ఇతర మారణాయుధాలను సేకరించి వాటిని సామాన్య నాగరికుల గృహాలలో, ఆఫీసులలో గోదాముల్ని సమకూర్చి ఇజ్రాయెల్ గ్రామాలపైన , నగరాలపైనా విచక్షణ లేకుండా క్షిపణులను ప్రయోగించి మారణకాండను నిర్వహిస్తూ వచ్చారు. తత్ఫలితంగా ఎంతో మంది నిరాయుధులైన ఇజ్రాయెల్ నాగరికులు క్షతగాత్రులవడమో, చావడమో జరుగుతోంది. ఇస్లాంలోని షియా తెగకు చెందిన దక్షిణ లెబనాన్‌లో అధిక సంఖ్యాకులుగా వున్న ముస్లింల పార్టీ హిజ్‌బుల్లా ధ్యేయం ఇజ్రాయెల్‌ని ధ్వంసంచేసి, ఇజ్రాయెల్‌లోని యూదులందరినీ చంపడమో లేక ఆ దేశాన్ని వదిలిపెట్టి ఎక్కడకైనా పంపించివేయడమో, ఈ ధ్యేయాన్ని పదేపదే బాహాటంగా ప్రపంచానికి చెబుతూ వస్తున్నారు. ఇరాన్ షియా దేశం కనుక షియా మతస్థులైన హిజ్‌బుల్లా ఉగ్రవాదులకు ఇంతవరకు 12,000 రాకెట్లను ఇతర మారణాయుధాలను ఇచ్చాడు ఇరాన్ దేశపు అధ్యక్షుడు.

ఇజ్రాయెల్‌తో, అరబ్ దేశాలైన ఈజిప్టు, జోర్డాన్‌లు శాంతి ఒడంబడిక చేసుకున్నప్పటికీ ఇరాన్ అటువంటి సంధిని చేసుకోకుండా ఇజ్రాయెల్‌తో శత్రుత్వం వహించి మూడు యుద్ధాలలో ఓడినప్పటికీ తిరిగి హిజ్‌బుల్లా ద్వారా ఉగ్రవాద చర్యలను చేయిస్తూ కొంతకాలం లెబనాన్ దేశాన్ని తమసైన్యంతో అదుపులో పెట్టుకుంటూ వచ్చింది. ఆవిధంగా హిజ్‌బుల్లాకు అంతరాయం లేని స్థావరాలను కల్పించుకునే అవకాశం కల్గించింది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) 1559వ తీర్మానం ప్రకారం,

పెద్దదేశాల వత్తిడివల్ల సిరియా, లెబనాన్‌ల నుంచి తమ సేలను గత సంవత్సరం ఉపసంహరించుకోవలసి వచ్చింది. అయినప్పటికీ తన తొత్తు అయిన హిజ్‌బుల్లా ద్వారా ఇజ్రాయెల్‌పై ఉగ్రవాదాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది.

జూలై 12, 2006లో హిజ్‌బుల్లా సాయుధులు ఇజ్రాయెల్‌లో చొరబడి వారి ఎనిమిదిమంది సైనికులను చంపి, ఇద్దరిని అపహరించుకుపోయారు. ప్రస్తుతం ఇజ్రాయెల్, హిజ్‌బుల్లాపై చేస్తున్న దండయాత్రకు ఇది ఒక కారణమైంది. విసిగి వేసారిపోయిన ఇజ్రాయెల్ తమ సైనికులను హిజ్‌బుల్లా వదలలేదు కనక వారికో గుణపాఠం చెప్పడానికి తక్షణం అప్రమత్తులై పెద్దఎత్తున యుద్ధ ప్రక్రియను ప్రారంభించింది.

హిజ్‌బుల్లా అధీనంలో వున్న ప్రాంతంలో లెబనాన్ ప్రభుత్వం సుంతైనా లేదు. లెబనాన్ రాజ్యం పోలీసులుకాని, సైనికులుగాని, ప్రభుత్వాధికారులుగాని దక్షిణ లెబనాన్‌లో లేరు. హిజ్‌బుల్లాదే రాజ్యం. మరి హిజ్‌బుల్లావారు ఇజ్రాయెల్ చేతిలో చంపబడుతుంటే తమ ఆధీనంలో లేనివారి తరపున వారికి జరిగే నష్టాన్ని గురించి అడిగే హక్కు లెబనాన్ రాజ్యానికి ఏమి వుంది. ఇజ్రాయెల్ ఇంత విస్తృతంగా దాడిచేస్తున్నా, లెబనాన్ ప్రభుత్వం తన సైన్యాన్ని బరిలో పెట్టి ఇజ్రాయెల్‌ను ఎందుకు ప్రతిఘటించడంలేదు. ఏ ఇళ్ళల్లో, కార్యాలయాలలో, భవనాలలో హిజ్‌బుల్లా తన ఆయుధాలను ప్రోగుచేసి ప్రయోగిస్తుందో, ఆ స్థావరాలపై ఇజ్రాయెల్ బాంబులు వేస్తోంది. బాంబులు వేసే ముందు అక్కడ ఉన్న ప్రజలకు విమానాలద్వారా కరపత్రాలను అన్నిచోట్లవేసి “మీరు ఆ ప్రదేశాలనుంచి వెళ్లిపోండి, మా యుద్ధం సామాన్య ప్రజలమీద కాదు, హిజ్‌బుల్లా ఉగ్రవాద దళాలపైనా” అని స్పష్టంగా చెప్పింది. తరువాతనే బాంబుల వర్షం కురిపిస్తోంది. ప్రపంచంలోని దేశాలు యుద్ధాలు జరుగుతున్నపుడు ఎవరు వధ్యులో, ఏ స్థావరాల మీద బాంబులు వేయవచ్చో అనే విషయాలను గురించి ఒక నియమావళిని తయారు చేసుకున్నాయి. దాని ప్రకారం ఇజ్రాయెల్ దాడికి గురైనవన్నీ నియమాలకు వ్యతిరేకులు చచ్చిపోతున్నారని అరబ్‌దేశాలు, ముస్లిం దేశాలు, వారి మిత్రులు ప్రచారం చేస్తున్నారు. మరి హిజ్‌బుల్లా మిత్రులైన పాలస్తీనాలోని







హమాస్ ఉగ్రవాదులు గడచిన 4/5 ఏళ్లలో 1500ల మంది అమాయక నిర్దోషులైన ఇజ్రాయెల్ బాలబాలికలను, ఇతర నాగరికులను టెర్రరిస్టు చర్యలలో చంపారు. యూదులు మనుషులు కాదా? హిజ్‌బుల్లా మిత్రులై, ఉగ్రవాదాన్ని సమర్థించి, పోషించే హిజ్‌బుల్లామిత్రులు, సహాయకులు మాత్రమే మనుషులా! ఎంతో మంది లెబనాన్ బాలురు, స్త్రీలు, చచ్చిపోతున్న ఫోటోలను వేస్తున్నారే కానీ చనిపోయిన వెయ్యిన్నరమంది యూదు నాగరికుల గురించి ఎందుకు ప్రస్తావించరు!

హిజ్‌బుల్లా , హమాస్ (పాలస్తీనాలోని ఉగ్రవాద సంస్థ)లు ముస్లిం దేశాల మధ్య వున్న స్పర్ధకు ఆ ప్రదేశానికి నాయకత్వం వహించదలచిన దేశాల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధానికి పాచికలు. ఇరాన్, ఇరాక్ కూడా షియా మెజారిటీ వున్న ఇస్లామిక్ రాజ్యాలు. లెబనాన్‌లో కూడా షియాముస్లింలే అధికంగా వున్నారు. సౌదీ అరేబియా, జోర్డాన్, ఈజిప్టు తదితర దేశాలన్నీ సున్నీ శాఖకు చెందిన ఇస్లాం రాష్ట్రాలు–ముస్లిం రాజ్యాలకి నాయకత్వం ఎవరు వహించాలి. షియా, ఇరాన్ లేక సున్నీ దేశాలు? ఇరాన్ ఆయిల్ సంపదతో మత్తెక్కుతున్న దేశం. ఇజ్రాయెల్‌ని ఎవరు చంపబూనుతారో వారే ముస్లిం రాజ్యాలకి నాయకులు. అందుకనే ఇరాన్ అధ్యక్షుడు పదేపదే ఇజ్రాయెల్‌ని నాశనం చేస్తానని బాహాటం చెబుతున్నారు. ఆ ప్రయత్నంలోని భాగమే హిజ్‌బుల్లాని ఇజ్రాయెల్ మీదకి ఉసిగొల్పడం జరుగుతుంది. ఇరాన్ ఎన్నో దేశాలను ధిక్కరించి అణుబాంబులను తయారుచేసే ప్రయత్నంలో వుంది. ఈ ప్రయత్నాలను వమ్ముచేయాలని ఇరాన్ మీద ఆంక్షలు విధించాలని అగ్రదేశాలైన అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్‌లు చర్యలు తీసుకోబోతున్నాయి. ప్రపంచ దృష్టిని తన అణ్వాయుధ నిర్మాణం నుంచి మరల్చడం కోసం ఇరాన్ హిజ్‌బుల్లాను ఉసిగొల్పిందనే ఒక గట్టి అభిప్రాయం చాలా దేశాలలో ఉంది. యుద్ధానికి కాక మరెందుకు 12000 రాకెట్‌లను ఇరాన్ హిజ్‌బుల్లాకు ఇస్తుంది!

మరి లెబనాన్ ప్రభుత్వ లక్ష్యమేమిటి? ఆ ప్రభుత్వానికి హిజ్‌బుల్లా అధీనంలో వున్న దక్షిణ లెబనాన్ తన ఆధీనంలోకి వస్తుంది కాబట్టి హిజ్‌బుల్లా నాశనం చేయబడితే ఆ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టబడితే లెబనాన్‌కి మంచి జరుగుతుంది. కానీ చెడు

జరుగదు. తరమి వేయబడితే నష్టపోయేది సిగ్గుపడేది సిరియా, ఇరాన్‌లే. ఇజ్రాయెల్ సరిహద్దులో వున్న అరబ్ రాజ్యాలైన ఈజిప్టు, జోర్డాన్‌లు కూడా ఈ యుద్ధానికి కారణం. యుద్ధం ఎక్కువైన కొద్దీ హతులు, క్షతగాత్రులు పెరుగుతున్నకొద్దీ అరబ్ దేశాలలోహిజ్‌బుల్లాకు సానుభూతి పెరగడం వల్ల ఈ మూడు దేశాలు కూడా పైపైకి ఇజ్రాయెల్ యుద్ధానికి వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. హిజ్‌బుల్లా తరిమివేయబడితే ఇరాన్, సిరియాలకు శృంగభంగం అనీ, వారికి ఇదో హెచ్చరిక అని అమెరికా అనుకుంటోంది. ఇజ్రాయెల్, అమెరికా, లోలోపుగా లెబనాన్ కూడా కోరుకునేదేమంటే లెబనాన్ దక్షిణ ప్రదేశాన్నుంచి హిజ్‌బుల్లా తరిమివేయబడాలి. ఈ ప్రాంతం సశస్త్రులైన సమర్థత కలిగిన అంతర్జాతీయ సైన్యం ఆధీనంలో పెట్టబడాలి అని, లెబనాన్ సైన్యం అక్కడ ఎందుకు వుండకూడదు అనే ప్రశ్న రావచ్చు. లెబనాన్ ప్రభుత్వం కొన్ని పార్టీల కూటమి. ఆ పార్టీలలో హిజ్‌బుల్లా కూడా వుంది. హిజ్‌బుల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు లెబనాన్ ప్రభుత్వంలో మంత్రులు, లెబనాన్ ప్రభుత్వం చాలా బలహీనమైనది. అటువంటి ప్రభుత్వం తన సైన్యాన్ని దక్షిణ లెబనాన్‌లో మోహరించి హిజ్‌బుల్లా నియంత్రిస్తుందనే విశ్వాసం ఎవరికీ లేదు.

భారతదేశానికి ఒక సామ్యం వుంది. కార్గిల్‌లో పాకిస్తాన్ సైన్యాలు స్థావరాలు చేసుకుంటే వారిని అక్కడి నుంచి తరిమివేయడానికి ఎంతోకాలం పట్టింది. 400 మందికి పైగా భారతీయ సైనికులు మరణించారు. ఇండియా–పాకిస్తాన్ మధ్య ఉన్న ఆధీనరేఖను దాటకుండా మన సైన్యాల పూర్తి బలాన్ని ఉపయోగించకుండా యుద్ధం చేయవలసి వచ్చింది. అందుకనే ఎంతోమంది సైనికులు ప్రాణాలను కోల్పోయారు. అదేవిధంగా కొన్ని హద్దులను ఇజ్రాయెల్ స్వయంగా విధించుకోవడం వలన నాలుగు యుద్ధాలలో మరణించిన వారికన్నా ఇజ్రాయెల్ టెర్రరిస్టుల దుశ్చర్యల వలన తన నాగరికులు చనిపోవడం చూసింది. ఓపికకు హద్దు వుంటుంది.







# 54. ప్రజల దిగుబడి

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల నిరవధిక సమ్మె సందర్భంలో టివి–9 యొక్క ఓపెన్ ఫోరమ్ చర్చలో పాల్గొంటూ ట్రేడ్ యూనియన్ నాయకులైన వీరయ్యగారు పదే పదే ప్రజా సంక్షేమ రక్షణ కోసం, ప్రజల యొక్క దీర్ఘకాలిక మంచికోసం రోడ్డు రవాణా సంస్థ అస్థిత్వాన్ని కాపాడటం కోసం కార్మికులు ప్రభుత్వం యొక్క ప్రజావ్యతిరేక విధానాన్ని తిప్పికొట్టడం కోసం కార్మికులు సమ్మె చేస్తున్నారని చెప్పారు. దీనికి స్పందిస్తూ త్రిపురనేని హనుమాన్ చౌదరిగారు, వీరయ్యగారిని ఉద్దేశించి ఇలా అన్నారు " ప్రజల యొక్క ప్రయోజనం, సంక్షేమం ఏది నిర్ణయించేది 1,20,000 రోడ్డు రవాణా సంస్థ కార్మికులా? రోజూ ప్రయాణం చేసే కోటి పది లక్షల మంది ప్రయాణీకులు, పన్నులు, సిస్థులూ కట్టే 8 కోట్ల తెలుగు ప్రజలా? మీ ట్రేడ్ యూనియన్‌లు, మీ పార్టీలు 80 సం॥ల నుండి ప్రజల కోసం పోట్లాడుతూనే ఉన్నారు. ఈ కాలంలో , ఎన్నో ఎన్నికలు జరిగాయి. మీ ప్రణాళికలో ఏ ప్రజా ప్రయోజనాల కోసం వాటిని చెప్పారు. వాటిని ప్రచారం చేశారు. ఇంత ఘోషించినా, ఇన్ని సమ్మెలు చేసినా, 5–10% కి మించి ప్రజలు మీకు ఓట్లు వేయలేదు. అంటే మీ మాటల్లో విశ్వాసం లేదు. మీ పంథాని వారు పదేపదే తిరస్కరించారు. కాబట్టి మీరే వేరే ప్రజలను ఎన్నుకుంటే బాగుంటుంది కదా".

చౌదరిగారు అర్ధసత్యాన్ని మాత్రమే చెప్పి ఆపారు. వాస్తవానికి, పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం బంగ్లాదేశ్ నుంచి కోట్ల మంది ముస్లింలను దిగుమతి చేసుకుని, వారిని సంతుష్టపరచి, వారికి రేషన్‌కార్డులిచ్చి, వాళ్ళను ఓటర్ల జాబితాలో చేర్చి, ప్రతి ఎన్నికలో అజేయులుగా ఉంటున్నారు. ఇలా ఒక్క బంగ్లాదేశ్ నుండే కాదు, వారి ఇతర సరిహద్దు ప్రాంతాల నుండి కూడా ఈ విధంగా ప్రజల దిగుమతి చేసుకుని, వారిని కొన్ని నియోజక వర్గాల్లో సమీకరించి, పశ్చిమ బెంగాల్‌లుగా శాశ్వత విజయాలను సాధించి, తుట్టతుదకు శ్రామికవర్గ నియంతృత్వ పాలనను స్థాపించినట్లైతే, పూర్వపు కమ్యూనిస్టు సోవియట్ యూనియన్‌లో వారే ప్రస్తుతం చైనా,

క్యూబా, ఉత్తర కొరియా, వియత్నాములలో వలె ఏక ఛత్రాధిపత్యాన్ని స్థాపించి, పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేక చర్యలు చేసే వారిని, ప్రజా శత్రువులుగా నిర్మూలించి, సమ్మెలు, అనధికృత ప్రదర్శనలు, అసమ్మతి–రచనలు లేని సమాజ వ్యవస్థను స్థాపించితే ధన్యులౌతాము.







# 55. నాయుడిగారి సెక్యులరిజం

మేము, మా పార్టీ టిడిపి 'సెక్యులర్'. అందుకని ఇప్పుడు భాజపా తో తెగతెంపులు చేసుకుంటున్నాం అని సెలవిచ్చారు తెలుగుదేశంఅధినేత శ్రీ చంద్రబాబుగారు. భాజపాతో పొత్తు లేనప్పుడు కూడా, తర్వాత కూడా ఈ సెక్యులర్ నాయకులలో హైదరాబాద్ మునిసిపాలిటీ ఎన్నికలలో 50 మందికి పైగా సెక్యులర్ ముస్లిం తెలుగుదేశం అభ్యర్థులను నిలబెట్టగా యం.ఐ.యం. చేతుల్లో చిత్తుగా ఓడిపోయి డిపాజిట్లు కోల్పోయారు. పాపం ఎన్నో ఉర్దూఘర్‌లు, షాదీఖానాలు, హాజ్‌భవనం, కోట్ల రూపాయలు వెచ్చించి కట్టినప్పటికీ ఈ సెక్యులర్ టిడిపి కి ముస్లింలు ఓట్లు వేయలేదు. ఈయన నిజంగా సెక్యులరిస్టు అయితే ముస్లింలకు 5% కాదు వారి జనాభాను అనుసరించి 11% రిజర్వేషన్ కల్పిస్తానని, అసలైన సిసలైన సెక్యులర్ రామ్ విలాస్ పాస్వాన్ బీహార్ ముస్లింలకు వాగ్దానం చేసినట్లు తను, తన టిడిపి కూడా ఆంధ్రప్రదేశ్‌కు, ముస్లింనే ముఖ్యమంత్రిగా చేస్తామని, ప్రతి గ్రామంలో కనీసం ఒక మదరసాను, ఒక మసీదును కట్టిస్తానని, ఉర్దూనుఅందరికీ నిర్బంధంగా నేర్పిస్తానని, ముస్లిం మెజారిటీ అయిన ప్రతి పట్టణంలోని విభాగానికి వేరే పురపాలక సంఘాన్ని ఇస్తామని, అరబ్ దేశస్థులు హైదరాబాద్ వచ్చినప్పుడువారి వివాహ, వైద్య, విద్య సౌకర్యాలకై ప్రత్యేక వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వాలి. ఈ వాగ్దానాలను ప్రకటిస్తేనే తన యొక్క సెక్యులరిజం , నిజాయితీని, నిరూపించుకోగలరు. లేనిచో, ఆయన మాటలు కేవలం శబ్దాల మూటగానే మిగిలిపోతాయి.

శ్రీ చంద్ర బాబునాయుడుగా అజ్మీర్‌కు వెళ్లి, ఖవాజామొయునుద్దీన్‌బిస్తీ అనే సూఫీసాధువు సమాధిని సందర్శించి, ఆంధ్రప్రదేశంనుండి ఆతీర్థస్థలానికి వెళ్లే ముస్లింల వసతిగ్రహనిర్మాణానికి, తెలుగు దేశంపార్టీ తరపున 50 లక్షల భూరి విరాళం ఇచ్చారు. ముస్లిలంటే ఎంత ఘాటుప్రేమయో! మరి హిందూ బక్తులు సందర్శించేకాశి, మధుర, అమర్‌నాథ్, షిర్డి, రామేశ్వరాల్లో, వారివసతి భవన నిర్మాణానికి చిల్లిగవ్వకూడా వారుగాని, వారి తెలుగుదేశం పార్టీగాని ఇవ్వలేదు. మే, 2007లో మక్కామసీదు

బాంబు ప్రేలుడులో మరణించిన ముస్లింలకుటుంబానికో ఐదు లక్షలూ, క్షతగాత్రునికో పది వేలరూపాయలు తెలుగుదేశం తరపున ఇచ్చారు; ఈ దానాలు ప్రభుత్వమిచ్చిన వాటికి! ఆంధ్రప్రదేశ్‌లో నాయుడిగారి పాలనా సమయంలో కూడా, వేల మంది రైతులు ఆత్మహత్యచేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఆ అభాగ్యులకుటుంబాలకు ముస్లింమృతులకుటుంబాలకిచ్చినట్లు, దానాలెందుకివ్వలేదో? సెక్కులరిజం యొక్క నిజస్వరూపం ముస్లింల సంతుష్టీకరణ; హిందువుల ఎడనిర్లిపత్త, నిర్దయ అనా నిర్వచనం?